



సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 312

గురువారం 2-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


# సప్తరుషి ట్రావెల్స్

## 'గ్రోత్' యాత్రకు మోదీ లగ్జరీ కోచ్

### బడ్జెట్ స్వరూపం

మొత్తం బడ్జెట్ **45,03,097**

రెవెన్యూ వసూళ్లు **26,32,281**

రెవెన్యూ వ్యయం **35,02,136**

మూలధన వసూళ్లు **18,70,816**

మూలధన వ్యయం **10,00,961**

(అంకెలు రూ. కోట్లలో)

- పూర్తి వివరాలు 2లో ▶

- సిగరెట్లు
- వంటింట్లో వాడే చిమ్నీలు
- ఇంపోర్టెడ్ కార్లు, ఎలక్ట్రిక్ వాహనాలు
- సైకిళ్లు, ఆటబొమ్మలు
- ఇమిటేషన్ ఆభరణాలు
- రబ్బర్
- వెండి వస్తువులు
- నాఫ్తా
- బంగారు ఆభరణాలు

ధరలు పెరిగేవి..

తగ్గేవి

- మొబైల్ ఫోన్లు
- రొయ్యలకు వాడే దాణా
- కేపిటల్ గూడ్స్
- సీడ్స్ ఫర్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్
- ఆక్వా దాణాలో వాడే చేప నూనె
- దేశీయంగా తయారైన టీవీసెట్లు
- లిథియమ్ అయాన్ బ్యాటరీల తయారీకి వినియోగించే యంత్రాలు



## ఆర్థిక వృద్ధే.. 'మౌలిక' లక్ష్యం

### భారీగా పెరిగిన మూలధన వ్యయం

2023–24 కేంద్ర బడ్జెట్



- పార్లమెంటులో ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్
- వేతన జీవులకు ఆదాయ పన్ను తాయిలాలు
- వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అంతంతే
- అమృతకాల్ బడ్జెట్‌గా ప్రస్తావించిన ఆర్థిక మంత్రి

చేతిలోని సొమ్ముకు, చేరాల్సిన గమ్యానికి మధ్య అంతులేని అంతరం. పన్నుల ఉపశమనంపై మధ్య తరగతి కోటి ఆశలు. అంతర్జాతీయంగా భయపెడుతున్న మాంద్యపు ఛాయలు. ఈ పరిస్థితుల్లో తమ '5 ట్రిలియన్ డాలర్ల' ఆర్థిక వ్యవస్థ సాధన యాత్రకు సప్తరుషులనే సారథులుగా చేసుకున్నారు ప్రధాని మోదీ. యువతకు ఉద్యోగాలు కల్పించి బలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టిస్తామన్నారు.

పురాణ పురుషుల పోలిక సరే!. కానీ బడ్జెట్ పత్రపు వాస్తవిక దార్శనికత ఎంత? మధ్యతరగతికి పన్ను సంస్కరణలే తప్ప ఉపశమనం లేదు. రెండేళ్ల కిందట తెచ్చిన కొత్త పన్ను వ్యవస్థలోకి ఎవరూ రావట్లేదన్న ఉద్దేశంతో... రూ.7 లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారు పన్ను చెల్లించాల్సిన పనిలేదంటూ కొత్త వ్యవస్థ తలుపులు తెరిచి ఊరించారు. దీనివల్ల లాభమెంతనేది పక్కనబెడితే... పన్ను మినహాయింపులతో కూడిన పాత వ్యవస్థ పనికిరాకుండా పోతుంది. దీంతో ఇక అందరూ 'కొత్త' దారిలోనే!!. ఫలితం... పొదుపు ఆధారిత భారత ఆర్థిక వ్యవస్థకు ఇక వినియోగమే ఆలంబనగా మారిపోవచ్చు. ఇది ఎకానమీని పరుగులు పెట్టించినా... పొదుపు సొమ్ముతోనే మలి సంధ్యలో సామాజిక భద్రతను సాధించుకుంటున్న సామాన్యులకు ఇబ్బందే. తాజా నిర్ణయంతో... పన్ను ఆదా కోసం సృష్టించుకున్న మ్యూచువల్ ఫండ్ల నుంచి సేవింగ్స్ సర్టిఫికెట్ల వరకూ ఒక మహా వ్యవస్థ అంతర్థానమైపోవచ్చు. బుధవారం బీమా కంపెనీల షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలే భవిష్యత్ పరిణామాలకు సూచిక. అప్పులు పెరుగుతున్న ఈ తరుణంలోనూ మూలధన వ్యయాన్ని ఏకంగా 33 శాతం పెంచి 10 లక్షల కోట్లకు చేర్చారు ఆర్థిక మంత్రి. ఇక మాంద్యం మీద పడకుండా సామాజిక రంగంపై వ్యయాన్ని పెంచటమే కాక... రాయితీలతో స్థానిక తయారీకి ప్రోత్సాహాన్నిచ్చే ప్రయత్నం చేశారు. అంతిమంగా ఇవన్నీ లక్ష్యం వైపు ఏ మేరకు తీసుకెళతాయో చూడాలి...

### వీటికి కేటాయింపులు ఎక్కువ (అంకెలన్నీ లక్షల కోట్ల రూపాయల్లో)

| | |
|---|---|
| రక్షణ | 5.94 |
| రోడ్డు రవాణా, హైవేలు | 2.7 |
| రైల్వేలు | 2.41 |
| వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ | 2.06 |
| వ్యవసాయం, రైతు సంక్షేమం | 1.25 |
| హోం | 1.96 |
| ఎరువులు, రసాయనాలు | 1.78 |
| గ్రామీణాభివృద్ధి | 1.6 |

| మధ్య తరగతికి అత్తెసరే.. | నిధుల కూ.. చుక్‌చుక్ | డిజిటల్.. సూపర్‌హిట్ |
|---|---|---|

మరిన్ని బడ్జెట్ కథనాలు 2,4, 7,8,9,10,11,12,13,14,15లో

## ఐటీ శ్లాబులు మారాయి

### కాసింత కనికరం చూపిన నిర్మలా సీతారామన్

- బేసిక్ లిమిట్ రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంపు
- కొత్త పన్నుల విధానంలో సెక్షన్ 80సీ, హోమ్‌లోన్ వంటి మినహాయింపులు వర్తించవు
- పన్ను రిబేట్ రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంపు.. కొత్త విధానంలో రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్ వర్తింపు
- ఏడు లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారు పన్ను చెల్లించక్కర్లేదు
- పాత పన్నుల విధానం ఎంచుకున్న వారికి ఇవి వర్తించవు
- అధిక ఆదాయం ఉన్న వారిపై కరుణ..
- రూ.2 కోట్ల వార్షికాదాయం దాటిన వారిపై విధించే సర్‌చార్జీ 37 నుంచి 25 శాతానికి తగ్గింపు

పొదుపు కాదు.. ఖర్చు చేసుకో! ఆర్థిక వృద్ధికి నిర్మలమ్మ కొత్త సూత్రం 7లో

### నూతన పన్నుల విధానంలో మారిన పన్నుల శ్లాబులు (ఆదాయం రూ.లలో)

| ప్రస్తుత శ్లాబులు | | శ్లాబు మార్పు ప్రతిపాదనలు | |
|---|---|---|---|
| ఆదాయ పరిమితి | పన్ను రేటు | ఆదాయ పరిమితి | పన్ను రేటు |
| 2.5 లక్షల వరకు | లేదు | 0-3 లక్షలు | లేదు |
| 2.5-5 లక్షలు | 5% | 3-6 లక్షలు | 5% |
| 5-7.5 లక్షలు | 10% | 6-9 లక్షలు | 10% |
| 7.5-10 లక్షలు | 15% | 9-12 లక్షలు | 15% |
| 10-12.5 లక్షలు | 20% | 12-15 లక్షలు | 20% |
| 12.5- 15 లక్షలు | 25% | 15 లక్షలపైన | 30% |
| 15 లక్షల పైన | 30% | | |

### ..చరిత్రాత్మకం



అమృతకాలంలో ప్రవేశపెట్టిన ఈ తొలి బడ్జెట్ చరిత్రాత్మకమైనది. పేద, మధ్య తరగతి ఆకాంక్షలను, సమృద్ధ భారత్‌ను సాకారం చేసుకునే దిశగా పటిష్ట పునాదులు వేసేది. చిరుధాన్యాలకు 'శ్రీ అన్న' పేరిట సరికొత్త గుర్తింపునిచ్చింది! హరిత వృద్ధికీ ఎంతో ఊతమిచ్చేదిగా ఉంది. - ప్రధాని నరేంద్ర మోదీ

## తెలంగాణ ఆశలు అడియాసలు



- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కనబడని ప్రత్యేక కేటాయింపులు
- ఫార్మాసిటీ, డిఫెన్స్ కారిడార్, నిమ్జ్, చేనేత పరిశోధన కేంద్రం ప్రతిపాదనలు బుట్టదాఖలు

సాగునీటి ప్రాజెక్టులకు నిధుల్లేవు

- వడ్డీలేని రుణాల్లో ఎంత వస్తాయన్న దానిపై అస్పష్టత... స్థానిక సంస్థల నిధులకూ ఎసరు
- రాష్ట్ర డిమాండ్లను పెడచెవిన పెట్టిన తెలుగింటి కోడలు

నిధులివ్వలేదు.. గ్యారెంటీ లేదు.. ప్రాజెక్టుల ఊసు లేదు.. ఏ గ్రాంటు కిందా కేటాయింపులు లేవు.. రెండు మూడు రాష్ట్రాలతో కలిపి కొన్ని అంశాల్లో డబ్బులిస్తామని చెప్పడానికే కేంద్ర బడ్జెట్ పరిమితమైంది. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల్లో వాటాను పెంచకపోవడం వల్ల రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో మళ్లీ కోత పడనుందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు సెస్సులు, సర్‌చార్జీలు తగ్గించుకోవాలని, లేదంటే వాటిలోనూ వాటా ఇవ్వాలని తెలంగాణ కోరినా కేంద్రం కనికరించలేదు. మొత్తానికి తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్ బుధవారం లోక్‌సభలో ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణకు ఉత్తచేయి చూపారని బీజేపీయేతర పార్టీల నేతలు అంటున్నారు.

## ..మొండిచేయి

### కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఫైర్

దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసే బడ్జెట్ ఇది



"అన్ని రంగాలనూ గాలికొదిలారు. రైతాంగాన్ని, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను నిరుత్సాహపరిచేలా పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉంది. ఇది రైతు, పేదల వ్యతిరేక బడ్జెట్. తెలంగాణకు మరోమారు అన్యాయం చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన రూ.1,350 కోట్లు ఇవ్వలేదు.

13లో

### కేంద్ర పన్నుల్లో పెరిగిన తెలంగాణ వాటా

గతేడాదితో పోలిస్తే రూ.4,305 కోట్ల మేర అధికం 13లో

### దేశాన్ని అభివృద్ధి చేసే బడ్జెట్: సంజయ్

### తెలంగాణ పట్ల తీవ్ర వివక్ష: రేవంత్

### 'ఏకలవ్య' గురుకులాలకు మహర్దశ...!

- రాష్ట్రంలో 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్..
- మరింత మెరుగుపడనున్న బోధన, అభ్యసన కార్యక్రమాలు

ఏకలవ్య గురుకుల విద్యా సంస్థలకు మంచిరోజులు వచ్చినట్టే. తాజాగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఈ సంస్థల్లోని కొలువుల భర్తీ అంశాన్ని ప్రస్తావించింది. 13లో

### ఇదండీ సంగతి



# జనహితమే మా అభిమతం

అన్ని రంగాల్లో తెలంగాణ ఆదర్శం

- అడ్డగోలుగా మాట్లాడేవారికి అభివృద్ధే సమాధానం
- గంభీరావుపేటలో మంత్రి కె.తారకరామారావు
- విద్యాశాఖ మంత్రి సబితతో కలిసి కేజీ టు పీజీ క్యాంపస్ ప్రారంభం



**ఉండమ్మా వడ్డిస్తా!** గంభీరావుపేటలో రూ.3 కోట్లతో నిర్మించిన కేజీ టు పీజీ స్కూల్, కాలేజీ క్యాంపస్‌ను విద్యాశాఖ మంత్రి సబితారెడ్డితో కలసి ప్రారంభించిన అనంతరం పిల్లలతో కూర్చుని భోజనం చేస్తూ వారికి వడ్డిస్తున్న మంత్రి కేటీఆర్

**సిరిసిల్ల:** అభివృద్ధే మా కులం.. సంక్షేమమే మా మతం.. జనహితమే మా అభిమతం.. ప్రజల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్రమంత్రి కె.తారకరామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో రూ.3 కోట్లతో నిర్మించిన కేజీ టు పీజీ స్కూల్, కాలేజీ క్యాంపస్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ కేజీ టు పీజీ ఉచిత విద్యనందిస్తామని మాట ఇచ్చారని, దానికి ప్రతిరూపమే గంభీరావుపేట క్యాంపస్ అని అన్నారు. ఎనిమిదేళ్ల కిందట పుట్టిన తెలంగాణ రాష్ట్రం దేశంలోని 28 రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయయానికి ఉచిత విద్యుత్, ఇంటింటికీ తాగునీరు, వైద్యం, పరిశ్రమలు, వాణిజ్యరంగాల్లో ఎంతో ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యారంగానికి పెద్దపీట వేస్తూ వెయ్యి గురుకులాలను ప్రారంభించామన్నారు. ఒక్కో విద్యార్థిపై రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని స్పష్టం చేశారు. 'మన ఊరు–మన బడి' పథకంలో రాష్ట్రంలోని మూడోవంతు స్కూళ్లను ఎంపిక చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. అడ్డగోలుగా మాట్లాడేవారికి అభివృద్ధే మా సమాధానమని స్పష్టం చేశారు. రాష్ట్రానికే తలమానికంగా నిలిచే గంభీరావుపేట కేజీ టు పీజీ క్యాంపస్‌కు తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్

మిగతా 6వ పేజీలో ▶



## మినీ మేడారం జాతర షురూ

సమ్మక్క, సారలమ్మలకు పూజలు చేసిన భక్తులు

**ఎస్ఎస్ తాడ్వాయి:** ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క–సారలమ్మ మినీ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయాల్లో మండమెలిగె పండుగను పూజారులు భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన మునీందర్‌తో పాటు ఆడపడుచులు పూజలు చేశారు. కల్లు, నీళ్లు, పాలు, బెల్లం పానకం, నెయ్యి పానకం, చలి గంజితో మూడుసార్లు నేలపై ఆరగించారు. గ్రామ శివారులో కూడా బురుక కర్రలతో ధ్వజస్తంభాలను నిలిపారు. అనంతరం సమ్మక్క గద్దె వద్ద పూజారులు రహస్య పూజ నిర్వహించారు. జాతర ఈనెల 4 వరకు జరగనుంది. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో కాక వంశస్థుల ఆధ్వర్యంలో మండమెలిగె పండగను ఘనంగా నిర్వహించారు.

# 'అమృత' ప్రగతికి... సప్తరుషి మంత్రం

## జనాకర్షణ మంత్రం, ఆర్థిక వృద్ధే లక్ష్యం...

## రూ.45.03 లక్షల కోట్లతో 2023-24 కేంద్ర బడ్జెట్

**పార్లమెంటులో ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్**

- వేతన జీవులకు ఆదాయ పన్ను తాయిలాలు
- మూలధన వ్యయ కేటాయింపుల్లో భారీ పెంపు
- వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అంతంతే
- ఉపాధి హామీలో కోత, ఆవాస్ యోజనకు పెంపు
- ఎన్నికల కర్ణాటకలో 'ఎగువ భద్ర'కు రూ.5,300 కోట్లు
- అతి త్వరలో '5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ


బుధవారం లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగం చదువుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** వేతన జీవుల కోసం వ్యక్తిగత ఆదాయ పన్ను రిబేటు పరిమితి పెంపు. మధ్య తరగతి, మహిళలు, పెన్షనర్ల కోసం పలు ప్రోత్సాహకాలు. మూలధన వ్యయంతో పాటు వృద్ధికి దోహదపడే రంగాలకు కేటాయింపుల్లో భారీ పెంపు. కీలకమైన వ్యవసాయానికి తగ్గింపు. ఆరోగ్య, విద్యా రంగాలకు అంతంతమాత్రం. రోడ్లు, మౌలిక తదితర రంగాలకు ఊపు. స్థూలంగా ఇవీ 'అమృత్‌కాల్'బడ్జెట్ విశేషాలు. ద్రవ్యోల్బణం, మాంద్యం వంటి సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన ఆవశ్యకతకు, లోక్‌సభ ఎన్నికల వేళ ఓటరును సంతృప్తి పరచాల్సిన అనివార్యతకు మధ్య సమ తూకం సాధించేందుకు విత్త మంత్రి శాయశక్తులా ప్రయత్నించారు. అదే సమయంలో వీలున్నంత వరకూ 'వృద్ధి బాట'నే సాగారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 45.03 లక్షల కోట్ల రూపాయలతో కేంద్ర బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. గత బడ్జెట్‌లో వేసిన పునాదులపై ముందుకు సాగుతూ 'వందేళ్ల భారత్'బ్లూప్రింట్‌లో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు తోడ్పడేలా పద్దును రూపొందించినట్టు వెల్లడించారు. రానున్న పాతికేళ్ల అమృత కాలంలో ఆశించిన ప్రగతి లక్ష్యాల సాధనకు మంత్రి సప్తర్షి మంత్రం జపించారు. సమ్మిళితాభివృద్ధి, ప్రతి ఒక్కరికీ పథకాల ఫలాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, సామర్థ్యాల వెలికితీత, హరిత వృద్ధి, యువ శక్తి, ఆర్థిక రంగం... ఇలా వృద్ధి ఏడు విభాగాలుగా అభివృద్ధి బ్లూ ప్రింట్‌ను ఆవిష్కరించారు. భారత్‌ను ప్రపంచ ఆర్థిక రంగంపై 'తళుకులీనుతున్న తార'గా అభివర్ణించారు. ''మన ఆర్థిక వ్యవస్థ పురోగమన దిశలో ఉంది. వృద్ధి బాటన అది శరవేగంగా పరుగులు తీస్తున్న వైనాన్ని ప్రపంచమంతా అబ్బురపాటుతో వీక్షిస్తోంది''అంటూ భరోసా ఇచ్చారు. 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యాన్ని అతి త్వరలో సాధిస్తామని ధీమా వెలిబుచ్చారు. తొమ్మిదేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలు తదితరాలను ఒక్కొక్కటిగా వివరిస్తూ వచ్చారు. తలసరి ఆదాయం రెట్టింపై ప్రజలు సగర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నారని చెప్పారు. 'అందరికీ తోడు, అందరి అభివృద్ధి'లక్ష్యంతో సాగుతున్నామన్నారు. వచ్చేది ఎన్నికల సంవత్సరం కావడంతో మోదీ ప్రభుత్వానికి ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్. 2024లో ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టి ఎన్నికలకు వెళ్లనుంది.

### డిజిటల్ బాటన వడివడిగా...

సుపరిపాలనే దేశ ప్రగతికి మూలమంత్రమన్న విత్త మంత్రి, పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ద్వారా సామాన్యుడి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఉటంకించారు. తొమ్మిదేళ్ల ప్రభుత్వ కృషి ఫలితంగా ప్రభుత్వ రంగంలో ప్రపంచ స్థాయి డిజిటల్ వ్యవస్థ సాకారమైందని చెప్పారు. ఆధార్, కొవిన్, యూపీఐ, డిజి లాకర్స్ తదితరాలన్నీ ఇందుకు నిదర్శనమేనన్నారు. కృత్రిమ మేధలో లోతైన పరిశోధనల నిమిత్తం మూడు అత్యున్నత విద్యా సంస్థల్లో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ తేనున్నట్టు చెప్పారు. 5జీ సేవలను మరింత విస్తరిస్తామన్నారు. అదే సమయంలో పేదలు, దిగువ తరగతి సంక్షేమానికీ పెద్ద పీట వేశామని చెప్పారు. ''కరోనా వేళ దేశంలో ఎవరూ ఆకలి బాధ పడకుండా చూడగలిగాం. 80 శాతం మంది పేదలకు ఆహార ధాన్యాలందించాం. ప్రధాన్ మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద రూ.2 లక్షల కోట్లతో పేదలకు ఉచితంగా తిండి గింజలు సరఫరా చేశాం. వంద కోట్ల పై చిలుకు మందికి వ్యాక్సినిచ్చాం. వాటిని పంపి ఎన్నో ప్రపంచ దేశాలను ఆదుకున్నాం''అన్నారు.

### పెద్ద దేశాల్లో మనమే టాప్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటును ఏకంగా 7 శాతంగా మంత్రి అంచనా వేశారు. ''పెద్ద దేశాలన్నింట్లోనూ ఇదే అత్యధికం. అంతర్జాతీయంగా తీవ్ర మాంద్యం, కరోనా కల్లోలం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వంటి గడ్డు సమస్యలను తట్టుకుంటూ ఇంతటి ఘనత సాధించనుండటం గొప్ప ఘనత''అని చెప్పారు. ప్రస్తుతం 6.4గా ఉన్న ద్రవ్య లోటును 2023–24లో 5.9 శాతానికి పరిమితం చేయడమే లక్ష్యమన్నారు.

### ఐటీ పరిమితి 7 లక్షలకు...

కొత్త పన్ను విధానంలో వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచడం ద్వారా పన్ను చెల్లింపుదారులు పాత విధానం నుంచి మారేలా ప్రోత్సహించేందుకు మంత్రి ప్రయత్నించారు. గరిష్ట ఆదాయ పన్ను రేటును 42.7 శాతం నుంచి 39 శాతానికి, సర్‌చార్జిని 37 నుంచి 27 శాతానికి తగ్గించారు. సీనియర్ సిటిజన్లకు కూడా గరిష్ట పొదుపు పరిమితిని రెట్టింపు చేస్తూ రూ.30 లక్షలకు పెంచారు. మొబైల్ ఫోన్ విడి భాగాలు, టీవీలు తదితరాలపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు ద్వారా మధ్య, దిగువ తరగతికి ఊరటనిచ్చే ప్రయత్నం చేశారు. అయితే వెండి ప్రియం కానుండటం మహిళలకు దుర్వార్తే.

### మౌలికంపై మరింత దృష్టి...

మౌలిక సదుపాయాలు తదితరాలపై ఈసారి మరింత దృష్టి పెడుతున్నట్టు నిర్మల పేర్కొన్నారు. ఆర్థికంగా వెనకబడ్డ పట్టణ ప్రాంతాల వారికి గూడు కల్పించే పీఎం ఆవాస్ యోజనకు కేటాయింపులను రూ.79 వేల కోట్లకు (ఏకంగా 66 శాతం) పెంచారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల కోసం పట్టణ మౌలికాభివృద్ధి నిధిని ప్రకటించారు. ఇక దేశానికి జీవనాడి అయిన రైల్వేలకు ఇప్పటిదాకా అత్యధికంగా రూ.2.4 లక్షల కోట్ల కేటాయింపులు చేశారు. ఇక పోర్టులు, పరిశ్రమలకు అనుసంధానాన్ని మరింత మెరుగు పరిచేందుకు ఉద్దేశించిన ఏకంగా రూ.77 వేల కోట్లతో కీలక రవాణా మౌలిక సదుపాయాల ప్రాజెక్టును ప్రకటించారు. ఇందులో రూ.15 వేల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి సేకరించనున్నారు.

### హరిత నినాదం

కాలుష్యకారక శిలాజ ఇంధనాల నుంచి క్రమంగా పూర్తిస్థాయిలో కాలుష్యరహిత స్వచ్ఛ ఇంధనానికి మారే లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఇందుకోసం బడ్జెట్లో రూ.35 వేల కోట్లు కేటాయించారు. బయో వ్యర్థాలను ఇంధనంగా మార్చడం ద్వారా సంపద సృష్టికి గోబర్ధన్ పథకం కింద ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. సాగు, భవనాలు, పరికరాలు తదితరాలన్నింటినీ హరితమయం చేయడానికి ప్రాధాన్యమిస్తామన్నారు. పీఎం కిసాన్ పథకానికి రూ.2.2 లక్షల కోట్లు కేటాయించారు. వ్యవసాయ రుణ లక్ష్యాన్ని రూ.20 లక్షల కోట్లుగా నిర్దేశించుకున్నారు. పశుగణాభివృద్ధి, మత్స్య విభాగాలపై ఫోకస్ పెంచారు. ప్రధాని బాగా ప్రోత్సహిస్తున్న చిరుధాన్యాలకు మరింత ప్రాచుర్యం కల్పిస్తామన్నారు. ఇక త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్ణాటకకు ఎగువ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించారు.

### మహిళలకు మరింత సాధికారత

మహిళా సాధికారత దిశగా మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి తెలిపారు. 81 లక్షల పై చిలుకు స్వయం సహాయ బృందాలను స్టార్టప్‌ల తరహాలో తీర్చిదిద్దడం ద్వారా నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తున్నట్టు ప్రకటించారు. పర్యాటక రంగానికి ఇతోధికంగా ప్రోత్సాహకాలిస్తామన్నారు. మధ్య తరగతి దర్శనీయ ప్రాంతాల్లో పర్యటించేందుకు పథకం ప్రకటించారు.

### జి-20 సారథ్యం.. గొప్ప అవకాశం

''జి–20 సదస్సుకు ఈ ఏడాది భారత్ సారథ్యం వహించనుండటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన పాత్రను మరింత బలోపేతం చేసుకునేందుకు గొప్ప అవకాశం. వసుధైక కుటుంబకం (ప్రపంచమంతా ఒకే కుటుంబం) నినాదంతో ఈ దిశగా ముందుకెళ్తున్నాం''అని నిర్మల తెలిపారు.

> ఆర్థిక వృద్ధి అవసరాలు, ప్రజాకాంక్షల మధ్య చక్కని సమతౌల్యం కుదిరిన బడ్జెట్ ఇది. పెట్టుబడి వ్యయ పద్దు తొలిసారి రూ.10 లక్షల కోట్లను తాకింది. ఇక వ్యక్తిగత ఆదాయ పన్ను వ్యవస్థలోనూ మధ్యతరగతికి లబ్ధి చేకూర్చేలా మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త ఆదాయ పన్ను వ్యవస్థను మరింత ఆకర్షణీయం చేయడం దీని ఉద్దేశం. మహిళా సాధికారతకూ మరింత పెద్దపీట వేశాం. కస్టమ్స్ సుంకాలనూ హేతుబద్ధీకరించే ప్రయత్నం చేశాం.
>
> – బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మీడియాతో నిర్మలా సీతారామన్

### బడ్జెట్ సైడ్‌లైట్స్...

**ఈసారి 87 నిమిషాలే...**

బడ్జెట్ ప్రసంగాన్ని విత్త మంత్రి ఈసారి 8,000 పై చిలుకు పదాల్లో, కేవలం 87 నిమిషాల్లోనే ముగించారు. 2020 బడ్జెట్ సమర్పించినప్పుడు ఆమె ఏకంగా 162 నిమిషాలు మాట్లాడటం విశేషం! బడ్జెట్ ప్రసంగాల్లో అతి సుదీర్ఘమైనదిగా అది చరిత్రకెక్కింది కూడా. ఆ తర్వాత క్రమంగా నిడివి తగ్గతూ వస్తోంది. నిర్మల 2021లో 110 నిమిషాలు, 2022లో 92 నిమిషాలు ప్రసంగించారు. కరోనా నేపథ్యంలో 2021లో తొలి పేపర్‌లెస్ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆమెదే.

**క్షమాపణలతో నవ్వులు పూయించి...**

- కాలం చెల్లిన పాత వాహనాలను పక్కన పెట్టే పథకానికి నిధులు ప్రకటించే క్రమంలో ఆర్థిక మంత్రి కాస్త తడబడి 'ఓల్డ్ పొలిటికల్ వెహికిల్స్'అనడంతో సభ్యులంతా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. నిర్మల వెంటనే సర్దుకుంటూ 'ఓల్డ్ పొల్యూటింగ్ వెహికిల్స్. సరేనా? అయాం సారీ'అనడంతో అంతా ఒక్కసారిగా నవ్వేశారు.
- అధికార సభ్యుల స్వాగతం నడుమ లోక్‌సభలోకి ప్రవేశించిన నిర్మల, ఎరుపు రంగు బహీ ఖాతా నుంచి బయటికి తీసిన ట్యాబ్లెట్ పీసీ సాయంతో పద్దును ప్రవేశపెట్టారు. ఆమె కూతురు, బంధువులు స్పీకర్ గ్యాలరీ నుంచి వీక్షించారు.
- కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ఐదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. ప్రసంగం ముగిశాక ప్రధాని ఆమె దగ్గరికి వెళ్లి అభినందించారు. మంత్రివర్గ సభ్యులతో పాటు కొందరు విపక్ష సభ్యులు కూడా ఆమెను చుట్టుముట్టారు.
- ఆమె ప్రసంగం పొడవునా అధికార సభ్యులు బల్లలు చరుస్తూ హర్షధ్వానాలు చేశారు. ముఖ్యంగా ఐటీ రాయితీలు ప్రకటిస్తుండగా మోదీ, మోదీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. చిరుధాన్యాల ప్రస్తావన రాగానే ప్రధాని మోదీ బల్లపై చరుస్తూ హర్షం వెలిబుచ్చారు. అప్పుడప్పుడూ విపక్ష సభ్యులు నిరసనలు తెలిపారు.
- బడ్జెట్ ప్రసంగం మొదలైన కాసేపటికి సభలోకి అడుగు పెట్టిన రాహుల్‌గాంధీని కాంగ్రెస్ సభ్యులు 'జోడో జోడో. భారత్ జోడో'అని నినదిస్తూ స్వాగతించారు. అప్పుడప్పుడూ 'అదానీ, అదానీ'నినాదాలూ విన్పించాయి.
- మామూలుగా నినాదాలు, నిరసనలతో హోరెత్తించే తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ప్రసంగాన్ని నిశ్శబ్దంగా వింటూ కన్పించారు.

## ఇదీ బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)




| | 2021-2022 వాస్తవ కేటాయింపులు | 2022-2023 బడ్జెట్ అంచనాలు | 2022-2023 సవరించిన అంచనాలు | 2023-2024 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| 1. రెవెన్యూ వసూళ్లు | 21,69,905 | 22,04,422 | 23,48,413 | 26,32,281 |
| 2. పన్ను ఆదాయం | 18,04,793 | 19,34,771 | 20,86,662 | 23,30,631 |
| 3. పన్నేతర ఆదాయం | 3,65,112- | 2,69,651 | 2,61,751 | 3,01,650 |
| 4. మూలధన వసూళ్లు | 16,23,896 | 17,40,487 | 18,38,819 | 18,70,816 |
| 5. రుణాల రికవరీ | 24,737 | 14,291 | 23,500 | 23,000 |
| 6. ఇతర వసూళ్లు | 14,638 | 65,000 | 60,000 | 61,000 |
| 7. అప్పులు, ఇతర వసూళ్లు | 15,84,521 | 16,61,196 | 17,55,319 | 17,86,816 |
| 8. మొత్తం వసూళ్లు(1+4) | 37,93,801 | 39,44,909 | 41,87,232 | 45,03,097 |
| 9. మొత్తం వ్యయం(10+13) | 37,93,801 | 39,44,909 | 41,87,232 | 45,03,097 |
| 10. రెవెన్యూ ఖాతా | 32,00,926 | 31,94,663 | 34,58,959 | 35,02,136 |
| 11. వడ్డీ చెల్లింపులు | 8,05,499 | 9,40,651 | 9,40,651 | 10,79,971 |
| 12. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు | 2,42,646 | 3,17,643 | 3,25,588 | 3,69,988 |
| 13. మూలధన ఖాతా | 5,92,874 | 7,50,246 | 7,28,274 | 10,00,961 |
| 14. వాస్తవమూలధన వ్యయం(12+13) | 8,35,520 | 10,67,889 | 10,53,862 | 13,70,949 |
| 15. రెవెన్యూ లోటు(10-1) | 10,31,021 | 9,90,241 | 11,10,546 | 8,69,855 |
| 16. నికర రెవెన్యూ లోటు(15-12) | 7,88,375 | 6,72,598 | 7,84,958 | 4,99,867 |
| 17. ద్రవ్య లోటు [9-(1+5+6)] | 15,84,521 | 16,61,196 | 17,55,319 | 1786816 |
| 18. ప్రాథమిక లోటు (17-11) | 7,79,022 | 7,20,545 | 8,14,668 | 706845 |


బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు సహాయ మంత్రులు భగవత్ కిషన్‌రావ్ కరద్, పంకజ్ చౌదరి, అధికారులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

## ఇది ఆచరణ సాధ్యం కాని బడ్జెట్

**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్**



**సాక్షి, హైదరాబాద్:** కేంద్రం రాష్ట్రాలతో కలిసి పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధ్యమనే విషయాన్ని మరిచి ఆచరణ సాధ్యం కానీ రీతిలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలను నిర్వీర్యం చేసేందుకు ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఏ రంగానికి మేలు చేయని రీతిలో బడ్జెట్‌ను ప్రతిపాదించింది. జనరల్ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్‌ను కూడా కలపడంతో అంతా గందరగోళం నెలకొంది. కేంద్రం గత ఎనిమిదేళ్లలో దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేయగా, అందులో తెలంగాణకు ఒక్క టి కూడా ఇవ్వలేదు. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేస్తామనే ప్రస్తు త ప్రతిపాదనతో రాష్ట్రానికి అన్యాయం జరుగు తుంది. కొత్త జిల్లాల్లో నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు తొమ్మిదేళ్లుగా కేంద్రాన్ని కోరుతున్నా ప్రస్తుత బడ్జెట్‌లో వాటి ప్రస్తావన లేకుండా పోయింది.

### చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు నిరాశ

వ్యవసాయంతో పాటు మరికొన్ని రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యం లభించినా చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు మాత్రం పెద్దగా ఆదరణ లభించలేదు. ఎలక్ట్రానిక్స్ రంగంలో దిగుమతి సుంకాలు తగ్గించడం చిన్న, సూక్ష్మ పరిశ్రమలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. బ్యాంకు రుణాలు, పెద్ద పరిశ్రమలకు ఇచ్చిన తరహాలో ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకాలు, సీటీఎంఎస్ తదితరాల విషయంలో కొంత నిరాశ ఎదురైంది. పన్ను పరిమితి పెంపు, ఇతర రంగాలకు కొంత లబ్ధి చేకూరే ప్రతిపాదనలు బడ్జెట్‌లో ఉండటంతో దిగువ మధ్య తరగతి కొనుగోలు శక్తి పెరిగి పరోక్షంగా ఎంఎస్‌ఎంఈలకు లబ్ధి చేకూరుతుంది. –గోపాల్‌రావు, కార్యదర్శి, తెలంగాణ పరిశ్రమల సమాఖ్య

### తెలంగాణకు ఒరిగిందేమీ లేదు

కేంద్ర బడ్జెట్ పేదలకు నిరాశను మిగిల్చి పెద్దలకు దోచిపెట్టేలా ఉంది. ఈ బడ్జెట్‌లో సామాన్యులకు మేలు కలిగించే అంశాలేవీ కనిపించడం లేదు. పేదల సంక్షేమం, సబ్సిడీల గురించి కేంద్రం పట్టించుకోలేదు. నిధులు కేటాయించకుండా వ్యాపారులకు మేలు కలిగే విధంగా పన్నులు వసూలు చేయనుంది. రాష్ట్ర విభజన హామీల అమలుపై ఎలాంటి ప్రకటన లేదు. బడ్జెట్‌లో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు. రాష్ట్రానికి మొండి చేయి చూపించారు. ఈ బడ్జెట్‌తో దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మరింత పెరుగుతాయి. – ఏలేటి, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్

### ఫండ్ ఆఫ్ ఫండ్స్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం

విద్య, అధ్యయన సంస్థలు ఐటీ రంగం నడుమ అంతరం తగ్గించడంతో పాటు కింది స్థాయిలో వ్యవస్థాపకత ప్రోత్సహించేందుకు కేంద్ర బడ్జెట్‌లో నేషనల్ డేటా గవర్నెన్స్ పాలసీ, స్కిల్ ఇండియా డిజిటల్ ప్లాట్‌ఫామ్, అప్‌స్కిల్లింగ్ పాలసీలు ప్రకటనలు దోహదం చేస్తాయి. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్‌కు రూ.283.5 కోట్లు, స్టార్టప్‌ల కోసం ఫండ్ ఆఫ్ ఫండ్స్ పేరిట రూ.వేయి కోట్లు కేటాయించడం ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఉపయోగపడుతుంది. స్టార్టప్ ఇండియా ఇనిషియేషన్‌లో భాగంగా స్టార్టప్‌లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, క్రెడిట్ గ్యారంటీ పథకం తదితరాలు వివిధ దశల్లో ఉపయోగపడుతాయి. దేశ అభివృద్ధిలో స్టార్టప్‌లు కీలకపాత్ర పోషించేందుకు ప్రస్తుత బడ్జెట్ ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, సాంకేతికతతో కూడిన అభివృద్ధిని నిర్మించడంపై యూనియన్ బడ్జెట్ విస్తృత దృష్టిని సారించింది. బడ్జెట్‌లో పేర్కొన్నట్లుగా భారతదేశం స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ అపారమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ మన ఆర్థిక వ్యవస్థకు వృద్ధి చోదకాలుగా స్టార్టప్‌లు ఉద్భవించాయి.
– మహంకాళి శ్రీనివాస్‌రావు, సీఈవో, టీ–హబ్

### మృతకాల్ బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌కు ఎలాంటి విజన్ లేదు. బీజేపీ నాయకులు ఈ బడ్జెట్‌ను అమృత్‌కాల్ బడ్జెట్ అని అంటున్నారు.. కానీ ఇది 'మృతకాల్'బడ్జెట్. ఉద్యోగాల భర్తీ మాటలేదు, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఎలా తగ్గిస్తారో చెప్పలేదు. సమాజంలో అసమానతలను తగ్గించే ప్రణాళిక లేదు. అలాగే దేశాభివృద్ధికి రోడ్ మ్యాప్ కనిపించలేదు. – రాహుల్ గాంధీ

### అమృత్‌కాల్ బడ్జెట్



దేశాన్ని స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం చేస్తున్న కృషికి దోహదం చేసే అమృత్‌కాల్ బడ్జెట్ ఇది. అన్ని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌కు రూపకల్పన జరిగింది. దేశంలో మౌలిక వసతులు, బలీయమైన ఆర్థిక వ్యవస్థకు ఊతం కల్పిస్తుంది. – అమిత్‌షా, కేంద్ర హోంమంత్రి

### అట్టడుగు వర్గాలకు మేలు



అట్టడుగు వర్గాలకు మేలు చేసే బడ్జెట్ ఇది. దేశంలోని అన్ని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం బడ్జెట్‌కు రూపకల్పన చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టిని ప్రతిబింబిస్తోంది. రైతులు, గ్రామీణ ప్రజలు, దళిత, గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దోహదం చేస్తుంది. దేశాభివృద్ధికి బాటలు వేసే బ్లూప్రింట్. – జేపీ నడ్డా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు

### పేదలను విస్మరించారు



దేశంలోని కోట్లాదిమంది పేదలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపొందించి ఉంటే బాగుండేది. ప్రభుత్వం గొప్పగొప్ప హామీలైతే ఇస్తోంది. కానీ ఆచరణలో హామీలు అమలు కావడం లేదు. పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం కారణంగా మధ్యతరగతి వర్గాలు .. దిగువ మధ్యతరగతికి దిగజారిపోతున్నాయి. – మాయావతి, బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షురాలు

### పెరిగిన పరిమితి స్వల్పమే: టీఎస్ యూటీఎఫ్




**సాక్షి, హైదరాబాద్:** ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి భారీ ఊరట పేరుతో ప్రచారం సమంజసం కాదని టీఎస్ యూటీఎఫ్ అభిప్రాయ పడింది. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ పాత పన్ను విధానాన్ని ఎత్తివేయటానికే కేంద్ర ప్రయత్నిస్తున్నట్లు బడ్జెట్ ద్వారా స్పష్టమైందని పేర్కొంది. పరోక్ష పన్నుల ద్వారా వేతనాలనుండి ఆదాయాన్ని రాబట్టుకుంటున్న ప్రభుత్వం వేతనాలపై భారీగా పన్ను వేయటమే అర్థ రహితమని, కార్పొరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించలేదని పేర్కొంది.

## పన్ను.. అభివృద్ధి.. మౌలిక సదుపాయాలు

**నిర్మల ప్రసంగంలో పదేపదే పునరావృతం**



**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం బడ్జెట్ ప్రసంగంలో పలు పదాలను పదేపదే పునరావృతం చేశారు. ఆమె దాదాపు 85 నిమిషాల పాటు ప్రసంగించారు. ట్యాక్స్(పన్ను) అనే పదాన్ని అత్యధికంగా 43 సార్లు ఉపయోగించారు. ఆ తర్వాత డెవలప్‌మెంట్(అభివృద్ధి) అనే పదాన్ని 28 సార్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(మౌలిక సదుపాయాలు) అనే పదాన్ని 26 సార్లు, డిజిటల్‌ను 21 సార్లు పలికారు. అలాగే క్యాపిటల్‌ను 18 సార్లు, ఇన్వెస్ట్‌మెంట్‌ను 16 సార్లు, అగ్రికల్చర్‌ను 11 సార్లు ఉపయోగించారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఏపీ మోడల్

**సాక్షి, అమరావతి:** ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ పథకాలు కేంద్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతిబింబించాయి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, డిజిటల్ లైబ్రరీలు, పీఎం శ్రీ స్కూళ్ల ఏర్పాటు సహా మరికొన్ని కార్యక్రమాలకు రాష్ట్రంలో ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిగా మారాయి. 'టెక్నికల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా' కార్యక్రమాన్ని కేంద్రం ఈ బడ్జెట్‌లో పొందుపరిచింది. తద్వారా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇంజనీరింగ్ విద్యాసంస్థలు అకడమిక్ ఎక్సలెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవడం, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపరచుకోవడంపై సమష్టిగా దృష్టి సారిస్తాయి. అయితే, రాష్ట్రంలో ఉన్నత విద్యామండలి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు ద్వారా ఇప్పటికే ఇలాంటి కార్యక్రమాలు అమలు చేస్తోంది. రాష్ట్ర వర్సిటీలతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐఐటీ, ఎన్‌ఐటీ, ఐఐఎం వంటి సంస్థలన్నీ కలిపి పరస్పర సహకారం అందించుకుంటూ ముందుకు వెళ్లేలా దీన్ని అమలు చేస్తున్నారు.

**డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధికి చర్యలు**

ప్రతి పంచాయతీలో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేసి యువతకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. రాష్ట్రంలో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుపై ప్రభుత్వం ఇంతకుముందే దృష్టి సారించింది. దీంతోపాటు ఉన్నత విద్యామండలి ద్వారా లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్‌ఎంఎస్)ను ఏర్పాటు చేయించి విద్యార్థులకు పలు సబ్జెక్టు అంశాలను అందుబాటులోకి తెచ్చింది. కాగా, నైపుణ్యాభివృద్ధి కోసం 'స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ల' ఏర్పాటుకు కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఇలాంటి ఏర్పాట్లు చేసింది. ఉన్నత విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు చదువులు పూర్తయ్యే నాటికే పూర్తి నైపుణ్యాలు కలిగి ఉండేలా తీర్చిదిద్దడంతో పాటు బయటకు వచ్చిన తరువాత కూడా అప్‌స్కిల్లింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 30 స్కిల్ హబ్‌లు, 26 స్కిల్ కాలేజీలు, రెండు స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయిస్తోంది.

### నాడు-నేడు తరహాలో..

దేశంలో కొత్తగా భారతీయ భాషా యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్ణయించింది. స్థానిక భాషల్లో ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సులను అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో కేంద్రం ఈ వర్సిటీని ఏర్పాటు చేస్తోంది. కాగా, పాఠశాల విద్యకు సంబంధించి కేంద్రం జాతీయ స్థాయిలో 14,500 స్కూళ్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ బడ్జెట్‌లో రూ.4,000 కోట్లను కేటాయించింది. రాష్ట్రంలో నాడు–నేడు పథకం కింద అన్ని విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఏకంగా రూ.16 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

## క్లుప్తంగా...

### రేపటి నుంచి మళ్లీ మాణిక్‌రావ్ పర్యటన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మూడోసారి తెలంగాణకు రానున్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు నాలుగు రోజులు రాష్ట్రంలో పర్యటించనున్నారు. మూడో తేదీన సాయంత్రం 5 గంటలకు ఠాక్రే హైదరాబాద్‌కు వస్తారని, శంషాబాద్ విమానాశ్రయం నుంచి గాంధీభవన్‌కు వచ్చి రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో సమావేశమవుతారని బుధవారం గాంధీభవన్ విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొంది. నాలుగున కూడా ఆయన ఆహ్వానితులతో భేటీ అవుతారు. ఐదో తేదీన రాష్ట్ర కాంగ్రెస్‌కు చెందిన వివిధ విభాగాల నేతలతో సమావేశమవుతారు. ఐదో తేదీన టీపీసీసీ ప్రచార కమిటీ, సోషల్ మీడియా కమిటీ, ఓబీసీ విభాగం, ఎస్సీ, మైనార్టీ విభాగాల నేతలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో సమావేశమవుతారు. ఆరో తేదీ ఉదయం టీపీసీసీ నేతలతో మరోమారు భేటీ కానున్న ఠాక్రే.. మధ్యాహ్నం బయలుదేరి ములుగులో జరిగే హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరవుతారు.

### అందుబాటులో చేప వంటకాలు: తలసాని



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు వివిధ రకాల చేప వంటకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మాసాబ్ ట్యాంక్‌లోని మత్స్యశాఖ కార్యాలయం ఆవరణలో బుధవారం రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా అభివృద్ధి చేసిన ఫిష్ క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపల వినియోగాన్ని పెంచేందుకు.. చేపల వంటకాలపై మహిళలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చేపలు, చేప వంటకాల విక్రయాల కోసం రాయితీపై మొబైల్ రిటైల్ ఫిష్ ఔట్ లెట్‌లను కూడా అందజేశామన్నారు. మత్స్య శాఖ నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో లభించే చేప వంటకాలకు ఆదరణ పెరగడంతో.. వచ్చే వినియోగదారులకు సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. త్వరలోనే వివిధ రకాల వంటకాలతో కూడిన ఫిష్, మటన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, టీఎస్ఎల్‌డీఏ సీఈవో మంజువాణి పాల్గొన్నారు.

# ఏపీలో అందరికీ సమాన అవకాశాలు

- ప్రభుత్వ స్కూళ్లు బాగున్నాయి
- సీఎం జగన్ అత్యున్నత లక్ష్యం కోసం పనిచేస్తున్నారు
- ఆయన్ని కలవడాన్ని గౌరవంగా భావిస్తున్నా
- ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

సాక్షి, అమరావతి: 'ఇప్పటివరకు 78 దేశాల్లో పర్యటించా. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్న సీఎం జగన్ లాంటి వ్యక్తిని నేను ఎక్కడా చూడలేదు' అని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ అత్యున్నత లక్ష్యం కోసం.. ఉన్నతమైన ఆశయాలతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఆయన్ని కలవడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. బుధవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను నిక్ వుజిసిక్ కలిశారు. ఈ సందర్భంగా నిక్ మాట్లాడుతూ..'ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లు బాగున్నాయి. ప్రైవేటు స్కూళ్లకు తీసిపోనిరీతిలో.. ప్రభుత్వ స్కూళ్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నారు. విద్యా రంగంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే గొప్ప లక్ష్యంతో సీఎం జగన్ పనిచేస్తుండటం.. చాలా ఆసక్తికరమైన అంశం. ఏపీలో విద్యార్థుల ఎదుగుదలకు మంచి అవకాశాలున్నాయి. ఈ విషయంలో సీఎం జగన్ గురించి చెప్పాలంటే ఆయన నిజమైన హీరో. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన ప్రగతి కనిపిస్తోంది. ఇవన్నీ అందరికీ తెలియాలి. ఇంతవరకూ ఇలా ఎక్కడా జరగలేదు. ఆయన చాలా నిబద్ధత, క్రమశిక్షణ గల మనిషి' అని నిక్ చెప్పారు. తన జీవిత కథను పదో తరగతి ఇంగ్లిష్ పుస్తకంలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడం ఆనందంగా ఉందని తెలిపారు.

### మెరుగవుతోన్న తారకరత్న ఆరోగ్యం

**ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడి**

బనశంకరి: నందమూరి తారకరత్న ఆరోగ్యం నిలకడగా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు. బుధవారం బెంగళూరులో నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్నను విజయసాయిరెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తారకరత్న కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తారకరత్న ఆరోగ్యం నిలకడగా ఉంది.. పురోగతి కనిపిస్తోందని తెలిపారు. డాక్టర్లు మంచి చికిత్స అందిస్తున్నారని, బాలకృష్ణ అక్కడే ఉండి అన్ని విషయాలు చూసుకుంటున్నారని చెప్పారు. తారకరత్నకు గుండెపోటు వచ్చిన 45 నిమిషాల పాటు మెదడుకు రక్తప్రసరణ ఆగిపోవడం వల్ల నరాలు కాస్త దెబ్బతిన్నాయని, ఇవాళ పరిస్థితి చాలా మెరుగ్గా ఉందన్నారు. గుండెతో పాటు రక్తప్రసరణ బాగుందని, రేపటి కల్లా మరింత మెరుగవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు విజయసాయిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.





### ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి కుమార్తె వివాహానికి సీఎం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కొంపల్లిలో బుధవారం జరిగిన ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సీఎం వెంట మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులున్నారు.

## కలిసొస్తున్నా కోవర్టు ముద్ర వేస్తున్నారు

- రేవంత్‌పై అధిష్టానానికి ఎంపీ కోమటిరెడ్డి ఫిర్యాదు!

సాక్షి, న్యూఢిల్లీ: విభేదాలను పక్కనపెట్టి కలిసి పని చేసేందుకు ముందుకు వస్తున్నాతనపై కోవర్టు ముద్ర వేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోమారు కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. రేవంత్ తీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన కోమటిరెడ్డి బుధవారం ముగ్గురు నేతలను విడివిడిగా కలిసి ఇటీవలి నకిరేకల్‌లో తనకు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్ల అంశంపై ఫిర్యాదు చేసినట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. రేవంత్ సూచనల మేరకు పార్టీ రాజకీయ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందంలోని సభ్యుడి పురమాయించడంతో కొందరు వ్యక్తులు తనను కోవర్టుగా ముద్రిస్తూ పోస్టర్లు వేశారని వివరించారు. దీనిపై తాను స్వయంగా సునీల్‌తో మాట్లాడగా, క్షమాపణలు సైతం కోరారని తెలిపారు. దీనిపై రేవంత్‌తో మాట్లాడతామని ఖర్గే సహా ఇతర నేతలు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## బడ్జెట్‌పై ప్రతి శాఖకు ఓ నోడల్ అధికారి

**పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్**

సాక్షి, హైదరాబాద్: ఈనెల 3వ తేదీ నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాలకు అన్ని ప్రభుత్వ శాఖలు సిద్ధంగా ఉండాలని పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆదేశించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆయన ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల కోసం ప్రతి శాఖకు ఒక నోడల్ అధికారిని నామినేట్ చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా ప్రశ్నలకు సమాధానాల సమర్పణ, అసెంబ్లీ అధికారులతో సమన్వయపరుచుకునే బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. సభా వ్యవహారాలు, జీరో అవర్‌లో సభ్యులు లేవనెత్తే సమస్యలు, ఇతర సంబంధిత విషయాలను ముందుగానే తెలియజేయాలని సూచించారు. సమావేశాల్లో సీనియర్ అధికారులు ఉండేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ఆడిట్ పేరాలపై ప్రత్యుత్తరాలు సమర్పించాలని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని గ్రాంట్ల సమాచారం కూడా ఇవ్వాలని, అధికారులందరూ పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

## రాష్ట్రంలో 6 నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర: రేవంత్

సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణలో ఈ నెల 6 నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభమవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలిపారు. ములుగు సమ్మక్క సారలమ్మ నుంచి ప్రారంభమయ్యే యాత్రను మొదటివిడతగా 60 రోజులు.. 40 నుంచి 50 నియోజకవర్గాల్లో చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాత్రలో జాతీయ నాయకత్వం కూడా వివిధ సందర్భాల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. 60 రోజుల తర్వాత యాత్రను కొనసాగించే అంశంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రతి అంశంపై సమగ్ర చర్చ జరగాలి

- తెలంగాణ అసెంబ్లీ పనితీరు దేశానికే ఆదర్శం: స్పీకర్ పోచారం
- బడ్జెట్ సమావేశాల ఏర్పాట్లపై స్పీకర్, మండలి చైర్మన్ సమీక్ష
- సీఎస్, డీజీపీ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు



సమీక్ష సమావేశంలో వేముల, పోచారం, గుత్తా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సమావేశాలు ఈనెల 3న ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, డీజీపీ అంజనీ కుమార్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులుతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల పనితీరు దేశానికే ఆదర్శంగా ఉందని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పారదర్శకంగా జరిగేందుకు గతంలో మాదిరిగానే అధికారులు సహకరించాలని కోరారు. శాసనసభ సమావేశాల హుందాతనం, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ప్రతీ అంశంపై సమగ్ర చర్చ జరగాలన్నారు. సభ్యులు అడిగే సమాచారాన్ని త్వరగా ఇవ్వడంతో పాటు గత సమావేశాలకు సంబంధించి ప్రశ్నలకు పెండింగులో ఉన్న జవాబులు వెంటనే పంపించాలని ఆదేశించారు. సమావేశాలు జరిగే సమయంలో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉండాలని, ప్రతీ శాఖ తరఫున ఒక నోడల్ అధికారిని నియమించాలని స్పీకర్ సూచించారు. శాసనసభ కమిటీలకు అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వం తరఫున అందించాలని, శాసనసభ పరిసరాల్లో విద్రోహశక్తులు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

**ప్రశాంత వాతావరణంలో సమావేశాలు: గుత్తా**

తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక మంచి పథకాలు అమలు చేస్తోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కితాబునిచ్చారు. అసెంబ్లీ లోపల, బయటా ప్రశాంత వాతావరణంలో సమావేశాలు జరిగేలా పోలీసు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో శాసనసభలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మండలి విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, పోలీసు కమిషనర్లు సీవీ ఆనంద్, డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర, చీఫ్ మార్షల్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నిర్మల్ టౌన్: మైనార్టీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: ఆలయాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో రూ.35 లక్షలతో నిర్మించిన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేవాలయాలు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 600కు పైగా ఆలయాలను పునర్నిర్మించుకున్నామని తెలిపారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ మేడారం అపర్ణ ప్రదీప్ ఆధ్వర్యంలో తీర్థప్రసాద వితరణ చేశారు. గాజుల్‌పేట్ ప్రాంతంలో రూ.2 కోట్లతో చేపట్టిన మైనార్టీ ఫంక్షన్ హాల్, డాక్టర్స్ లైన్‌లో రూ.2 కోట్లతో చేపట్టిన ఫుట్‌పాత్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గండి రామన్న ఆలయ చైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు, స్వర్ణకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**వ్యవసాయరంగ అభివృద్ధే లక్ష్యం**

సారంగాపూర్: వ్యవసాయరంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో రూ.25లక్షలతో చేపట్టిన పీఏసీఎస్ భవన నిర్మాణం, రూ.20లక్షలతో చేపట్టిన గోదాం నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, సర్పంచ్ దండు రాధ, మండల ఉపాధ్యక్షురాలు పతాని రాధ, అడెల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, నాయకులు సాయికృష్ణ, జీవన్‌రావు పాల్గొన్నారు.

# వేములవాడ బరిలో ప్రవాసీలు!

- ఆర్థికంగా, పలుకుబడి ఉన్న వ్యక్తి కోసం అన్వేషణ
- టికెట్ కోసం సీనియర్ నేతల మధ్య పోటీ
- తోట రాము సహా టికెట్ ఆశిస్తున్న ఎన్‌ఆర్‌ఐలు
- వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లే ఆలోచనలో బండి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేయబోయే వ్యక్తి ఎవరా? అనే విషయంలో పార్టీలో చర్చ ఊపందుకుంటోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ వేములవాడ నుంచి పోటీ చేస్తారని తొలుత వార్తలొచ్చాయి. అయితే.. కరీంనగర్ అసెంబ్లీ నుంచి పోటీ చేయాలని సంజయ్‌పై స్థానిక నేతలు, కార్యకర్తలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. మంత్రి గంగుల కమలాకర్‌ను ఢీ కొట్టాలంటే సంజయ్‌ను పోటీలో దింపడమే సరైన ఛాయిస్ అని ఇటీవల బీజేపీ చేయించుకున్న పలు సర్వేల్లోనూ వెల్లడైనట్లు తెలిసింది. సంజయ్ కూడా ఇందుకు సుముఖంగా ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

**పోటీకి ఎన్‌ఆర్‌ఐల ఆసక్తి..**

కరీంనగర్ నుంచి బండి పోటీ దాదాపుగా ఖరారైన నేపథ్యంలో వేములవాడ అసెంబ్లీ నుంచి ఎవరు పోటీ చేస్తారనే అంశం ఇప్పుడు ఆసక్తిగా మారింది. మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు కుమారుడు బరిలో దిగుతారని ప్రచారం జరిగినా... తెరపైకి మాత్రం కొత్త పేర్లు వస్తున్నాయి. ఇద్దరు ఎన్‌ఆర్‌ఐలు ఈసారి బీజేపీ నుంచి వేములవాడ టిక్కెట్ ఆశిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ మేరకు వారు ఇటీవల సంజయ్‌ను కలిసి తమ మనోగతాన్ని కూడా వివరించినట్లు తెలిసింది. వీరిలో వేములవాడకు చెందిన తోట రాము ఒకరు. దుబాయిలో అనేక వ్యాపారాలు నిర్వహిస్తున్న తోట రాము వేములవాడలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన రాజకీయ ప్రవేశానికి బీజేపీనే ఎంచుకున్నారని సమాచారం. ఇప్పటికే తోట రాము పలుమార్లు బండి సంజయ్‌ను కలిసి పార్టీలో చేరే అంశంతోపాటు టిక్కెట్‌పై చర్చించారు. పలువురు సీనియర్ నేతలతోనూ ఈ విషయంపై సంప్రదించినట్లు తెలిసింది. దీంతోపాటు మరో ఎన్‌ఆర్‌ఐ కూడా సంజయ్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది.

**ఆచితూచి అడుగులు..!**

టిక్కెట్ల ఎంపిక విషయంలో బండి సంజయ్ ఆచితూచి అడుగేస్తున్నారు. బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఆయన వ్యూహాత్మకంగా అడుగులేస్తున్నారు. వేములవాడ నుంచి బరిలో దిగాలని సంజయ్‌పై కార్యకర్తల ఒత్తిళ్లు ఉన్నప్పటికీ.. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఆర్థికంగా, ప్రజల్లో పలుకుబడి ఉన్న వ్యక్తిని బరిలో దింపాలని యోచిస్తున్నారు. వేములవాడ సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్న విషయాన్ని ఈ ఎన్నికల్లో తమ అస్త్రంగా మలుచుకుని ముందుకెళ్లాలని బీజేపీ ప్రణాళిక రచిస్తోంది. ఇందుకోసం అంగబలం, అర్థబలం ఉన్న వ్యక్తిని ఈ స్థానంలో పోటీకి నిలపాలని యోచిస్తోంది. వీరితోపాటు వేములవాడ టిక్కెట్ కోసం కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు సీనియర్ నేతలు కూడా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వేములవాడ బీజేపీ అభ్యర్థిపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

**వీరి మాటేంటి?**

ఈ నేపథ్యంలో చాలాకాలంగా తనకు వేములవాడ నుంచి టికెట్ ఆశిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఎలాగైనా తాను బరిలో నిలబడాలన్న యోచనలో ఉన్నారని సమాచారం. అదే సమయంలో చాలాకాలంగా ఇక్కడ మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ కుమారుడు వికాస్ కూడా ఇదే స్థానంపై ఆసక్తి చూపుతున్నారు. సిరిసిల్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు ప్రతాప రామక్రిష్ణ కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బండి సంజయ్ వేములవాడ బరిలో లేడని తెలిసిన మరుక్షణమే ఈ స్థానానికి పోటీ అనూహ్యంగా పెరిగింది. వీరిలో ఎన్‌ఆర్‌ఐకి టికెట్ దక్కుతుందా? సీనియర్లను వరిస్తుందా? అన్న ఉత్కంఠ మొదలైంది.

### ఆముదం గింజలు తిని చిన్నారులకు అస్వస్థత

- ఆసిఫాబాద్‌లోని ఆస్పత్రిలో ఏడుగురికి చికిత్స



ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్

వాంకిడి(ఆసిఫాబాద్): ఆముదం గింజలు తిని చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటన కుమురం భీం జిల్లా వాంకిడి మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న పుల్లార గ్రామానికి చెందిన తొడసం జంగు, తొడసం జానుబాయి, సుర్పం భూమిక, సుర్పం కీర్తి, కుర్సెంగ నాగవల్లి, మడవి శంకర్, చిత్రం నందు ఆడుకుంటూ బుధవారం సాయంత్రం ఆముదం గింజలు తిన్నారు. చిన్నారులందరూ ఏడేళ్లలోపు వారే కావడంతో గింజలు తిన్న వెంటనే వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారిని వాంకిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డి ఆస్పత్రిని సందర్శించి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పూర్తిగా కోలుకునే వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు.

## అయ్యో చోటు..!

- ఆటో ట్రాలీ కింద పడి బాలుడు మృతి
- కుమురంభీం జిల్లా బీబ్రా గ్రామంలో ఘటన



చోటు మృతదేహం

దహెగాం(సిర్పూర్): రెప్పపాటులో జరిగిన ప్రమాదం ఓ చిన్నారి ప్రాణాలను బలి తీసుకుంది. అప్పటివరకు ఇంట్లో ఆడుకుంటూ తిరిగిన ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడం కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఆటోట్రాలీ కింద పడి 18 నెలల చిన్నారి మృతిచెందిన ఘటన కుమురంభీం జిల్లా దహెగాం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన దుర్గం సాయి, లలిత దంపతులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు చోటు (18 నెలలు) ఉన్నాడు. బుధవారం కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ సాజిద్ ఆటో ట్రాలీలో కర్బూజ కాయలు అమ్ముతూ బీబ్రాకు వచ్చాడు. మధ్యాహ్నం రోడ్డుపై నిలిపిన వాహనం వద్ద దుర్గం సాయి తల్లి శాంతాబాయి కర్బూజ కాయలు కొనుగోలు చేసింది. ఆ తర్వాత డబ్బులు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లి చోటును ఎత్తుకుని మళ్లీ రోడ్డుపైకి వచ్చింది. చిన్నారిని కిందికి దించి డబ్బులు ఇస్తుండగా సాజిద్ రోడ్డుపై ఉన్న ఆటో ట్రాలీని పక్కకు పోనిచ్చాడు. అదే సమయంలో ఆడుకుంటూ ఆటోట్రాలీ కిందకు వెళ్లిన చోటుపై నుంచి వాహనం వెళ్లడం తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే చోటును కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి నానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

## రిజర్వేషన్ చేసుకుంటే రాయితీ

ఆదిలాబాద్: రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి ప్రకటనలో తెలిపారు. 31 రోజుల నుంచి 45 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకుంటే టికెట్ ధరలో 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 46 నుంచి 60 రోజుల ముందు టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ఈమేరకు ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (ఓపీఆర్ఎస్) సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశామని, రిజర్వేషన్ సదుపాయం ఉన్న అన్ని సర్వీసులకు ఈ రాయితీ వస్తుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ కోసం www. tsrtconline. in ను సందర్శించాలని కోరారు.

## విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్



బాలింతల బంధువులతో మాట్లాడుతున్న డాక్టర్ అజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆరా తీశారు. సిబ్బంది వసూళ్లపై పేషెంట్లు, వారి బంధువులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించిన కొంత మందిని ఉద్యోగం నుంచి తొలగించాలని సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాలను ఆదేశించారు. పేషెంట్ల నుంచి అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్న లేబర్ రూం సిబ్బంది డీఎంహెచ్‌వో నుంచి నియామకం అయినందున వారిపై చర్యలకు డీఎంహెచ్‌వోకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా అద్దె రూంలను సిబ్బంది వాడుకుంటున్నారనే విషయంలో ఇటీవల సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించారు. అద్దె రూంలను పరిశీలించి ఆక్రమించిన సిబ్బందికి సంబంధించిన వస్తువులను ఖాళీ చేయించారు. కమిషనర్ వెంట ఆర్ఎంవో డాక్టర్ నవీన, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.






ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్. పేదలను నిరాశకు గురిచేసింది. ఒక్క ఆదాయపు పన్ను స్లాబుల్లో మార్పు చేస్తే సరిపోదు. దేశ భవిష్యత్తుకు ఏమాత్రం ఉపయోగపడని 'చీకటి' బడ్జెట్ ఇది. పూర్తిగా అవకాశవాదం కనిపిస్తోంది. నిరుద్యోగుల విషయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ బడ్జెట్‌ను తయారు చేశారు.


- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి



ప్రజల జీవన స్థితిగతులు, ధరల పెరుగుదలపై నెలకొన్న భయాందోళనలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ధనికులు, పేదల మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించడానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇది క్రూరమైన బడ్జెట్. పన్నుల తగ్గింపుల్లో కూడా పెద్ద మార్పులు లేవు. ప్రత్యక్ష పన్నులను తగ్గించలేదు. ప్రజలకు అత్యంత భారంగా ఉన్న జీఎస్టీ రేట్లను తగ్గించలేదు. దేశ సంపదనంతా అహ్మదాబాద్‌కే కట్టబెట్టేందుకు కేంద్రం నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది.

- పి. చిదంబరం, కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి

ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి ఈ బడ్జెట్ ఊతం కల్పిస్తుంది. రానున్న కొద్ది సంవత్సరాల్లో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపుదిద్దుకోవడానికి ఈ బడ్జెట్ దోహదం చేస్తుంది.



- రాజ్‌నాథ్ సింగ్, రక్షణమంత్రి

### మహాశక్తిగా మలిచేది



ఈ రోజు ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో నవ భారత సమృద్ధి పట్ల సంకల్పం ఉంది. అంత్యోదయుల పట్ల విజన్ ఉంది. 130 కోట్ల దేశ ప్రజల సేవాలక్ష్యం ఉంది. నిస్సందేహంగా ఈ బడ్జెట్ భారత్‌ను ఆర్థిక మహాశక్తిగా రూపొందించే దిశలో ఒక మైలురాయి అని రుజువవుతుంది.

- యోగి ఆదిత్యనాథ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి

### ఆలోచన లేదు



ఢిల్లీ వాసులు గతేడాది రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయపు పన్ను రూపంలో కేంద్రానికి చెల్లిస్తే బడ్జెట్‌లో ఢిల్లీకి దక్కింది కేవలం రూ.325 కోట్లే. దేశ రాజధానిగా ఉన్న ఢిల్లీపై కేంద్రం సవతితల్లిలా వ్యవహరిస్తోంది. పైగా ఈ బడ్జెట్ వల్ల ధరలు పెరుగుతాయి. నిరుద్యోగాన్ని తొలగించడానికి గట్టి ఆలోచన లేదు. విద్యకు కేటాయింపుల్ని 2.64 శాతం నుంచి తగ్గించి 2.5 శాతం చేయడం దౌర్భాగ్యం. ఆరోగ్య కేటాయింపులు తగ్గించి 2.2 శాతం నుంచి 1.98 శాతం చేయడం హానికారకం.

- అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

### పెద్దవాళ్ల బడ్జెట్



భాజపా ఇంతకుముందు జనానికి ఏమీ ఇవ్వనిది ఇప్పుడు మాత్రం ఏమిస్తుంది? భాజపా బడ్జెట్ ధరల్ని, నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. రైతులు, కార్మికులు, యువకులు, మహిళలు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలకు దీనివల్ల ఆశ కాదు నిరాశ పెరుగుతుంది. ఎందుకంటే, కొద్దిమంది పెద్దవాళ్లకు లాభం కలిగించడానికే ఇది తయారైంది.

- అఖిలేశ్ యాదవ్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి

### పేరు గొప్ప... ఊరు దిబ్బ



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేరుగొప్ప... ఊరు దిబ్బ తరహాలో ఉంది. వంటగ్యాస్, గోధుమ పిండి, ఆహార ధాన్యాలు, పాల వంటి నిత్యావసరాల ధరలను పెంచి నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదలను దోచుకుంటోంది. జీజేపీ మీద ప్రజలకు నమ్మకం పోయింది. ఈ ప్రభుత్వం సామాన్య ప్రజల జీవితాలను దుర్భరం చేస్తోంది.

- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు

# అమృత కాలంలో ఇదేనా వ్యవసాయం?

అభిప్రాయం



డా. దొంతి నరసింహారెడ్డి

**ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే రూపొందించినట్లున్నా... వ్యవసాయానికి మాత్రం అన్యాయం జరిగింది. ఒకపక్క 2022-23 ఆర్థిక సర్వే వ్యవసాయ రంగానికి 'ఒక కొత్త దారి' అవసరం అని పేర్కొన్నా... బడ్జెట్‌లో మాత్రం పాత కేటాయింపుల కన్నా తక్కువ నిధులు కేటాయించడం గమనార్హం. ఈ రంగానికి 2022-23లో రూ. 1.24 లక్షల కోట్లు కేటాయించగా... 2023-24కు గానూ రూ. 1.15 లక్షల కోట్లకు కేటాయింపులు తగ్గించారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. రైతు సగటు ఆదాయం దారుణంగా రూ.7 వేలకు మించడం లేదు. కానీ వ్యవసాయ అభివృద్ధి బాగా ఉందనీ, ఆహార ఉత్పత్తి పెరుగుతోందనీ ప్రకటించిన ప్రభుత్వం... రైతుల ఆదాయం గురించీ, దానిని రెట్టింపు చేసే లక్ష్యం గురించీ ప్రస్తావించలేదు.**

భారత వ్యవసాయం మంచి పనితీరును కనబరిచిందనీ, అయితే భూతాపం పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతిలో సంభవిస్తున్న వాతావరణ ప్రతికూల ప్రభావాలూ, పెరుగుతున్న పంట ఖర్చులూ వంటి కొన్ని సవాళ్ల నేపథ్యంలో ఈ రంగానికి 'ఒక కొత్త దారి' అవసరమనీ జనవరి 31న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2022-23 ఆర్థిక సర్వే తెలిపింది.

ఇదే ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం 2020-21లో వ్యవసాయంలో ప్రైవేటు పెట్టుబడులు 9.3 శాతానికి పెరిగాయి. వ్యవసాయ రంగానికి సంస్థాగత రుణాలు 2021-22లో రూ. 18.6 లక్షల కోట్లకు పెరిగాయి. భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్థిరమైన పెరుగుదల వల్ల 2021-22 లో 315.7 మిలియన్ టన్నులకు ఉత్పత్తి చేరింది.

2021-22 నాలుగో ముందస్తు అంచనాల ప్రకారం ఆహార ధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తి ఏటేటా పెరుగుతోంది. పప్పుధాన్యాల ఉత్పత్తి కూడా గత ఐదేళ్లలో సగటున 23.8 మిలియన్ టన్నుల కంటే ఎక్కువగా ఉంది.

మారుతున్న వాతావరణం... వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని చెప్పిన నివేదిక ఆహార ఉత్పత్తి పెరిగిందనీ చెబుతోంది. కానీ రైతుల పరిస్థితి మీద అంచనా మాత్రం వేయలేదు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. రైతు సగటు ఆదాయం చాలా దారుణంగా రూ.7 వేలు మించని వైనం ప్రస్తావించలేదు.

వ్యవసాయానికి ఒక కొత్త దారి అవసరమని ఆర్థిక సర్వే చెప్పినా, బడ్జెట్‌లో ఆ దిశగా ఆలోచన చేయలేదు. వ్యవసాయానికి కేటాయింపులను తగ్గించారు. 2022-23లో రూ. 1,24,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ కేటాయింపులు 2023-24కి వచ్చేటప్పటికి రూ. 1,15,531.79 కోట్లకు తగ్గించారు. పశుగణాభివృద్ధికీ, మత్స్య రంగానికీ కలిపి రూ. 6,576.62 కోట్లు కేటాయించారు. పోయిన సంవత్సరం ఈ రంగాలకు ఇచ్చింది రూ. 5,956.70 కోట్లు. వ్యవసాయ పరిశోధనలకు రూ. 9,504 కోట్లు కేటాయించారు. గతేడాది ఇచ్చింది రూ. 8,513.62 కోట్లు. మొత్తం మీద వ్యవసాయ రంగానికి గతేడాది కన్నా రూ. 8,468.21 కోట్లు – దాదాపు 7 శాతం తగ్గించారన్నమాట. వ్యవసాయ శాఖ ఆఫీసు ఖర్చులు 167 శాతం పెంచిన ప్రభుత్వం, ప్రధాన మంత్రి పంటల బీమా పథకానికి 13 శాతం కోత విధించింది. ఈసారి ఇచ్చింది కేవలం రూ. 13,625 కోట్లు మాత్రమే. ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, నకిలీ విత్తనాల బారిన పడి, రైతులకు పంట నష్టం పెరుగుతుంటే ఆదుకునే ఒకే ఒక్క బీమా పథకాన్ని ఇంకా



విస్తృతం చేయాల్సి ఉండగా తగ్గించడం శోచనీయం.

ప్రధాన మంత్రి రైతులకు అందిస్తున్న రూ. 2 వేల నగదు సహాయం వల్ల రైతులకు నగదు సమస్య తీరిందనీ, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు వారి రోజువారీ వినియోగం, విద్య, ఆరోగ్యం ఇతర యాదృచ్ఛిక ఖర్చులను తీర్చడానికి సహాయపడిందనీ సర్వే తెలిపింది. ఏడాదికి కేవలం రూ. 2 వేలతో రైతుల సమస్య తీర్చిన ఈ గొప్ప పథకానికి బడ్జెట్లో కేటాయింపులు మాత్రం పెరగలేదు. పైగా తగ్గాయి. మొత్తంగా రూ. 8 వేల కోట్లు తగ్గించారు.

పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, చేపల పెంపకంపై దృష్టి సారించి వచ్చే ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రుణ లక్ష్యాన్ని 11 శాతం (రూ. 20 లక్షల కోట్ల) పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రుణ లక్ష్యం రూ. 18 లక్షల కోట్లు. ఇది లక్ష్యం మాత్రమే. రైతులకు బ్యాంకుల నుంచి, సంస్థాగత రుణాలు పలు కారణాల వల్ల అందడం లేదు. ప్రతి ఏటా ప్రకటించే రుణాల లక్ష్యం ఏ మేరకు సఫలం అయ్యిందీ ప్రభుత్వం స్పష్టంగా చెప్పదు. రూ. 2,200 కోట్ల వ్యయంతో అధిక విలువ కలిగిన ఉద్యాన పంటలకు వ్యాధి రహిత, నాణ్యమైన మొక్కల లభ్యతను పెంచడానికి ప్రభుత్వం 'ఆత్మనిర్భర్ క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్'ను ప్రారంభిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఈ కొత్త పథకానికి ప్రత్యేక కేటాయింపులు మాత్రం లేవు. కృషి ఉన్నతి కార్యక్రమంలో భాగంగా ఖర్చు పెట్టవచ్చు.

మత్స్యకారులూ, చేపల వ్యాపారులూ... సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల కార్యకలాపాలను మరింత సులభతరం చేయడానికీ, మత్స్య ఉత్పత్తుల సరఫరా సామర్థ్యాలను మెరుగుపరచడానికీ, మార్కెట్ విస్తరించడానికీ 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన' కొత్త ఉప పథకాన్ని రూ. 6,000 కోట్ల పెట్టుబడితో ప్రారంభిస్తామని ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో చెప్పారు. కాని మత్స్య శాఖ కేటాయింపులు మొత్తం రూ. 2,250 కోట్లు దాటలేదు. 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన' పథకానికి ఇచ్చిన కేటాయింపు కేవలం రూ. 2,025 కోట్లు మాత్రమే. తరువాత పెంచుతారా అనే విషయంలో స్పష్టత లేదు.

వ్యవసాయ రుణాలపై ఉండే 9 శాతం వడ్డీకి, 2 శాతం వడ్డీ సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కేటాయించింది రూ. 23 వేల కోట్లు. పోయిన ఏడాది సవరణ ద్వారా ఈ పథకానికి ఇచ్చింది రూ. 22 వేల కోట్లు – పెంచింది కేవలం 4.5 శాతం మాత్రమే. ఈ పథకం ద్వారా ఎంత మంది రైతులు లబ్ధి పొందుతున్నారు? బ్యాంకు రుణాలు తీసుకున్న ప్రతి రైతుకూ ఈ వడ్డీ రాయితీ అందడం లేదు. వడ్డీ రాయితీ నేరుగా రైతులకు కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేటు రుణదాతలు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు తమ నిధుల వినియోగంపై వడ్డీ రాయితీ... ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకుల రీఫైనాన్సింగ్ కోసం నాబార్డ్‌కు ఇస్తారు.

ఇదివరకు, 3 శాతం వడ్డీ రాయితీ కేంద్ర ప్రభుత్వం ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఇంకొక 3 శాతం ఇచ్చేది. ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ ఇవ్వడం లేదు. రైతు మీద వడ్డీ భారం 7 నుంచి 9 వరకు ఉంటుందని మనకు అర్థమవుతోంది. స్పష్టంగా రైతులకు ఉపయోగపడే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేయలేదు. రుణ వ్యవస్థలో చిన్న, సన్నకారు రైతుల సంఖ్యను పెంచడానికీ, పూచీకత్తు లేని వ్యవసాయ రుణాల పరిమితిని రూ. 1 లక్ష నుండి రూ. 1.6 లక్షలకు పెంచాలనీ రిజర్వ్ బ్యాంకు నిర్ణయించిందనే ప్రకటన చూశాం. దీనికీ బడ్జెట్ కేటాయింపులకూ సంబంధం లేదు.

వ్యవసాయ అభివృద్ధి బాగా ఉందనీ, ఆహార ఉత్పత్తి పెరుగుతోందనీ ప్రకటించిన ప్రభుత్వం... రైతుల ఆదాయం గురించీ, దానిని రెట్టింపు చేసే లక్ష్యం గురించీ, ఈ మధ్య కాలంలో రైతులు ఎదుర్కుంటున్న ఆర్థిక నష్టాల గురించీ అటు ఆర్థిక సర్వేలో, ఇటు కేంద్ర బడ్జెట్‌లోనూ ఎటువంటి ప్రస్తావనా చేయకపోవడం, వారి సమస్య పరిష్కారానికి తగిన విధంగా స్పందించకపోవడం వ్యవసాయ ఆధారిత సమాజంలో పెను విషాదం.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

# ఈ లక్ష్యాలు సరికాదు!

అభిప్రాయం



ప్రొఫెసర్ డి. నర్సింహారెడ్డి

వార్షిక బడ్జెట్ అనగానే ఒక ఏడాది కాలానికి సంబంధించి చేసే కేటాయింపులు కాగా, దేశం వందేళ్ల పూర్తి చేసుకునే 2047 నాటికి లక్ష్యాల దిశగా ఈ బడ్జెట్ అని ప్రధాని మోదీ పేర్కొనడం సరికాదు. దీన్నిబట్టి చూస్తే 2024 లోక్‌సభ ఎన్నికల రీత్యా ఎక్కడెక్కడ ఇబ్బందులున్నాయి, ఏయే వర్గాల్లో అసంతృప్తి ఏర్పడుతుందో గుర్తించి వాటిని సరిదిద్దే చర్యలు బడ్జెట్ ద్వారా చేపట్టినట్టు కనిపిస్తోంది. అందుకే మధ్యతరగతి, మహిళలను ఫోకస్‌లో పెట్టుకున్నారు. ఆదాయపన్ను పరిమితి పెంపు, ఎస్‌హెచ్‌జీ లకు రాయితీలు, తదితరాలకు కేటాయింపులు అలా ఇచ్చినవే. గ్రామీణ ప్రజానీకాన్నీ, పేదలనూ ఆదుకోవడంలోనూ ఈ బడ్జెట్ వెనకడుగు వేసింది.



మధ్యతరగతికి ప్రాధాన్యం తగ్గి, ఆ వర్గాల్లో అసంతృప్తి రగులుతోందన్న విషయాన్ని గ్రహించి, ఆదాయపు పన్ను పరిమితి పెంచారనిపిస్తోంది. సమాజ గతిలో మధ్యతరగతి పెద్ద పాత్ర పోషిస్తున్నదని ప్రధాని మోదీ తాజాగా పదే పదే పేర్కొనడం ద్వారా ఇదే స్పష్టమైంది. సమాజంలోని సమస్యలు, ఇతర అంశాలపై గొంతు విప్పేదిగా ముద్రపడిన ఈ వర్గం ప్రజలకు బడ్జెట్ ప్రతిపాదనలతో దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. దీన్ని పెద్ద ఎత్తున రాయితీల కల్పన లేదా పునర్ వ్యవస్థీకరణగా చూడాల్సిన అవసరమూ లేదు.

ఎన్నికలు రానుండడంతో దేశజనాభాలో సగభాగమైన స్త్రీలను దృష్టిలో పెట్టుకొని, బడ్జెట్‌లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) పాత్రను ప్రస్తావించారు. ఎస్‌హెచ్‌జీల పాత్రను ప్రధాని ప్రశంసిస్తున్నా, వీటిలో కేంద్రం నిర్వహించే పాత్ర శూన్యం. ఈ సంఘాల ఏర్పాటు, వడ్డీ రాయితీలు, అభివృద్ధి, వివిధ కార్యక్రమాల్లో నిమగ్నం చేయడం, బ్యాంక్‌లతో లింకేజీ రాష్ట్ర ప్రభుత్వాలే చేస్తున్నాయి. వీటి నిర్వహణతో పాటు మంచి ఫలితాలను సాధించడంలో ఏపీ, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలు దేశంలో అగ్రభాగాన నిలుస్తున్నాయి. కేంద్రం పాత్ర లేకున్నా, ఎస్‌హెచ్‌జీల ప్రస్తావనతో మహిళల ఆదరణ పొందేందుకు ప్రయత్నించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి కేటాయింపులు తగ్గించి, పేదవర్గాలకు నష్టం చేకూరుస్తూ, ఇప్పుడు ప్రభుత్వ పెట్టుబడులు పెంచడంపైనా ప్రశ్నలు ఎదురవుతున్నాయి. క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్లు, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయడం మంచిదైనా, పేదవర్గాలను ఆదుకునే అదనపు చర్యలు లేక పోవడం విషాదం.

బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన ప్రస్తావన, స్పష్టత కొరవడింది. సెంట్రల్ సెక్టార్ ద్వారా 10 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని గతంలో మోదీ చెప్పారు. దాని గురించి ఇప్పుడు ఎలాంటి ప్రస్తావనా లేదు. సాధారణంగా ఆర్థికరంగంలో ప్రభుత్వ కేటాయింపుల పెంపు, ప్రైవేట్ పెట్టుబడుల పెరుగుదల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే అంతర్గత భావనగానే దీన్ని విడిచిపెట్టినట్టున్నారు. ఇక, కోటిమంది రైతులు సేంద్రియ రైతులుగా మారతారని బడ్జెట్‌లో పేర్కొంటున్నా అది ఎలా చేస్తారనే దానిపై స్పష్టత లేదు. సహజ, సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసే వారికి ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రోత్సాహకాలూ అందడం లేదు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఎకరానికి ఏడాదికిచ్చే మొత్తం రూ. 6 వేల నుంచి రూ. 8 వేలకు బడ్జెట్‌లో పెంచుతారనే ప్రచారం జరిగినా అదీ జరగలేదు.

వ్యాసకర్త ఆర్థిక వేత్త, హెచ్‌సీయూ సోషల్ సైన్సెస్ విభాగం మాజీ డీన్

# కార్పొరేట్ల బడ్జెట్

అభిప్రాయం



ప్రొ. జి. హరగోపాల్

ఇదే కాదు... కొన్నేళ్ళుగా బడ్జెట్‌ల స్వరూపాలను చూస్తే ఇవి బడుగులకు బాసటగా ఉంటున్నాయా? కార్పొరేట్లకు కొమ్ముగాస్తున్నాయా అనే సందేహాలొస్తున్నాయి. ప్రజల భవిష్యత్, మానవ ప్రమాణాలు, జీవన అవసరాలు నెరవేరని బడ్జెట్ దేశాన్ని సంక్షోభంలోకి నెడుతుందనేది నిర్వివాదాంశం. సంపద సృష్టే లక్ష్యంగా దేశ బడ్జెట్‌ను ప్రవేశపెడితే దుష్ఫలితాలు తప్పవు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ఈ వాదానికి ఏమాత్రం తీసిపోదు. ఆదాయానికి అనుగుణంగా పన్నులు వేయాల్సిందే. దాని ద్వారా వచ్చిన ఆదాయంతోనే ప్రజా సంక్షేమం సాధ్యం. ఇది జరగాలంటే సంపాదించే వర్గం నుంచే ఆదాయాన్ని రాబట్టాలి. కానీ నూతన ఆర్థిక విధానాల తర్వాత బడ్జెట్ల స్వరూపమే మారుతోంది. అవి కార్పొరేట్ రంగానికి ఊతమిచ్చేలా ఉంటున్నాయి.

ప్రత్యక్ష, పరోక్ష పన్నులను పరిశీలిస్తే 70 శాతం సంపదను గుప్పిట్లో పెట్టుకునే పది శాతం ఆదాయ వర్గాల నుంచి పన్ను రాబట్టడం లేదు. ఆదాయం తక్కువగా ఉండే 90 శాతం ప్రజలే పన్నుల భారాన్ని మోస్తున్నారు. రూ. 6 కోట్ల సంపద దాటినా 30 శాతమే పన్ను వేయడం ఏమిటి? ఇదే ప్రభుత్వాలు అనుసరిస్తున్న లాజిక్. ప్రత్యక్ష పన్నుల పేరుతో 90 శాతం తక్కువ సంపద ఉన్నవారి నుంచి పీడిస్తున్నారు. దేశ ద్రవ్యోల్బణం 3 శాతం దాటకూడదు. కానీ 6 శాతం ద్రవ్యోల్బణం ఉన్నట్టు కేంద్రం చెబుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేయడంలో ఏమాత్రం వెనకాడని ప్రభుత్వం, వాటి పరిరక్షణకు ఎక్కడా కేటాయింపులు చేయకపోవడం దుర్మార్గమే. జనాభాలో 60 శాతంగా ఉన్న రైతుల ఆదాయం కేవలం 11 శాతమే. అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అనేక రకాలుగా ఆందోళనలకు దిగుతున్నారు. ఈ రంగాన్ని కేంద్ర బడ్జెట్ విస్మరించడం దారుణం.

డిజిటల్ టెక్నాలజీ తెస్తామనీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెస్తామనే భరోసాలు రైతన్న కళ్ల నీళ్లు తుడుస్తాయా? విద్యారంగంపై చేసే ఖర్చును పెట్టుబడిగానే చూడాలి. ఈ రంగంపై పెట్టుబడులు పెట్టబట్టే జపాన్, కొరియా వంటి దేశాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి. కానీ మన బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు తగ్గించారు.

కోవిడ్ మనకు ఎన్నో అనుభవాలు నేర్పింది. వైద్య రంగాన్ని అతలాకుతలం చేసింది. అయినా పేదవాడి ప్రాణాలకు భరోసా ఇచ్చే రీతిలో కేటాయింపులు కన్పించడం లేదు. ప్రైవేట్ కాలేజీలు నర్సింగ్ కోర్సులు పెట్టుకునేందుకు ముందుకు రావడం లేదు. లాభాలు తక్కువగా వస్తున్నాయని



వెనకడుగు వేస్తున్నాయి. కాబట్టే నర్సింగ్ కాలేజీలకు నిధులు కేటాయించారు. కానీ అందరికీ వైద్యం అందించేందుకు తీసుకున్న చర్యలేమిటో, కేటాయించిన నిధులెంతో ప్రభుత్వం చెప్పలేదు. విద్య, వైద్యాన్ని విస్మరిస్తే పురోగతి ఎలా సాధ్యమవుతుంది? ఏదేమైనా ఈ బడ్జెట్ పేదలకు ఏ మాత్రం ప్రయోజనం చేసేది కాదు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగానే ఉంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తిలోదకాలిచ్చిన నేపథ్యం తాజా బడ్జెట్ కూర్పులో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ప్రభావం మున్ముందు అనేక దుష్ఫలితాలకు దారి తీస్తుంది.

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక విశ్లేషకులు

# సమతూకం లేని సంబరం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలనూ కాస్త ఆనంద పర్చేలానే ఉంది. బహుశా 2024లో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈమాత్రం జాగ్రత్త! మూలధనం వ్యయంపై దృష్టి పెట్టడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చారు. ఆదాయ పన్ను పరిమితి పెంపు ద్వారా సగటు వేతన జీవిని తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. ఇంత చేసినా... దేశానికి అన్నం పెట్టే రైతన్నను కంటతడి పెట్టించేలా బడ్జెట్ ఉండటం అన్యాయమే. పెట్టుబడి ఖర్చు తగ్గించే చర్యలే లేవు. అప్పుల ఊబి నుంచి రైతన్నను గట్టెక్కించే కనీస మద్దతు ధర విషయం కన్పించలేదు. సహకార బ్యాంకుల ద్వారా రుణాలిస్తామని చెప్పినా, గడచిన కాలంలో ఎదురైన ప్రతి



కూలతలు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయం పరిధిలోకి కోటి మంది రైతులను తీసుకొస్తామని చెప్పారు. ఇందుకు అనుగుణంగానే బయో ఫర్టిలైజర్‌కు కేటాయింపులు పెంచారు. ఎక్కువమంది రైతులకు ప్రయోజనంగా ఉండే 'ఫసల్ బీమా' వంటి వాటికి కేటాయింపులు పెంచితే బాగుండేది. మార్కెట్ ధర, ఎంఎస్‌పీకి మధ్య ఉన్న తేడాను పూడ్చేందుకు ప్రయత్నిస్తే రైతన్నకు ఊతం ఇచ్చినట్టు అవుతుంది. 'నరేగా'కు నిధులు తగ్గించడం ప్రతికూల ఫలితాలనే ఇస్తుంది. రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా విద్యుత్ రంగ సంస్కరణలను మరింత బలంగా తీసుకెళ్ళే యోచన బడ్జెట్ ప్రసంగంలో కనిపించింది. ఇది ప్రైవేటీకరణకు దారి తీస్తుంది.

అభిప్రాయం



ప్రొఫెసర్ ఇ. రేవతి

ప్రభుత్వ మూలధన వ్యయం పెంచడం ఉపాధి కల్పించే అంశమే. అయితే, ఈ విషయంలో రాష్ట్రాలకు కేంద్రం ఊతం ఇవ్వాలన్న విషయాన్ని విస్మరించింది. ఎన్నికల కారణంగా కర్ణాటకకు బడ్జెట్‌లో మేలు చేసినా... ఇతర రాష్ట్రాల పురోభివృద్ధిని పట్టించుకున్నట్టు లేదు. కోవిడ్ తర్వాత ప్రైవేట్ పెట్టుబడులు తగ్గాయి. ఈ కారణంగానే రెండేళ్లుగా ప్రభుత్వ పెట్టుబడిని పెంచుతున్నారు. ఇది ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తుందనేది కేంద్రం ఆలోచన. మూల ధన వ్యయాన్ని రూ. 10 లక్షల కోట్లకు పెంచడం మంచిదే. రాష్ట్రాల్లో పెరిగే మూలధన పెట్టుబడుల విషయంలోనూ కేంద్రం తోడ్పాటు ఉంటే బాగుండేది. ఉదాహరణకు తెలంగాణ ప్రభుత్వం మూల ధన పెట్టుబడులు పెంచింది. ఈ కారణంగా కేంద్రం నుంచి రాష్ట్రం వాటా పెరగాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసినా గతంలో ఇవ్వలేదు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్' అంటూ ముందుకెళ్ళిన మోదీ సర్కార్ తయారీ రంగాన్ని ప్రోత్సహించిన దాఖలాలు బడ్జెట్‌లో కన్పించలేదు. కోవిడ్ తర్వాత చితికిన ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ ఇస్తున్నా... వాటిని బలోపేతం చేసే దిశగా అడుగులు పడలేదు. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తికి ఎంఎస్‌ఎంఈలు చేరాలంటే భారీగా రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది. గత కొంతకాలంగా చూస్తే... సెస్‌లు, సర్‌ఛార్జీల రూపంలో కేంద్రానికి రాష్ట్రాల నుంచి ఆదాయం వస్తోంది. కానీ ఈ మొత్తాదులో రాష్ట్రాలకు కేంద్రం వాటా ఇవ్వడం లేదనేది సుస్పష్టం. ఉదాహరణకు విద్యా రంగం నుంచి ఎక్కువ భాగం సెస్ వస్తున్నా... అందులో ఒక్క శాతమే కేంద్రం ఇస్తోంది. ప్రస్తుత బడ్జెట్‌లో సమతూకాన్ని పాటించకపోవడం ప్రతికూలమే.

వ్యాసకర్త సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ డైరెక్టర్

### తలసరి ఆదాయం పెంచేది



విజన్, నిర్మాణం, క్రమశిక్షణ కలిగిన బడ్జెట్. సంపాదించే ప్రతి ఒక్కరికీ తక్షణ లబ్ధి చేకూరుస్తుంది. ఆర్థిక ఏకీకరణ (ద్రవ్యలోటు, రుణాల తగ్గింపు) దిశగా తగిన చర్యలున్నాయి. ప్రతి భారతీయుడి తలసరి ఆదాయాన్ని 1.97 లక్షల నుంచి విశేషంగా పెంచేలా పునాది వేస్తుంది. పేరుకు తగ్గట్టే అమృత కాలానికి ఇది మొదటి బడ్జెట్.

- ఉదయ్ కోటక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ సీఈఓ

### రైతుల పట్టింపు లేదు



బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ పథకాల మీద(పీఎం కిసాన్ సహా) ఖర్చుల్ని విపరీతంగా కుదించారు. 2022-23 (పూర్వ అంచనా) లోని 3.84 శాతం నుంచి 2023-24లో 3.20 శాతానికి తగ్గింది. బహుశా రైతుల పట్ల అత్యంత పట్టింపు లేని బడ్జెట్ ఇది.

- యోగేంద్ర యాదవ్, యాక్టివిస్ట్

### పదివేలకు పదహారా?



ప్రభుత్వ పని ఎంత గొప్పగా ఉందో చూడండి: ఏడు లక్షలు సంపాదిస్తే, ఏ పన్నూ చెల్లించనక్కర్లేదు. అదే 7.1 లక్షలు సంపాదిస్తే, 16,000 పన్నుగా చెల్లించాలి. అంటే ఒక్క 10,000 ఎక్కువ సంపాదిస్తే, 16,000 పన్నుగా పోతుంది. మేధావులు మాత్రమే ఇలాంటి పన్ను విధానాన్ని రూపొందించగలరు.

- సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

### కీలకాంశాల పట్టింపేది?



బడ్జెట్ అనేది కేవలం రెవిన్యూలు, ఖర్చుల గురించి మాత్రమే కాదు- కీలక సామాజికార్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి అవసరమైన చట్రాన్ని రూపొందించే అవకాశం కూడా! కానీ నిరుద్యోగం, పేదరికం, అసమానతలు, మహిళా సాధికారత, సామాజిక రంగాల లాంటి కీలక అంశాల్లో 2023 బడ్జెట్ ఒక వైఫల్యం.

- సల్మాన్ అనీస్ సోజ్, ప్రపంచ బ్యాంక్ మాజీ అధికారి

### నోట్ల పెట్టుబడి



బిగ్ బ్యాంగ్ ఎత్తుగడ: ఎఫ్‌పీఐ (ఫారిన్ పోర్ట్ ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్)లతో పూర్తిస్థాయి పీ-నోట్ (పార్టిసిపేటరీ నోట్) పెట్టుబడులను తెచ్చారు నిర్మలా సీతారామన్. రెట్టింపు పన్ను ఒప్పందం కంటే ఇది పెద్దది. పీ- నోట్లతో ఎఫ్‌పీఐలకు పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. 'గిఫ్ట్' సిటీ నుంచి విదేశీ బ్యాంకులు పీ-నోట్లను జారీ చేయగలవు.

- పాలక్ షా, ఆర్థికాంశాల రచయిత

### వీళ్ళే నడుపుతున్నారు



2022-23 సంవత్సరానికి 6.3 కోట్ల మంది ఐటీ రిటర్నులు ఫైల్ చేశారు. ఇందులో 40 శాతం జీరో ట్యాక్స్ రిటర్నులు. అంటే 3.8 కోట్ల మంది ఆదాయ పన్ను చెల్లిస్తున్నారు. వసూలైన వ్యక్తిగత ఆదాయ పన్ను రూ.5 లక్షల కోట్లు. ఈ 3.8 కోట్ల మంది చెల్లించిన తలసరి పన్ను రూ.1.3 లక్షలు.

- అమితాబ్ తివారీ, పెట్టుబడుల సలహాదారు

### నాటు నాటు బడ్జెట్



మరోసారి 'ఆర్ఆర్ఆర్' బడ్జెట్! రైల్వేలు, రెన్యూవబుల్స్ (పునర్వినియోగ), రిఫార్మ్స్(సంస్కరణలు). ఈ నాటు నాటు బడ్జెట్ మనల్ని గోల్డెన్ గ్లోబ్ గెలిచే పథంలో పెడుతుంది.

- హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

**గ్రహం అనుగ్రహం** శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.ద్వాదశి సా.5.03 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: ఆరుద్ర పూర్తి (24గంటలు), వర్జ్యం: ప.1.53 నుండి 3.36 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.21 నుండి 11.07 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.35 వరకు, అమృతఘడియలు: 7.56 నుండి 9.39 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.51.

## క్లుప్తంగా...

### పాతగుట్టలో వైభవంగా ధ్వజారోహణం



గరుడ ముద్దలను ఎగురవేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ధ్వజారోహణం, వేదపారాయణాలు నిర్వహించారు. శ్రీస్వామి వారి వాహనమైన గరుఢ ఆళ్వారుడిని కొత్త వస్త్రంపై చిత్రించి పూజలు చేశారు. గరుఢ ముద్దలను ధ్వజస్తంభం వద్ద పైకి ఎగరేసి పూజించారు. సాయంత్రం భేరీ పూజ, దేవతాహ్వానం విశేషంగా జరిపించారు. గురువారం శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.

### ఆస్ట్రేలియాకు యాదాద్రి ఆలయ బృందం

యాదగిరిగుట్ట: ఆస్ట్రేలియా దేశంలో ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ విక్టోరియా ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి ఆలయ ఈవో గీతారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు బుధవారం బయల్దేరి వెళ్లారు. 4వ తేదీన మెల్‌బోర్న్, 11వ తేదీన సిడ్నీ, 18వ తేదీన బ్రిస్బేన్‌లో యాదాద్రీశుడి కల్యాణ వేడుకలు నిర్వహించనున్నారు. ఏటా ఆస్ట్రేలియాలోని వివిధ రాష్ట్రాల్లో శ్రీస్వామి వారి కల్యాణోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ఈవో గీతారెడ్డి నేతృత్వంలో ఏఈవో రఘు, ఉప ప్రధానార్చకుడు సురేంద్ర చార్యులు, ముఖ్య అర్చకుడు నర్సింహమూర్తి, వేద పండితుడు వేణుగోపాలచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తరలి వెళ్లారు.

### తీర్చిదిద్దడం చేతకాకపోతే పిల్లలను కనొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా రూరల్: 'పిల్లలను ప్రయోజకులుగా చేయకపోతే తల్లిదండ్రులు చరిత్రలో దోషులుగా నిలబడతారు. మీకు చేతకాకపోతే పిల్లల్ని కనొద్దు.. కన్నారంటే ప్రయోజకులను చేయాల్సిందే' అని ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైరా మండలం గొల్లెనపాడులో నిర్మించిన సీసీ రోడ్లు, ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకోకపోతే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ 'మీరు ఏం చేస్తారో చేయండి.. అప్పుల పాలవుతారా ఇంకేం చేస్తారో తెలియదు.. పిల్లలను మాత్రం ఉన్నతంగా చదివించాల్సిందే' అని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇస్తూ, బడుల్లో వసతులు కల్పిస్తున్నందున పిల్లలను బడికి పంపించని తల్లిదండ్రులు చరిత్రకు సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు. 'మీరు పిల్లలను కంటారు.. ఆ పిల్లలను ప్రయోజకులుగా చేయకపోతే దోషులుగా నిలబడతారు' అని పేర్కొన్నారు. తాను చదువుకునే రోజుల్లో మూడేళ్లపాటు మధ్యాహ్న భోజనం చేయకుండానే సాయంత్రం వరకు ఉండేవాడినని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు.

### నేడు రాజ్‌భవన్‌కు వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల భేటీ కానున్నారు. గురువారం ఆమె రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనా వైఫల్యాల పై వినతి పత్రం సమర్పిస్తారు. గవర్నర్‌ను కలి సిన అనంతరం రాజ్‌భవన్ నుంచే షర్మిల తన పాదయాత్రకు బయలుదేరనున్నారు. ఆగిన చోట నుంచే ప్రజా ప్రస్థానం పునఃప్రారంభంకానున్నది. నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం శంకరమ్మ తండా నుంచి షర్మిల తన పాద యాత్ర మొదలు పెట్టనున్నారు.

**నెక్కొండ మీదుగా224వ రోజు...**

నెక్కొండ మండల పరిధిలోని తోపనగడ్డ తాండా, నెక్కొండ మీదుగా వైఎస్ షర్మిల తలపెట్టిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర 224వ రోజుగా కొనసాగనున్నదని ఆ పార్టీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వాడుక రాజగోపాల్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నారావుపేట మండలం శంకరమ్మ తాండా నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఆ సాయంత్రం 5.30 గంటలకు నెక్కొండ మండల కేంద్రంలో షర్మిల ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మాట– ముచ్చట'కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

# గోదావరి కావేరి అనుసంధానం సందేహమే!

**నిధుల కేటాయింపుపై కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు**

- కెన్–బెత్వా అనుసంధానానికి మాత్రమే రూ.3,500 కోట్లు
- తెలుగు రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న అప్పర్ భద్రకు రూ.5,300 కోట్ల సాయం
- వచ్చే కర్ణాటక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర సర్కార్ తాయిలం
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఇతర ప్రధాన ప్రాజెక్టుల ప్రస్తావన కరువు



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నదుల అనుసంధానంలో భాగంగా చేపట్టాలని నిర్ణయించిన గోదావరి–కావేరి అనుసంధాన ప్రక్రియ ఈ ఏడాది ముందుకు పోయేట్లు కనిపించడం లేదు. బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఈ అనుసంధాన ప్రక్రియకు సంబంధించి ఊసెత్త కపోవడం, నిధుల కేటాయింపులపైనా ఎలాంటి ప్రకటన లేకపోవడంతో ఇప్పట్లో ఇది సాధ్యపడేట్లు కనిపించడం లేదు. కేవలం ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలను తీర్చే కెన్–బెత్వా నదుల అనుసంధాన ప్రక్రియకు మాత్రమే నిధులు కేటాయింపు జరిపిన కేంద్రం, మిగతా నిధుల అనుసంధానాలపై ఎలాంటి ప్రస్తావన చేయలేదు. గోదావరి–కృష్ణా, కృష్ణా–పెన్నార్, పెన్నార్–కావేరి అనుసంధానానికి సంబంధించిన ముసాయిదా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు ఇప్పటికే ఖరారయ్యాయని, ఈ ప్రక్రియ ద్వారా లబ్ధిపొందే రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిన తర్వాత, వాటి అమలుకు కేంద్రం తోడ్పాటును అందిస్తుందని గత బడ్జెట్ సమావేశాల సందర్భంగానే కేంద్రం ప్రకటించినప్పటికీ సంప్రదింపుల వ్యవహారం కొలిక్కిరాలేదు. ఈ నేపథ్యంలోనే ఎలాంటి ప్రకటన చేయలేదని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి.

**అప్పర్ భద్రపై అభ్యంతరాలున్నా...**

ఇక తుంగభద్ర జలాలపై ఆధారపడి కర్ణాటక రాష్ట్రం చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర సాయం కింద రూ.5,300 కోట్లు ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. కర్ణాటకలోని కరువు పీడిత ప్రాంతాల్లో సుస్థిరమైన మైక్రో ఇరిగేషన్, తాగు నీటి కోసం చెరువులను నింపేందుకు ప్రాజెక్టుకు నిధులివ్వనున్నట్లు ప్రకటించారు. అయితే ఈ ప్రాజెక్టుపై సైతం దిగువ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు తీవ్ర అభ్యంతరాలు చెబుతున్నాయి. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం అప్పర్ తుంగకు 11 టీఎంసీ, అప్పర్ భద్రకు 9 టీఎంసీల నీటి కేటాయింపులున్నాయని, అయితే ఈ ట్రిబ్యునల్ తీర్పు అవార్డు కానందున ఈ నీటి వినియోగానికి కర్ణాటకకు అవకాశం లేదని కేంద్రానికి రెండు రాష్ట్రాలు తెలిపాయి. అదీగాక తీర్పులో పేర్కొన్న దానికన్నా అధికంగా నీటిని వినియోగించేలా అప్పర్ భద్రను చేపట్టిందని వివరించాయి. దీనికితోడు ఒక నదిలో నీటి వినియోగంతో దిగువ రాష్ట్రాలకు నష్టం జరిగితే అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం –1956 నిబంధనల మేరకు పరీవాహక ప్రాంతంలోని దిగువ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అభిప్రాయాలను తీసుకోవాలని, కానీ అలాంటిదేమీ లేకుండానే అప్పర్ భద్ర ప్రాజెక్టు ద్వారా 29.90 టీఎంసీలను తరలించడానికి కేంద్ర జలసంఘం అనుమతించడాన్ని తప్పుపట్టాయి. అప్పర్ భద్ర ప్రాజెక్టుతో దిగువ రాష్ట్రాలపై ప్రభావం పడుతుందని లేఖ రాసినా పట్టని కేంద్రం బడ్జెట్‌లో మాత్రం భారీ నిధులు కేటాయించింది. రానున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ఈ కేటాయింపులు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

**మిగతా ప్రాజెక్టుల ప్రస్తావన కరువు..**

ఇక కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు సంబంధించిన ఇతర పథకాల అంశాలను వేటినీ ప్రస్తావించలేదు. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించి కాళేశ్వరం, ఏపీకి సంబంధించిన పోలవరంపై ఎలాంటి నిధుల కేటాయింపులు చేయలేదు. అయితే ఏఐబీపీ ప్రాజెక్టులకు మాత్రం నిధులను రూ.1,800 కోట్ల నుంచి రూ.3,122 కోట్లకు పెంచింది. దీనిద్వారా తెలంగాణలోని 7 ప్రాజెక్టులు, ఏపీలోని 3 ప్రాజెక్టులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. దీంతో పాటే క్యాడ్‌వామ్ కింద నిధులను రూ.140 కోట్లనుంచి రూ.400 కోట్లకు పెంచడంతో తెలంగాణలోని 11 ప్రాజెక్టులకు ప్రయోజనం చేకూరనుంది.

## దేశవ్యాప్తంగా ఎస్సీలకు రూ.15 వేల కోట్లేనా?



సాక్షి, హైదరాబాద్: ఎస్సీల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.38 వేల కోట్లు ఖర్చు చేస్తుంటే.. కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా కేవలం ఎస్సీలకు రూ.15 వేల కోట్లు కేటాయించడం సిగ్గు చేటు. దీంతో దేశవ్యాప్తంగా అణగారిన వర్గాలను కేంద్ర ప్రభుత్వం అవమానపరిచింది. మోదీ పాలనలో అన్యాయం, వివక్ష కొనసాగుతుందనడానికి కేంద్ర బడ్జెట్ నిదర్శనం. రైతులు, ఉద్యోగులు, ఉపాధి హామీ కూలీలకు బడ్జెట్ వ్యతిరేకంగా ఉంది. వ్యవసాయంతో పాటు ఇతర రంగాలను పట్టించుకోలేదు. దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసే కార్పొరేట్లకు కొమ్ము కాసే బడ్జెట్ ఇది. రాష్ట్రాలను కేంద్ర బడ్జెట్ ఆర్థికంగా దెబ్బతీసింది. విద్య, వైద్య రంగాలను పట్టించుకోలేదు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని విస్మరించారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణ అడుగుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడలేదు. కేంద్ర బడ్జెట్‌ను పునః సమీక్షించాలి.

– కొప్పుల ఈశ్వర్, సంక్షేమ శాఖమంత్రి

## చీకటి గదిలో ఉంచడం అవాస్తవం

- నరేశ్ పిటిషన్‌పై టీఎల్ఎస్ఏ నివేదిక

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి జైలులో ఇతర నిందితులకు కల్పిస్తున్న వసతులన్నీ బైరి నరేశ్‌కు కూడా కల్పిస్తున్నారని తెలంగాణ లీగల్ సర్వీస్ అథారిటీ(టీఎల్ఎస్ఏ) హైకోర్టుకు నివేదిక అందజేసింది. నిందితుడిని చీకటి గదిలో ఏకాంతంగా ఉంచారన్నది అవాస్తవమని పేర్కొంది. అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలపై నరేశ్‌ను డిసెంబర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. అనంతరం అతన్ని చర్లపల్లి జైలుకు తరలించారు. అయితే తనను అధికారులు ఏకాంత గదిలో నిర్బంధించారని, దీంతో ఆరోగ్య పరిస్థితి విషమించిందని.. అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ నరేశ్, అతని సతీమణి సుజాత హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి.. జైలుకు వెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వమని టీఎల్ఎస్ఏ సభ్య కార్యదర్శిని ఆదేశించారు. దీంతో జనవరి 30న సభ్య కార్యదర్శి, రంగారెడ్డి డీఎల్ఎస్ఏ కార్యదర్శి, మరో ఇద్దరు జైలును సందర్శించారు. ఈ సందర్భంగా బైరి నరేశ్‌తో మాట్లాడి.. జైలులో తగిన రక్షణలోనే ఉన్నట్లు న్యాయమూర్తికి నివేదిక అందజేశారు. అనంతరం విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

# ఆ 45 టీఎంసీలు మావే!

- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌లో ఏపీ కేసుపై తెలంగాణ కౌంటర్ దాఖలు
- పాలమూరు–రంగారెడ్డికి 45 టీఎంసీల జలాల కేటాయింపుపై కేసు వేసిన ఏపీ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టా సిస్టమ్‌కు తరలింపునకు బదులుగా నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు కృష్ణా జలాల్లో 80 టీఎంసీలను వాడుకోవాలని బచావత్ ట్రిబ్యునల్ ఆదేశించగా, అందులో మిగిలి ఉన్న 45 టీఎంసీలను వాడుకునే అధికారం తమకే ఉందని తెలంగాణ రాష్ట్రం స్పష్టం చేసింది. నాగార్జునసాగర్‌కు ఎగువన కృష్ణా బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులు మాత్రమే ఉన్నాయని గుర్తు చేసింది. 21 టీఎంసీలను కర్ణాటక, 14 టీఎంసీలను మహారాష్ట్ర కలిపి మొత్తం 35 టీఎంసీలను వాడుకోగా, మిగిలి ఉన్న 45 టీఎంసీలపై పూర్తి హక్కులు కేవలం తెలంగాణకు మాత్రమే ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్(కృష్ణా ట్రిబ్యునల్–2)లో ఇంటర్‌లొకేటరీ పిటిషన్ దాఖలు చేసింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఆ 45 టీఎంసీలను కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.246ను నిలుపుదల చేయాలని కోరుతూ ఇటీవల ఏపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఆదేశించగా, ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల కృష్ణా జలాలను గుంపగుత్తగా కేటాయించిందని, ఈ జలాలను భవిష్యత్తులో ఏ ప్రాజెక్టుల అవసరాలకైనా వాడుకునే స్వేచ్ఛను ఇచ్చిందని తెలంగాణ గుర్తు చేసింది. దాంతో మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు చేసిన 45 టీఎంసీలతో పాటు పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా లభించిన 45 టీఎంసీలను కలిపి 90 టీఎంసీలను పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించినట్టు వివరించింది. తెలంగాణ తాజాగా వేసిన కౌంటర్‌పై బదులివ్వడానికి ఏపీకి ట్రిబ్యునల్ రెండు వారాల గడువు ఇచ్చింది.

## ఉత్తరాంధ్ర సుజలస్రవంతి ప్రాజెక్టుకు అనుమతులు లేవు

- ఈ ప్రాజెక్టుపై 6న నీతి ఆయోగ్ సమావేశం తగదు
- తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసిన తెలంగాణ ప్రభుత్వం
- నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌కు తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి అనుమతులు లేని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై)లో చేర్చాలని ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుండడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై ఈ నెల 6న నీతి ఆయోగ్ సమావేశాన్ని తలపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌కు లేఖ రాశారు. పోలవరం దిగువన గోదావరి ఎడమ గట్టు నుంచి వరదల సమయంలో 63.2 టీఎంసీల మిగులు జలాలను రెండు నుంచి మూడు నెలల కాలంలో తరలించడానికి ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. అయితే ఈ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం నుంచి ఎలాంటి అనుమతులు లేవని లేఖలో తెలంగాణ స్పష్టం చేసింది. 2021 జూలై 15న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పొందుపరిచిన అనుమతి ఉన్న/ అనుమతులు లేని ప్రాజెక్టుల జాబితాలో సైతం ఈ ప్రాజెక్టు లేదని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో పోలవరం దిగువన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును ఏపీ చేపట్టరాదని పేర్కొంది. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టుకు నికర, మిగులు జలాల్లో ఏపీ ప్రభుత్వం హక్కును కోరే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

# రెండోరోజూ ఐటీ సోదాలు

**రాజపుష్పతోపాటు 3 సంస్థల్లోనూ కొనసాగిన తనిఖీలు**





సాక్షి, హైదరాబాద్/ రామచంద్రాపురం (పటాన్‌చెరు): మాజీ ఐఏఎస్ అధికారి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి కుటుంబానికి చెందిన రాజపుష్ప ప్రాపర్టీస్‌తోపాటు ముప్ప, వెర్టెక్స్ హోమ్స్, వసుధ ఫార్మా కంపెనీలో ఆదాయపన్ను శాఖ అధికారుల సోదాలు బుధవారం రెండోరోజూ కొనసాగాయి. ఐటీ చెల్లింపుల్లో భారీ అవకతవకలు జరిగినట్లు గుర్తించిన ఐటీ శాఖ మంగళవారం ఉదయం నుంచి ఈ సోదాలు చేపడుతోంది. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లోని రాజపుష్ప లైఫ్‌స్టైల్ విల్లాస్‌లోని డైరెక్టర్ల ఇళ్లతోపాటు ఉర్జిత్ గేటెడ్ కమ్యూనిటీలోని ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఇంట్లోనూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్లు, విల్లాలతోపాటు ఆస్తుల కొనుగోళ్లు, అమ్మకాల్లో గత ఐదేళ్లుగా జరిగిన లావాదేవీల రికార్డులను వారు పరిశీలించినట్లు సమాచారం. బుధవారం రాజపుష్ప కంపెనీకి చెందిన ఆర్థిక లావాదేవీల వివరాలను, బ్యాంక్ లాకర్లతోపాటు కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న భూముల పత్రాలపైనా అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఇందుకోసం ఆయా కంపెనీల ఆడిటర్లు, అకౌంటెంట్ల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు సమాచారం. రాజపుష్ప ప్రాపర్టీస్ సంయుక్తంగా ఇతర సంస్థలతో కలిసి చేపట్టిన ప్రాజెక్టుల వివరాలను, ఆ రియల్ ఎస్టేట్ సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని కూడా అధికారులు సేకరించారు. మరోవైపు వసుధా ఫార్మా పలు డొల్ల కంపెనీలను సృష్టించి లాభాలను పలు రియల్ ఎస్టేట్ సంస్థల్లోకి మళ్లించినట్లు ఐటీ అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఈ సంస్థకు చెందిన బ్యాంకు పత్రాలు, ఐటీ రిటర్న్‌లు, పన్ను చెల్లింపుల పూర్తి సమాచారాన్ని అధికారులు పరిశీలించారు. రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కొనుగోదారుల నుంచి పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. ఈ సోదాలు గురువారం కూడా కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

## కృష్ణా బోర్డు చైర్మన్‌గా శివ్‌నందన్‌కుమార్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్‌గా పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్ బుధవారం జలసౌధలోని కేఆర్ఎంబీ కార్యాలయంలో అదనపు బాధ్యతలు స్వీకరించారు. కేఆర్ఎంబీ చైర్మన్ మహేంద్ర ప్రతాప్‌సింగ్ గత నెల 31న పదవీ విరమణ చేయగా, ఆయన స్థానంలో శివ్‌నందన్‌కుమార్‌ను కేంద్ర జలశక్తి శాఖ నియమించింది.

## కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు పైసా లాభం లేదు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు పైసా లాభం లేదు. వరంగల్–కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, ములుగు ట్రైబల్ యూనివర్సిటీ లాంటి అంశాల ప్రస్తావన లేదు. ప్రపంచంలోనే పెద్దదైన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు నయా పైసా ఇవ్వలేదు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కర్ణాటక అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించారు. తెలంగాణ టూరిజానికి ఒక్క పైసా ఇవ్వలేదు. దేశంలో 50 స్పాట్లలో టూరిజం అభివృద్ధి అన్నారు. మన తెలంగాణ రాష్ట్రం ఎక్కడ? రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి ఏం చేస్తున్నట్లో చెప్పాలి. మొత్తానికి ఈ బడ్జెట్‌తో దేశంలోని సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు పెద్దగా ప్రయోజనం లేదు.

– వాసుదేవరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్

## ఇది కార్పొరేట్ల బడ్జెట్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ రైతు, ఉపాధి హామీ కూలీల వ్యతిరేక బడ్జెట్. ఇది పూర్తిగా కార్పొరేట్ల బడ్జెట్. విద్య, వైద్య రంగాలను పట్టించుకోలేదు. సాగునీటి ప్రాజెక్టుల్లో ఒక్కదానికి కూడా జాతీయ హోదా ఇవ్వలేదు. రాష్ట్రానికి ఒక్క పారిశ్రామిక వాడను కేటాయించలేదు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడంతో ఎరువుల సబ్సిడీలో కోత పడి రైతులు ఇబ్బంది పడనున్నారు. తెలంగాణ అడుగుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదు.

–పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

## ఉపాధిహామీ నిర్వీర్యం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో గతానికంటే ఉపాధిహామీ పథకానికి కేటాయించాల్సిన నిధుల్లో 30 శాతం కోత పెట్టింది. కూలీలు వలస వెళ్లకుండా ఉండేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరుతుంటే.. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని దశలవారీగా తొలగించేందుకు యత్నిస్తోంది.

– ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్ మంత్రి

# కదం తొక్కిన డ్వాక్రా మహిళలు





కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మాచారెడ్డి: వడ్డీలేని రుణాలు, స్త్రీనిధికి సంబంధించిన వడ్డీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డ్వాక్రా మహిళలు కదం తొక్కారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రంలోని గజ్యానాయక్ తండా ఎల్లమ్మ ఆలయం నుంచి మండల కార్యాలయం వరకు భారీ ర్యాలీ తీశారు. వేలాది మంది మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్మన్, బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వడ్డీలేని రుణాలు, అభయహస్తం పథకాలకు సంబంధించిన డబ్బులివ్వకుండా ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. కామారెడ్డి నియోజకవర్గంలోని మహిళలకు రూ.45 కోట్ల బకాయిలు రావాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించేంతవరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో సాయిబాబాకు వినతిపత్రం ఇచ్చారు.

## త్వరలో మోదీ అమెరికా పర్యటన

- ఉభయసభలనుద్దేశించి ప్రసంగం!
- ఇంకా ఖరారుకాని తేదీలు

**వాషింగ్టన్:** అమెరికా సందర్శనకు రావాలంటూ భారత ప్రధాని మోదీని అధ్యక్షుడు బైడెన్ ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని నరేంద్ర మోదీ అంగీకరించారు. ఇద్దరు నేతలకు అనుకూలించే తేదీలను ఖరారు చేసేందుకు రెండు దేశాల అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. జీ–20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్, సెప్టెంబర్‌లో జరిగే శిఖరాగ్రానికి అవసరమైన సన్నాహక సమావేశాలు జరుపుతోంది. శిఖరాగ్రానికి బైడెన్ కూడా రానున్నారు. అంతకుముందుగానే ప్రధాని మోదీ జూన్ లేదా జూలైలో అమెరికాలో పర్యటనకు వెళ్లేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పుడే పర్యటనకు వెళ్తే ఉభయ సభల సమావేశంలోనూ ఆయన ప్రసంగించేందుకు వీలుంటుందని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. . ఇది తప్పితే, ఆ తర్వాత మళ్లీ రాష్ట్రాల ఎన్నికల ప్రచార కార్యక్రమాలతో మోదీ బిజీగా ఉంటారు. అయితే, అమెరికా రావాలంటూ ప్రధాని మోదీకి బైడెన్ ఆహ్వానం ఎప్పుడు పంపారనే విషయాలను వెల్లడించేందుకు విశ్వసనీయ వర్గాలు నిరాకరించాయి. బైడెన్ అధ్యక్షుడయ్యాక గత డిసెంబర్‌లో ఫ్రాన్సు అధ్యక్షుడు మేక్రాన్‌కు మొదటి అధికారిక విందు ఇచ్చారు.

## ఫుడ్ పార్సిళ్లపై ప్యాకింగ్ సమయమూ ఉండాలి

**తిరువనంతపురం:** ఆహార పార్సిళ్లపై అందులోని పదార్థాలు ఎప్పుడు తయారయ్యాయి? ఎప్పటిలోగా తినడం సురక్షితం? అనే వివరాలను కూడా ముద్రించాలని కేరళ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల ఒకటో తేదీ నుంచే ఈ ఆదేశాలు అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ విభాగం స్పష్టం చేసింది. అమలు చేయని వారిపై చర్యలు తప్పవని ఆరోగ్య మంత్రి వీణా జార్జి హెచ్చరించారు. రాష్ట్రంలో వరుస ఫుడ్ పాయిజనింగ్ ఘటనల నేపథ్యంలో ఈ మేరకు ఆదేశాలిచ్చామన్నారు. హోటళ్ల నిర్వాహకులు, ఇతర ఆహార పదార్థాల తయారీదారులు హెల్త్ కార్డులు తీసుకోవాల్సిన గడువును మరో రెండు వారాలకు పొడిగించామన్నారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్లు ఆహార తనిఖీలను ముమ్మరం చేశారన్నారు.

## కశ్మీర్‌లో హిమపాతం

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతం గుల్మార్గ్‌లో బుధవారం హిమపాతంలో చిక్కుకుని ఇద్దరు విదేశీ పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. మంచు కింద చిక్కుకుపోయిన మరో 21 మందిని పోలీసులు కాపాడారు. 21 మంది పోలండ్, రష్యా దేశస్తులు, ఇద్దరు స్థానిక గైడ్లు మూడు బృందాలుగా ఏర్పడి ప్రఖ్యాత స్కై రిసార్ట్ హపట్‌ఖుడ్ కాంగ్‌డోరి వద్ద ఉండగా హిమపాతం సంభవించింది. దాంతో 20 అడుగుల పొడవైన మంచు పెళ్ల వారికిపైకి దొర్లుకుంటూ వచ్చి పడింది. ఈ ఘటనలో మంచు కింద చిక్కుబడిన ఇద్దరు పోలండ్ జాతీయులు చనిపోగా, మిగతా వారినందరిని కాపాడి, సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



హిమపాతం సంభవిస్తున్న వీడియో దృశ్యం

ఈ ఘటనతో ఆ ప్రాంతంలో నిషేధ హెచ్చరికలు ఏర్పాటు చేశామన్నారు.

# అమెరికాలో మంచు వడగండ్ల వాన

- వందలాది విమాన సర్వీసులు రద్దు
- పాఠశాలలు బంద్
- రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

**ఆస్టిన్/న్యూయార్క్:** అమెరికాలోని దక్షిణాది రాష్ట్రాల్లో మూడు రోజులుగా అతిశీతల పరిస్థితులు కొనసాగుతున్నాయి. టెక్సాస్ మొదలుకొని వెస్ట్ వర్జీనియా వరకు భారీగా కురిసిన మంచు వడగండ్ల వానతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మంచు వాన కారణంగా జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు చనిపోయారు. వాహనదారులు రోడ్లపైకి వెళ్లవద్దంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం ఉదయం 1,400 విమాన సర్వీసులు రద్దయ్యాయి. డల్లాస్, ఆస్టిన్, టెక్సాస్, నాష్‌విల్లె, టెన్నెస్సీ విమానాశ్రయాల్లో విమానాలు నిలిచిపోయాయి. ప్రమాదకర అతిశీతల వాతావరణంతో డల్లాస్, మెంఫిస్, టెన్నెస్సీల్లో స్కూళ్లు మూతబడ్డాయి. లక్షలాది మంది విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. అర్కాన్సస్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.



ఉటాహ్‌లోని వెల్స్‌విల్లెలో మంచును తొలగిస్తున్న ఓ వ్యక్తి

**న్యూయార్క్‌లో అసాధారణం**

న్యూయార్క్ వాసులు ఏటా డిసెంబర్– జనవరి ఆఖరు వరకు కురిసే మంచులో స్లెడ్జిలపై తిరుగుతూ, స్నోబాల్స్‌తో కొట్లాడుతూ ఎంజాయ్ చేసేవారు. కానీ, ఈసారి.. దాదాపు 50 ఏళ్ల తర్వాత అలాంటి పరిస్థితులు కనిపించకుండా పోయాయి. గడిచిన 325 రోజుల్లో నగరంలో ఒక్కసారైనా అరంగుళం మంచు కూడా పడలేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. 1973 తర్వాత ఇలాంటి పరిస్థితులు ఏర్పడటం ఇదే మొదటిసారని వాతావరణ శాస్త్రవేత్తలు అన్నారు. వరుసగా 332 రోజులు అతి తక్కువ మంచుకురిసిన 2020 నాటి రికార్డు త్వరలో బద్దలు కానుందని కూడా చెప్పారు. ఏడాదికి సరాసరిన 120 అంగుళాల మంచు కురిసే సిరాక్యూస్‌లో ఈసారి 25 అంగుళాలు మాత్రమే నమోదైంది. రొచెస్టర్, బఫెల్లోలోనూ దాదాపు ఇవే పరిస్థితులున్నాయి.

## ఆ హామీ వివరాలను ప్రచారం చేయాలి

**వాట్సాప్‌కు సుప్రీంకోర్టు ఆదేశం**

**న్యూఢిల్లీ:** ప్రముఖ మెసేజింగ్ వేదిక వాట్సాప్ తన నూతన గోప్యతా విధానాన్ని అంగీకరించని వినియోగదారులకు కూడా సేవలను కొనసాగిస్తామంటూ 2021లో కేంద్రానికి ఇచ్చిన హామీని ప్రచారం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. డేటా ప్రొటెక్షన్ చట్టంలోని నిబంధనలకు కట్టుబడి ఉంటామంటూ అందులో వాట్సాప్ హామీ ఇచ్చిందని కూడా గుర్తు చేసింది. సంబంధిత హామీ వివరాలను అందరికీ తెలిసేలా ఐదు ప్రధాన పత్రికల్లో రెండు పర్యాయాలు ప్రచురించాలని పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్ 11న చేపడతామని తెలిపింది. పిటిషనర్ల తరఫున శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ విషయంలో వాట్సాప్ విధానాలు యూరప్ దేశాలతో పోలిస్తే భారత్‌లో వేరుగా ఉన్నాయన్నారు. వినియోగదారులు షేర్ చేసుకునే కాల్స్, ఫొటోలు, మెసేజీలు, వీడియోలు, డాక్యుమెంట్ల వివరాలను అందుబాటులో ఉంచేందుకు, వాట్సాప్ తన మాతృసంస్థ ఫేస్‌బుక్‌తో కుదుర్చుకున్న ఒప్పందం వ్యక్తిగత భద్రతకు, వాక్ స్వాతంత్ర్యానికి భంగ కరమంటూ కర్మణ్యసింగ్ సరీన్, శ్రేయ సేథి అనే విద్యార్థినులు వేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారించి పైఆదేశాలిచ్చింది. ఈ బెంచ్‌లో జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సీటీ రవికుమార్ ఉన్నారు.



శాంతినికేతన్‌లో పర్యటించిన సందర్భంగా అక్కడి ఓ టీ స్టాల్‌లో టీ కాస్తున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

## అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తా

**భారతీయ అమెరికన్ నిక్కీ హేలీ ప్రకటన**

**వాషింగ్టన్:** 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలుస్తానని ప్రముఖ భారతీయ అమెరికన్, రిపబ్లికన్ పార్టీ నేత నిక్కీ హేలీ(51) ప్రకటించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానన్నారు. ఈ వారంలోనే ఇందుకు సంబంధించిన ఒక వీడియోను ఆమె విడుదల చేసే అవకాశం ఉందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్కరే ఇప్పటి వరకు రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష బరిలో ఉన్నట్లు ప్రకటించారు. ఎన్నికల ప్రచారాన్ని రెండు నెలల క్రితమే ప్రారంభించారు. తాజా పరిణామంతో తన మాజీ బాస్ ట్రంప్‌కు ఆమె ఏకైక ప్రత్యర్థిగా నిలువనున్నారు. నిక్కీ హేలీ సౌత్ కరోలినాకు రెండు పర్యాయాలు గవర్నర్ గాను, ఐరాసలో అమెరికాలో రాయబారిగాను పనిచేశారు. ట్రంప్ మళ్లీ అధ్యక్ష పదవికి పోటీ చేసిన పక్షంలో బరిలో ఉండబోనంటూ గతంలో ప్రకటించిన హేలీ మనసు మార్చుకున్నారు. నిక్కీ హేలీ అసలు పేరు నిమ్రత నిక్కీ రన్‌ధావా హేలీ. ఈమె తల్లిదండ్రులు అజిత్ సింగ్ రన్‌ధావా, రాజ్ కౌర్ రన్‌ధావా. పంజాబ్ అగ్రికల్చర్ వర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసే అజిత్ సింగ్ కుటుంబంతో కలిసి 1960ల్లో కెనడాకు, అక్కడి నుంచి అమెరికాకు చేరారు.



## టికెట్ అడిగేసరికి బిడ్డనే వదిలేశారు!

**టెల్అవీవ్:** బెల్జియం పాస్‌పోర్టులున్న ఆ దంపతులు ఏడాది వయసున్న బిడ్డను తీసుకుని ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మరికాసేపట్లో బయలుదేరే బ్రస్సెల్స్ విమానంలో వారు ఎక్కాల్సి ఉంది. ఆలస్యంగా వచ్చిన వారిని కౌంటర్ వద్ద సిబ్బంది ఆపి టికెట్లడిగారు. రెండు టికెట్లే చూపారు. చిన్నారికి కూడా టికెట్ కావాలనేసరికి ఇదేమిటంటూ ప్రశ్నించారు. సిబ్బందితో వాదనకు దిగారు. మరో టికెట్ కొనడానికి నిరాకరించారు. పైపెచ్చు, స్ట్రోలర్‌పైన చిన్నారిని అక్కడే సెక్యూరిటీ విభాగం వద్ద వదిలేసి హడావుడిగా విమానం వైపు వెళ్లిపోబోయారు. ఇది చూసి సిబ్బంది అప్రమత్తమయ్యారు. సిబ్బంది అలెర్ట్ చేయడంతో సెక్యూరిటీ అధికారులు వారిని అడ్డుకుని, పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన జనవరి 31వ తేదీన ఇజ్రాయెల్‌లోని టెల్అవీవ్‌లో ఉన్న బెన్ గురియన్ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. టికెట్ అడిగారనే కారణంతో ఏకంగా బిడ్డనే వదిలేసిన తల్లిదండ్రులను ఇప్పుడే చూస్తున్నామని అక్కడి సిబ్బంది వ్యాఖ్యానించారు. ఇలాంటి తల్లిదండ్రులు కూడా ఉంటారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ ఘటన తమకు షాక్ కలిగించిందని సిబ్బంది తెలిపారని రియాన్‌ఎయిర్ విమానయాన సంస్థ అధికారి ఒకరు అన్నారు.



## యూకేలో ఉద్యోగుల భారీ సమ్మె

**లండన్:** బ్రిటన్‌లో దశాబ్ద కాలంలోనే అతిపెద్ద సమ్మె బుధవారం జరిగింది. సుమారు 5 లక్షల మంది ఉపాధ్యాయులు, కాలేజీ లెక్చరర్లు, ఇతర ప్రభుత్వ సిబ్బంది, రైల్ డ్రైవర్లు విధులను బహిష్కరించారు. ఫలితంగా 85% స్కూళ్లు మూతబడ్డాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో రైళ్లు నిలిచిపోయాయి. నాలుగు దశాబ్దాల్లోనే అత్యధికంగా ద్రవ్యోల్బణం 10% మించి పోవడంతో అందుకు తగినట్లుగా వేతనాలు పెంచాలంటూ ఆరోగ్య, రవాణా రంగ సిబ్బంది దగ్గర్నుంచి అమెజాన్ వేర్ హౌస్ ఉద్యోగులు, రాయల్ మెయిల్ పోస్టల్ ఉద్యోగుల వరకు సమ్మెలకు దిగుతున్నారు. వేతనాల పెంపు డిమాండ్‌తో వచ్చే వారంలో విధులు బహిష్కరిస్తామంటూ నర్సులు, అంబులెన్సు సిబ్బంది, పారామెడిక్స్, ఎమర్జెన్సీ, ఆరోగ్య సిబ్బంది ఇప్పటికే ప్రకటించారు. కాగా, సమ్మెలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రధాని రిషి సునాక్ ఆందోళన వ్యక్తం చేశారు. బదులుగా ఉద్యోగులు చర్చలకు రావాలని ఆయన కోరారు. అయితే, సమస్యలను పరిష్కరించడానికి బదులుగా.. కొన్ని రంగాల్లో సమ్మెలపై నిషేధం విధించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వల్ల సంబంధాలు మరింత దెబ్బతింటాయని ఉద్యోగ సంఘాల నాయకులు అంటున్నారు.





బర్మింగ్‌హామ్‌లో ఉద్యోగుల నిరసన ర్యాలీ

## ఎంసీడీ భేటీకి ఎల్‌జీ ఓకే

**న్యూఢిల్లీ:** రెండుసార్లు సమావేశమైనా మేయర్‌ను ఎన్నుకోకుండానే అర్ధాంతరంగా వాయిదాపడిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) భేటీని ఈసారి 6వ తేదీన నిర్వహించేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ) వీకే సక్సేనా అనుమతి ఇచ్చారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎల్‌జీ ఆమోదం తెలిపారని ఉన్నతాధికారులు బుధవారం చెప్పారు. ఇటీవలి ఎంసీడీ ఎన్నికల్లో 250 స్థానాలకుగాను ఆప్ 134 చోట్ల, బీజేపీ 104 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెల్సిందే. అయితే, మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకునేందుకు ఎంసీడీ జనవరి 6, 24వ తేదీల్లో సమావేశమైన సందర్భంగా కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్న విషయం విదితమే.

---

**రాష్ట్రీయం**



### కేసీఆర్‌తో అమిత్ జోగి భేటీ

**సాక్షి, హైదరాబాద్:** ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి అజిత్ జోగి తనయుడు, జనతా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమిత్ జోగి.. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ముఖ్యనాయకులతో కలిసి బుధవారం ప్రగతి భవన్‌కు వచ్చిన అమిత్ జోగి, సీఎం కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల అవసరముందని అభిప్రాయపడిన అమిత్ జోగి, బీఆర్‌ఎస్‌ను స్థాపించడాన్ని స్వాగతించారు. ఈ సందర్భంగా తన తండ్రి అజిత్ జోగి రాసుకున్న ఆటోబయోగ్రఫీని సీఎం కేసీఆర్‌కు బహూకరించారు. కాగా.. జనతా కాంగ్రెస్ పార్టీకి ముగ్గురు ఎమ్మెల్యేలున్నారు.

### మంత్రి కేటీఆర్ అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ**

**కరీంనగర్ టౌన్:** కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మంత్రి కేటీఆర్ వివిధ పర్యటనల సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ తీవ్రంగా ఖండించారు. పదే పదే తప్పుడు ప్రచారాన్ని నిజం చేయాలని కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని, ఆయన అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని దుయ్యబట్టారు. బుధవారం కరీంనగర్‌లో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో రాణీరుద్రమ మాట్లాడారు. తెలంగాణలో రాజరిక పరిపాలన నడుస్తోందన్నారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న గవర్నర్, రాష్ట్రపతులను, ముఖ్యంగా ఆ పదవిలో కొనసాగుతున్న మహిళలను గౌరవించలేని పరిస్థితుల్లో కేసీఆర్ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేయిస్తున్నారని, విద్య, వైద్యం, జాతీయ, గ్రామీణ రహదారులు, ఇతరత్రా అవసరాల కోసం, ముఖ్యంగా కరీంనగర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందడానికి ఎన్నో నిధులు మంజూరు చేయించారని ఆమె తెలిపారు. సంజయ్ చేపట్టిన ఇలాంటి అభివృద్ధి పనులు కేటీఆర్ కళ్లకు కనపడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈటల గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని రాణీరుద్రమ వ్యాఖ్యానించారు.



# పాతబడి.. కొత్తరూపు

### ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక హంగులు.. మౌలిక సదుపాయాలు

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ:** రాష్ట్రంలో ప్రభుత్వపాఠశాలల రూపుమారుతోంది. ఆధునిక హంగులే కాదు.. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అన్నీ అందుబాటులోకి వస్తున్నాయి. మనఊరు–మనబడి కార్యక్రమంలో మిషనరీ, ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వపాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయి. సుశిక్షితులైన టీచర్లు విద్యను అందించే ఆధునిక దేవాలయాలు ఇన్నాళ్లు పాడుబడిన ఇళ్లలా ఉండగా ఇప్పుడు కొత్తరూపును సంతరించుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని వాటిని తీర్చిదిద్దుతోంది. వాటిల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు సమకూరుతుండటంతో విద్యార్థులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడతలో పనులు పూర్తయిన పాఠశాలల భవనాలను బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. వచ్చేనెల రోజుల్లో పనులు పూర్తి చేసుకొని వేల స్కూళ్లు ప్రారంభం కానున్నాయి.

**సదుపాయాల కల్పనే లక్ష్యంగా...**

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్యతోపాటు కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలను కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుడుగు వేసింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో 40 శాతం నిధులను కచ్చితంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకే కేటాయించేలా నిర్ణయం తీసుకుంది. 30 లక్షల మంది పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ బడిని బాగుచేస్తోంది. పక్కాభవనాలు, ప్రహరీ గోడలు, టాయిలెట్, వంటగది, భవన నిర్మాణాలు, అదనపు తరగతి గదులు, ల్యాబ్‌లు ఇలా 12 రకాల సదుపాయాలను కల్పిస్తోంది.

**దశలవారీగా అభివృద్ధి దిశగా..**

రాష్ట్రంలోని 26,072 ప్రభుత్వ, జిల్లా పరిషత్తు పాఠశాలల్లో రూ.7,300 కోట్లతో ఈ పథకం కింద మౌలిక సదుపాయాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో మొదటిదశలో 9,123 స్కూళ్లలో రూ.3,497 కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. పలుచోట్ల పనులు ఇప్పటికే పూర్తి కాగా, మిగతాచోట్ల పనులు కొనసాగుతున్నాయి. ప్రాధాన్యతాక్రమంలో మండలానికి రెండు చొప్పున రూ.30 లక్షలలోపు విలువైన పనులను గతేడాదే ప్రారంభించింది. ప్రస్తుతం ఆ పనుల్లో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని వేగంగా సాగుతున్నాయి.

**నాడు.. నేడు.. మారిన తీరు..**

- భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణంలోని స్టేషన్‌బస్తీలో 30 ఏళ్ల కిందట నిర్మించిన పాఠశాల భవనంలో అన్నీ సమస్యలే. అధ్వానంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ సదుపాయం, వెలుతురు లేని చీకటి తరగతి గదులతో విద్యార్థులు అవస్థలు పడేవారు. నిత్యం అక్కడ పశువులు సంచరించేవి. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. మనఊరు–మనబడితో సౌకర్యాలు సమకూరాయి. కార్పొరేట్‌కు దీటుగా హంగులద్దుకుంది.
- జిల్లా పర్వతగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లను మించిన హంగులతో రూపుదిద్దుకుంది. ప్రభుత్వ చొరవతో గతంలోనే భవనం నిర్మించగా, మన ఊరు మన బడిలో మౌలిక వసతులు కల్పించారు. క్లాస్ రూమ్‌ల మరమ్మతులు, తాగునీటి సదుపాయం, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటు వంటి పనులను చేపట్టారు.
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని షాబునగర్(తాళ్లగడ్డ) ప్రాథమిక పాఠశాల భవనం. ఒకప్పుడు పాడుబడిన భవనంలా ఉండగా, ఇప్పుడు ఆధునిక పాఠశాలలా మారిపోయింది. పక్కనే పాఠశాలలో టాయిలెట్ల ఆవరణ అంతా చెత్తాచెదారంతో నిండిపోయి వాడుకోవడానికి వీల్లేని పరిస్థితుల్లో ఉండగా, ఇప్పుడు విద్యార్థులకు అనువైన రీతిలో తయారయ్యాయి.
- సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 222 మంది చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో కొత్తగా కిచెన్‌షెడ్డును నిర్మించారు. పాత టాయిలెట్లకు టైల్ వేసి మరమ్మతు చేశారు. ఫ్లోరింగ్ అస్తవ్యస్తంగా ఉండటంతో కొత్తగా ఫ్లోరింగ్ చేశారు. భవనానికి పలుచోట్ల బీటలు వారడంతో వాటిని నింపివేశారు. గతంలో విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా వేలాడుతుండగా, ఇప్పుడు గోడల నుంచి వైరింగ్ చేశారు. తాగునీటి సౌకర్యం కోసం కొత్తగా సంప్‌ను నిర్మించారు. కొత్తగా టాయిలెట్‌లను కూడా నిర్మించారు.

**విద్యార్థులు, టీచర్లు ఏమంటున్నారంటే..**

**బోధన సులభతరం**

పాఠశాలలో సదుపాయాలు కల్పించారు. తరగతి గదుల్లో టీవీలు ఏర్పాటు చేశారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించిన పెన్‌డ్రైవ్‌లు అందించారు. దీంతో విద్యార్థులకు బోధన చేయడం, వారు చదువుకోవడం సులభం కానుంది.

జలీల్, హెచ్‌ఎం, పర్వతగిరి

**ఆనందంగా ఉంది**

విద్యుత్, తాగునీటి సౌకర్యాలతోపాటు డిజిటల్ క్లాస్‌రూమ్‌కు కావాల్సిన పరికరాలను సమకూర్చారు. దీంతో అభ్యాసనపట్ల శ్రద్ధ పెరిగింది.

రిషిక విద్యార్థిని
పదో తరగతి,
ఇంగ్లిష్ మీడియం, పర్వతగిరి

**సౌకర్యాలు మెరుగుపడ్డాయి**

స్కూళ్లలో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. గతంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడేవారు. వర్షం పడితే అక్కడక్కడా లీకేజీలతో ఇబ్బంది అయ్యేది. ఇప్పుడు సౌకర్యాలు మెరుగుపడటంతో విద్యార్థులు స్కూల్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.

రుక్మిణి,
ప్రధానోపాధ్యాయురాలు, సంగారెడ్డి

## 11న రాష్ట్రానికి అమిత్ షా ?

**ఫిబ్రవరిలో ప్రధాని మోదీ, నడ్డా పర్యటనలు కూడా..**

**సాక్షి, హైదరాబాద్:** ఈనెల 11న బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్రానికి రానున్నట్టు పార్టీవర్గాల సమాచారం. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ లేదా మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని ఒకట్రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఆయన పర్యటించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. గత నెల 28, 29 తేదీల్లో ఆయన ఇక్కడకు రావాల్సి ఉండగా పార్లమెంట్ సమావేశాలు, కేంద్ర బడ్జెట్ తయారీ నేపథ్యంలో వాయిదా పడింది. రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగం పెంచడంతో పాటు రాజకీయంగానూ ఇతర రాష్ట్రాల్లో బీఆర్‌ఎస్ కార్యకలాపాల విస్తరణ చేపడుతుండటంతో ఫిబ్రవరిలో బీజేపీ అగ్రనేతలు మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా వరుస పర్యటనలు చేపట్టనున్నట్టు తెలిసింది. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా నడ్డా కూడా ఒక లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో విస్తృత పర్యటనలు నిర్వహించనున్నట్టు సమాచారం. బీజేపీ అగ్రనేతల పర్యటనల్లో ప్రధానంగా సంస్థాగత అంశాలపైనే అధిక దృష్టి కేటాయించనున్నట్టు తెలుస్తోంది. అదీగాక ఈ నెల 10వ తేదీ నుంచి 25 తేదీ దాకా అన్ని శక్తికేంద్రాల్లో (3,4 పోలింగ్‌బూత్‌లు కలిపి ఒక శక్తికేంద్రం) వీధిచివర సమావేశాలు (స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్) నిర్వహించాలని రాష్ట్రపార్టీని జాతీయ నాయకత్వం ఆదేశించింది.



**కేంద్ర బడ్జెట్‌కు విస్తృత ప్రచారం...**

కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించిన అంశాలు, వాటి వల్ల రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలకు చేకూరనున్న ప్రయోజనాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ నిర్ణయించింది. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది. బడ్జెట్ ముఖ్యాంశాలతో స్థానిక భాషల్లో కరపత్రాలు ముద్రించడం, సమావేశాల నిర్వహణ, సోషల్ మీడియా సాధనాల ద్వారా ప్రచారం చేయాలని నిర్ణయించింది. కేంద్ర బడ్జెట్ సంబంధిత కార్యక్రమాల సమన్వయానికి కోఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, సహ కోఆర్డినేటర్లుగా డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి, పి.రజనీకుమారి, కె.సంగప్పలతో కూడిన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నియమించారు.


## జనహితమే మా అభిమతం

▶ మొదటి పేజీ తరువాయి

జయశంకర్ సార్ పేరు పెడుతున్నట్లు మంత్రి ప్రకటించారు.

**దేశంలోనే తొలి క్యాంపస్: సబితాఇంద్రారెడ్డి**

దేశంలోనే కేజీ టు పీజీ క్యాంపస్ గంభీరావుపేటలో ఏర్పాటైందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రంలో 26 వేల స్కూళ్లు ఉండగా మొదటి విడతలో రూ.7,300 కోట్లతో 'మన ఊరు–మన బడి'లో 9 వేల స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్లమాధ్యమం, డిజిటల్ బోధన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. పిల్లల విదేశీ చదువులకు సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. గంభీరావుపేటలో రహేజా కార్ప్ ఫౌండేషన్, మైండ్‌స్పేస్ రిట్, దివీస్‌ల్యాబ్, గివ్ తెలంగాణ, గ్రీన్‌కో సహకారంతో రూ.3 కోట్లతో క్యాంపస్ నిర్మితమైందన్నారు. ఒకేసారి వెయ్యి మంది కూర్చుని భోజనం చేసే డైనింగ్‌హాల్‌తో కూడిన క్యాంపస్ నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కె.రవీందర్‌రావు, కలెక్టర్ అనురాగ్ జయంతి, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, ఎస్పీ అఖిల్‌మహాజన్ పాల్గొన్నారు.



గంభీరావుపేటలో కేజీ టు పీజీ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, సబిత

## నేను తెలంగాణ ప్రజలకే జవాబుదారీ

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


**సాక్షి, న్యూఢిల్లీ:** గత నాలుగేళ్లుగా తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసి ప్రాజెక్టులు మంజూరు చేయిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టులకు అవసరమైన కనీస వసతులు కల్పించకుండా అభివృద్ధికి మోకాలడ్డుతోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. తాను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీ అని.. కల్వకుంట్ల కుటుంబానికి ఏ మాత్రం కాదన్నారు. తనను విమర్శించే నైతిక హక్కు కల్వకుంట్ల కుటుంబానికి ఉందా? అని ప్రశ్నించారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు భూసేకరణ ఖర్చులో కూడా సగం భరిస్తామని కేంద్రం ముందుకొచ్చినా.. మిగతా సగం నిధులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు. ఎంఎంటీఎస్ ఫేజ్–2కు రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా ఇవ్వడంలేదన్నారు.




## ఆ దేశాల్లో ఆదాయ పన్ను మోతే!


పౌరుల వ్యక్తిగత ఆదాయంపై పన్ను వేయడం సాధారణమే. ఇది కొన్నిదేశాల్లో అత్యధికంగా, మరికొన్ని దేశాల్లో నామమాత్రంగా ఉంది. అయితే దాదాపు అన్ని దేశాల్లో కనీస ఆదాయంపై పన్ను మినహాయింపు ఉండగా.. ఎక్కువ ఆదాయం ఉన్నవారిపై నేరుగా పన్నులతోపాటు సర్‌చార్జీలు, సెస్‌ల విధింపు కూడా ఉండటం గమనార్హం.

45%
ఆస్ట్రేలియా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, స్లోవేనియా, దక్షిణాఫ్రికా, యూకే, దక్షిణకొరియా, దేశాల్లో ఆదాయ పన్ను




ప్రభుత్వానికి ఆదాయం రావాలంటే ఇతర మార్గాలు ఎన్నో ఉన్నాయి. దేశంలో అభివృద్ధి జరగాలంటే.. ఆర్థిక వ్యవస్థ దూకుడుగా ముందుకెళ్లాలంటే వ్యక్తిగత ఆదాయ పన్నును పూర్తిగా రద్దు చేయాలి. వడ్డీ రేట్లు తగ్గేలా చూడాలి.

-సుబ్రమణ్యస్వామి, ఆర్థికవేత్త, ఎంపీ





### 1 సమ్మిళిత అభివృద్ధి బాటలో..

దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వెనుకబడిన వర్గాల మధ్య అసమతుల్యతను తగ్గించడం.. 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' నినాదంతో అన్నివర్గాలు అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టడం లక్ష్యమని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దేశాభివృద్ధి నుంచి సమకూరే ప్రయోజనాలు అందరికీ అందేలా విధానాలను రూపొందించడంపై దృష్టి పెడతామని చెప్పారు.



### బడ్జెట్ అంటే..

స్థూలంగా ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయ, వ్యయపట్టిక. సర్కారు ఆర్థిక, విధాన పత్రం. ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన ధనాన్ని వారికోసం ఎలా వినియోగించబోతున్నారో వివరించే కార్యాచరణ ప్రణాళిక.

### మూలధన బడ్జెట్ CAPITAL OUTLAY

మూలధన ఆదాయ, వ్యయ పట్టికగా చెప్పుకోవచ్చు. వార్షిక బడ్జెట్‌లో మూలధన బడ్జెట్‌తోపాటు రెవెన్యూ బడ్జెట్ కూడా ఉంటుంది. ప్రభుత్వానికి మూలధన ఖాతాలో వసూలయ్యే ఆదాయం, ఖర్చులు మూలధన బడ్జెట్‌లో ఉంటాయి. ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ వసూళ్లు, ఖర్చులకు సంబంధించిన వివరాలు రెవెన్యూ బడ్జెట్‌లో ఉంటాయి.

### క్యాపిటల్ పద్దు (ప్రణాళికా వ్యయం)

(CAPITAL EXPENDITURE)

ప్రభుత్వం ఆదాయ వనరులను, ఆస్తులను సృష్టించుకునేందుకు చేసే వ్యయం ఇది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రణాళికలకు చేసే కేటాయింపులు ఇందులో ఉంటాయి.

### రెవెన్యూ పద్దు (ప్రణాళికేతర వ్యయం)

(REVENUE EXPENDITURE)

ఉద్యోగుల జీతభత్యాలు, రక్షణ, పోలీసు వ్యవస్థల నిర్వహణ, ఎన్నికలు, కళలు, క్రీడలు, కుటుంబ సంక్షేమం, సమాచార ప్రసార, పర్యాటకం, కార్మిక సంక్షేమం, వ్యవసాయ రంగాలకు వెచ్చించే నిధులు, వడ్డీలు, రుణ చెల్లింపులు ఈ పద్దులోకి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే ప్రణాళికేతర గ్రాంటులు కూడా ఈ ఖాతాలోనే ఉంటాయి.

### సంచిత నిధి CONTINGENCY FUND

అన్ని రకాల వసూళ్లు, ఆదాయాలు, రుణాల ద్వారా వచ్చిన సొమ్ము ఈ నిధి కింద జమ అవుతుంది. ఈ నిధి నుంచి ఖర్చు చేయడానికి పార్లమెంటు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఇందులో రెండు పద్దులుంటాయి. 1. రెవెన్యూ వసూళ్లు -రెవెన్యూ వ్యయం. 2. మూలధన వసూళ్లు-మూలధన వ్యయం.

### ప్రభుత్వ ఖాతా GOVERNMENT ACCOUNT

సంచిత నిధిలో జమయ్యే వసూళ్లు మినహా ప్రభుత్వం వద్దకు వచ్చే ఇతర అన్ని రకాల నిధులు ఈ ఖాతాలో జమ అవుతాయి. ఆర్‌బీఐ నుంచి, పీఎఫ్ నుంచి తీసుకునే రుణాలను ఈ ఖాతా కింద ఖర్చు చేస్తారు. ఈ సొమ్మును మళ్లీ చెల్లించాల్సి ఉంటుంది.

### రెవెన్యూ వసూళ్లు REVENUE RECEIPTS

పన్నులు, సుంకాల ద్వారా వసూలయ్యే ఆదాయమే రెవెన్యూ వసూళ్లు. ఎగుమతి, దిగుమతి సుంకాలు (కస్టమ్స్), ఎక్సైజ్ డ్యూటీ, కార్పొరేట్ ట్యాక్స్, ఇతరత్రా పన్నుల రూపంలో వచ్చే సొమ్మంతా ఈ ఖాతాలోకే చేరుతుంది. ప్రభుత్వ పెట్టుబడులపై వడ్డీలు, డివిడెండ్ల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వ సేవలపై వసూలు చేసే చార్జీలు వీటి కిందకే వస్తాయి.

### రెవెన్యూ వ్యయం REVENUE EXPENDITURE

ప్రభుత్వ నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, ఐదిలీలపై చేసే ఖర్చును రెవెన్యూ వ్యయంగా పేర్కొంటారు. ఇది ప్రభుత్వానికి ఆస్తులను సృష్టించదు.

మిగతా 8లో ▶

ఆర్థిక వృద్ధికి నిర్మలమ్మ కొత్త సూత్రం

# పొదుపు కాదు ఖర్చు చేసుకో!



సాక్షి, అమరావతి: ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడానికి పొదుపు కంటే ఖర్చులను ప్రోత్సహించే విధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పొదుపు చేసే వారికంటే ఖర్చు చేసే వారికే పన్ను ప్రయోజనాలను కల్పిస్తూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. సెక్షన్ 80సీ, గృహ రుణంపై వడ్డీ చెల్లింపులు, హెచ్ఆర్ఏ వంటి పన్ను మినహాయింపులు కోరని వారికి కనీస ఆదాయ పరిమితి పెంచడంతో పాటు ట్యాక్స్ రిబేట్ పరిమితిని పెంచారు. ఎటువంటి పన్ను మినహాయింపులు కోరకుండా మొత్తం ఆదాయంపై పన్ను చెల్లించే నూతన పన్నుల విధానంలో బేసిక్ లిమిట్‌ను రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచారు. పాత పన్నుల విధానంలో బేసిక్ లిమిట్‌లో ఎటువంటి మార్పులు చేయలేదు. అదేవిధంగా నూతన పన్నుల విధానంలో సెక్షన్ 87ఏ కింద ఎటువంటి పన్ను చెల్లించాల్సినక్కర్లేని ట్యాక్స్ రిబేట్ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. అంటే వచ్చే ఆర్థిక సంవత్సరం(2023–24) నుంచి రూ.7 లక్షల వార్షిక ఆదాయం వరకు ఎటువంటి పన్ను చెల్లించనవసరం లేదని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. పాత పన్నుల విధానంలో ఈ రిబేట్‌ను రూ.5 లక్షలకే పరిమితం చేశారు. ఎటువంటి పన్ను మినహాయింపులు కోరని వారికి తక్కువ పన్ను రేట్లతో ఆరు శ్లాబులతో కొత్త పన్నుల విధానాన్ని 2020–21లో నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. మూడేళ్లు అయినప్పటికీ ఇప్పటికీ చాలామంది పన్ను చెల్లింపుదారులు పాత పన్నుల విధానాన్నే ఎంచుకోవడంతో వీరిని కొత్త పన్నుల విధానంలోకి మార్చడానికి ఆర్థిక మంత్రి ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆరు ట్యాక్స్ శ్లాబులను కొత్త పన్నుల విధానంలో ఐదుకు పరిమితం చేయడమే కాకుండా వీరికి రూ. 50,000 స్టాండర్డ్ డిడక్షన్‌ను వర్తింపచేస్తున్ననట్లు తెలిపారు. ఫ్యామిలీ పెన్షన్ తీసు కునే వారికి ఈ స్టాండర్డ్ డిడక్షన్ రూ. 15,000గా నిర్ణయించారు. ఈ స్టాండర్డ్ డిడక్షన్ పరిగణనలోకి తీసుకుంటే రూ. 7.5 లక్షల ఆదాయం వరకూ ఎలాంటి పన్ను ఉండదు. అలాగే ఫ్యామిలీ పెన్షన్ తీసుకొనే వారికి రూ.7.15 లక్షల ఆదాయం వరకూ పన్ను ఉండదు.

## ఐటీ శ్లాబులు మారాయ్

### పొదుపు ప్రయోజనాలు లేని కొత్త పన్నుల విధానానికే పరిమితమైన పన్ను తగ్గింపు ప్రయోజనాలు

ఇప్పటివరకు రెండు పన్నుల విధానాల్లో దేన్నీ ఎంచుకోకపోతే డిఫాల్ట్‌గా పాత పన్నుల విధానాన్ని పరిగణనలోకి తీసుకునేవారు. కానీ, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త పన్నుల విధానాన్ని డిఫాల్ట్ విధానంగా పరిగణించనున్నట్లు ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ పాత పన్నుల విధానంలో రిటర్న్‌లు దాఖలు చేసేవారికి పన్ను మినహాయింపు ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు. ఆర్థిక మంత్రి తీసుకున్న ఈ నిర్ణయాల వల్ల కొత్త పన్ను చెల్లింపుదారుల్లో రూ.7 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారికి రూ.33,800 వరకు ప్రయోజనం కలగనుండగా, రూ.10 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి

### డిఫాల్ట్‌గా కొత్త పన్నుల విధానం

రూ.23,400, రూ.15 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి రూ.49,400 వరకు ప్రయోజనం చేకూరుతుందని ట్యాక్స్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనల వల్ల రూ.15.5 లక్షల ఆదాయం దాటిన వారికి కనీసం రూ.52,500 వరకు ప్రయోజనం దక్కనున్నట్లు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆదాయపు పన్ను చట్టంలోని మినహాయింపుల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోగలితే రూ.9.5 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారి వరకు ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు.

## అధిక ఆదాయం ఉన్నవారిపై కరుణ



రూ.కోట్లలో ఆదాయం ఆర్జిస్తున్న వారిపై మోదీ ప్రభుత్వం కరుణ చూపించింది. రూ.2 కోట్ల వార్షికాదాయం దాటిన వారిపై విధించే సర్‌చార్జీని 37 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల రూ.5.5 కోట్ల వార్షికాదాయం ఉన్న వారికి రూ.20 లక్షల వరకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటివరకు అధికాదాయం ఉన్న వారిపై ప్రపంచంలోనే అత్యధికంగా 42.7 శాతం పన్నురేటు ఉండేదని, సర్‌చార్జీ తగ్గించడం వల్ల ఈ రేటు 39 శాతానికి పరిమితమైనట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. అదేవిధంగా ఎర్న్‌డ్ లీవులను నగదుగా మార్చుకుంటే పన్ను మినహాయింపు పరిమితిని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రసుత్తం ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌పై రూ.3 లక్షలుగా ఉన్న ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. రూ.5 లక్షలకు పైబడి చెల్లించే అధిక మొత్తం ఉండే బీమా పాలసీలకు వర్తించే పన్ను మినహాయింపులను రద్దు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ నిర్ణయం నుంచి యూనిట్ లింక్డ్ (యులిప్) పాలసీలను మినహాయించారు.

**పాత పన్నుల విధానంలో ట్యాక్స్ శ్లాబులు**

60 ఏళ్ల లోపు వయస్సు ఉంటే..

| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| 0-2.5 లక్షలు | లేదు |
| 2.5 - 5 లక్షలు | 5% |
| 5-10 లక్షలు | 20% |
| 10 లక్షలు దాటితే | 30% |

60 నుంచి 80 ఏళ్లు

| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| 0-3 లక్షలు | లేదు |
| 3 - 5 లక్షలు | 5% |
| 5-10 లక్షలు | 20% |
| 10 లక్షలు దాటితే | 30% |

80 ఏళ్లు దాటితే..

| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| 0-5 లక్షలు | లేదు |
| 5-10 లక్షలు | 20% |
| 10 లక్షలు పైన | 30% |




న్యూఢిల్లీ: అమృత్‌కాల్‌లో ప్రవేశపెట్టబడిన తొలి బడ్జెట్ ఇదేనంటూ బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. ' గత బడ్జెట్ వేసిన పునాదులపై నిర్మించబడిన బడ్జెట్ ఇది. పాతికేళ్లలో వందో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోనున్న భారత్‌కు బ్లూప్రింట్ ఈ పద్దు' అని ఆమె వ్యాఖ్యానించారు. బడ్జెట్ ప్రసంగంలో విత్తమంత్రి పలు మార్లు ప్రస్తావించిన 'అమృత్‌కాల్'పై చర్చ మొదలైంది. అమృత్‌కాల్ ప్రత్యేకత ఏంటి అనేది ఓసారి పరిశీలిస్తే.. ఢిల్లీలో 2021వ సంవత్సరంలో 75వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ తొలిసారిగా 'అమృత్‌కాల్' అనే భావనను తెరమీదకు తెచ్చారు. 'దేశం 75 స్వేచ్ఛా స్వాతంత్ర్య వసంతాలు పూర్తిచేసుకుంది. మరో 25 సంవత్సరాల్లో దేశం శత వసంతాలు పూర్తిచేసుకోబోతోంది. అంటే 2021వ ఏడాది నుంచి వచ్చే 25 సంవత్సరాలు దేశానికి అమృతకాలంతో సమానం. ఈ 25 సంవత్సరాల్లోనే భారత్ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి 'అభివృద్ధి చెందుతున్న దేశం' నుంచి 'అభివృద్ధి చెందిన దేశం'గా అవతరించాలి. ఇందుకు అనుగుణంగా పల్లెలు, పట్టణాలకు మధ్య ఉన్న అభివృద్ధి అంతరాలను చెరిపేయాలి. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని దేశంలో డిజిటలైజేషన్ పాత్ర పెంచి ప్రజాజీవితంలో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించుకోవాలి. ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండాలి. ప్రతీ కుటుంబానికి బ్యాంక్ ఖాతా, గ్యాస్ కనెక్షన్, అర్హులైన పౌరులకు ఆరోగ్య బీమా ఉండాలి. అందరి సమష్టి కృషి, అంకితభావం, త్యాగాల ఫలితంగానే ఇదంతా సాధ్యం. వందల ఏళ్ల బానిసత్వాన్ని చవిచూసిన భారతీయ సమాజం.. కోల్పోయిన వైభవాన్ని తిరిగి సాధించేందుకు మనకు మనం నిర్దేశించుకున్న పాతికేళ్ల లక్ష్యమిది' అని ఆనాడు ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అమృత్‌కాల్ అనే పదం మన వేదాల్లో ప్రస్తావించబడింది. కష్టాల కడలిని దాటి విజయతీరాలకు చేరుకునే కాలం. కొత్త పని మొదలుపెట్టేందుకు అత్యంత శుభసూచకమైన సమయంగా అమృత్‌కాల్‌ను భావిస్తారు.

### అమృత్‌కాల్ అంటే..



న్యూఢిల్లీ: అంకురసంస్థలకు కేంద్రం మరోసారి ప్రోత్సాహకాలు ప్రకటించింది. కొత్తగా ఏర్పాటయ్యే అంకురసంస్థలకు పన్ను మినహాయింపులు ఇవ్వనున్నట్లు మంత్రి నిర్మల చెప్పారు. 2024 మార్చి నెలలోపు స్థాపించబడిన స్టార్టప్ సంస్థలకు పన్ను మినహాయింపులు కొనసాగుతాయని ఆమె స్పష్టంచేశారు. 'నష్టాలను తదుపరి ఆర్థిక సంవత్సరానికి ఫార్వార్డ్ చేసే వెసులుబాటును ప్రస్తుతమున్న ఏడేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతున్నాం. 2023 మార్చి 31 నుంచి 2024 మార్చి 31వ తేదీదాకా ఆదాయ పన్ను మినహాయింపులు పొందవచ్చు. 2016–17 ఆర్థికసంవత్సర అంచనాలకు ముందు చెరకు రైతులకు ఇచ్చేసిన చెల్లింపులను చక్కెర సహకార సంఘాలు క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాం'అని మంత్రి చెప్పారు. దీంతో చక్కెర సహకార సంఘాలకు రూ.10,000 కోట్లమేర లబ్ధిచేకూరనుంది. 'కొత్త కోపరేటివ్‌లకూ 15 శాతం పన్ను లబ్ధి దక్కుతుంది. ల్యాబ్‌లలో తయారయ్యే డైమండ్ల కోసం వినియోగించే ముడిసరుకుపై కస్టమ్ సుంకాలను సైతం తగ్గించే యోచనలో ఉన్నాం. ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల్లోని ఒక్కో సభ్యుడు తీసుకునే రుణం/ డిపాజిట్ చేసే మొత్తానికి రూ.2,00,000ను గరిష్ట పరిమితిగా విధించాలని భావిస్తున్నాం'అని మంత్రి తెలిపారు.

### అప్పటిదాకా స్టార్టప్‌లకు పన్ను మినహాయింపులు



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎం) కొనుగోలు చేయడం కోసం కేంద్ర న్యాయశాఖకు ఈ బడ్జెట్‌లో దాదాపు రూ.1,900 కోట్లను కేటాయించారు. 2024లో రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా ఈవీఎంలను సమకూర్చుకోవడంతోపాటు వాటికి అనుబంధంగా వాడే ఇతర పరికరాల కొనుగోలు చేయడానికి వీలుగా రూ.1,891.78 కోట్లను కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఇతర పరకరాలను కొనుగోలు చేయడమేకాక పాతవాటిని తుక్కుకింద మార్చడానికి ఈ నిధులను వినియోగిస్తారు. 2024 సంవత్సరంలో రానున్న లోక్‌సభ ఎన్నికలతోపాటు ఈ ఏడాది పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘానికి నిధులు అవసరమవుతాయని కేంద్ర న్యాయశాఖ ప్రతిపాదించడంతో కేంద్ర కేబినెట్ గత నెలలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈవీఎంలకోసం బడ్జెట్‌లో నిధులను కేటాయించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాల నుంచి ఈవీఎంలను కొనుగోలు చేయనున్నారు.

### ఈవీఎంల కోసం రూ.1,900 కోట్లు కేటాయింపు



2023 బడ్జెట్ లెక్కలు సరే..
మరి మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్ సంగతేమిటి?
అప్పుడు మనకు ఎంత ఆదాయం వచ్చేది?
రక్షణ శాఖ బడ్జెట్ ఎంత?
వంటి వివరాలు మీకోసం..
(అంకెలు రూ.కోట్లలో)



1947

ఆర్కే షణ్ముగం చెట్టి

1947, నవంబర్ 26

| | |
|---|---|
| రెవెన్యూ అంచనా | 171.15 |
| రెవెన్యూ వ్యయం | 197.39 |
| రెవెన్యూ లోటు | 26.24 |
| రక్షణశాఖకు | 92.74 |
| ఆదాయపు పన్ను ద్వారా ఆదాయం | 119 |
| కస్టమ్స్ ఆదాయం | 50.5 |
| ఫారెక్స్ నిల్వలు | 1,547 |

### నూతన, పునరుత్పాదక ఇంధన శాఖకు రూ.37,828.15 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.37,828.15 కోట్లు కేటాయించింది. గత ఏడాది బడ్జెట్‌లో సవరించిన అంచనా(రూ.27,547.47 కోట్లు)తో పోలిస్తే ఇది 37 శాతం అధికం. ఈ శాఖ ఆధ్వర్యంలోని రెండు సంస్థలకు బడ్జెట్‌లో కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. తాజా బడ్జెట్‌లో ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐఆర్ఈడీఏ)కి రూ.35,777.35 కోట్లు కేటాయించారు. అలాగే సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఈసీఐ)కి రూ.2,050.80 కోట్లు కేటాయించారు. ఇంధన రంగంలో కొత్త ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందజేయడానికి ఐఆర్ఈడీఏ 1987లో ఏర్పాటయ్యింది. నేషనల్ సోలార్ మిషన్(ఎన్ఎస్ఎం) అమలు, ఈ రంగంలో లక్ష్యాల సాధన కోసం ఎస్ఈసీఐని 2011లో నెలకొల్పారు.

## 'మేధో సంపత్తి'కి మరిన్ని...


### డీపీఐఐటీకి రూ.8,200 కోట్లు
### ఇండస్ట్రియల్ కారిడార్స్‌కు రూ.2,000 కోట్లు



న్యూఢిల్లీ: డిజైన్స్, ట్రేడ్ మార్కులు, కాపీ రైట్ ఆఫీస్, కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్ వంటి మేధో సంపత్తి హక్కులకు సంబంధించిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) ఎకో సిస్టమ్‌కు బడ్జెట్లో రూ.329 కోట్లు కేటాయించారు. గతేడాది కంటే ఇది 15 శాతం ఎక్కువ. వీటితోపాటు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అపిలేట్ బోర్డ్ (ఐపీఏబీ), ఐపీఆర్ పాలసీ మేనేజ్‌మెంట్, సీజీపీ, డీటీఎంల్లో మౌలిక వసతుల అభివృద్ధి తదితరాలకు కూడా నిధులను మరింతగా పెంచారు. పేటెంట్, డిజైన్లు, ట్రేడ్ మార్కులు, కాపీరైట్ తదితర చట్టాల వ్యవహారాలను సీజీపీ, డీటీఎం పర్యవేక్షిస్తుంటాయి.

**ఇండస్ట్రియల్ కారిడార్‌కూ...**


నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్స్‌కు బడ్జెట్లో రూ.2,000 కోట్లు కేటాయించారు. గతేడాది కంటే ఇది రూ.500 కోట్లు ఎక్కువ. అలాగే పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ)కి రూ.8,200 కోట్ల కేటాయింపులు దక్కాయి. ఇది గతేడాది (రూ.6,725 కోట్లు) కంటే ఏకంగా 22 శాతం ఎక్కువ! స్టార్టప్స్‌కు ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఎఫ్ఎస్)కింద మరో రూ.1,470 కోట్లు దక్కాయి. ఈ స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ (ఎస్ఐఎస్ఎఫ్ఎస్)ను రూ.10 వేల కోట్ల కార్పస్ నిధితో 2021 ఏప్రిల్లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి ఆపరేటింగ్ ఏజెన్సీగా భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (ఎస్ఐఈడబీఐ) వ్యవహరిస్తోంది. కాన్సెప్టులకు పరూపులు, ప్రొటో టైప్ డెవలప్‌మెంట్, ప్రొడక్ట్ ట్రయల్స్, మార్కెట్ ఎంట్రీ, వాణిజ్యీకరణ తదితర అంశాల్లో స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించడం ఎస్ఐఎస్ఎఫ్ఎస్ లక్ష్యం.






## వ్యవసాయ భూమి బంగారమే..!

● ప్రపంచంలో 200కుపైగా దేశాలు ఉన్నా ప్రజలకు అవసరమైన ఆహార ఉత్పత్తులను పండించుకునే దేశాలు తక్కువే. వ్యవసాయ యోగ్యమైన భూమి తక్కువగా ఉండటమే దీనికి కారణం. వారికి ఆహార ఉత్పత్తుల దిగుమతులే దిక్కు. ప్రపంచంలో ఎక్కువ శాతం వ్యవసాయ భూమి ఉన్న దేశాల్లో మూడు భారత ఉపఖండంలోనే ఉండటం గమనార్హం. ఇక ఫారో ఐలాండ్స్, ఒమన్, సీషెల్స్, సురినామ్, కువైట్, బోట్స్‌వానా, యూఏఈ, సింగపూర్, మంగోలియా, లిబియా వంటి దేశాల్లో అయితే మొత్తం భూమిలో కేవలం ఒక శాతమే వ్యవసాయానికి పనికొస్తుంది.




సాంకేతికత, విధాన నిర్ణయం రెండూ వేర్వేరు. వ్యవసాయంలో సాంకేతికత వల్ల ఉత్పత్తి పెరగవచ్చు. కానీ ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాలే రైతుల ఆదాయాన్ని పెంచగలుగుతాయి. ఎక్కడైనా వ్యవసాయం సరిగా లేకపోతే.. మరేదీ కూడా సరిగా ఉండే అవకాశం లేదు.



– ఎంఎస్ స్వామినాథన్, వ్యవసాయ శాస్త్రవేత్త



### 2 పథకాలు అందరికీ చేరేలా..

ప్రభుత్వ పథకాలు, విధానాలు దేశంలో ప్రతి మూలన, ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు చేపడతామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. దీనిని సాధించేందుకు వినూత్న విధానాలను, సాంకేతికతను వినియోగిస్తామన్నారు. ప్రభుత్వ సేవలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అందేలా 'ఆస్పిరేషనల్ బ్లాక్స్' కార్యక్రమాన్ని చేపట్టినట్టు వెల్లడించారు.

### రెవెన్యూ లోటు — REVENUE DEFICIT

ప్రభుత్వానికి వివిధ మార్గాల ద్వారా వచ్చే రెవెన్యూ ఆదాయం కంటే.. వ్యయం ఎక్కువగా ఉన్నప్పుడు ఆదాయ లోటు ఏర్పడుతుంది. దీనినే రెవెన్యూ లోటు అంటారు. అప్పులు, ఇతర మార్గాల ద్వారా ఈ లోటును పూడ్చుకుంటారు.

### ప్రత్యక్ష పన్నులు — DIRECT TAXES

ప్రభుత్వానికి మనం నేరుగా చెల్లించే పన్నులు ఇవి. ఆదాయ పన్ను, సంపద పన్ను, ఫ్రింజ్ బెనిఫిట్ ట్యాక్స్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. ఈ పన్నులను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) పర్యవేక్షిస్తుంది.

### పరోక్ష పన్నులు — INDIRECT TAXES

నేరుగా మనం చెల్లించకుండా వివిధ వస్తువులు, సేవలపై ప్రభుత్వం వేసే పన్నులను పరోక్ష పన్నులుగా చెప్పవచ్చు. జీఎస్టీ, వ్యాట్, సేల్స్ ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్ వంటివి పరోక్ష పన్నుల కేటగిరీలోకి వస్తాయి. ఈ పన్నులు సదరు వస్తువులు, సేవలను అందించే కంపెనీల ద్వారా ప్రభుత్వానికి చేరుతాయి.

### సెస్‌లు — CESS

మనం చెల్లించే పన్నులకు అదనంగా కొంత శాతం మేర విధించే ప్రత్యేక పన్నులు/చార్జీలను సెస్‌లుగా చెప్పవచ్చు. ఎడ్యుకేషన్ సెస్, కృషి కల్యాణ్ సెస్, స్వచ్ఛ భారత్ సెస్, పెట్రోల్-డీజిల్‌లపై సెస్ వంటివి దీనికి ఉదాహరణలు. సాధారణంగా కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. అదే సెస్‌లుగా వసూలు చేసే మొత్తం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే వెళుతుంది.

### సర్‌చార్జీలు — SURCHARGE

అత్యంత విలాసవంతమైన, ఖరీదైన వస్తువులు, సేవలపై అదనంగా విధించే చార్జీలను సర్‌చార్జీలుగా చెప్పుకోవచ్చు. దేశంలో పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడం కోసం ప్రభుత్వాలు ధనిక కేటగిరీల్లోని వారు వినియోగించే ఖరీదైన వస్తువులు, సేవలపై సర్‌చార్జీలను విధిస్తూ ఉంటాయి. ఉదాహరణకు విలాసవంతమైన కార్లు, ఖరీదైన బైకులు, దిగుమతి చేసుకునే వాహనాలు వంటివి. దీనికితోడు అత్యధిక ఆదాయం ఉండేవారి నుంచి వసూలు చేసే ఆదాయ పన్నుపైనా సర్‌చార్జీలు ఉన్నాయి.

### డిజిన్వెస్ట్‌మెంట్ — DISINVESTMENT

ప్రభుత్వ రంగ కంపెనీల్లో వాటాలను అమ్మడం, లేదా పూర్తిగా విక్రయించడం, లేదా స్టాక్ మార్కెట్లో వాటిని లిస్ట్ చేయడం ద్వారా ప్రభుత్వాలు నిధులను సమకూర్చుకోవడాన్ని పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) అంటారు.

### ఓటాన్ అకౌంట్ — VOTE ON ACCOUNT


బడ్జెట్ ఏదైనా ఒక ఆర్థిక సంవత్సరం పూర్తి నిడివికి సంబంధించి ఉంటుంది. అంటే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తర్వాతి ఏడాది మార్చి 31వ తేదీ వరకు అన్నమాట. కేంద్రం, ఏవైనా రాష్ట్ర ప్రభుత్వాల పదవీకాలం ఈ మధ్యకాలంలో ముగిస్తే.. పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి వీలుండదు. సదరు ప్రభుత్వం పదవిలో ఉండే కాలానికి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. దీనినే ఓటాన్ అకౌంట్ అంటారు. ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది.

# కోతలు.. కొత్త పథకాలు

## గతసారితో పోలిస్తే ఐదుశాతం తగ్గిన బడ్జెట్ కేటాయింపులు

- అన్ని ప్రధాన స్కీమ్‌లు, కార్యక్రమాలకు తగ్గిన నిధులు
- పంటల 'గిట్టుబాటు ధర'కు మంగళం
- మత్స్య రంగానికి ఊపు కోసం రూ. 6 వేల కోట్లు
- ప్రకృతి సాగు కోసం కోటి మంది రైతులకు ప్రోత్సాహకాలు
- తృణధాన్యాలను ప్రోత్సహించేందుకు 'శ్రీ అన్న' పథకం
- దీనికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా హైదరాబాద్ ఐఐఎంఆర్

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయ రంగంపై శీతకన్ను వేసింది. గతంలో కంటే గణనీయ స్థాయిలో నిధులకు కోత పెట్టింది. ప్రధాన పథకాలన్నింటికీ కేటాయింపులను తగ్గించి వేసింది. ఇదే సమయంలో దేశంలో ప్రకృతి వ్యవసాయాన్ని, తృణధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు కొత్త పథకాలను ప్రవేశపెట్టింది. మత్స్య రంగానికి మాత్రం కాస్త నిధులు ఇచ్చింది.




### భారీగా తగ్గిన కేటాయింపులు

**2022-23** బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు కలిపి రూ. 1,51,521 కోట్లను కేటాయించగా.. తాజా బడ్జెట్‌లో 5% తక్కువగా రూ. 1,44,214 కోట్లకు మాత్రమే ప్రతిపాదించారు. మొత్తంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు శాతాన్ని చూస్తే.. వ్యవసాయం, అనుబంధ రంగాలకు గత ఏడాది 3.84% ఇవ్వగా, ఈసారి 3.20 శాతానికి తగ్గిపోయింది. ఫసల్ బీమా యోజన, పీఎం కిసాన్, కృషి వికాస్ యోజన పథకాలకు కేటాయింపులు భారీగా తగ్గిపోయాయి. ఇక పంటలకు గిట్టుబాటు ధర లభించేందుకు తోడ్పడేలా అమల్లోకి తెచ్చిన 'మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్'కు, పంటలకు మద్దతు ధర లభించేందుకు తెచ్చిన 'పీఎం-ఆశ' పథకాలను కేంద్రం పక్కన పెట్టేసింది.

### వ్యవసాయానికి రుణ సాయం..

దేశంలో వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు, తక్కువ వడ్డీతో మరిన్ని రుణాలు అందేలా చర్యలు చేపడతామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. గత ఏడాది (రూ.18 లక్షల కోట్లు) కన్నా 11 శాతం అధికంగా ఈసారి రూ.20 లక్షల కోట్ల మేర పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. బ్యాంకులు పంట రుణాలకు 9 శాతం వడ్డీ వసూలు చేస్తాయని.. కేంద్రం అందులో 2 శాతాన్ని భరిస్తుండటంతో రైతులకు ఏడు శాతం వడ్డీకే రుణాలు అందుతున్నాయని చెప్పారు. రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు ఎలాంటి తనఖా లేకుండా ఇచ్చే రుణాలను రూ.1.6 లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు.

➤ ఎక్కువ పొడవు పింజ ఉండే పత్తి ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు క్లస్టర్ ఆధారిత విధానాన్ని అనుసరిస్తామని నిర్మల తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ విధానం)తో విత్తనాల నుంచి మార్కెటింగ్ వరకు వ్యాల్యూ చైన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

### మత్స్య రంగానికి ఊపు కోసం..

➤ దేశంలో చేపల ఉత్పత్తి, రవాణాను మెరుగుపర్చేందుకు 'ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన' కింద రూ.6,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. ఇతర సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలో రొయ్యల దాణా దిగుమతిపై కస్టమ్స్ పన్నును తగ్గిస్తున్నట్టు ప్రకటించారు.

### వ్యవసాయానికి బడ్జెట్ తీరు ఇదీ.. (రూ. కోట్లలో)

| విషయం | 2022-23లో | 2023-24లో | తగ్గింపు/పెంపు |
|---|---|---|---|
| మొత్తం బడ్జెట్ | 1,51,521 | 1,44,214 | 5% తగ్గింపు |
| ఉపాధి హామీ | 73,000 | 60,000 | 18% తగ్గింపు |
| పీఎం కిసాన్ | 68,000 | 60,000 | 13% తగ్గింపు |
| ఫసల్ బీమా | 15,500 | 13,625 | 12% తగ్గింపు |
| కృషి వికాస్ యోజన | 10,433 | 7,150 | 31% తగ్గింపు |
| కృషి ఉన్నతి యోజన | 7,183 | 7,066 | 2% తగ్గింపు |
| మార్కెట్ ఇంటర్వెన్షన్ | 1,500 | 10 లక్షలు | పూర్తిగా కోత |
| పీఎం ఆశ | 1 | ఒక లక్ష | పూర్తిగా కోత |

### ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం..

● దేశంలో సహజ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు నిర్మల ప్రకటించారు. ఇందుకోసం వచ్చే మూడేళ్లపాటు దేశవ్యాప్తంగా కోటి మంది రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. పంటలకు అవసరమైన సూక్ష్మ పోషకాలు (ఎరువులు), పురుగు మందులను పంపిణీ చేసేందుకు 10వేల 'బయో-ఇన్‌పుట్ రీసోర్స్ సెంటర్'లతో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

➤ పశు, వ్యవసాయ వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేందుకు 'గోబర్ధన్ (గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో-ఆగ్రో రీసోర్సెస్ ధన్)' పథకం కింద రూ.10 వేల కోట్లతో కొత్తగా 500 ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సహజవాయువును విక్రయించే అన్ని సంస్థలు తప్పనిసరిగా 5శాతం బయో కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను అందులో చేర్చాలని నిర్ణయించినట్టు తెలిపారు.

### 'శ్రీ అన్న'తో తృణధాన్యాల హబ్‌గా..

దేశాన్ని తృణధాన్యాల హబ్‌గా మార్చేందుకు 'శ్రీ అన్న' కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్'ను దీనికి వేదికగా ఎంచుకున్నట్టు తెలిపారు. ఇది తృణధాన్యాల ఉత్పత్తి, పరిశోధన, సాంకేతిక అంశాల్లో అత్యుత్తమ విధానాలను అంతర్జాతీయ స్థాయిలో పంచుకునేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పనిచేస్తుందని వివరించారు. తృణధాన్యాల వినియోగంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని.. ఎందరో చిన్న రైతులు వీటిని పండించి ప్రజల ఆరోగ్యానికి తోడ్పడుతున్నారని వ్యాఖ్యానించారు.

### హైదరాబాద్ ఐఐఎంఆర్ ఏంటి?

దేశంలో తృణధాన్యాల దిగుబడి పెంచడం, కొత్త వంగడాల రూపకల్పన కోసం హైదరాబాద్‌లో 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్)'ను ఏర్పాటు చేశారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) పరిధిలో ఇది పనిచేస్తుంది. జొన్నలు, సజ్జలు, రాగులు, సామలు వంటి తృణధాన్యాల పంటలపై ఇక్కడ పరిశోధనలు చేస్తారు. ఐఐఎంఆర్ దేశ విదేశాలకు చెందిన తృణధాన్యాల సంస్థలతో కలిసి పనిచేస్తుంది కూడా.

### భూమిని కాపాడేందుకు 'పీఎం-ప్రణామ్'!

ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగం, పురుగు మందుల వాడకాన్ని నియంత్రించడమే లక్ష్యంగా 'ప్రధాన మంత్రి ప్రోగ్రామ్ ఫర్ రీస్టోరేషన్, అవేర్‌నెస్, నరిష్‌మెంట్ అండ్ అమెలియరేషన్ ఆఫ్ మదర్ ఎర్త్ (పీఎం-ప్రణామ్)' పథకాన్ని చేపడుతున్నట్టు నిర్మల తెలిపారు. ఈ దిశగా చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.



➤ ఉద్యాన పంటల కోసం.. తెగుళ్ల సోకని, నాణ్యమైన మొక్కలను అందుబాటులో ఉంచేందుకు రూ.2,200 కోట్లతో 'ఆత్మనిర్భర్ క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్'ను ప్రారంభించనున్నట్టు తెలిపారు.

➤ గ్రామీణ ప్రాంతాల్లో యువ పారిశ్రామికవేత్తలు 'అగ్రి స్టార్టప్స్'ను నెలకొల్పేలా ప్రోత్సహించేందుకు 'అగ్రికల్చర్ యాక్సిలరేటర్ ఫండ్ (ఏఏఎఫ్)'ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

➤ వ్యవసాయ రంగంలో రైతు ఆధారిత, సమ్మిళిత పరిష్కారాల కోసం డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

➤ 'మిష్టి' పథకం కింద దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో మడ అడవులను పెంచనున్నట్టు తెలిపారు.

# పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ఫండ్

**న్యూఢిల్లీ:** టైర్-2, టైర్-3 పట్టణాల మౌలిక వసతుల అభివృద్ధికి ఏటా రూ. 10 వేల కోట్లు కేటాయించేలా అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్)ను ఏర్పాటు చేస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్ఐడీఎఫ్) తరహాలో యూఐడీఎఫ్‌ను ఏర్పాటు చేస్తామని, నేషనల్ హౌసింగ్ బ్యాంక్ దీని నిర్వహణ చేపడుతుందని తెలిపారు. ఈ నిధులను మౌలిక వసతుల కల్పనకు టైర్-2 (50 వేల నుంచి లక్ష జనాభా), టైర్-3 (20 వేల నుంచి 50 వేల జనాభా) పట్టణాల్లోని ప్రభుత్వ సంస్థలు వినియోగిస్తాయని తెలిపారు. రేపటి స్థిరమైన నగరాలుగా అభివృద్ధి చేసేందుకు పట్టణ ప్రణాళికల్లో సంస్కరణను ప్రోత్సహిస్తామని, ఇందులో భాగంగా సమర్థవంతంగా భూ వనరుల వినియోగం, మౌలిక వసతులకు చాలినంత వనరులు, రవాణా అభివృద్ధి, అందుబాటులో పట్టణ భూమి వనరులు, అందరికీ అవకాశాలు అనేవి ఉంటాయని తెలిపారు. ఇక అన్ని పట్టణాల్లో సీవరేజీ, సెప్టిక్ ట్యాంకుల విషయంలో మ్యాన్‌హోల్ నుంచి మెషీన్-హోల్‌గా మారేలా చర్యలు చేపడతామన్నారు. వృత్తాకార ఆర్థిక వ్యవస్థ ప్రోత్సాహంలో భాగంగా గోబర్ ధన్ పథకాన్ని ఏర్పాటు చేసి 500 వరకూ ×వేస్ట్ టు వెల్త్× ప్లాంట్లను ప్రారంభిస్తామన్నారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసే 200 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లలో 75 ప్లాంట్లను పట్టణ ప్రాంతాల్లో నిర్మిస్తామని, అలాగే 300 కమ్యూనిటీ లేక క్లస్టర్ బేస్డ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికి రూ. 10 వేల కోట్ల పెట్టుబడిని కేటాయించారు. సహజ, బయోగ్యాస్‌ను ప్రోత్సహించడంలో భాగంగా అన్ని సంస్థల్లో 5 శాతం ఈ గ్యాస్‌ను వినియోగించేలా తప్పనిసరి చేస్తామని చెప్పారు.




# సహకారానికి పన్ను ఊరట

**ఈ శాఖకు రూ.1,150.38 కోట్లు కేటాయింపు**

**గతసారితో పోల్చితే 29శాతం తగ్గిన బడ్జెట్**




**న్యూఢిల్లీ:** దేశంలో సహకార రంగానికి ప్రోత్సాహం ఇచ్చేందుకు కేంద్రం పన్ను రాయితీలను ప్రకటించింది. అయితే ఇదే సమయంలో ఈ శాఖకు నిధుల్లో కోత పెట్టింది. 2022-23 సవరించిన అంచనాల మేరకు సహకారశాఖకు కేటాయింపులు రూ.1,624.74 కోట్లు కాగా.. తాజా బడ్జెట్‌లో 1,150.38 కోట్లే ఇచ్చింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్), రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంకుల సభ్యులు సొసైటీల్లో నగదు ఉపసంహరణపై 2 లక్షల పరిమితిని విధించింది.

**పన్ను రాయితీతో..**

సహకార రంగంలో ఉత్పత్తిని పెంచేందుకు, కొత్త సొసైటీలను ప్రోత్సహించేందుకు కేవలం 15శాతం పన్నునే వసూలు చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. 2023 ఏప్రిల్ తర్వాత ఏర్పాటై, 2024 మార్చి చివరిలోగా ఉత్పత్తి ప్రారంభించే సొసైటీలకు ఇది వర్తిస్తుందని ప్రకటించారు. సొసైటీలకు నగదు విత్‌డ్రాపై టీడీఎస్ విధింపు పరిమితిని ఒక ఏడాదిలో రూ.3 కోట్లకు పెంచుతున్నట్టు వివరించారు. సహకారంతో సమృద్ధి'నినాదంలో భాగంగా 63 వేల ప్యాక్స్‌ను రూ.2,516 కోట్లతో కంప్యూటీకరించినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా సహకార సొసైటీలతో కూడిన డేటాబేస్‌ను సిద్ధం చేస్తామని.. దీని ఆధారంగా భారీగా గోదాములను నిర్మిస్తామని చెప్పారు. రైతులు తమ ఉత్పత్తులకు మంచి ధర వచ్చేదాకా నిల్వ చేసుకోవచ్చని తెలిపారు.

# పల్లెకు నిధులు కట్!

గ్రామీణాభివృద్ధికి తగ్గిన కేటాయింపులు

ఉపాధి హామీపై చిన్నచూపు

ఇళ్లు, తాగునీటికి మాత్రం ఊరట..

మౌలిక రంగాన్ని పరుగులు పెట్టిస్తామంటూ భారీగా పెట్టుబడి నిధులను కేటాయించిన మోదీ సర్కారు.. గ్రామీణాభివృద్ధి విషయంలో ఈసారి కాస్త చిన్నచూపు చూసింది. ప్రధానమైన కేంద్ర ప్రాయోజిత పథకాలకు (ఫ్లాగ్‌షిప్) నిధుల కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)లో గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయింపులు (సవరించిన అంచనా) రూ. 1,81,121 కోట్లు కాగా, 2023-24 బడ్జెట్లో కేటాయింపులను 13 శాతం మేర తగ్గించి రూ.1,57,545 కోట్లకు పరిమితం చేసింది. ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో భారీగా కోత పెట్టడం గమనార్హం.

### ఉపాధి 'హామీ'కి కోత...



2023-24 కేటాయింపు: రూ.60,000 కోట్లు

2022-23 కేటాయింపు: రూ.73,000 కోట్లు (సవరించిన అంచనా రూ.89,400 కోట్లు)

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంజీఎన్ఆర్ఈజీఏ) కేటాయింపుల్లో భారీగా కోత పడింది. 2022-23లో కేటాయింపుల సవరించిన అంచనా రూ.89,400 కోట్లతో పోలిస్తే 32 శాతం మేర తగ్గించేశారు. కాగా, 2022 జూలై-నవంబర్ కాలంలో ఈ స్కీమ్ కింద పనులు చేసేందుకు ముందుకొచ్చిన కార్మికుల సంఖ్య కోవిడ్ ముందస్తు స్థాయిలకు చేరినట్లు తాజా ఆర్థిక సర్వే పేర్కొనడం గమనార్హం.

### గ్రామీణ రోడ్లు.. జోరు తగ్గింది (పీఎంజీఎస్‌వై)

2023-24 కేటాయింపు: రూ.19,000 కోట్లు

2022-23 కేటాయింపు: రూ.19,000 కోట్లు

గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు రోడ్ల నిర్మాణం కోసం కేంద్రం నిధులు వెచ్చిస్తోంది. అయితే, తాజా బడ్జెట్లో ఈ ఫ్లాగ్‌షిప్ స్కీమ్‌కు కేటాయింపులను మాత్రం పెంచలేదు. 2023-24లో 38,000 కిలోమీటర్ల మేర పక్కా రోడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### ఇంటికి ఓకే... (పీఎంఏవై)



2023-24 కేటాయింపులు: రూ.79,590 కోట్లు (గ్రామీణ-పట్టణ ప్రాంతాలతో కలిపి)

2022-23 కేటాయింపులు: రూ.48,000 కోట్లు (సవరించిన అంచనా రూ.77,130 కోట్లు)

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణానికి పెద్దపీట వేసేలా తాజా బడ్జెట్లో కొంత మెరుగ్గానే కేటాయింపులు జరిపారు. ప్రధానంగా గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి ఫండ్ తరహాలోనే పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి ఫండ్‌ను నెలకొల్పుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఏటా రూ.10,000 కోట్లను ఈ ఫండ్‌కు ఖర్చు చేస్తామని, దీన్ని నేషనల్ హౌసింగ్ బ్యాంక్ నిర్వహిస్తుందని ప్రకటించారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో బలహీన వర్గాలకు 2023-24లో 57.33 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పట్టణ ప్రాంతాల్లో దాదాపు 20 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం.

### స్వచ్ఛ భారత్ మిషన్...



2023-24 కేటాయింపు: రూ.12,192 కోట్లు (గ్రామీణ-పట్టణ ప్రాంతాలతో కలిపి)

2022-23 కేటాయింపు: రూ.9,492 కోట్లు (సవరించిన అంచనా రూ.7,000 కోట్లు)

దేశంలో బహిరంగ మలమూత్ర విసర్జన (ఓడీఎఫ్)ను పూర్తిగా తుడిచిపెట్టడానికి 2014లో ఆరంభమైన ఈ స్వచ్ఛ భారత్ పథకం (ఎస్‌బీఎం) కిందికి ఘన వర్థాల (చెత్త నిర్మూలన), జల వ్యర్థాల నిర్వహణను కూడా తీసుకొచ్చారు. ఈ పథకానికి మాత్రం తాజా బడ్జెట్లో కేటాయింపులు పెంచారు. కాగా, పట్టణ ప్రాంతాల్లో 2023-24లో 13,500 కమ్యూనిటీ/పబ్లిక్ టాయిలెట్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే, 3 లక్షల గ్రామాలను ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీరు నిర్వహణ కిందికి తీసుకురావాలనేది కేంద్రం లక్ష్యం.

### తాగునీటికి నిధుల పెంపు...

2023-24 కేటాయింపు: రూ.70,000 కోట్లు

2022-23 కేటాయింపు: రూ.60,000 కోట్లు (సవరించిన అంచనా రూ.55,000 కోట్లు)

స్వచ్ఛమైన తాగునీటిని అందరికీ అందించేందుకు 2019-20లో జల్ జీవన్ మిషన్ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించారు. దీనిలో భాగంగా 2023-24లో 4 కోట్ల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కేంద్రం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందుకు తాజా బడ్జెట్లో నిధుల కేటాయింపులను పెంచారు.

### భారత్ నెట్...



2023-24 కేటాయింపు: రూ.10,400 కోట్లు

2022-23 కేటాయింపు: రూ.9,000 కోట్లు

భారత్ నెట్ కింద దేశంలోని పల్లెలన్నింటికీ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలనేది కేంద్రం లక్ష్యం. దీనిలో భాగంగా 2023-24లో 17,000 గ్రామ పంచాయితీలను కొత్తగా హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ ద్వారా అనుసంధానించనున్నారు. అలాగే 78,750 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరంలో 5,50,000 ఫైబర్-టు-హోమ్ కనెక్షన్లు కూడా ఇవ్వాలనేది లక్ష్యం.

### రహదారులపై ప్రగతి పయనం

ఎన్‌హెచ్‌ఏఐకి రూ.1.62 లక్షల కోట్లు

జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.2.70 లక్షల కోట్లు

ఎన్‌హెచ్‌ఏఐకు 2022-23 బడ్జెట్‌లో కేంద్రం రూ.1.42 లక్షల కోట్లు కేటాయించగా, 2023-24 బడ్జెట్‌లో రూ.1.62 లక్షల కోట్లు కేటాయించింది. ఈసారి కేటాయింపులను రూ.20,000 కోట్లు(13.90 శాతం) పెంచింది. జాతీయ రహదారుల రంగానికి 2022-23లో రూ.1.99 లక్షల కోట్లు కేటాయించగా, దీన్ని తర్వాత రూ.2.17 లక్షల కోట్లుగా సవరించింది. తాజా బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.2.70 లక్షల కోట్లు కేటాయించడం గమనార్హం.




## జీడీపీలో ఇవి పవర్‌ఫుల్

ఏదైనా ఒక దేశం/ప్రాంతంలో ఒక ఏడాది మొత్తంలో ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల విలువను కలిపి 'జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్)' అంటారు. ఎంత ఎక్కువ జీడీపీ ఉంటే.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఆ దేశం అంత ప్రభావవంతమైనదని చెప్పుకోవచ్చు. 'ప్రపంచ ఆర్థిక సంస్థ (ఐఎంఎఫ్)' తాజా గణాంకాల ప్రకారం ప్రపంచంలోని సుమారు 200 దేశాల జీడీపీలను కలిపి చూస్తే.. అందులో సగం కేవలం యూఎస్, చైనా, జపాన్, జర్మనీ, ఇండియాల వాటానే కావడం గమనార్హం. ఇంకా చెప్పుకోవాలంటే కేవలం యూఎస్, చైనాల వాటానే 40 శాతం దాకా ఉంటుంది.




ఆర్థిక వ్యవస్థ మంచి పనితీరుకు జీడీపీ పూర్తిస్థాయి ప్రమాణం ఏమీ కాదు. అదేమీ ప్రజల సంక్షేమాన్ని ప్రతిబింబించదు. చాలా దేశాల జీడీపీ పెరిగిపోతూ ఉంటుంది. కానీ ప్రజల జీవితంలో, ఆదాయంలో పెద్దగా మార్పులు ఉండవు.

\- జోసెఫ్ స్టిగ్లిట్జ్, అమెరికన్ ఆర్థికవేత్త






'ఈ జగమంతా రామమయం' అన్నాడు ఆనాటి రామదాసు!

ఈ నాటి నిర్మలా సీతారామమ్మ బడ్జెట్ పాట కూడా ఇదే. కాకపోతే...

జగము స్థానంలో భారత్ అని... రాముడికి బదులు డిజిటల్ అని మార్చుకోవాలి!

# డిజిటల్ సీతారామం... సూపర్ హిట్!




కేంద్ర ప్రభుత్వం ఏళ్ల క్రితం మొదలుపెట్టిన డిజిటలీకరణకు ఈ ఏడాది బడ్జెట్‌లోనూ మంచి మద్దతు లభించింది. దేశ పురోగతికి కృత్రిమ మేధను వాడుకోవడం మొదలు.. రైతన్న సమస్యలన్నింటికీ ఒక్క చోటే పరిష్కారాలు దక్కేలా చేయడం వరకూ పలు ప్రతిష్ఠాత్మక డిజిటల్ కార్యక్రమాలకు ఈ ఏడాది బడ్జెట్‌లో శ్రీకారం చుట్టారు. ఒక్కొక్కటి వివరంగా చూద్దాం...

### డిజిటల్ లైబ్రరీ

పుస్తకం హస్తభూషణమన్న పాత పాటకు పాతరేసి.. పుస్తకాలను ఇప్పుడు డిజిటల్ రూపంలో అందించేందుకు ప్రయత్నం మొదలైంది. జాతీయ స్థాయిలో అన్ని భాషల్లో, ప్రాంతాల్లో స్థాయిల్లోనూ యువతీ యువకులకు, బాలబాలికలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన పుస్తకాలను ఈ డిజిటల్ లైబ్రరీ ద్వారా అందించనున్నారు. కోవిడ్ కారణంగా చదువుల్లో డిజిటల్ టెక్నాలజీ అవసరం పెరిగిపోయిన నేపథ్యంలో ఈ లైబ్రరీ ఏర్పాటు కానుండటం విశేషం. స్మార్ట్ ఫోన్లు మొదలుకొని, డెస్క్‌టాప్‌ల వరకూ అన్నింటి ద్వారా ఈ లైబ్రరీ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదే సమయంలో రాష్ట్రాల్లో పంచాయితీల స్థాయిలో భౌతిక గ్రంథాలయాల ఏర్పాటునూ ప్రోత్సహిస్తామని వాటిల్లోనే డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులో ఉండేలా చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

''ఆర్థిక అంశాల్లో అక్షరాస్యత కల్పించేందుకు, పుస్తక పఠనాన్ని అలవాటు చేసేందుకు ఈ లైబ్రరీలు ఉపయోగపడతాయి.''అని సీతారామన్ తెలిపారు. అక్షరాస్యత కార్యక్రమాలను కూడా స్వచ్ఛంద సంస్థల సాయంతో ఈ డిజిటల్ లైబ్రరీ ప్రాజెక్టుకు అనుసంధానిస్తామన్నారు.


**ఐఐటీ ఖరగ్‌పూర్, కేంద్ర విద్యాశాఖ దేశ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 2018లోనే నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఒకదాన్ని స్థాపించింది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన కొత్త గ్రంథాలయం బాలురు, యువకులకు మాత్రమే ఉద్దేశించింది**

### వ్యవసాయానికి డిజిటల్ ప్లాట్‌ఫామ్

ఈ ఏడాది బడ్జెట్‌లో 'వ్యవసాయం'కోసం డిజిటల్ రూపంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. నాణ్యమైన ఇన్‌పుట్స్ (విత్తనాలు, ఎరువులు తదితరాలు) రైతులకు లభించేందుకు మాత్రమే కాకుండా... పండిన పంటకు జరిగే నష్టాలను నివారించేందుకు అవకాశాలు మెరుగు అవుతాయి. తగిన సమాచారం అందుబాటులో లేని కారణంగా రుణాలిచ్చేందుకు తటపటాయించే బ్యాంకులు కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా రైతులకు అవసరమైనంత స్థాయిలో రుణాలు ఇచ్చే పరిస్థితి వస్తుంది. పంటల ఆరోగ్యంపై, ఇన్‌పుట్‌ల ఖర్చు, నేల సారం, ధరలు, ఉత్పత్తుల నాణ్యత వంటి అనేక అంశాల సమాచారం ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా బ్యాంకర్లకు అందుతుందని అంచనా. వీటి ద్వారా రైతుల రుణ అర్హతలనూ నిర్ణయించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. జన్‌ధన్ ఖాతాలు, డిజిటల్ పేమెంట్ల కారణంగా ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు నేరుగా నగదు రూపంలోనే సాయం అందిస్తున్న విషయం ఇక్కడ చెప్పుకోవాల్సి ఉంటుంది.

**రైతులకు ఉపయోగపడే అనేక ప్లాట్‌ఫామ్‌లు ఇప్పటికే కొన్ని కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి విజయవంతంగా నడుపుతున్నాయి. ఐటీసీ 'ఈ-చౌపాల్' 'దేహాత్', 'ఆర్య', 'రేష మండి', 'అనిమాల్.ఇన్', 'ఆక్వా-కనెక్ట్' వంటివి మరికొన్ని కూడా ఉన్నాయి. కేంద్రం వీటిలోని మేలి అంశాల మేళవింపుగా కొత్త ప్లాట్‌ఫామ్‌ను రూపొందించవచ్చు.**

### దేశం కోసం.. దేశంలోనే... కృత్రిమ మేధ



కృత్రిమ మేధ వినియోగాన్ని మరింత విస్తృతం చేసేందుకు దేశంలో మూడు అత్యున్నత నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలు మూడింటిలో వీటి ఏర్పాటు జరుగుతుంది. వ్యవసాయం, ఆరోగ్యం, సస్టెయినబుల్ సిటీస్ రంగాల్లో పరిశోధనలు తద్వారా ఆయా రంగాల్లోని సమస్యలకు అత్యాధునిక టెక్నాలజీ పరిష్కారాలు కనుక్కునేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయి. ఇందుకు పరిశ్రమ వర్గాలు తమవంతు తోడ్పాటునందిస్తాయి. ''కృత్రిమ మేధ రంగంలో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు, దేశంలో సమర్థమైన కృత్రిమ మేధ వ్యవస్థ ఒకటి ఏర్పాటయ్యేందుకు 'ఈ మూడు కేంద్రాలు ఉపకరిస్తాయి'' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటు వల్ల విద్యార్థులు మరింత ఎక్కువ మంది కృత్రిమ మేధ కోర్సులకు మొగ్గు చూపుతారని, దేశ అభివృద్ధికి మేలు చేస్తుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

**గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీలు కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. గూగూల్‌కు చెందిన 'ఇండియ రీసెర్చ్ ల్యాబ్ కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్‌ల సాయంతో ఆరోగ్య రంగాన్ని మెరుగు పరిచేందుకు ప్రయత్నిస్తోంది. అంతేకాకుండా... ప్రజా ఆరోగ్య రంగం, వన్యప్రాణి సంరక్షణ, వ్యాధుల నివారణ వంటి అనేక అంశాల్లో కృత్రిమ మేధను వాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి.**

### 5జీ కోసం వంద ల్యాబ్‌లు...

డిజిటల్ ఇండియా పథకంలో భాగంగా కేంద్రం గత ఏడాది దేశంలో 5జీ సర్వీసులను మొదలుపెట్టింది. వేగవంతమైన నెట్‌వర్క్‌తోపాటు అనేక ఇతర లాభాలు తెచ్చిపెట్టగల ఈ 5జీ టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకునేందుకు దేశంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో వంద ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి తాజాగా ప్రకటించారు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, ప్రిసిషన్ ఫార్మింగ్, తెలివైన రవాణా వ్యవస్థలతోపాటు ఆరోగ్య రంగంలో ఉపయోగపడే అప్లికేషన్లను తయారు చేయడం వీటి లక్ష్యం. బ్యాంకులు, వివిధ నియంత్రణ సంస్థలు, ఇతర వ్యాపార వర్గాలు కూడా ఈ ల్యాబ్ కార్యకలాపాల ద్వారా లాభపడే అవకాశం ఉంది. దేశంలో ప్రస్తుతం సుమారు 225 ప్రాంతాల్లో ఈ 5జీ టెక్నాలజీ అందుబాటులో ఉంది. 5జీ టెక్నాలజీలపై పరిశోధనలకు గాను ఈ ఏడాది రూ. 5.56 కోట్లు కేటాయించారు. గత ఏడాది ఈ కేటాయింపులు రూ.7.74 కోట్లు.




**టెలి కమ్యూనికేషన్స్, 5జీ టెక్నాలజీల్లో గత ఏడాది డిమాండ్ 33.7 శాతం వరకూ పెరిగింది. 2022-23లోనే ఈ రంగాల్లో 1.3 లక్షల ఉద్యోగాలకు డిమాండ్ ఉండగా... ఏటికేడాదీ ఇది పెరుగుతోంది. 5జీ రంగంలో కొత్తగా ఏర్పాటయ్యే ల్యాబ్‌ల వల్ల యూనివర్సిటీల్లో పరిశోధనలు మరింత ఊపందుకుంటాయి. మరిన్ని ఉద్యోగావకాశాలను సృష్టించనున్నాయి.**

రేపటి తరం కొత్త టెక్నాలజీల్లో దేశ యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఇందులో భాగంగా వివిధ రకాల నైపుణ్యాలను అందించనున్నారు. కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ ఇవ్వడంతోపాటు, శిక్షణ పొందిన వారిని, కంపెనీలను ఒకచోటకు చేర్చడమూ ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా జరుగుతాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకూ ప్రాధాన్యం లభించనుంది.




**స్కిల్ ఇండియా కార్యక్రమం దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 1.0 పేరుతో 2015లో మొదలైన విషయం తెలిసిందే. దాదాపు 20 కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు స్కిల్ ఇండియాలో భాగంగా పలు నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నాయి. అవసరమైన సందర్భాల్లో వాటిని మరింత ఆధునీకరించడం కూడా చేస్తున్నాయి. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 2.0 2017లో, మూడో దఫా 2021లోనూ మొదలయ్యాయి.**

### నైపుణ్యాల వృద్ధికి భారీ ఊతం

నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్‌లో భాగంగా రానున్న మూడేళ్లలో 47 లక్షల మంది యువతకు నేరుగా ఆన్‌లైన్ పద్ధతిలో స్టైఫండ్ అందించనున్నారు.

అంతేకాకుండా.. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0లో భాగంగా కోడింగ్, కృత్రిమ మేధ, మెకట్రానిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, త్రీడీ ప్రింటింగ్ డ్రోన్స్ ఇతర సాఫ్ట్ స్కిల్స్‌ను అందిస్తారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు దేశం మొత్తమ్మీద 30 స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ కేంద్రాల ఏర్పాటు జరుగుతుంది.

### నేషనల్ డేటా గవర్నెన్స్ పాలసీ

ఆర్థిక రంగ సంస్థలకు భారీగా ఉపయోగపడేలా కేంద్రం ఈ ఏడాది నేషనల్ డేటా గవర్నెన్స్ విధానం ఒకదాన్ని తీసుకు రానుంది. ఈ విధానం వల్ల స్టార్టప్ కంపెనీల్లో మరింత అధిక సంఖ్యలో సృజనాత్మక ఆవిష్కరణలు జరుగుతాయని, విద్యా సంస్థల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఇప్పటివరకూ అందుబాటులో లేని సమాచారం డేటా గవర్నెన్స్ పాలసీ కారణంగా నిర్దిష్ట సంస్థలకు అందుబాటులోకి వస్తుందని, వివిధ సంస్థలు 'నో యువర్ కస్టమర్'లేదా కేవైసీ కోసం ఎక్కువ ప్రయాస పడాల్సిన అవసరం లేకుండా పోతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కేవైసీలో భాగంగా అందరూ ఆధార్ వంటి వివరాలు మాత్రమే అడుగుతున్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే కంపెనీలు, బ్యాంకులు తమకు ఎదురయ్యే రిస్క్ ఆధారంగా ఇతర డాక్యుమెంట్లను కూడా కోరవచ్చు లేదా డిజిలాకర్ నుంచి తీసుకోవచ్చు. వ్యక్తులు డిజిలాకర్‌లో ఉంచుకున్న డాక్యుమెంట్లను కూడా అవసరాలకు తగ్గట్టుగా కొన్ని నియంత్రణ, ఆర్థిక సంస్థలకు అందుబాటులోకి తేనున్నారు.



**డిజిలాకర్‌లో ప్రస్తుతం మనం పలు రకాల డాక్యుమెంట్లను స్టోర్ చేసి ఉంచుకోవచ్చు. ఆధార్, పర్మనెంట్ అకౌంట్ నెంబరు (పాన్)లతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హతల డాక్యుమెంట్లను ఇక్కడ నిక్షిప్తం చేసుకోవచ్చు. ఇప్పటివరకూ వీటిని చూడగలిగే అవకాశం కొన్ని సంస్థలకు మాత్రమే ఉండగా... కొత్త డేటా గవర్నెన్స్ పాలసీ కారణంగా మరిన్ని ఎక్కువ సంస్థలు అవసరాన్ని బట్టి చూడగలిగే అవకాశం ఏర్పడుతుంది.**

### డిజిటల్‌కు కేటాయింపుల తగ్గింపు?

ఈ ఏడాది బడ్జెట్‌లో డిజిటల్ ఇండియా కార్యక్రమాలకు మొత్తం రూ.4785 కోట్లు కేటాయించారు. అయితే ఇది గత ఏడాది కేటాయింపుతో పోలిస్తే 37 శాతం తక్కువ. గత ఏడాది మొత్తం రూ.7603.5 కోట్ల కేటాయింపులు డిజిటల్ ఇండియా కార్యక్రమానికి జరిగింది. ముందుగా రూ.10,676 కోట్ల కేటాయింపులు జరిగినా సవరణల తరువాత ఈ మొత్తం తగ్గింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ డిజిటల్ ఇండియా కార్యకలాపాలను చేపడుతుందన్న విషయం తెలిసిందే. ప్రతి పౌరుడికి హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి తీసుకు రావడం, జీవితాంతం పనిచేసే ఐడెంటిటీ (ఆధార్, యూపీఐ, పాన్ వంటివి) అందించడం ఈ డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగం. అలాగే... ప్రభుత్వ సేవలను డిజిటల్ టెక్నాలజీల సాయంతో అందివ్వడం, అన్ని భాషల్లోనూ ఈ టెక్నాలజీ ఫలాలు అందుబాటులో ఉండేలా చేయడం కూడా ఇందులో భాగంగానే చేస్తున్నారు.

### 3 మౌలికం.. పెట్టుబడితో..

దేశ అభివృద్ధి వేగం పుంజుకునేలా భారీగా పెట్టుబడులు పెడతామని.. రోడ్లు, రైల్వే, విమాన, నౌకా రవాణా తదితర మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెడతామని నిర్మల తెలిపారు. బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులకు కేటాయింపులను 10 లక్షల కోట్లకు (గతం కంటే 33% అదనం) పెంచుతున్నామని, ఇది దేశ జీడీపీలో 3.3% శాతానికి సమానమని పేర్కొన్నారు.

### 'చాట్‌జీపీటీ' ఆదర్శ బడ్జెట్ ఎలా ఉండాలి..?

కృత్రిమ మేధ (ఏఐ)తో పనిచేస్తూ మనం అడిగే ప్రశ్నలను అర్థం చేసుకొని టెక్ట్స్ రూపంలో బదులిచ్చే 'చాట్‌జీపీటీ'... ఆదర్శవంతమైన బడ్జెట్‌లో పొందుపరచాల్సిన అంశాలను వివరించింది. అవి ఏమిటంటే..



- విద్య, వైద్యం, మౌలికవసతుల కల్పనలో పెట్టుబడుల పెంపు.
- ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధిపై దృష్టి.
- పన్ను సంస్కరణలు, పన్నుల వ్యవస్థ సరళీకరణ.
- వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి ఊతం.
- వ్యాపారవేత్తలను తయారు చేయగల విధానాల అమలు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ.
- ఆదాయ అసమానత, పేదరిక నిర్మూలన చర్యలు.
- పర్యావరణ పరిరక్షణ, కర్బన ఉద్గారాల తగ్గింపుపై దృష్టి.
- ఆర్థిక వ్యవస్థ ఆధునికీకరణకు సాంకేతిక, డిజిటైజేషన్ రంగంలో పెట్టుబడులు.
- ప్రభుత్వ వ్యయం తగ్గింపు, ద్రవ్య లోటు నియంత్రణ.
- సరళతర వ్యాపార నిర్వహణను మెరుగుపరిచేందుకు సంస్కరణలు.



## చేనేత చీరలో ఆర్థిక మంత్రి..

బెంగళూరు: కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించిన కర్ణాటకకు చెందిన చేనేత చీర అందర్నీ ఆకట్టుకుంది. ముదురు ఎరుపురంగులో ఉన్న సంప్రదాయ కసూతి వర్క్ ఉన్న ఇల్కల్ శారీని ఆమె ధరించారు. ధార్వాడ్ ప్రాంతానికి చెందిన ఈ కసూతి వర్క్ జాగ్రఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ పొందింది. చేతితో చేసే కసూతి ఎంబ్రాయిడరీ వర్క్‌లో సాధారణంగా రథాలు, ఏనుగులు, ఆలయ శిఖరాలు, నెమళ్లు, జింకలు, తామర పువ్వులు ఉంటాయి. నిర్మల ధరించిన చీరపై వీటిలో కొన్ని ఉన్నాయి. 800 గ్రాముల బరువున్న ఈ చీరను ధార్వాడ్ ప్రాంతానికి చెందిన ఆరతి క్రాఫ్ట్స్ రూపొందించింది. గత డిసెంబర్‌లో ఈ చీర కోసం ఆర్డర్ వచ్చిందని, రెండు చీరలు నేసి పంపామని ఆరతి క్రాఫ్ట్స్ యజమాని ఆరతి హిరేమత్ తెలిపారు. అయితే అప్పుడు ఆర్డర్ ఎందుకు ఇచ్చారో తమకు తెలియదని, ఆమె తమ చీర ధరించి బడ్జెట్ ప్రవేశపెట్టడాన్ని టీవీలో చూసి ఎంతో సంతోషించామని చెప్పారు.

## అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ. 5,300 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మేలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్ణాటకకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ 2023–24లో పెద్దపీట వేశారు. ముఖ్యంగా కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వం ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరుతున్న నేపథ్యంలో ఆ ప్రాజెక్టుకు ఏకంగా రూ. 5,300 కోట్ల గ్రాంట్‌ను ప్రకటించారు. ''కర్ణాటకలోని కరువుపీడిత మధ్య ప్రాంతాలను సస్యశ్యామలం చేసే ఎగువ భద్ర ప్రాజెక్టుకు రూ. 5,300 కోట్ల సాయాన్ని అందిస్తాం''అని సీతారామన్ తన ప్రసంగంలో తెలిపారు. తుంగ నది నుంచి 17.40 టీఎంసీల నీటిని భద్ర రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయడంతోపాటు భద్ర జలాశయం నుంచి 29.90 టీఎంసీలను ఎగువ భద్రలోకి ఎత్తిపోయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. నిర్మలా సీతారామన్ ప్రకటనపై కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై హర్షం వ్యక్తం చేశారు. యావత్ కర్ణాటక ప్రజల తరపున కేంద్ర మంత్రికి ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు.



## బడ్జెట్‌లో స్పష్టత ఏదీ?

''కేంద్ర బడ్జెట్ అంశాల్లో స్పష్టత లేదు. వ్యవసాయం అత్యంత ప్రాధాన్య రంగం. రూ.20 లక్షల కోట్ల రుణాలు ఇస్తామన్నా.. రైతులకు ఎలా మేలు చేస్తారో ప్రసంగంలో ప్రస్తావించలేదు. స్థిరాస్తి రంగం దేశ ఆర్థిక వ్యవస్థను ప్రత్యక్షంగా, పరోక్షంగా బలోపేతం చేస్తున్నా ఇప్పటివరకు దాన్ని పరిశ్రమగా గుర్తించలేదు. వార్షిక ఆదాయ వ్యయాల సర్దుబాటుపై స్పష్టత లేదు. వేతన జీవులకు ఆదాయ పరిమితి శ్లాబ్ పెంచి మిగతా అంశాలను విస్మరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రవాణా రంగం మరింత విస్తరించాలి. కొత్త రంగాలను విస్తారిస్తామన్నారే తప్పా దానికి సంబంధించి సంకేతాలిస్తే బాగుండేది. ఒక ఐడియా ప్రకటించి వదిలేశారు. ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యంను అధిగమించేందుకు బడ్జెట్‌లో చర్యలు కనిపించలేదు.''

\- సుధీర్ కిరణ్, మౌలిక వసతుల రంగ నిపుణుడు

## మిషన్ 'గ్రీన్ ఎనర్జీ'

### ఐదు మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యం




న్యూఢిల్లీ: కర్బన ఉద్గారాలను అరికట్టి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు 2030 నాటికి 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 4,000 ఎండబ్ల్యూహెచ్ సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీని ప్రోత్సహిస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ చట్టంలో గ్రీన్ క్రెడిట్ కార్యక్రమాన్ని చేరుస్తామన్నారు. ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి 4వ తేదీన రూ.19,744 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగం, ఎగుమతులను పెంచడంతోపాటు 2030 నాటికి రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించేలా ఈ మిషన్ దోహదం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ హైడ్రోజన్ వినియోగానికి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో కర్బన ఉద్గారాలను అరికట్టే ప్రక్రియ దేశానికి ఇంధన భద్రతతోపాటు ఆర్థిక పురోగతికి ఉపకరిస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది.

## ఆన్‌లైన్ గేమ్స్ సంపాదనపై 30 శాతం టీడీఎస్

### బడ్జెట్‌లో కొత్త ప్రతిపాదన




న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమ్స్‌లో సంపాదించే డబ్బుపై 30 శాతం టీడీఎస్ (మూలం వద్ద పన్ను విధింపు) విధించాలని కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించింది. అలాగే ప్రస్తుతం టీడీఎస్‌లో ఇప్పుడున్న రూ.10వేల పరిమితి (థ్రెషోల్డ్ లిమిట్)ని తొలగించనున్నట్లు చెప్పింది. ఒకవేళ యూజర్ ఖాతా నుంచి డబ్బును ఉపసంహరించకపోతే ఆర్థిక సంవత్సరం చివరిలో ఈ టీడీఎస్ కోత విధిస్తారు. ఇంటర్నెట్ గేమ్స్‌లో గెలుపొందే సంపాదనపై పన్ను విధిస్తామని రెవెన్యూ శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా బడ్జెట్ అనంతరం మీడియాకు వెల్లడించారు. కొన్ని ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు థ్రెషోల్డ్ పరిమితి కన్నా తక్కువున్న డబ్బును యూజర్స్ నుంచి తీసుకుంటున్నట్లు పన్నుల శాఖ దృష్టికి వచ్చిందని, ఈ డబ్బు టీడీఎస్ పరిధిలోకి రావడంలేదని చెప్పారు. దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ బాగా విస్తరించిందని, 2025 నాటికి దేశంలో మొబైల్ గేమింగ్ రంగం నుంచి వచ్చే ఆదాయం 5 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని నంగియా అండర్సన్ ఎల్ఎల్‌పీ భాగస్వామి సుదిన్ సబ్నిస్ చెప్పారు. అందువల్ల ఆన్‌లైన్ గేమింగ్స్ నుంచి వచ్చే మొత్తంపై ఆదాయంపై యూజర్ల నుంచి పన్ను విధించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారన్నారు. ఆన్‌లైన్ గేమింగ్స్‌కు టీడీఎస్‌కు సంబంధించి రెండు సెక్షన్లు 115 బీబీజే, 194 బీఏలను కొత్తగా తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

## ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ అంటే?



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ (ఎల్‌డీజీ)ను అభివృద్ధి చేసేందుకు ఐఐటీల్లో ఒకదానికి ఐదేళ్లపాటు పరిశోధన గ్రాంట్‌ను అందిస్తామని ప్రకటించారు. దేశీయంగా ల్యాబ్ తయారీ వజ్రాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

**ఇంతకీ ఎల్‌డీజీలు అంటే ఏమిటి?**

భూగర్భంలో లభించే వజ్రాలను అచ్చుగుద్దినట్లుగా ల్యాబ్‌లలో నిర్దిష్ట సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కృత్రిమంగా తయారు చేసే వాటినే ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ అంటారు. వీటిని తయారు చేసేందుకు ఎన్నో పద్ధతులు ఉన్నప్పటికీ సాధారణంగా, అత్యంత చౌకగా ఎల్‌డీజీలను అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రత పద్ధతిలో తయారు చేస్తారు. గ్రాఫైట్‌ను 'డైమండ్ సీడ్'గా ఉపయోగిస్తూ దాన్ని 7.30 లక్షల పీఎస్ఐ పీడనానికి, సుమారు 1500 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు గురిచేస్తే భౌతికంగా, రసాయనపరంగా అచ్చం సహజ వజ్రాలను పోలిన వజ్రం ల్యాబ్‌లో తయారవుతుంది. ఎల్‌డీజీలను సాధారణంగా పారిశ్రామిక అవసరాల కోసం యంత్రాలు, పనిముట్లలో ఉపయోగిస్తారు. అయితే సాధారణ వజ్రాల్లాగానే ఎల్‌డీజీలను సైతం మెరుపు కోసం కట్టింగ్, పాలిషింగ్ వంటి ప్రక్రియలకు లోనుచేయాల్సి ఉంటుంది. దీనివల్ల విదేశాల నుంచి ముడి వజ్రాల దిగుమతులను గణనీయంగా తగ్గించుకోవచ్చు. అదే సమయంలో కట్టింగ్, పాలిషింగ్ కోసం దేశీయంగా ఉన్న వజ్రాల పరిశ్రమకు మరింత ఉపాధి కల్పించడం వీలవుతుంది.

## పౌర విమానయాన శాఖకు రూ. 3,113 కోట్లే!

### గత బడ్జెట్‌తో పోలిస్తే సగానికిపైగా కేటాయింపుల్లో కోత



న్యూఢిల్లీ: పౌర విమానయాన శాఖకు గతేడాదితో పోలిస్తే 2023–24 బడ్జెట్‌లో సగానికిపైగా కేటాయింపులు తగ్గాయి. ఎయిర్ ఇండియాకు చెందిన ఆస్తుల కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికల్ 'ఎయిర్‌ఇండియా అసెట్ హోల్డింగ్ లిమిటెడ్'(ఏఐఏహెచ్ఎల్)కు కేటాయింపుల్లో భారీ కోత పెట్టడంతో ఈ శాఖకు మొత్తంమీద రూ. 3,113.36 కోట్ల మేర మాత్రమే కేటాయింపులు లభించాయి. ఇందులో ఏఐఏహెచ్ఎల్‌కు రూ. 1,114.49 కోట్లను కేంద్రం కేటాయించింది. 2022–23 బడ్జెట్‌లో ఏఐఏహెచ్ఎల్‌కు తొలుత రూ. 9,259.91 కోట్లు కేటాయించిన కేంద్రం... ఆ తర్వాత సవరించిన బడ్జెట్ అంచనాల్లో ఆ మొత్తాన్ని రూ. 7,200 కోట్లకు తగ్గించింది. 2022–23 బడ్జెట్‌లో పౌర విమానయాన శాఖకు మొత్తంగా రూ. 10,667 కోట్లు కేటాయించినప్పటికీ సవరించిన బడ్జెట్ అంచనాల్లో దాన్ని రూ. 9,363.70 కోట్లకు పరిమితం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఎయిర్ ఇండియా నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో టాటా గ్రూప్ ఆ సంస్థను గతేడాది జనవరిలో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

**విమానయాన రంగానికి సంబంధించిన ఇతర కేటాయింపులు...**

- ప్రాంతీయ గగనయాన అనుసంధానత కోసం రూ. 1,244.07 కోట్లు
- పౌర విమానయాన డైరెక్టరేట్‌కు రూ. 73 కోట్లు
- పౌర విమానయాన భద్రతా బ్యూరోకు రూ. 309 కోట్లు




**అప్పట్లో..**
1850 తొలినాళ్లలో మన దేశంలో ఇలా ఎడ్లే ఇంజిన్లుగా అప్పటి నేరో గేజ్ రైలును లాగేవి.





**ఆ తర్వాత..**
దేశంలోనే తొలి ప్యాసింజర్ రైలు ఇది. 1853లో బొంబే నుంచి థానే వరకు నడిచింది.



**ఇప్పుడు..**
మన రైల్వేలో సరికొత్త విప్లవానికి పట్టాలు వేసిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఇది. మొదట 2019 ఫిబ్రవరి 15న పట్టాలెక్కింది.


# నిధుల కూ.. చుక్.. చుక్..

- బడ్జెట్‌లో రైల్వేకు రూ. 2.40 లక్షల కోట్లు కేటాయింపు
- పదేళ్ల క్రితం బడ్జెట్‌తో పోల్చితే తొమ్మిది రెట్లు అధికం
- ప్రీమియర్ రైళ్లలో కోచ్‌ల ఆధునీకరణకు ప్రాధాన్యం
- రైళ్ల వేగం పెంచే దిశగా ట్రాక్‌ల పునరుద్ధరణకు భారీగా నిధులు
- కొత్తగా 35 హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైళ్లు

**న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు గతంలో ఎన్నడూ లేనంతగా పెద్దపీట వేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 2.40 లక్షల కోట్లు కేటాయించారు. 2013–14తో పోలిస్తే ఇది తొమ్మిది రెట్లు అధికమని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు తదితర సరుకుల రవాణా కోసం మౌలికవసతుల కల్పనకు 100 కీలక ప్రాజెక్టులు గుర్తించామని నిర్మల చెప్పారు. వీటిని రూ. 75 వేల కోట్ల పెట్టుబడితో ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. దీనిలో రూ. 15 వేల కోట్లు ప్రైవేట్ వర్గాల నుంచి సేకరించనున్నట్లు వెల్లడించారు. ప్రీమియర్ రైళ్లలో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందనే అంచనాతో రాజధాని, శతాబ్ది, దురంతో, హమ్‌సఫర్, తేజస్ వంటి రైళ్లలో 1,000కి పైగా కోచ్‌లను ఆధునీకరించాలని రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఈ కోచ్‌ల లోపలి భాగాల్లో అధునాతన సౌకర్యాల కల్పనతో పాటు వాటిని సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది.

## మరిన్ని వందేభారత్ రైళ్లు..

దేశవ్యాప్తంగా పలు రైళ్ల వేగం పెంచడంతో పాటు మరిన్ని మార్గాల్లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టడం కోసం ట్రాక్‌లను మార్చడానికి పెద్దఎత్తున నిధులు కేటాయించనున్నారు. అయితే వందేభారత్ రైళ్ల కోసం ట్రాక్‌ల ఆధునీకరణకు గత బడ్జెట్ సవరించిన అంచనాల మేరకు రూ. 15,388.05 కోట్లు కేటాయించగా.. ఈ బడ్జెట్‌లో దానిని రూ. 17,296.84 కోట్లుగా ప్రతిపాదించారు. దేశవిదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా మరో 100 విస్టాడోమ్ కోచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని, కొత్తగా 35 హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైళ్లు, నూతన డిజైన్‌తో కూడిన 4,500 ఆటోమొబైల్ క్యారియర్ కోచ్‌లు, 5,000 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, 58,000 వ్యాగన్లు తయారు చేయాలని తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గత ఏడాది(2022–23) బడ్జెట్‌లో రైల్వే శాఖకు మొత్తం 1.4 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో పెట్టుబడి వ్యయం రూ.1.37 లక్షల కోట్లు కాగా.. రూ. 3,267 కోట్లు రెవెన్యూ వ్యయం. కాగా, 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ పేపర్ల అంచనా ప్రకారం నెట్ రెవెన్యూ వ్యయం రూ. 2.65 లక్షల కోట్లుగా ఉంది. అయితే ఇది 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల మేరకు రూ. 2,42,892.77 కోట్లుగా ఉంది.



## నిర్వహణ నష్టాలకు తక్కువగా..

ఈ బడ్జెట్ అంచనాల మేరకు వ్యూహాత్మక మార్గాల్లో నిర్వహణ నష్టాలకు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ. 487.51 కోట్లుగా ఉండగా.. సవరించిన అంచనాల మేరకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.2,461.90కోట్లుగా ఉంది. కాగా, జాతీయ ప్రాజెక్టులకు సంబంధించి మార్కెట్ల నుంచి రుణ సేకరణ సేవలకు ఈ బడ్జెట్‌లో రూ. 780 కోట్లను ప్రతిపాదించారు. ఈ బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయంకోసం మొత్తంరూ. 2,60,200 కోట్లను కేటాయించగా.. ఇందులో రూ 2,40,000 కోట్లు జనరల్ రెవెన్యూ, రూ.2 వేల కోట్లు నిర్భయ ఫండ్, రూ.3వేల కోట్లు అంతర్గత వనరులు, రూ.17వేల కోట్లు బడ్జెట్ వనరులుగా ఉన్నాయి.

## రాబడి ఇలా..

ప్రయాణికులు, సరుకు రవాణా, ఇతర ఖాతాలు, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల నుంచి మొత్తం రాబడిని రూ. 2,65,000 కోట్లుగా ఈ బడ్జెట్‌లో అంచనా వేశారు. ఇది గత బడ్జెట్‌లో సవరించిన అంచనాల ప్రకారం రూ. 2,42,892.77 కోట్లుగా ఉంది. సరుకు రవాణా నుంచి ఆదాయం రూ. 1,79,500 కోట్లుగా ఉంటుందని ఈ బడ్జెట్‌లో పేర్కొన్నారు. అయితే ఇది గత బడ్జెట్‌లో సవరించిన అంచనాల మేరకు రూ. 1,65,000 కోట్లుగా ఉంది. రైలు బండ్ల నిర్మాణానికి గత బడ్జెట్‌లో సవరించిన అంచనాల మేరకు కేటాయింపులు రూ. 15,157.86 కోట్లు కేటాయించగా.. ఈ బడ్జెట్‌లో ఆ నిధులను సుమారు రెట్టింపు చేసి రూ. 37,581 కోట్లుగా ప్రతిపాదించారు.

## మెట్రో ప్రాజెక్టులకు రూ. 19,518 కోట్లు..

దేశ వ్యాప్తంగా మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 19,518 కోట్లు కేటాయించింది. అయితే గత బడ్జెట్‌లో సవరించిన అంచనాల మేరకు మెట్రోలకు రూ. 15,628 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనల్లో ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ రూ. 4,471 కోట్లు, సబార్డినేట్ డెట్ రూ. 1,324 కోట్లు, పాస్‌త్రూ అసిస్టెన్స్ రూ. 13,723 కోట్లుగా ఉంది. నేషనల్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌కు రూ. 3,496 కోట్లు కేటాయించారు.

## ఇక వందే మెట్రో..

పెద్ద నగరాల పరిసరాల్లో నివసించే ప్రజలు రాకపోకలు సాగించేందుకు వందే మెట్రో రైళ్లను రూపొందిస్తున్నామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. వందే మెట్రో రైళ్లు.. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మినీ రూపమన్నారు. ఈ ఏడాది వీటి డిజైన్, తయారీ పూర్తవుతుందన్నారు. ఇక పూర్తి దేశీయంగా రూపొందించిన తొలి హైడ్రోజన్ ఇంధన రైలును ఈ ఏడాది డిసెంబర్ నాటికి ప్రవేశపెడతామన్నారు.



## 4 సృజనాత్మకత వెలికితీత

విద్య, స్టార్టప్స్ రంగాల్లో క్షేత్రస్థాయి నుంచి సృజనాత్మకత, సామర్థ్యాలను వెలికితీసి.. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు చర్యలు చేపడతామని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. కార్మిక, విద్య, స్టార్టప్స్ (పారిశ్రామిక) రంగాల్లో అడ్డంకులను తొలగించడం.. అవసరమైన డేటాను అందుబాటులో ఉంచడం.. ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు.

## బడ్జెట్ అలా వచ్చింది..
### ఇలా రంగు మారింది..

రాబడి, ఖర్చుల లెక్కను బడ్జెట్ అని పిలుస్తున్నా.. ఆ పదం పుట్టుక మాత్రం లెక్కల నుంచి రాలేదు. 'బొగెట్టె'అనే ఫ్రెంచ్ పదం నుంచి బడ్జెట్ పుట్టింది. దీని అర్థం ఓ చిన్న సంచీ. అప్పట్లో బ్రిటీష్ ఆర్థిక మంత్రులు చిన్న తోలు సంచీలో ఆదాయ, వ్యయాల పత్రాలను తీసుకెళ్లి.. పార్లమెంటుకు సమర్పించేవారు. తర్వాత ఇదే బడ్జెట్‌గా మారిపోయింది.



- ఇక మన దేశంలో ఆర్థిక మంత్రులు నల్లటి రంగులో ఉన్న సూట్‌కేసులో బడ్జెట్ పత్రాలను పార్లమెంటుకు తీసుకెళ్లేవారు. పార్లమెంట్ భవనం ముందు దానిని చూపుతూ ఫొటోలకు పోజిచ్చేవారు. అయితే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సాంప్రదాయాన్ని మార్చేశారు. ఎర్రటి రంగులో వస్త్రంతో తయారు చేసిన సంచీలో బడ్జెట్ పత్రాలను తీసుకెళ్లారు. ఈ సంచీని 'బహీ ఖాతా'గా పిలుస్తారు.

## హల్వా చేసి..
### బందీ అయి..

ఏటా బడ్జెట్‌కు ముందు ఆర్థిక మంత్రి, ఆ శాఖ అధికారులు కలసి హల్వా తయారు చేయడం సంప్రదాయం. అప్పటిదాకా శాఖలు, విభాగాల వారీగా విడివిడిగా ప్రతిపాదనల్లా రూపొందించిన ఆదాయ, వ్యయాలన్నీ.. ఒక్క దగ్గర బడ్జెట్ రూపంలో ముద్రించడం మొదలయ్యేదీ దీని తర్వాతే. బ్రిటిష్‌వారి హయాంలో మొదలైన ఈ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది.



- హల్వా అయిందంటే.. బడ్జెట్ రూపకల్పనతో సంబంధమున్న అధికారులు, సిబ్బంది చాలా వరకు 'బందీ'అయి పోయినట్టే. బడ్జెట్ పత్రాల ముద్రణ పూర్తయి, పార్లమెంట్‌కు చేరేదాకా వారంతా నార్త్ బ్లాక్‌లోని బేస్‌మెంట్‌లో ఉన్న ప్రత్యేక గదుల్లో ఉండిపోవాల్సిందే. బయటికి వెళ్లనివ్వరు, ఫోన్లు ఉపయోగించడానికీ అవకాశం ఉండదు. బడ్జెట్ లీక్ అవకుండా ఉండేందుకే ఈ జాగ్రత్తలు పాటిస్తారు.
- అప్పట్లో బడ్జెట్ పత్రాలు భారీగా ముద్రించాల్సి ఉండటంతో రెండు వారాల పాటు అధికారులు, సిబ్బంది నార్త్‌బ్లాక్‌లో ఉండిపోవాల్సి వచ్చేది. ఇప్పుడు డిజిటల్ వినియోగంతో కేవలం ఐదు రోజుల పాటు ఉంటున్నారు.



## సహకార సంఘాలను గుర్తించేందుకే డేటాబేస్
### నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉన్న వివిధ సహకార సంఘాలను గుర్తించేందుకే జాతీయ సహకార డేటాబేస్‌ను తయారు చేస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం తెలిపారు. సహకార సంఘాల కోసం ప్రతిపాదిత జాతీయ విధానం అమలుకు ఈ చర్య దోహదపడుతుందని చెప్పారు. ఎన్‌సీయూఐ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 8.6 లక్షల సహకార సంఘాలు ఉండగా వాటిలో సుమారు 63 వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయన్నారు. ఈసారి వ్యవసాయ రుణ లక్ష్యాన్ని రూ. 20 లక్షల కోట్లకు పెంచినట్లు నిర్మలా సీతారామన్ వివరించారు. ప్రధానంగా పశుసంవర్ధక, పాడి, మత్స్య రంగాలకు రుణాలపై అధిక దృష్టిపెట్టామన్నారు.

## క్రీడా శాఖకు అదనంగా రూ.700 కోట్లు



**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడలు, 2024లో ప్యారిస్ ఒలంపిక్స్‌కు ఆటగాళ్లను సంసిద్ధులను చేయాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం క్రీడాశాఖకు రూ.3,397.32 కోట్లను కేటాయించింది. మునుపటిబడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఇది రూ.723.97 కోట్లు అదనం. గత 2022–23 బడ్జెట్‌లో క్రీడలకు వాస్తవ కేటాయింపులు రూ.3,062.60 కోట్లు కాగా, రివైజ్డ్ బడ్జెట్‌లో రూ.2,673.35 కోట్లిచ్చింది. చైనాలో 2022 సెప్టెంబర్‌లో జరగాల్సిన ఆసియా క్రీడలు కోవిడ్ తీవ్రత కారణంగా వాయిదా పడ్డాయి. ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్ నెలల్లో ఇవి జరగాల్సి ఉంది. క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఖేలో ఇండియా'కు ఈసారి రూ.1,045 కోట్లు ప్రత్యేకించింది. గత రివైజ్డ్ బడ్జెట్‌లో ఖేలో ఇండియాకు కేటాయించింది రూ.606 కోట్లే. భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్)కి కూడా రూ.785.52 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్ కేటాయింపుల కంటే ఇది రూ.36.09 కోట్లెక్కువ. అదేవిధంగా, నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్(ఎన్‌ఎస్‌ఎఫ్)లకు కూడా గతంలో కంటే రూ.45 కోట్లు ఎక్కువగా అంటే రూ.325 కోట్లు కేటాయించింది. వరల్డ్ యాంటీ–డోపింగ్ ఏజెన్సీ(వాడా)కి అనుబంధంగా ఉండే నేషనల్ యాంటీ–డోపింగ్ ఏజెన్సీ(నాడా)కి, నేషనల్ డోప్ టెస్టింగ్ ల్యాబొరేటరీ(ఎన్‌డీటీఎల్)లకు గతంలో సాయ్‌తోపాటే నిధులు కేటాయించేవారు. ఈసారి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నాడాకు రూ.21.73 కోట్లు, ఎన్‌డీటీఎల్‌కు రూ.19.50 కోట్లు కేటాయించింది. పలు దేశాలు క్రీడాకారులకు నైపుణ్యం, శాస్త్రీయ శిక్షణపై ఎక్కువ శ్రద్ధ చూపడాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నేషనల్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ రీసెర్చ్ కోసం వేరుగా రూ.13 కోట్లు కేటాయించింది.

## జమ్మూకశ్మీర్‌కు రూ.35,581 కోట్ల కేంద్ర సాయం..



**న్యూఢిల్లీ:** వార్షిక బడ్జెట్‌లో కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌కు రూ.35,581.44 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కశ్మీర్‌కు కేటాయించింది రూ.34,704.46 కోట్లు. తాజా కేటాయింపుల్లో అత్యధికం రూ.33,923 కోట్లు కేంద్ర సాయం (సెంట్రల్ అసిస్టెన్స్) రూపంలోనే ఉండటం గమనార్హం. ఈ నిధులను 2014 వరదల్లో దెబ్బతిన్న మౌళిక వనరులను పునరుద్ధరించేందుకు, ముఖ్యంగా దాల్–నగీన్ సరస్సు పరిరక్షణ, పునరుద్ధరణ కోసం వెచ్చించాల్సి ఉంటుంది. ఇంకా, 624 మెగావాట్ల కిరు జలవిద్యుత్ ప్రాజెక్టు, 800 మెగావాట్ల రాటిల్ జల విద్యుత్ ప్రాజెక్టు, 540 మెగావాట్ల క్వార్ జల విద్యుత్ ప్రాజెక్టులకు ఈక్విటీగా ఖర్చు చేస్తారు. అండమాన్ నికోబార్ దీవులకు గత బడ్జెట్‌లో రూ.5,508.05 కోట్లు కేటాయించగా ఈసారి రూ.5,987.14 కోట్లు కేటాయించారు. మరో కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌కు గత బడ్జెట్‌లో రూ.5,131.12 కోట్లు ఇవ్వగా ఈసారి రూ.5,436.10 కోట్లు కేటాయించారు. అలాగే, దాద్రానగర్ హవేలీకి రూ.2,475 కోట్లు, లద్దాఖ్‌కు రూ.5,958 కోట్లు, లక్షద్వీప్‌కు రూ.1,394 కోట్లు, ఢిల్లీకి రూ.1,168.01 కోట్లు, పుదుచ్చేరికి రూ.3,117.77 కోట్లు కేటాయించారు.

## రెవెన్యూ అంతరాన్ని పూడ్చేందుకు... రూ.15.4 లక్షల కోట్ల రుణాలు

- సెక్యూరిటీల ద్వారా 11.8 లక్షల కోట్లు
- ఇతరత్రా మిగతా మొత్తం: విత్త మంత్రి

**న్యూఢిల్లీ:** 2023–24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ అంతరాన్ని పూడ్చుకునేందుకు డేటెడ్ సెక్యూరిటీల ద్వారా ఏకంగా రూ.15.4 లక్షల కోట్ల మేరకు రుణాలు సేకరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఈ లక్ష్యం రూ.14.21 లక్షల కోట్లు. కాగా జనవరి నాటికి అందులో 91 శాతం, అంటే రూ.12.93 లక్షల కోట్లు సేకరించగలిగారు. 2023- 24లో రూ.11.8 కోట్ల నికర మార్కెట్ రుణాలను ఆశిస్తున్నట్టు విత్త మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. మిగతా మొత్తాలను చిన్న మొత్తాల పొదుపు తదితర మార్గాల ద్వారా సమకూర్చుకుంటామన్నారు. రుణాలు పోను ఈసారి రూ.27.2 లక్షల కోట్ల రాబడిని, రూ. 45 లక్షల కోట్ల వ్యయాన్ని అంచనా వేస్తున్నాం. నికర పన్ను వసూళ్ల అంచనా రూ.23.3 లక్షల కోట్లు''అని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి రుణగ్రస్తత వార్షిక స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఏకంగా 83 శాతానికి సమానం!



లోక్‌సభలో ఆర్థికమంత్రి ప్రసంగాన్ని సావధానంగా వింటున్న సభ్యులు సోనియా గాంధీ, అధీర్ రంజన్, సుప్రియా సూలే, ఎ.రాజా, కనిమొళి, శశిథరూర్ తదితరులు



బడ్జెట్ పత్రాల కాపీలను పార్లమెంట్‌కు తీసుకొస్తున్న దృశ్యం



## ఇన్‌ఫ్రాకు ఇతోధికంగా..

- ఏకంగా రూ.10 లక్షల కోట్లు..
- మూలధన పద్దు కింద కేటాయింపులు
- ఇవి గతం కంటే 33% ఎక్కువ

**పోర్టులు, పరిశ్రమలకు అత్యుత్తమ కనెక్టివిటీ**
**ఇందుకు 100 కీలక రవాణా ప్రాజెక్టులు**
**దీనికి రూ.75,000 కోట్ల కేటాయింపులు**

**న్యూఢిల్లీ:** మౌలిక సదుపాయాల అభివృద్ధికి బడ్జెట్ పెద్దపీట వేసింది. ఇందుకోసం మూలధన వ్యయ పద్దు కింద కేటాయింపులను ఏకంగా రూ.10 లక్షల కోట్లకు పెంచారు. గత కేటాయింపుల కంటే ఇది 33 శాతం ఎక్కువ! అంతేగాక మొత్తం జీడీపీలో ఇది 3.3 శాతం!! 2019–20 కేటాయింపులతో పోలిస్తే దాదాపుగా మూడు రెట్లు ఎక్కువ!!! ఈ కేటాయింపులను పెంచడం వరుసగా ఇది మూడో ఏడాది. ఈసారి బడ్జెట్ కేటాయింపులకు అదనంగా ప్రైవేటు పెట్టుబడులను కూడా సేకరిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ''కొత్తగా ఏర్పాటు చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ సెక్రటేరియట్ ఇందుకు తోడ్పడుతుంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి మాస్టర్ లిస్టును నిపుణుల కమిటీ మదింపు చేసి వేటిని ఏ క్రమంలో చేపట్టాలో సిఫార్సు చేస్తుంది''అని ప్రకటించారు. ఆమె ఇంకా ఏం చెప్పారంటే...

- బొగ్గు, ఉక్కు, ఎరువులు, ఆహార ధాన్యాల వంటి రంగాలకు చెందిన పరిశ్రమలు, పోర్టులకు పూర్తిస్థాయి అత్యుత్తమ కనెక్టివిటీ కల్పిస్తాం. ఇందుకోసం 100 కీలక రవాణా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టనున్నాం. దీనికి రూ.75,000 కోట్లు కేటాయిస్తున్నాం. రూ.15,000 కోట్లు ప్రైవేటు నుంచి సేకరిస్తాం.
- మౌలిక సదుపాయాలు, ఉత్పాదన సామర్థ్య రంగాలపై పెట్టుబడులు వృద్ధి, ఉద్యోగ కల్పనను ఎన్నో రకాలుగా ప్రభావితం చేయగలవు. అందుకే పెట్టుబడులు, ఉపాధి కల్పన క్రమాన్ని మరోసారి వేగవంతం చేసే చర్యలకు బడ్జెట్‌లో పెద్దపీట వేస్తున్నాం. కరోనా కారణంగా కొంత కాలం మందగించిన పెట్టుబడులు మళ్లీ పుంజుకుంటుండటం శుభ పరిణామం.

## ఇప్పటికే పీఎం గతి శక్తి..

లాజిస్టిక్ వ్యయాలను తగ్గించేందుకు ఉద్దేశించిన జాతీయ సమీకృత మౌలికాభివృద్ధి మాస్టర్ ప్లాన్ 'పీఎం గతి శక్తి'ని 2021 అక్టోబర్లో ప్రధాని మోదీ ప్రారంభించడం తెలిసిందే. ఇందులో భాగంగా రూ.500 కోట్లకు మించిన అనుసంధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులన్నీ నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్‌పీజీ) ద్వారా సాగుతాయి. రవాణా, కనెక్టివిటీ సంబంధిత మౌలిక సదుపాయాల కల్పనలో కొత్త యుగానికి తెరతీసేలా బడ్జెట్ ఉందంటూ ఉపరితల రవాణా, హైవే శాఖల మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. హైవే రంగానికి బడ్జెట్లో రూ.27 లక్షల కోట్లు కేటాయించడం ముదావహమన్నారు.

# ద్రవ్యలోటు అదుపులోనే..

## 2023-24లో 5.9 శాతం కుదింపు లక్ష్యం

ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటును కట్టడి చేస్తామని నిర్మల ప్రకటించారు. ప్రస్తుత 2022–23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం మేరకు ద్రవ్యలోటును 6.4% వద్ద (స్థూల దేశీయోత్పత్తి విలువలో పోల్చి- విలువలో రూ.16,61,196 కోట్లు)) నిలువరించగలుగుతున్నట్లు తెలిపారు. అదే విధంగా రానున్న ఆర్థిక సంవత్సరంలో (2023–24) దీనిని మరింతగా 5.9%కు తగ్గించాలని తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 2025–26 ఆర్థిక ఏడాదికి ద్రవ్యోలోటును 4.5 శాతానికి తగ్గించడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కాగా, గడచిన ఆర్థిక సంవత్సరం 2021–22లో ద్రవ్యలోటు తొలి అంచనా 6.8%కాగా, దీనిని తాజాగా 6.9 శాతానికి (రూ.15,06,812 కోట్ల నుంచి రూ.15,91,089 కోట్లు) సవరించడం జరిగింది.

### రూ.23.3 లక్షల కోట్ల నికర పన్ను వసూళ్ల అంచనా..

బడ్జెట్ ప్రకారం 2023–24లో కేంద్రానికి రాబడులు రూ.27.2 లక్షల కోట్లు. ఇందులో నికర పన్ను రాబడులు రూ.23.3 లక్షల కోట్లు. డేటెడ్ సెక్యూరిటీల నుంచి నికర మార్కెట్ రుణాలను రూ.11.8 లక్షల కోట్లు. స్థూలంగా ఈ విలువ రూ.15.43 లక్షల కోట్లుగా ఉంది. ఇక వ్యయ అంచనా రూ.45 లక్షల కోట్లు. ఇదిలావుండగా, రాష్ట్రాలవిషయంలో ద్రవ్యలోటును జీడీపీలో 3.5%గా అంచనావేయడం జరిగింది. ఇందులో విద్యుత్ రంగం సంస్కరణలకు సంబంధించి ఆ రంగానికి 0.5 శాతాన్ని అనుమతించడం జరుగుతుంది. కాగా, పరోక్ష పన్ను ప్రతిపాదనలు గ్రీన్ మొబిలిటీ ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) పెంచుతాయని ఆర్థిక మంత్రి చెప్పారు.

### మహిళలకు కొత్త పొదుపు పథకం..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ పేరుతో రెండేళ్ల కాలానికి మహిళలకు కొత్త పొదుపు పథకాన్ని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2025 వరకూ ఉద్దేశించిన ఈ పథకం గరిష్ఠ డిపాజిట్ పరిమితి రూ. 2 లక్షలు. వడ్డీ రేటు 7.5 శాతం.

### రాష్ట్రాలకు మరో ఏడాది '50 ఏళ్లరుణాలు'

రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను కేంద్రం మరో ఏడాది కొనసాగించనుంది. ఈ రుణాలను 2023-24లోపు మూలధన వ్యయంపై ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆర్థికమంత్రి తెలిపారు.

### ఇన్‌ఫ్రా ఫైనాన్స్ సెక్రటేరియట్‌తో భారీ పెట్టుబడులు..

కొత్తగా ఏర్పాటు చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ సెక్రటేరియట్ ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో సహకరిస్తుందని నిర్మల అన్నారు. అమృత్ కాల్‌కు అనువైన మౌలిక సదుపాయాల వర్గీకరణ, ఫైనాన్సింగ్ ఫ్రేమ్‌వర్క్ చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి 33% పెంపుతో రూ.10 లక్షల కోట్లకు పెంచిన మూలధన వ్యయం జీడీపీలో 3.3%గా ఉందన్నారు.


### పోస్టాఫీస్ డిపాజిట్ పథకం పరిమితి రెట్టింపు

పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ డిపాజిట్ పథకం పరిమితిని వ్యక్తిగతంగా ప్రస్తుత 4.5 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచడం జరిగింది. జాయింట్ అకౌంట్‌కు సంబంధించి ఈ పరిమితిని రూ.9 లక్షల నుంచి రూ.15 లక్షలకు రెట్టింపు చేయనున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు.





## ప్రపంచంలో 32 శాతం మధ్య తరగతే..

అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో మెల్లగా మధ్య తరగతి ప్రజల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. ఒకప్పుడు పేదలుగా ఉన్నవారు పరిస్థితులు మెరుగుపడిన కొద్దీ మధ్య తరగతికి మారుతున్నారు. అందులో వ్యాపారం, ఉన్నత ఉద్యోగం వంటివి కలిసివచ్చినవారు ఎగువ మధ్య తరగతికి, ధనిక కేటగిరీకి మారుతున్నారు. 2021 మార్చి నాటికి ప్రపంచవ్యాప్తంగా 32 శాతం మంది మధ్య తరగతి కేటగిరీలో ఉన్నట్టు 189 దేశాల్లో ప్యూ రీసెర్చ్ సంస్థ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఇందులో 17 శాతం మధ్య తరగతికాగా.. మరో 15శాతం ఎగువ మధ్య తరగతిగా ఉన్నారు.




ఏదైనా సరే.. ప్రభుత్వాలు పేదలు, మధ్య తరగతి వారిపై పన్నులను బాగా తగ్గించాలి. నాలాంటి అత్యంత సంపన్నులు ఎక్కువ పన్నులు కట్టాలనేది నా అభిప్రాయం. ఎగువ మధ్య తరగతివారిపైనా పన్నులు తగ్గించడం మంచిది.



వారెన్ బఫెట్, పెట్టుబడిదారు

# మధ్యతరగతికి అత్తెసరే!

## బడ్జెట్‌లో కుటుంబానికి ఒరిగిందిదే..!

కేంద్ర బడ్జెట్ మీద గంపెడాశలు పెట్టుకున్న ఓ సగటు మధ్య తరగతి కుటుంబానికి దక్కింది చాలా తక్కువే. ఒకట్రెండు హామీలు తప్పితే మిగతావన్నీ చేదుగుళికలే. "నేనూ మధ్యతరగతి వ్యక్తినే. ఈ వర్గం ప్రజలపై ఉండే ఒత్తిళ్లు నాకూ తెలుసు. వాటిని అర్థం చేసుకోగలను" అని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలతో బడ్జెట్‌లో మిడిల్ క్లాస్ మెలోడీస్ విని పిస్తాయని అందరూ అనుకున్నారు. తీరా చూస్తే ఆదాయ పన్ను మినహాయింపు, కాసింత సేవింగ్స్, కూసింత ఎంటర్‌టైన్‌మెంట్ తప్ప మిగిలిన వాటిల్లో నిరాశే మిగిలింది. – సాక్షి, నేషనల్ డెస్క్



### ఉద్యోగి



→ కరోనా తర్వాత బతుకు భారమైపోయింది. ఆదాయాన్ని మించిపోయేలా ఖర్చులు తడిసిమోపెడయ్యాయి. సగటు వేతన జీవి ఆదాయ పన్ను పరిమితివైపే ఆశగా చూశాడు. ఈ విషయంలో కాస్తో కూస్తో ఊరట కలిగింది. ఏడాదికి రూ.7 లక్షలు అంటే నెలకి రూ.60 వేల సంపాదన ఉన్నవారు ఆదాయ పన్ను కట్టాల్సిన పని లేదు. ఈ కొత్త బడ్జెట్ ద్వారా వారికి నెలకి రూ.2800 వరకు మిగులుతుంది. పెరిగిపోతున్న ధరాభారానికి అదేమంత పెద్ద మొత్తం కాదని అందరూ పెదవి విరుస్తున్నారు. ఒక కుటుంబం కొనుగోలు శక్తిని మరింత పెంచకుండా దేశ ఆర్థిక వృద్ధి రేటుపై మోయలేని లక్ష్యాలు పెట్టుకొని ఏం ప్రయోజనమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

### మహిళ



→ ఆదాయాన్ని పొదుపుగా వాడుకుంటూ ఇల్లు నడిపే మహిళల కోసం ప్రకటించిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ ఒక వరం. బ్యాంకుల్లో వడ్డీ రేట్లు నానాటికీ తీసికట్టుగా మారిపోతున్న నేపథ్యంలో మహిళలకి 7.5% స్థిర వడ్డీరేటుని కల్పిస్తారు. ఈ సర్టిఫికెట్ కింద రెండు లక్షల వరకు డిపాజిట్ చేసే అవకాశం ఉంది. ఆర్థిక కష్టాలు వస్తే బంగారం ఆదుకుంటుందన్న నమ్మకం బడ్జెట్‌లో గల్లంతైంది. గోల్డ్ బార్స్ దిగుమతి సుంకాన్ని 12.5 శాతానికి పెంచడంతో బంగారం ధరలు భారీగా పెరిగాయి. బడ్జెట్ ప్రసంగం పూర్తయిన వెంటనే 10 గ్రాముల బంగారం రూ. 58 వేలకి చేరుకోవడం మహిళలకి షాక్ తగిలినట్టైంది.

### సీనియర్ సిటిజన్



→సీనియర్ సిటిజన్లకి నిర్మలా సీతారామన్ గుడ్ న్యూస్ చెప్పారు. సీనియర్ సిటిజన్ల సేవింగ్స్ స్కీమ్ పరిమితిని ఒకేసారి రెట్టింపు చేస్తూ నిర్ణయం ప్రకటించారు. సీనియర్ సిటిజన్లు తమ పేరు మీద ఇన్నాళ్లూ రూ.15 లక్షల డిపాజిట్లు చేసుకోవచ్చు. ఇప్పుడు దానిని రూ.30 లక్షలకు పెంచారు. కరోనా సమయంలో రైలు ప్రయాణంలో సీనియర్ సిటిజన్లకి 50శాతం కన్సెషన్ ఉండేది. దానిని ఎత్తేస్తారని ఆశగా ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైంది. నిర్మలక్క ఆ ఊసు కూడా ఎత్తలేదు.

### విద్యార్థి



→ కోవిడ్–19 చదువుల్ని చావు దెబ్బ తీసింది. బడిముఖం చూడకుండా ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లలో పాఠాలు విన్న పిల్లలు చదువుల్లో కొన్నేళ్లు వెనకబడిపోయారు. 2012 నాటి స్థాయికి చదువులు పడిపోయాయని సర్వేలు ఘోషిస్తున్నాయి. ఈ సారి బడ్జెట్‌లో ఎన్నడూ లేని విధంగా రూ.1.12 లక్షల కోట్లు కేటాయించారు. పాఠశాల విద్యకి 8 శాతం నిధులు పెరిగినా పిల్లల్ని బడి బాట పట్టించే చర్యలు శూన్యం. నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తాననడం కంటితుడుపు చర్యగా మారింది.

### నిరుద్యోగి



→ ఇది లే ఆఫ్‌ల కాలం. పని సగంలో ఉండగా మీ సేవలు ఇంక చాలు అంటూ పింక్ స్లిప్ చేతికిచ్చి ఇంటికి పంపేస్తున్నారు. దీంతో నిరుద్యోగ యువతకి ఉద్యోగాల కల్పనకి అవసరమైన కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సారి బడ్జెట్ సప్తరుషుల్లో ఒకటిగా యువశక్తికి పెద్ద పీట వేసింది. యువతలో నైపుణ్యం పెంచడానికి ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) 4.0 ప్రారంభించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్, 3డీ ప్రింటింగ్, డ్రోన్లు వంటి వాటిలో శిక్షణ ఇస్తుంది. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 38,800 ఉపాధ్యాయులను నియమించనుంది. టూరిజం రంగంలో ఉద్యోగాల కోసం యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపడతామని చెప్పినా ఎన్ని కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న దానిపై స్పష్టత లేదు.

### సొంతిల్లు



→ సొంతిల్లు అనేది మధ్య తరగతికి కల. ఏదున్నా లేకున్నా తల దాచుకోవడానికి ఒక గూడు ఉండాలని అనుకుంటారు. ఈ మధ్య కాలంలో ఆర్‌బీఐ రెపో రేట్లు సవరించిన ప్రతీసారి గృహ రుణాల వడ్డీ రేటు పెరిగిపోతూనే ఉన్నాయి. ఈ సారి బడ్జెట్‌లో వడ్డీ రేట్లు తగ్గింపు వంటి వాటిపై ఏమైనా ప్రకటనలుంటాయేమోనని, ఆదాయ పన్ను మినహాయింపులో గృహ రుణాలు తీసుకున్న వారి పరిమితిని పెంచుతారని ఆశపడ్డారు. కానీ ఆర్థిక మంత్రి ఆ ఊసే ఎత్తలేదు. అయితే నిరుపేదల కోసం నిర్మించే ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకానికి 66% నిధుల్ని పెంచుతూ మొత్తంగా 79 వేల కోట్లు కేటాయించారు.

### ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్



→ ఇవాళ రేపు ఎవరింట్లో చూసినా ఎవరి తీరాన వారు మొబైల్ ఫోన్లలో తలదూర్చేస్తున్నారు. వాట్సాప్‌లోనే పలకరింపు, ముచ్చట్లు కలబోసుకుంటున్నారు. వినోదమైనా, విజ్ఞానమైనా అంతా మన అరచేతిలోనే. ఇప్పుడు ఆ మొబైల్ ధరలైతే తగ్గనున్నాయి. టీవీలు, మొబైల్ ఫోన్లలో వాడే విడిభాగాలపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించడంతో టీవీ, మొబైల్ రేట్లు తగ్గుతాయి. ఇవి తగ్గుతాయి బానే ఉంది కానీ, వినోదం కోసం బయట సినిమాకి వెళ్లారంటే ఇక్కడ మిగిలింది కాస్త అక్కడ ఖర్చైపోతుంది. మొత్తంగా లెవలైపోతుంది. హాళ్లికీ హాళ్లి సున్నాకి సున్నా. ఫ్యామిలీ పార్టీల్లో బ్రాండెడ్ దుస్తులు వేసుకోవాలన్నా మధ్యతరగతికి ఇప్పుడు అది భారమైపోయింది.



**5** ఆర్థిక రంగానికి ఊతమిస్తూ..

దేశంలో ఆర్థిక రంగానికి ఊతం ఇవ్వడం ద్వారా వృద్ధిరేటు పెరగడానికి, అభివృద్ధికి మార్గం వేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పలు పథకాలను అమలు చేస్తామన్నారు. ఇందుకోసం కార్పస్ ఫండ్ కింద బడ్జెట్‌లో రూ.9 వేల కోట్లను కేటాయిస్తున్నట్టు తెలిపారు.

## పోస్టల్, టెలికామ్‌కు
### రూ. 1.23 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: పోస్టల్, టెలికామ్ ప్రాజెక్టులకు 2023–24 కేంద్ర బడ్జెట్‌లో రూ. 1.23 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో టెలికాం ప్రాజెక్టులకు మొత్తం రూ. 97,579.05 కోట్లు కేటాయించగా.. పోస్టల్ ప్రాజెక్టులకు రూ. 25,814 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో పోస్టు పేమెంట్స్ బ్యాంకు కోసం రూ. 250 కోట్లు కేపిటల్ ఇన్ఫ్యూజన్‌గా పేర్కొన్నారు. అలాగే 5జీ సేవలందించడానికి సిద్ధమవుతున్న బీఎస్‌ఎన్‌ఎల్‌కు రూ. 52,937 కోట్లు కేపిటల్ ఇన్ఫ్యూజన్‌గా ప్రతిపాదించారు. డిఫెన్స్ సర్వీసెస్‌కు ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఆధారిత నెట్‌వర్క్ కోసం రూ. 2,158 కోట్లు కేటాయించారు. ఈశాన్య రాష్ట్రాల్లో టెలికాం సేవల ప్రాజెక్టుల కోసం రూ. 715.8 కోట్లు ప్రతిపాదించారు.

## విదేశీ వ్యవహారాలకు
### రూ. 18,050 కోట్లు

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో విదేశీ వ్యవహారాల శాఖ రూ. 18,050 కోట్లు దక్కించుకుంది. గత బడ్జెట్ కంటే ఇది సుమారు 4.64 శాతం ఎక్కువ. కేటాయింపుల్లో రూ. 5,408 కోట్లను వివిధ దేశాలకు సహాయం కోసం ప్రతిపాదించారు. జీ 20 అధ్యక్ష బాధ్యతలకు రూ. 990 కోట్లు ఇచ్చారు. 'పొరుగుకు ప్రాధాన్యం' పాలసీ నేపథ్యంలో భూటాన్‌కు రూ. 2,400 కోట్లు కేటాయించారు. మాల్దీవుల్లో ప్రాజెక్టుల నిర్వహణకు రూ. 400 కోట్లు ప్రతిపాదించారు. అఫ్గనిస్తాన్‌తో అనుబంధం కొనసాగింపులో భాగంగా రూ. 200 కోట్లు సహాయంగా అందించనున్నారు. నేపాల్ రూ. 550 కోట్లు, మారిషస్ రూ. 460 కోట్లు, మయన్మార్ రూ. 400 కోట్లు, శ్రీలంక రూ. 150 కోట్లు, ఆఫ్రికా దేశాలు రూ. 250 కోట్లు అభివృద్ధి నిధులు పొందనున్నాయి. మూలధన వ్యయం గత బడ్జెట్‌లో రూ. 1,416.23 కోట్లు ఉండగా.. ఈ బడ్జెట్‌లో అది రూ. 1,520.21 కోట్లకు పెరిగింది.

## వార్తాసంస్థలకు పన్ను
### మినహాయింపు రద్దు

న్యూఢిల్లీ: వార్తాసంస్థలకున్న పన్ను మినహాయింపులను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దీని ప్రభావం పీటీఐ (ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా) వార్తాసంస్థపైనా పడనుంది. ఈమేరకు పన్ను మినహాయింపు కల్పిస్తున్న ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 10లో ఉన్న క్లాజ్ 22బీకి ప్రభుత్వం సవరణలు ప్రతిపాదించింది. లాభాపేక్షలేకుండా పని చేస్తున్న పీటీఐ సంస్థ 1994–95 నుంచి పన్ను మినహాయింపులు పొందుతోంది. వివిధ వార్తాపత్రికలకు చెందిన ఈ సంస్థ తన ఆదాయాన్ని వాటాదారులకు ఇవ్వకుండా వార్తల సేకరణకే కేటాయిస్తోంది. యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యూఎన్ఐ) వార్తాసంస్థ కూడా ఇదే పంథాలో పనిచేస్తోంది.

## ఎయిర్ కనెక్టివిటీ పెంపు
### మరో 50 ఎయిర్‌పోర్టులు

న్యూఢిల్లీ : ఎయిర్ కనెక్టివిటీ పెంచడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అదనంగా 50 విమానాశ్రయాలు, వాటర్ ఏరోడ్రోమ్స్, హెలిపోర్టులు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. కొంత కాలంగా ప్రాంతీయంగా విమాన ప్రయాణాల కనెక్టివిటీని పెంపొందించడానికి ఉడాన్ పథకం కింద పలు ప్రోత్సాహకాలు చేపట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో 50 అదనపు విమానాశ్రయాలు, హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్ అభివృద్ధి చేస్తామని చెప్పారు. రవాణా రంగంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా చేపట్టనున్నట్టు వివరించారు.

## రూ.7వేల కోట్లతో మూడో దశ ఇ-కోర్టులు

న్యూఢిల్లీ: న్యాయ పరిపాలన సమర్థంగా సాగేలా రూ.7,000 కోట్లతో మూడో దశ ఇ-కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. కక్షిదారులు, న్యాయవాదులు ఎక్కడి నుంచైనా కేసును నమోదుచేసేందుకు మూడోదశ ఇ-కోర్టులు ఉపయోగపడతాయి. మూడో దశ ఇ-కోర్టులను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజ్జు ఇటీవల చెప్పిన సంగతి తెలిసిందే.

### ప్రధాన పథకాలకు కేటాయింపులు ( అంకెలు రూ.కోట్లలో)

| పథకం | 2022-23 బడ్జెట్ అంచనాలు | 2023-24 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|
| ఫార్మా రంగ అభివృద్ధి.. | 100 | 1,250 |
| ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు | 2,000 | 5,943 |
| విద్యుత్ వాహనాల తయారీ పథకం | 2,908 | 5,172 |
| ఈశాన్య రాష్ట్రాల మౌలిక వసతుల అభివృద్ధి పథకం | 1,419 | 2,491 |

## మొబైల్ విడిభాగాలపై సుంకాల తగ్గింపు

### లిథియం అయాన్ సెల్స్ తయారీకి మద్దతు

దేశీయంగా మొబైల్ ఫోన్లు, లిథియం అయాన్ బ్యాటరీల తయారీని ప్రోత్సహించేందుకు విడిభాగాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం తగ్గించారు. కెమెరా లెన్స్ దిగుమతులపై సుంకాన్ని తగ్గించారు. లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్ దిగుమతులపై రాయితీ డ్యూటీని కొనసాగించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు దేశీయంగా లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్ తయారీ కోసం దిగుమతి చేసుకునే పరికరాలు, క్యాపిటల్ గూడ్స్‌పై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు కల్పించారు. సీఆర్‌జీవో స్టీల్, ఫెర్రస్ స్క్రాప్, నికెల్ క్యాథోడ్ తయారీ ముడి పదార్థాల దిగుమతులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు కొనసాగిస్తున్నట్టు ప్రకటించారు. కాంపౌండెడ్ రబ్బర్ దిగుమతిపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతం నుంచి 25 శాతం చేశారు. ఎలక్ట్రిక్ కిచెన్ చిమ్నీలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 7.5 శాతం నుంచి 15 శాతానికి పెంచారు.

## రీట్, ఇన్విట్.. అన్ని రకాల ఆదాయంపై పన్ను

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)లకు సంబంధించి పన్ను పరిధి విస్తృతమైంది. రీట్‌లు, ఇన్విట్‌లు తమ వాటాదారులకు (యూనిట్ హోల్డర్లు) వడ్డీ, డివిడెండ్, అద్దె ఆదాయం, డెట్ ఇలా నాలుగు భాగాలుగా లాభాలను చెల్లిస్తుంటాయి. ఇందులో వడ్డీ ఆదాయం, డివిడెండ్, అద్దె ఆదాయంపై పన్ను అమల్లో ఉంది. వీటిని స్వీకరించిన ఇన్వెస్టర్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. డెట్ భాగం చెల్లింపు పన్ను లేదు. ఇక మీదట ఈ మొత్తం కూడా యూనిట్ హోల్డర్ వార్షిక ఆదాయానికి కలుస్తుంది. కనుక రీట్‌లు, ఇన్విట్‌ల నుంచి వాటాదారులు అందుకునే అన్ని రకాల ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది.

## ఆటబొమ్మల దిగుమతులపై మరింత పన్ను

న్యూఢిల్లీ: ఆట బొమ్మలు (టాయ్స్), వాటి విడిభాగాల దిగుమతులపై 60 శాతంగా ఉన్న సుంకాన్ని 70 శాతానికి పెంచుతూ ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రతిపాదించారు. దేశీ తయారీకి ఊతమిచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సైకిళ్ల దిగుమతులపైనా సుంకాన్ని 30 శాతం నుంచి 35 శాతానికి చేర్చారు. ఎలక్ట్రానిక్ టాయ్స్, వాటి విడిభాగాలకు పన్ను పెంపును మినహాయింపు కల్పించారు. ఆట బొమ్మలు, వాటి విభాగాలపై కస్టమ్స్ డ్యూటీ 30 శాతంగా ఉంటే, 2020 ఫిబ్రవరిలో 60 శాతానికి పెంచడం గమనార్హం. దీంతో అప్పటి వరకు ఏటా రూ.2,960 కోట్ల మేర ఉన్న దిగుమతులు 2021–22లో రూ.870 కోట్లకు పరిమితమయ్యాయి. ఎగుమతులు 61 శాతం వృద్ధితో అదే ఏడాది రూ.2,601 కోట్లకు చేరాయి.

# రక్షణకు 5.94 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ఈ ఏడాది రక్షణ రంగానికి ప్రాధాన్యం లభించింది. మొత్తం రూ.5.94 లక్షల కోట్లు కేటాయించారు. ఇది గత ఏడాది కంటే రూ. 69 వేల కోట్లు ఎక్కువ. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ రక్షణ రంగ కేటాయింపుల్లో రూ. 1.62 లక్షల కోట్లు మూలధన వ్యయమని తెలిపారు. ఈ మొత్తాన్ని కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధనౌకలు, ఇతర మిలటరీ పరికరాల కొనుగోళ్లకు మాత్రమే ఉపయోగిస్తారన్నమాట. 2022–23 మూలధన కేటాయింపులు రూ.1.52 లక్ష కోట్లు మాత్రమే. అంచనాల సవరణ తరువాత ఇది రూ.1.50 లక్షల కోట్లకు చేరింది. ఈ ఏడాది రక్షణ రంగ కేటాయింపుల్లో రూ.2.70 లక్షల కోట్లు ఆదాయ వ్యయం అంటే సిబ్బంది జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం ఖర్చు పెట్టనున్నారు. గత ఏడాది ఈ ఖర్చుల కోసం ముందుగా 2.39 లక్షల కోట్లు కేటాయించారు. మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ (సివిల్) మూలధన వ్యయం రూ.8774 కోట్లు. పింఛన్ల కోసం విడిగా రూ.1.38 లక్షల కోట్లు కేటాయిపులు జరిగాయి. దీంతో రక్షణ శాఖ ఆదాయ వ్యయం మొత్తమ్మీద రూ.4.22 లక్షల కోట్లకు చేరింది.

# భద్రతకు పెద్దపీట

### హోంశాఖకు 1.96 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: దేశంలో అంతర్గత భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా స్పష్టం చేసింది. బడ్జెట్‌లో కేంద్ర హోంశాఖకు ఏకంగా రూ.1,96,034.94 కోట్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనం. గత ఏడాది బడ్జెట్‌లో ఈ కేటాయింపులు రూ.1,85,776.55 కోట్లు. ఈసారి కేటాయింపులను రూ.10,258.39 కోట్లు పెంచినట్లు స్పష్టమవుతోంది. మొత్తం కేటాయింపుల్లో సింహభాగం కేంద్ర సాయుధ పోలీసు దళాలు, నిఘాసమాచారం సేకరణ కోసం ఖర్చు చేయనున్నారు. అంతర్జాతీయ సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పోలీసు దళాల ఆధునీకరణ కోసం పెద్ద ఎత్తున వెచ్చించబోతున్నారు.

**మహిళా భద్రత పథకాలకు రూ.1,100 కోట్లు**

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు దళాలకు గత ఏడాది రూ.1,19,070 కోట్లు కేటాయించగా ఈసారి రూ.1,27,756 కోట్లు కేటాయించారు. ఇందులో సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)కు 2022–23లో రూ.31,495 కోట్లు కేటాయించగా, తాజా బడ్జెట్‌లో రూ.31,772 కోట్లు కేటాయించారు. సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్), కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్), సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ), ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ), అస్సాం రైఫిల్స్ తదితర దళాలకు కేటాయింపులను పెంచారు. నేషనల్ సెక్యూరిటీ గార్డు(ఎన్ఎస్‌జీ), ఇంటెలిజెన్స్ బ్యూరో, ప్రత్యేక భద్రతా విభాగం(ఎస్పీజీ)కి గణనీయమైన కేటాయింపులు లభించాయి. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.3,545.03 కోట్లు, పోలీసు మౌలిక సదుపాయాల కోసం రూ.3,636.66 కోట్లు, పోలీసు దళాల ఆధునీకరణ కోసం రూ.3,750 కోట్లు కేటాయించారు. భద్రతకు సంబంధించిన ఖర్చుల కోసం రూ.2,780.88 కోట్లు, జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన పనులకు రూ.1,564.65 కోట్లు, మహిళా భద్రత పథకాలకు రూ.1,100 కోట్లు, ఫోరెన్సిక్ సదుపాయాల ఆధునీకరణకు రూ.700 కోట్లు, సరిహద్దుల్లో చెక్‌పోస్టుల నిర్వహణకు రూ.350.61 కోట్లు,సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు దళాల ఆధునికీకరణ ప్రణాళిక–4 కోసం రూ.202.27 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

# అంతరిక్షానికి 12,544 కోట్లు



న్యూఢిల్లీ: అంతరిక్ష రంగానికి బడ్జెట్‌లో రూ.12,544 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపులు గత ఏడాది ఇచ్చిన రూ.13,700 కంటే 8 శాతం తక్కువ కావడం గమనార్హం. వచ్చే ఏడాది చంద్రుడు, చుట్టూ ఉన్న గ్రహాల అధ్యయనం కోసం మానవ సహిత గగన్‌యాన్‌ను నిర్వహించేందుకు అంతరిక్ష విభాగం ఏర్పాట్లు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈసారి ఇచ్చిన కేటాయింపుల్లో అధికభాగం రూ.11,669.41 కోట్లను గగన్‌యాన్, శాటిలైట్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ఇస్తారు. థియరిటికల్ ఫిజిక్స్‌తోపాటు వివిధ అంశాలపై పరిశోధనలు నిర్వహించే అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీకి రూ.408.69 కోట్లు కేటాయించారు. ఈ విభాగానికి గత ఏడాది రూ.411.11 కోట్లు ఇచ్చారు. ప్రైవేట్ రంగాన్ని పర్యవేక్షించేందుకు కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసిన సింగిల్‌విండో విభాగమైన ఇన్–స్పేస్‌కు గత ఏడాది రూ.21 కోట్లు ఇవ్వగా, తాజా బడ్జెట్‌లో రూ.95 కోట్లను కేటాయించారు. వచ్చే ఏడాది చంద్రయాన్ మిషన్ చేపడుతున్న ఇస్రో.. సూర్యుడు, శుక్రుడు, అంగారక గ్రహాలపైనా పరిశోధనలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది.


# న్యూక్లియర్ ఎనర్జీకి బూస్ట్

న్యూఢిల్లీ: అణు ఇంధన ఉత్పత్తి కెపాసిటీని పెంచేందుకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)కు గత బడ్జెట్‌లో కన్నా రూ. 2,859 కోట్లు ఈ బడ్జెట్‌లో అధికంగా ఇచ్చారు. న్యూక్లియర్ ఎనర్జీకి బూస్ట్ నిచ్చేందుకు ఎన్‌పీసీఐఎల్ రూ. 9,410 కోట్లు ఈ బడ్జెట్ ద్వారా అందుకోనుంది. అంతర్గత, బహిర్గత వనరుల ద్వారా ఎన్‌పీసీఐఎల్ రూ. 12,863 కోట్లు సమకూర్చుకోనుంది. అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్‌కు రూ. 25,078.49 కోట్లు కేటాయించారు. దేశంలో 6,780 మెగావాట్ల సామర్థ్యంతో న్యూక్లియర్ ఎనర్జీ ప్లాంట్లు ఉన్నాయి. 2031 నాటికి ఈ సామర్థ్యాన్ని 15,700 మెగావాట్లకు పెంచే లక్ష్యంతో మరో 21 పవర్ జనరేషన్ యూనిట్లను స్థాపించనున్నారు.




## ఈ దేశాలు 'చదువు'లో మేటి

- ఏ దేశంలో అయినా, ఎన్ని వనరులు ఉన్నా మంచి విద్యా విధానం లేకుంటే అభివృద్ధి చెందలేదు. అటు అభివృద్ధి చెందిన ధనిక దేశాలతోపాటు చిన్న దేశాలు కూడా విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ఉంటాయి. ఈ క్రమంలో అమెరికాకు చెందిన యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్, బీఏవీ గ్రూప్, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలు పలు అధ్యయనాలు చేసి.. 78 దేశాల్లో విద్యావ్యవస్థలను పరిశీలించి ర్యాంకులు ఇచ్చాయి.
- ఈ జాబితాలో ఇండియా 32వ స్థానంలో, చైనా 22వ స్థానంలో నిలిచాయి. పాకిస్తాన్ ఈ జాబితాలో లేదు.




విద్య అనేది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆయుధం. దానితో మీరు ప్రపంచాన్నే మార్చేయవచ్చు. మంచి గుండె, మంచి ఆలోచన కలవడం ఎంతో మంచిది. వీటికి చదువుకున్న నాలుకగానీ, పెన్నుగానీ తోడైతే మరెంతో ఉత్తమం.

\- నెల్సన్ మండేలా



# చదివింపులు రూ. 1.12 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:** ఈసారి విద్యా రంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1,12,898.97 కోట్లు కేటాయించింది. ఇప్పటివరకు విద్యాశాఖకు ఇవే అత్యధిక కేటాయింపులు కావడం గమనార్హం. పాఠశాల విద్యకు రూ.68,804.85 కోట్లు కేటాయించగా ఉన్నత విద్యకు రూ.44,094.62 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.1,04,277.72 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాలు ఉన్నత విద్యకు రూ.40,828.35 కోట్లు, పాఠశాల విద్యకు రూ.59,052.78 కోట్లుగా ఉన్నాయి.

**ఇప్పటివరకు ఇదే అత్యధికం**
**పాఠశాల విద్యకు రూ.68,804.85 కోట్లు**
**ఉన్నత విద్యకు రూ.44,094.62 కోట్లు**

మేక్ ఏఐ ఇన్ ఇండియా, మేక్ ఏఐ వర్క్ ఫర్ ఇండియా కలను సాకారం చేసే లక్ష్యంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి మూడు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలు అత్యున్నత విద్యాసంస్థల్లో ఏర్పాటు కానున్నాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా రంగాల్లో మెరుగైన సేవలు అందించేలా ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో వంద ల్యాబ్‌లు ఏర్పాటవుతాయి. నేషనల్ డిజిటల్ లైబ్రరీని నెలకొల్పి నాణ్యమైన పుస్తకాలను అందుబాటులోకి తెస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

జాతీయ నూతన విద్యావిధానాన్ని (ఎన్ఈపీ 2020) చిత్తశుద్ధితో అమలు చేసే లక్ష్యంతో కేంద్ర పరిధిలోని అత్యుత్తమ విద్యాసంస్థలు, యూనివర్సిటీలకు ఈసారి రూ.4,235.74 కోట్లు అదనంగా కేటాయించనున్నారు. గత

### కేంద్ర సంస్థలకు పెరిగిన కేటాయింపులు

బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి 12.8 శాతం నిధులు అదనంగా కేటాయించారు. యూజీసీకి గ్రాంట్లను రూ.459 కోట్లు పెంచారు. సెంట్రల్ యూనివర్సిటీలకు 17.66 శాతం, డీమ్డ్ యూనివర్సిటీలకు 27 శాతం గ్రాంట్లు పెరిగాయి. గతేడాది బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఐఐటీలకు 14 శాతం, ఎన్ఐటీలకు 10.5 శాతం పెరిగాయి.



### మెరుగ్గా ఉపాధ్యాయ శిక్షణ

వినూత్నంగా పెడగాగి అంశాలు, కరిక్యులమ్‌లో మార్పులు, నిరంతర నైపుణ్యాల అభివృద్ధి తదితరాలతో 'డైట్'కేంద్రాలను సరికొత్తగా ఆవిష్కరించి టీచర్ శిక్షణను మరింత మెరుగ్గా తీర్చిదిద్దనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో 38,800 ఉపాధ్యాయ, సహాయ సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. రానున్న మూడేళ్లలో 740 ఏకలవ్య స్కూళ్లలో 3.5 లక్షల మంది ఆదివాసీ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేలా నియామకాలు చేపట్టనున్నారు. ఏకలవ్య రెసిడెన్సియల్ స్కూళ్లకు బడ్జెట్‌లో రూ.5,943 కోట్లు కేటాయించారు.

### వజ్రాల తయారీ రీసెర్చ్‌కు గ్రాంట్

ల్యాబ్‌ల్లో వజ్రాల తయారీ (ఎల్‌జీడీ) టెక్నాలజీకి ఉన్న విస్తృత ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని దేశీయంగా ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఓ ఐఐటీకి ఐదేళ్ల పాటు రీసెర్చ్ గ్రాంట్ అందచేస్తామని ప్రకటించారు.

### ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0

వచ్చే మూడేళ్లలో లక్షల మంది యువతలో నైపుణ్యాలను పెంపొందించేలా ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 ప్రారంభం కానుంది. పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా ఆధునిక కోర్సులైన కోడింగ్, ఏఐ, రోబోటిక్స్, మెకట్రానిక్స్, ఐవోటీ, 3డీ ప్రింటింగ్, డ్రోన్లు, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ అందించనున్నారు. అంతర్జాతీయంగా అవకాశాలను అందిపుచ్చుకునేలా 30 స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ కేంద్రాలను దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నెలకొల్పనున్నారు.

### స్వాగతించిన ఎడ్‌టెక్ సంస్థలు

విద్యా రంగంలో డిజిటల్ విధానాలను ప్రోత్సహిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు పెద్దపీట వేయటాన్ని ఎడ్‌టెక్ సంస్థలు స్వాగతిస్తున్నాయి. డిజిటల్ విప్లవం దిశగా దీన్ని కీలక చర్యగా అభివర్ణిస్తున్నాయి. డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు ఎడ్‌టెక్ రంగానికి సరికొత్త ఊపునిస్తుందని జడ్ఎంటీ సంస్థ వ్యవస్థాపకుడు ఆరుల్ మాలవీయ పేర్కొన్నారు. విద్యారంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యతకు బడ్జెట్‌లో గుర్తింపు లభించిందని చెప్పారు. ఎడ్‌టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యేందుకు తాజా చర్యలు దోహదం చేస్తాయన్నారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకునేందుకు మానవ వనరులపై నిధులు వెచ్చించాల్సిన అవసరాన్ని బడ్జెట్ చాటి చెప్పిందని కూ ఇండియా, కీ బ్రిడ్జి గ్లోబల్ ఎడ్యుకేషన్ సహ వ్యవస్థాపకుడు అమోద్ దని చెప్పారు. నిత్య జీవితంలో భాగంగా మారిపోయిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలను పెంపొందించే దిశగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు కృషి చేస్తాయని ఫిజిక్స్‌వాలా కో ఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి పేర్కొన్నారు.



### 6 'హరిత'వృద్ధి మార్గంలో..

దేశంలో పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధి విధానాలను ప్రోత్సహిస్తామని నిర్మల తెలిపారు. పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తామని, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపడతామని వివరించారు. ఇందుకోసం కేంద్ర చమురుశాఖ ఆధ్వర్యంలో రూ.35 వేల కోట్లను ఖర్చు చేస్తామని ప్రకటించారు.

## రాష్ట్రపతి గృహవ్యయంలో రూ. 10 కోట్ల కోత

**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి గృహవ్యయం కింద సిబ్బంది జీతాలు, రాష్ట్రపతి మంజూరు చేసే విచక్షణ గ్రాంట్లు మొదలైన వాటికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 36.22 కోట్లు కేటాయించింది. అయితే ఇది ప్రస్తుత



ఆర్థిక సంవత్సరంలో సవరించిన బడ్జెట్ అంచనాల కన్నా రూ. 10 కోట్ల మేర తక్కువ కావడం గమనార్హం. ఈ బడ్జెట్‌లో రాష్ట్రపతి కార్యాలయం, ఇతర ఖర్చుల కోసం రూ. 90.14 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ కేటాయింపు రూ. 5.34 కోట్లు అధికం. అలాగే రాష్ట్రపతి జీతం, అలవెన్సుల కోసం రూ. 60 లక్షలు, రాష్ట్రపతి సచివాలయానికి రూ. 53.32 కోట్లు కేటాయించింది.

## దుర్బరులైన ఆదివాసీల అభ్యున్నతి రూ.15 వేల కోట్లతో పథకం

**న్యూఢిల్లీ :** అతి ప్రాచీన కాలం నుంచి వస్తున్న దుర్బరులైన ఆదివాసీల అభ్యున్నతిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. వారి సామాజిక, ఆర్థిక పురోగతికి ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకటించారు.ఎస్టీల అభివృద్ధి కోసం చేపట్టే కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రూ.15 వేల కోట్లతో ప్రైమ్ మినిస్టర్ పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్ (పీఎం-పీవీటీజీ) డెవలప్‌మెంట్



మిషన్‌ని వచ్చే మూడేళ్లలో అమలు చేస్తారు. ఆదిమ గిరిజన తెగల కుటుంబాలకు ప్రాథమిక సౌకర్యాలైన భద్రమైన గృహాలు, సురక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, మెరుగైన విద్య, ఆరోగ్యం వంటివి ఈ పథకం కింద కల్పిస్తారు. వచ్చే మూడేళ్లలో రూ.15 వేల కోట్లను ఈ పథకం కింద ఖర్చు చేస్తారు.


## 'సున్నా ఉద్గారాల' కోసం రూ. 35,000 కోట్లు

**న్యూఢిల్లీ:** కాలుష్యానికి కారణమవుతున్న కర్బన ఉద్గారాలను 2070 నాటికి సున్నా స్థాయికి తగ్గించుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వ ముఖ్యమైన లక్ష్యాల్లో ఒకటి. ప్రభుత్వ తొలి ఏడు ప్రాధాన్యతల్లో హరిత వృద్ధి(గ్రీన్ గ్రోత్) కూడా ఉంది. శిలాజ ఇంధనాల వినియోగం, తద్వారా కర్బన ఉద్గారాలను పూర్తిగా తగ్గించుకోవడానికి 2023-24 బడ్జెట్‌లో కేంద్ర సర్కారు రూ.35,000 కోట్లు కేటాయించింది. లైఫ్(పర్యావరణ హిత జీవనశైలి) అనేది ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. పర్యావరణానికి హాని కలిగించని జీవనశైలిని ఒక ఉద్యమంగా సాగించాల్సిన అవసరం ఉందన్నారు. హరిత పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థ దిశగా మన ప్రయాణం సాగాలని



పిలుపునిచ్చారు. పెట్రోలియం, సహజ వాయు శాఖ ఆధ్వర్యంలో ఇంధన భద్రత, కర్బన ఉద్గారాల తగ్గింపునకు పెట్టుబడి కింద తాజా బడ్జెట్‌లో రూ.35,000 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. రూ.19,700 కోట్లతో ఇటీవలే నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ప్రారంభించినట్లు గుర్తుచేశారు. 2030 నాటికి ప్రతిఏటా ఐదు మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. 4,000 ఎండబ్ల్యూహెచ్ బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్స్ కోసం నిధులు సమకూరుస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు.

## కీలక రంగాలకు బడ్జెట్ కేటాయింపులు 2023-24 (రూ.కోట్లలో)




## సోషల్ మీడియాను ముంచెత్తిన బడ్జెట్ మీమ్స్







2023-24 బడ్జెట్‌పై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు పోస్టు చేసిన మీమ్స్ అందరినీ నవ్వుల్లో ముంచెత్తాయి. ముఖ్యంగా మిడిల్ క్లాస్, వ్యక్తిగత ఆదాయపన్ను పరిమితి, సిగరెట్లపై వారు చేసిన మీమ్స్ ట్విట్టర్‌లో టాప్ ట్రెండింగ్‌గా నిలిచాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం మొదలుపెట్టే ముందే మొదలైన మీమ్స్ హడావుడి... మధ్యతరగతికి ఆదాయపరిమితి పెంపు ప్రతిపాదనతో పతాక స్థాయికి చేరాయి. అలాగే సిగరెట్లపై 16% పన్ను పెంపు ప్రతిపాదనతో నిరాశ చెందిన పొగరాయుళ్లు పెట్టిన మీమ్స్ కూడా ట్రెండ్ అయ్యాయి. అయితే ఐటీ పరిమితి పెంపు కొత్త పన్ను విధానానికి వర్తిస్తుందని నిర్మల ప్రకటించడంపై చాలా మంది నెటిజన్లను అయోమయానికి గురిచేసింది. ఈ పన్ను విధానంపై కొందరు హర్షం వ్యక్తం చేస్తూ మీమ్స్ పెట్టగా మరికొందరు మాత్రం తమకు ఏమీ అర్థం కాలేదన్న సంకేతాన్ని మీమ్స్ రూపంలో పోస్టు చేశారు.




# ఇక ఆరోగ్య భాగ్యం

- హెల్త్‌కేర్ రంగానికి బడ్జెట్‌లో రూ.89,155 కోట్లు
- గత ఏడాదితో పోలిస్తే 13 శాతం పెంపు
- కొత్తగా 157 నర్సింగ్ కళాశాలలు



**న్యూఢిల్లీ:** ఆరోగ్య రంగానికి ప్రాధాన్యం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో రూ.89,155 కోట్లు కేటాయించింది. గత ఏడాది రూ.79,145 కోట్లు కేటాయించగా, ఈసారి నిధులను 13 శాతం పెంచింది. ఆయుష్ శాఖకు కేటాయింపులను రూ.2,845.75 కోట్ల నుంచి రూ.3,647.50 కోట్లకు పెంచడం విశేషం. అంటే గత ఏడాది కంటే ఈ పెంపు 28 శాతంగా ఉంది. ఆరోగ్య రంగానికి కేటాయించిన రూ.89,155 కోట్లలో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ విభాగానికి రూ.86,175 కోట్లు, ఆరోగ్య పరిశోధన విభాగానికి రూ.2,980 కోట్లు ఖర్చు చేయనున్నారు. తాజా బడ్జెట్‌లో 'ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన'కు రూ.3,365 కోట్లు, 22 నూతన 'ఎయిమ్స్'ల ఏర్పాటు కోసం రూ.6,835 కోట్లు కేటాయించారు. నేషనల్ హెల్త్ మిషన్‌కు బడ్జెట్ కేటాయింపులను రూ.28,974.29 కోట్ల నుంచి రూ.29,085.26 కోట్లకు పెంచారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనకు కేటాయింపులను రూ.6,412 నుంచి రూ.7,200 కోట్లకు పెంచారు. అంతేకాకుండా నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం)కు రూ.140 కోట్ల నుంచి రూ.341.02 కోట్లకు కేటాయింపులను పెంచారు. నేషనల్ టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌కు కేటాయింపులు రూ.121 కోట్ల నుంచి రూ.133. 73 కోట్లకు పెరిగాయి. భారత వైద్య పరిశోధన మండలికి గత బడ్జెట్‌లో రూ.2,116.73 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2,359.58 కోట్లు కేటాయించారు. ప్రఖ్యాత ఢిల్లీ-ఎయిమ్స్‌కు కేటాయింపులు రూ.4, 400.24 కోట్ల నుంచి రూ.4,134.67 కోట్లకు తగ్గడం గమనార్హం. ఆరోగ్య రంగంలో స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలకు 2022-23 బడ్జెట్‌లో రూ.10,348.17 కోట్లు కేటాయించగా, 2023-24 బడ్జెట్‌లో రూ.17,322.55 కోట్లు కేటాయించారు.

### 'ఫార్మా'లో పరిశోధనలకు ఊతం

దేశంలో ఫార్మాస్యూటికల్ రంగంలో పరిశోధనలకు మరింత ఊతం ఇవ్వడానికి కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. ఫార్మాస్యూటికల్ రంగంలో మరింత అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నామని వెల్లడించారు.

### 2047 నాటికి 'సికిల్ సెల్'అంతం!

దేశంలో సికిల్ సెల్ వ్యాధిని 2047 నాటికి పూర్తిగా అంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. సికిల్ సెల్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమం అమలు చేయబోతున్నట్లు చెప్పారు. ఇదే కార్యక్రమం కింద గిరిజన ప్రాంతాల్లో 40 ఏళ్ల లోపు వయసున్న సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు, చికిత్స నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో కౌన్సెలింగ్ చేపట్టనున్నట్లు వివరించారు. అంతేకాకుండా కొత్తగా 157 నర్సింగ్ కాలేజీలు ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. 2014 తర్వాత ఏర్పాటు చేసిన 157 మెడికల్ కళాశాలల ప్రాంగణాల్లోనే ఈ నర్సింగ్ కాలేజీలు వస్తాయని పేర్కొన్నారు. ఎంపిక చేసిన భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) ల్యాబ్‌ల్లో ఇకపై ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫ్యాకల్టీ సిబ్బంది సైతం పరిశోధనలు చేసుకొనే వెసులుబాటు కల్పిస్తామని తెలియజేశారు.

### సికిల్ సెల్ స్టేటస్ కార్డులు

సికిల్ సెల్ స్థాయిని తెలియజేసే కార్డులను 40 ఏళ్లలోపు గిరిజనులకు ఇవ్వనున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చెప్పారు. అంతేకాకుండా పెళ్లికి ముందు వారికి కౌన్సెలింగ్ సైతం ఇస్తామన్నారు. ఇద్దరు సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు పెళ్లి చేసుకొంటే వారికి పుట్టబోయే బిడ్డ సైతం ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలియజేశారు.

# మహిళా, శిశు సంక్షేమమే ధ్యేయం

## కీలక శాఖకు బడ్జెట్‌లో రూ.25,448.75 కోట్లు

- గత ఏడాది కంటే రూ.267 కోట్లు పెరిగిన కేటాయింపులు
- కొత్తగా 'మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్'
- 81 లక్షల స్వయం సహాయక సంఘాల ఏర్పాటు



**న్యూఢిల్లీ:** కీలకమైన మహిళా, శిశు సంక్షేమ శాఖకు తాజా బడ్జెట్‌లో కేంద్రం రూ.25,448.75 కోట్లు కేటాయించింది. గత ఏడాది కంటే ఇది రూ.267 కోట్లు అధికం కావడం విశేషం. మహిళా, శిశు సంక్షేమమే ధ్యేయంగా కేటాయింపులను పెంచినట్లు తెలుస్తోంది. 2022-23లో ఈ శాఖకు రూ.25,172.28 కోట్లు కేటాయించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో మహిళల కోసం ముఖ్యమైన ప్రకటన చేశారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్'ను ప్రతిపాదించారు. దీనికింద పొదుపు చేసిన మొత్తంపై రెండేళ్ల కాలానికి రూ.7.5 శాతం వడ్డీరేటు చెల్లిస్తారు. మహిళ లేదా ఆడ శిశువు పేరిట డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గరిష్టంగా రూ.2 లక్షలు డిపాజిట్ చేయొచ్చు. పాక్షికంగా ఉపసంహరించుకొనే వెసులుబాటు ఉంటుంది. ఇదొక చిన్న తరహా పొదుపు పథకం. మహిళ ఆర్థిక సాధికారత కోసం 'దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్'కింద గ్రామీణ మహిళలతో 81 లక్షల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఒక్కో సంఘంలో వేలాది మంది మహిళలు ఉంటారని తెలిపారు. ఉత్పాదక సంస్థల ద్వారా ఆర్థిక సాధికారత సాధించడమే ఈ సంఘాల లక్ష్యమని వివరించారు.

### మహిళా రైతులకు రూ.54,000 కోట్ల లబ్ధి

పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి కింద చిన్న, సన్నకారు రైతులకు రూ.2.25 లక్షల కోట్లు బదిలీ చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ వివరించారు. ఇందులో 3 కోట్ల మంది మహిళా రైతులు రూ.54,000 కోట్ల మేర లబ్ధి పొందుతారని తెలియజేశారు. మహిళా, శిశు సంక్షేమ శాఖకు బడ్జెట్‌లో రూ.25,448.75 కోట్లు కేటాయించగా, ఇందులో సాక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 పథకాలకు రూ.20,554.31 కోట్లు, మిషన్ వాత్సల్యకు రూ.1,472 కోట్లు, మిషన్ శక్తికి రూ.3,143 కోట్లు కేటాయించారు. అలాగే సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ(సీఏఆర్ఏ), నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్(ఎన్‌సీపీసీఆర్), నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ తదితర స్వయం ప్రతిపత్తి కలిగిన విభాగాలకు రూ.168 కోట్లు కేటాయించారు. గత ఏడాది కంటే ఇది రూ.4 కోట్లు అధికం.

### పెట్టుబడి పరిమితి రెట్టింపు

సీనియర్ సిటిజెన్ సేవింగ్ పథకం(ఎస్సీఎస్ఎస్)లో గరిష్టంగా రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టేందుకు అవకాశం ఉండగా, ఈ పరిమితిని రూ.30 లక్షలకు పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. అలాగే పోస్టల్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ సింగిల్ అకౌంట్‌లో ఇకపై గరిష్టంగా రూ.9 లక్షలు (ప్రస్తుతం రూ.4.5 లక్షలు) పెట్టుబడి పెట్టొచ్చని అన్నారు. జాయింట్ అకౌంట్‌లో గరిష్టంగా రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టొచ్చని సూచించారు. ఇవి పెట్టుబడికి ఎలాంటి రిస్క్ లేకుండా వడ్డీ అందించే పథకాలు.

## పాత వాహనాల తుక్కు కోసం నిధులిచ్చాం

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వానికి చెందిన పాత వాహనాలను తొలగించేందుకు అవసరమైన నిధులను కేటాయించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అలాగే పాత వాహనాలు, అంబులెన్సులను వినియోగం నుంచి పక్కన పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తాయన్నారు. పర్యావరణహిత ఆర్థిక వ్యవస్థ కోసం కాలుష్యకారక పాత వాహనాలను తొలగిస్తామని లోక్‌సభలో చెప్పారు. ప్రయాణికులు, వస్తువుల రవాణా కోసం తక్కువ వ్యయమయ్యే జలరవాణాను ప్రోత్సహిస్తామని, నిధుల అంతరాన్ని పూడ్చేందుకు దీన్ని పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో చేపడతామని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి 15 సంవత్సరాలకు పైబడి ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రవాణా సంస్థలకు చెందిన బస్సులు, ప్రభుత్వరంగ సంస్థల వాహనాల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి తొలగిస్తామని, వాటిస్థానంలో కొత్త వాహనాలను తీసుకొస్తామని ఇటీవల కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పిన సంగతి తెలిసిందే. శాంతిభద్రతల దృష్ట్యా రక్షణ శాఖకు చెందిన ఆయుధ వాహనాలు, ఇతర ప్రత్యేక వాహనాలకు ఈ నిబంధన వర్తించదని చెప్పారు.

## మైనార్టీ శాఖ నిధుల్లో 38% కోత

**న్యూఢిల్లీ :** మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ సారి బడ్జెట్‌లో భారీగా కోత పడింది. గత ఏడాదితో పోల్చి చూస్తే 38% నిధుల్ని తగ్గించారు. 2023-24 సంవత్సరానికి మైనార్టీ శాఖకి రూ.3097.60



కోట్లు కేటాయించినట్లుగా బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరంలో మైనార్టీ శాఖ రూ.5,020.20 కేటాయించగా ఈసారి భారీగా కోత పడింది. ఈ సారి కేటాయించిన రూ. 3,097.60 కోట్లలో విద్యా సాధికారత కోసం రూ. 1,689 కోట్లు, నైపుణ్యాల అభివృద్ధి కోసం రూ. 65 కోట్లు, మైనార్టీల అభివృద్ధి కోసం రూ. 610 కోట్లు ఖర్చు చేయనున్నట్టు మంత్రి వివరించారు.




## నిధుల పంపిణీలో అసమానతలు: ఎమ్మెల్సీ కవిత



సబ్‌కా సాత్ అంటూ ప్రకటనలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిధుల పంపిణీలో మాత్రం సమానత పాటించడం లేదు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీకి 2025 వరకు పన్ను మినహాయింపును పొడిగించిన కేంద్రం తెలంగాణలోని నిమ్జ్, ఇతర సెజ్‌ల సంగతి మాట్లాడలేదు. తెలంగాణకు రావాల్సిన పెండింగ్ నిధులను విడుదల చేయాలి. నిజామాబాద్, వరంగల్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు భూమి అందుబాటులో ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు.

## 'అన్ని వర్గాల కలలను సాకారం చేసేలా బడ్జెట్'



"నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉంది. 2047 ఏడాది లక్ష్యంగా పథకాలు రూపొందించిన ఈ బడ్జెట్ అన్ని వర్గాల కలలను సాకారం చేస్తుంది. మహిళా శక్తి, సాధికారత దేశాన్ని ఏవిధంగా నిర్మించగలదో ఈ బడ్జెట్ స్పష్టం చేసింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతనజీవులు, మధ్యతరగతి వర్గాల ఆశలు ఈ బడ్జెట్‌తో ఫలించాయి. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ మోదీ ప్రభుత్వం వారి కోసం ప్రత్యేకంగా 'మహిళా సమ్మాన్ బచత్ పత్ర' పొదుపు పథకాన్ని ప్రకటించడం హర్షణీయం". – బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

ప్రాచీన తాళపత్రాలు, శిలా శాసనాలకు సంబంధించి భారత-శ్రీ పథకం ద్వారా డిజిటలైజేషన్ చేపట్టాలని నిర్ణయించాం. దీనికి సంబంధించి ఎపిగ్రఫీ మ్యూజియాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. 50 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసి అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాం.

- కిషన్‌రెడ్డి, కేంద్రమంత్రి






**7** 'యువ శక్తి'తో అభివృద్ధి వైపు..

దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న యువత శక్తిని సంపూర్ణంగా వినియోగించుకుని అభివృద్ధికి బాటలు వేస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. విద్య, నైపుణ్య అభివృద్ధి, ఉద్యోగాల సృష్టి, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడతామని ప్రకటించారు. యువతకు నైపుణ్య శిక్షణ కోసం 'పీఎం కౌశల్ వికాస్ యోజన 4.0'ను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు.

# ఆశలు.. అడియాసలు

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కనబడని ప్రత్యేక కేటాయింపులు... సాగునీటి ప్రాజెక్టులకు నిధుల్లేవు
- ఫార్మాసిటీ, డిఫెన్స్ కారిడార్, నిమ్జ్, చేనేత పరిశోధన కేంద్రం ప్రతిపాదనలు బుట్టదాఖలు
- ములుగు వర్సిటీతోపాటు భారజల కేంద్రాలకు నామమాత్రపు కేటాయింపులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వాదనలు పట్టించుకోలేదు... ఆర్థిక సంఘం సిఫారసు చేసే నిధులకు గ్యారంటీ ఇవ్వలేదు... ఫార్మాసిటీ, డిఫెన్స్ కారిడార్, నిమ్స్ ఏర్పాటు, జాతీయస్థాయి చేనేత పరిశోధన కేంద్రం లాంటి ప్రాజెక్టులకు నిధులడిగినా కేంద్ర ప్రభుత్వం కనికరం చూపలేదు. ఒక్క సాగునీటి ప్రాజెక్టుకూ నిధులివ్వలేదు. అలాగే, ఏ ప్రాజెక్టు, ఏ పథకం, ఏ గ్రాంటు కింద కూడా తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు చూపలేదు. నలుగురిలో నారాయణ అన్న చందంగా రెండు, మూడు చోట్ల ఇతర రాష్ట్రాలతో కలిపి డబ్బులిస్తామని చెప్పడానికి మాత్రమే కేంద్రం పరిమితమైంది. స్థూలంగా చెప్పాలంటే ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న హామీలను పట్టించుకోకుండా, రాష్ట్ర మంత్రులు చేసిన అభ్యర్థనలను వినకుండానే తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్ 2023–24 బడ్జెట్‌ను బుధవారం లోక్‌సభలో ప్రకటించారు. విభజన హామీలైన రైల్‌కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కార్మాగారం లాంటి ప్రాజెక్టుల ఊసెత్తకుండానే... కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధుల పెంపు, రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లు లాంటి ఊరట కలిగించే అంశాలేవీ లేకుండానే ఈ ఏడాది కూడా బడ్జెట్ ప్రవేశపెట్టడం గమనార్హం.

### వాదనలు, అభ్యర్థనలు పట్టించుకోలేదు...

అభివృద్ధి చెందుతున్న తెలంగాణ లాంటి రాష్ట్రాలను అన్ని రాష్ట్రాల గాటన కట్టవద్దని, పురోగమన రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలివ్వాలన్న రాష్ట్ర వాదనను కేంద్రం ఈసారి కూడా పరిగణనలోకి తీసుకోలేదని ఆర్థికశాఖ వర్గాలు చెప్పాయి. ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల కారణంగా అప్పుల్లో కోత, 2021–26 వరకు 15వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసులు, వెనుకబడిన జిల్లాలకు నిధులు, పౌష్టికాహార పంపిణీ కోసం ఆర్థిక సంఘం ఇవ్వాలన్న నిధులు... ఇలా రూ.లక్ష కోట్లకు పైగా నష్టం జరిగిందని తెలంగాణ చెబుతున్నా.. కేంద్రం వీటిలో ఏ ఒక్క విషయంలోనూ ఉపశమనం కలిగించలేదు. త్వరలోనే ఎన్నికలున్న కర్ణాటకకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పేరుతో రూ.5వేల కోట్లు కేటాయించిన కేంద్రం తెలంగాణకు గత మూడేళ్ల నుంచి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద ఇవ్వాల్సిన రూ.1,350 కోట్లు ఎందుకు ఇవ్వలేదనే విమర్శలు వస్తున్నాయి. దీనికి తోడు గతంలో ప్రతిపాదించిన 157 మెడికల్ కళాశాలల్లో ఒక్కటి కూడా రాష్ట్రానికి ఇవ్వకపోవడం, ఇప్పుడు ఆ మెడికల్ కళాశాలలిచ్చిన చోటనే నర్సింగ్ కళాశాలలు మంజూరు చేయడంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందనే వాదన వినిపిస్తోంది. వ్యవసాయ రంగంతోపాటు ఉపాధి హామీ పథకానికి కూడా నిధులు తగ్గించడంతో రాష్ట్రంలోని గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతాంగానికి ప్రత్యక్ష నష్టం కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## రావాల్సిన నిధుల్లో కోత


కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) నిధుల్లో వాటాను పెంచకపోవడం వల్ల రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో మళ్లీ కోత పడనుందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు సెస్సులు, సర్‌చార్జీలు తగ్గించుకోవాలని, లేదంటే వాటిలోనూ వాటా ఇవ్వాలని తెలంగాణ కోరినా కేంద్రం కనికరించకపోవడం గమనార్హం. ఇక, ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల మేరకు రుణాలపై ఆంక్షల విషయంలోనూ కేంద్రం అదే వైఖరి చూపింది. విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తేనే జీఎస్‌డీపీలో అదనంగా 0.5 శాతం రుణాలకు అంగీకరిస్తామన్న నిబంధనను కొనసాగించడంతో మరోమారు రూ.6వేల కోట్ల అప్పులకు కోత పడుతుందని ఆర్థిక శాఖ అంటోంది. రుణ పరిమితులపై ఆంక్షలు కొనసాగించడం, గ్రాంట్లు ప్రత్యేకంగా కేటాయించకపోవడం, అప్పుల్లో కోతల నిబంధనలను యథాతథంగా ఉంచడంతో ఈసారి కూడా నిధులకు కటకట తప్పదని చెబుతోంది.

## స్పష్టత లేని ప్రతిపాదనలు

గుడ్డిలో మెల్లలా 50 ఏళ్ల కాలపరిమితిలో చెల్లించే విధంగా రాష్ట్రాలకు వడ్డీలేని రుణాల కింద రూ.13.7 లక్షల కోట్లు కేంద్రం కేటాయించినా, అందులో మన రాష్ట్రానికి ఎంత వస్తుంది... ఏ ప్రాతిపదికన ఆ నిధులిస్తారన్న దాంట్లో స్పష్టత లేదు. గతంతో పోలిస్తే ఈ రుణపరపతిని భారీగానే పెంచినా రాష్ట్రానికి ఇచ్చే సమయానికి ఆంక్షలు విధిస్తే నష్టపోతామని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇక, కేటాయింపులను చూస్తే ములుగు వర్సిటీతోపాటు ఏపీలోని మరో వర్సిటీకి కలిపి రూ.37 కోట్లు బడ్జెట్‌లో చూపెట్టారు. అదేవిధంగా దేశంలోని మూడు భారజల కేంద్రాలకు చూపెట్టిన రూ.1,473 కోట్లలోనే మణుగూరు భార జల కేంద్రానికి నిధులు రావాల్సి ఉంటుంది. మొత్తమ్మీద ఈసారి కూడా కేంద్ర బడ్జెట్ రాష్ట్రం ఆశించిన విధంగా లేదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. తెలంగాణకు అన్ని రాష్ట్రాలతో కలిపి చేసిన కేటాయింపులే తప్ప ప్రత్యేకంగా ఒరిగేదేమీ లేదని, బకాయిలు వచ్చే అవకాశాలు కూడా కనిపించడం లేదని అంటున్నారు.

# తెలంగాణకు మొండిచేయి

- కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఫైర్
- రైతులు, ఉపాధి హామీని పట్టించుకోలేదని వ్యాఖ్య
- దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసే బడ్జెట్ ఇది



సాక్షి, హైదరాబాద్: అందమైన మాటల మాటున నిధుల కేటాయింపులో డొల్లతనాన్ని కప్పిపుచ్చుతూ అన్ని రంగాలను గాలికి వదిలేసి దేశ రైతాంగాన్ని, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను నిరుత్సాహపరిచే విధంగా పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణకు ఈ బడ్జెట్ మరోమారు అన్యాయం చేసిందని, రాష్ట్రానికి మొండిచేయి చూపెట్టిందని ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది రైతు, పేదల వ్యతిరేక బడ్జెట్ అని, ఇదో భ్రమల బడ్జెట్ అని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌పై హరీశ్ స్పందన ఈ విధంగా ఉంది.

### రైల్ కోచ్ ఫ్యాక్టరీ గురించి ఒక్కమాటలేదు..

'తెలంగాణకు మరోమారు అన్యాయం చేశారు. తొమ్మిదేళ్లుగా అడుగుతున్న రైల్ కోచ్ ఫ్యాక్టరీ గురించి ఒక్కమాట లేదు. గిరిజన యూనివర్సిటీకి ఇచ్చిన నిధులు అంతంత మాత్రమే. ఒక్క విభజన హామీని కూడా అమలు చేయలేదు. సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు. జీఎస్టీ రాయితీలు, ప్రత్యేక ప్రోత్సాహకాలు లేవు. తెలంగాణకు ఒక్క కొత్త పారిశ్రామికవాడ కూడా లేదు. గ్రామీణ ఉపాధి హామీ నిధుల్లో కోత పెట్టారు. ఎరువుల సబ్సిడీలు తగ్గించారు. ఆర్థిక సంఘాల సిఫారసులను అమలు చేస్తామని చెప్పలేదు. సింగరేణి కార్మికులకిచ్చిన పన్ను మినహాయింపులు కూడా ఆశాజనకంగా లేవు. ఉద్యోగులను భ్రమల్లో పెట్టారు. సెస్సులభారం తగ్గించలేదు. పన్నులభారం నుంచి ప్రజలకు ఉపశమనం లేదు. గత బడ్జెట్‌లో రూ.89,400 కోట్లు ఉపాధి హామీకి పెట్టిన కేంద్రం ఈసారి ఆ బడ్జెట్‌ను రూ.60 వేల కోట్లకు తగ్గించింది. గతేడాది బడ్జెట్‌లో 33 శాతం తగ్గించి ఉపాధి హామీ కూలీల ఉసురు తీసుకునే చర్యలకు ఉపక్రమించింది. ఆహారభద్రత నిధుల్లో భారీగా కోత పెట్టారు. గతేడాది 2.87 లక్షల కోట్లు కేటాయించి ఈసారి 1.97 లక్షల కోట్లకు తగ్గించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు 157 మెడికల్ కళాశాలలు మంజూరు చేస్తే అందులో తెలంగాణకు ఒక్కటి కూడా లేదు. గతంలో మెడికల్ కాలేజీలు ఇచ్చిన ప్రాంతాలకే ఇప్పుడు నర్సింగ్ కాలేజీలు ఇస్తున్నట్టు ప్రకటించి మరోమారు తీవ్ర అన్యాయం చేసింది. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన రూ.1,350 కోట్లు ఇవ్వలేదు.

### రూ.5,300 కోట్లు కేటాయించి కర్ణాటక పట్ల పక్షపాతం

కర్ణాటకలో ఎన్నికలున్నాయన్న కారణంతో ఆ రాష్ట్రానికి రూ.5,300 కోట్లు కేటాయించి కేంద్ర పాలకులు పక్షపాత వైఖరి చూపారు. ఎరువుల సబ్సిడీ నిధులను రూ.2.25 లక్షల కోట్ల నుంచి రూ.1.75 లక్షల కోట్లకు తగ్గించారు. గతేడాదితో పోలిస్తే 20 శాతం కోత పెట్టారు. పత్తి మద్దతుధరకు కేవలం రూ.లక్ష రూపాయలు కేటాయించి తీవ్ర నష్టం చేశారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద గత బడ్జెట్‌లో రూ.5,020 కోట్లు చూపెట్టి ఈసారి రూ.3,097 కోట్లకు కుదించారు. విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తేనే 0.5 శాతం ఎఫ్ఆర్‌బీఎం అమలు చేస్తామని షరతు పెట్టారు. దీనివల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.6 వేల కోట్లు నష్టం జరుగుతుంది. 15వ ఆర్థిక సంఘం సిఫారసు ప్రకారం ఇవ్వాల్సిన నిధుల్లో కోత పెట్టి గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు తీవ్ర అన్యాయం చేశారు. అప్పులను మూలధన వ్యయం కోసం కాకుండా, అప్పులో 48.7 శాతాన్ని రోజువారీ ఖర్చుల కోసం ప్రతిపాదించడం ఆర్థిక వ్యవస్థకే చేటుతెస్తుంది. రెవెన్యూ లోటు పెంపు ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి విరుద్ధం. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా కింద కేవలం 30.4 శాతం మత్రమే ఇస్తున్నారు. కానీ 41 శాతం ఇవ్వాలి. పన్నుల్లో వాటా పెంచామని కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాలవాటాను పెంచి, కేంద్ర కేటాయింపులను కుదించడంవల్ల రాష్ట్ర ప్రభుత్వం రెండు రకాలుగా నష్టపోతుంది.

### గతం కంటే 22 శాతం తగ్గుదల



కేంద్రంలో రైతువ్యతిరేక ప్రభుత్వం నడుస్తోంది. ఈసారి కేంద్ర బడ్జెట్లో వ్యవసాయానికి గతేడాది కంటే 22 శాతం కేటాయింపులు తగ్గించారు. గత బడ్జెట్లో రూ.2.25 లక్షల కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.1.75 లక్షల కోట్లకు కుదించారు. మెల్లగా కేంద్రం ఎరువుల సబ్సిడీకి మంగళం పాడుతోంది. రైతులను ప్రత్యామ్నాయ ఎరువుల వైపు మళ్లించే పీఎం ప్రణామ్ పథకానికి బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. – రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

## బడ్జెట్‌పై స్పందనలు..



### దేశాన్ని అభివృద్ధిచేసే బడ్జెట్ ఇది..

ప్రతిపక్షాలు కూడా విమర్శించలేని బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. విమర్శించకపోతే దుకాణం మూతపడుతుందన్న భయంతో కొందరు విమర్శిస్తున్నారు. దేశాన్ని నంబర్–1 గా ఉంచే లక్ష్యంతో రూపొందించిన బడ్జెట్‌ను కేంద్రమంత్రి తీసుకొచ్చారు. దేశంలో స్టార్టప్ రంగాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నారు. మిల్లెట్స్ రంగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి చేయాలన్న విధంగా బడ్జెట్ ఉంది. – బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ

### తెలంగాణ పట్ల తీవ్ర వివక్ష..



బడ్జెట్ తీవ్ర నిరాశపరిచింది.. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే ఫ్యాక్టరీ, ఏదైనా సాగు నీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి అంశాలను బడ్జెట్లో విస్మరించారు. ఐటీఆర్ ప్రాజెక్ట్ ప్రస్తావన లేదు. ఎన్నికలు జరుగుతున్న కర్ణాటక రాష్ట్రానికి మాత్రం నిధులు కేటాయించింది. కానీ తీవ్రమైన వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తెలంగాణ పట్ల మాత్రం కేంద్రం వివక్ష చూపింది. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి బీజేపీ, బీఆర్ఎస్ ఇద్దరూ దోషులే.

-రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎంపీ

### బడ్జెట్‌లో తగ్గిన రాష్ట్ర వాటా

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన వాటాను గణనీయంగా తగ్గించారు. తెలంగాణకు 2.133 శాతం వాటా మాత్రమే తిరిగి వస్తోంది. 15వ ఫైనాన్స్ కమిషన్ కేటాయించిన ప్రకృతి వైపరీత్యాల పరిహారం, స్థానిక సంస్థల నిధులు, మున్సిపాలిటీల నిధులు, ఉన్నతవిద్య, ఆరోగ్య రంగాల కోసం కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో కోత పెట్టారు

– సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

### రాష్ట్రానికి మొండిచేయి

కేంద్ర బడ్జెట్లో ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీలకు సంబంధించిన ఊసేలేదు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలకు సంబంధించి నిధులు కేటాయించలేదు. జీఎస్టీలో రాష్ట్రాలకు వాటాల పెంపుదల గురించిన ప్రస్తావనేలేదు.

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

### రాష్ట్రానికి బీఆర్ఎస్–బీజేపీలు శాపంగా మారాయి



లక్డీకాపూల్ (హైదరాబాద్): "కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసే ఎత్తకపోవడం దుర్మార్గం. రాష్ట్రానికి బీఆర్ఎస్–బీజేపీలు శాపంగా మారాయి. విభజన చట్టంలో ఇచ్చిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, పసుపు బోర్డు, ములుగు గిరిజన వర్సిటీ హామీల ప్రస్తావన ఈసారి కూడా లేకపోవడం దారుణం. దేశంలో 2 కోట్ల ఉద్యోగాల కల్పన సైతం కనపడటం లేదు. అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదు. మన దొరగారు ఏనాడైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం కొట్లాడిండా? ప్రధాని రాష్ట్రానికి వస్తే విభజన సమస్యలు పట్టించుకోరా అని అడిగిండా?"

-వైఎస్ షర్మిల, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు

### బడ్జెట్ నిరుత్సాహపరిచింది..



కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరుత్సాహపరిచింది. ఈ బడ్జెట్ పేదల వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్. ఆర్థిక మంత్రి ప్రసంగంలో తెలంగాణకు ప్రత్యేక ప్రకటనలు ఏమీ లేవు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు హామీలను విస్మరించారు. పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల గురించి కూడా ప్రస్తావన లేదు. హైదరాబాద్‌లో మిల్లెట్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నట్లు గతంలోనూ అనేక ఉత్తుత్తి హామీలు ఇచ్చారు. బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం జరగడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా బాధ్యత ఉంది. తెలంగాణకు అవసరమైన నిధులు రాబట్టేలా బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో కేసీఆర్ విఫలమయ్యారు.

– ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ

### ఉక్కు ఫ్యాక్టరీ ఊసేలేదు...

కేంద్ర బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. తెలంగాణ ప్రజలకు ఉపయోగం లేకుండా రూపొందించారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఊసేలేదు. విభజన చట్టాన్ని ఆమోదించి పదేళ్లు అవుతున్నా ఇప్పటిదాకా బీజేపీ ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు.

– కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ ఎంపీ



బుధవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీలు

### జుమ్లా బాజీ బడ్జెట్...

బడ్జెట్ పూర్తిగా జుమ్లా బాజీ. ప్రసంగానికి, వాస్తవ కేటాయింపులకు పొంతన లేదు. తెలంగాణకు సంబంధించి మాట రాలేదు. ఏ స్కీములోనూ తెలంగాణ కనిపించలేదు. రాష్ట్రాలకు 50 ఏళ్లపాటు వడ్డీ లేని రుణాలు కొత్తేమీ కాదు. బడ్జెట్లో తెలంగాణను మర్చిపోయారు.

– కె.కేశవరావు, బీఆర్ఎస్ ఎంపీ

### రైతు, పేద ప్రజలకు వ్యతిరేకం..

ఇది రైతు, పేదల, గ్రామీణ ప్రజల వ్యతిరేక బడ్జెట్. డిజిటల్ వ్యవసాయం అంటే అభివృద్ధి జరిగిపోదు. గత 9 ఏళ్లలో ఎన్ని డ్యాములు కట్టారు? ఎన్ని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు తెచ్చారు? ఎంత మందికి విద్యుత్తు ఉచితంగా ఇచ్చారు? వీటికి సమాధానం చెప్పాలి. ఇది భారతదేశ బడ్జెట్. కేవలం కర్ణాటక రాష్ట్రానికి మాత్రమే బడ్జెట్ కాదు. రైల్వే ప్రాజెక్టుల్లో తెలంగాణకు మాత్రం పూర్తి అన్యాయం చేశారు.

– నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఎంపీ

### ఎరువులకు నిధుల కోత అన్యాయం..

దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. చాలా ఏళ్లుగా బీఆర్ఎస్ ఈ విషయాన్ని చెబుతోంది. బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి ఈ విషయాన్ని గణాంకాల ద్వారా అంగీకరించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఎరువులకు నిధుల కోత ఎక్కువగా ఉంది. వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వానికి సరైన ఆలోచన లేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా నిర్ణయాలు తీసుకున్నారు.

– కె.ఆర్.సురేశ్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ

# కేంద్రపన్నుల్లో పెరిగిన తెలంగాణ వాటా

- గతేడాదితో పోలిస్తే రూ.4,305 కోట్ల మేర అధికం
- ఈ ఏడాది మొత్తం రూ.21,470 కోట్ల పన్నుల కేటాయింపు
- ఐఐటీ హైదరాబాద్‌కు రూ.300 కోట్లు.. సింగరేణి కాలరీస్‌కు రూ.1,650 కోట్లు




సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రపన్నుల్లో రాష్ట్రవాటా పెరిగింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రపన్నుల్లో భాగంగా 2023–24లో తెలంగాణకు రూ.21,470.98 (2.102 శాతం) కోట్లు రానున్నాయి. అందులో కార్పొరేషన్ పన్ను రూ.6,872.08 కోట్లు, ఆదాయపు పన్ను రూ.6,685.61 కోట్లు, సంపద పన్ను రూ.–0.18 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ రూ.6,942.66 కోట్లు, కస్టమ్స్ రూ.681.10 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.285.26 కోట్లు, సర్వీస్ ట్యాక్స్ రూ.4.31 కోట్లను కేంద్రం కేటాయించింది. కాగా, గత బడ్జెట్‌లో కేంద్రపన్నుల రూపంలో తెలంగాణకు రూ.17,165.98 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. గతేడాదితో పోలిస్తే రాష్ట్రానికి రానున్న పన్నుల వాటా రూ.4,305 కోట్లు అధికం.

### రాష్ట్ర సంస్థలకు కేటాయింపులు ఇవే...

ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్ ఐఐటీకి రూ.300 కోట్లు, సింగరేణి కాలరీస్‌కు రూ.1,650 కోట్లు, హైదరాబాద్‌సహా దేశంలోని 7 నైపర్ సంస్థలకు కలిపి రూ.550 కోట్లు, హైదరాబాద్‌లోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు రూ.392.79 కోట్లు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌కు రూ.115 కోట్లు, ఇన్‌కాయిస్‌కు రూ.27 కోట్లు, హైదరాబాద్‌సహా మరో మూడు ప్రాంతాల్లో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ హిందీ సంస్థకు రూ.39.77 కోట్లు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డుకు రూ.19 కోట్లు, స్వాతంత్య్ర సమరయోధుల(పెన్షన్లు)కు రూ.653.08 కోట్లు, తెలంగాణ, ఏపీల్లోని గిరిజన విశ్వవిద్యాలయాలకు కలిపి రూ.37.67 కోట్లు, హైదరాబాద్‌సహా 12 నగరాల్లో ఉన్న సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ–డాక్)కు రూ.270 కోట్లు, హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమీసహా పోలీసు విద్య, ట్రెనింగ్, పరిశోధనలకు మొత్తం రూ.442.17 కోట్లు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనిమల్ బయోటెక్నాలజీ సంస్థకు రూ.30.50 కోట్లు, మణుగూరుసహా కోట(రాజస్తాన్)లోని భారజల ప్లాంట్లకు రూ.1,473.43 కోట్లు, బీబీనగర్, మంగళగిరిసహా దేశంలో 22 కొత్త ఎయిమ్స్ నిర్మాణానికి రూ.6,835 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.

# 'ఏకలవ్య' గురుకులాలకు మహర్దశ!

తాజా బడ్జెట్‌లో పోస్టుల భర్తీకి నిధుల కేటాయింపులు • ప్రస్తుతం రాష్ట్రంలో 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్

- అన్నిచోట్ల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే నెట్టుకొస్తున్న వైనం
- ఇకపై అన్ని స్కూళ్లలో పూర్తిస్థాయి టీచర్లు
- మరింత మెరుగుపడనున్న బోధన, అభ్యసన కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: ఏకలవ్య గురుకుల విద్యా సంస్థల సొసైటీ పాఠశాలలకు మంచిరోజులు వచ్చినట్టే. మెజార్టీ పాఠశాలలకు అత్యాధునిక స్థాయిలో మౌలిక వసతులు కల్పించినప్పటికీ కీలకమైన బోధన, బోధనేతర సిబ్బంది అంతా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. తాజాగా ఈ పాఠశాలల్లో బోధనా కొలువులను పూర్తిస్థాయిలో భర్తీ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈమేరకు తాజాగా ప్రవేశపెట్టిన 2023–24 వార్షిక బడ్జెట్‌లో కొలువుల భర్తీ అంశాన్ని ప్రస్తావిస్తూ స్పష్టత ఇచ్చింది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో అన్ని రకాల సామర్థ్యాలున్న బోధకులు అతి త్వరలో అందుబాటులోకి రానున్నారు. 2023–24 వార్షిక సంవత్సరంలోనే నిర్దేశించిన ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రకటన వెలువడడం, ఆ తర్వాత భర్తీ ప్రక్రియ పూర్తి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రాష్ట్రంలో 23 ఈఎంఆర్ఎస్‌లు....



తెలంగాణ వ్యాప్తంగా 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఇవన్నీ ఉట్నూరు ఐటీడీఏ, ఏటూరు నాగారం ఐటీడీఏ, భద్రాచలం ఐటీడీఏల పరిధిలో ఉన్నాయి. ఒక్కో పాఠశాల పరిధిలో 29 మంది బోధన, 20 బోధనేతర, 10 క్లాస్ ఫోర్ ఉద్యోగులుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలల్లో మెజార్టీ సంఖ్యలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులు లేరు. దీంతో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రతి సంవత్సరం నియమించుకోవడంతో బోధన, బోధనేతర కార్యక్రమాల నిర్వహణ ఇబ్బందికరంగా ఉంటుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ఈఎంఆర్ఎస్‌లకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులు రానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదువందలకు పైబడి బోధనా సిబ్బందిని భర్తీ చేసే అవకాశం ఉంది.

## నిబంధనలు సడలిస్తే....

ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త ఈఎంఆర్ఎస్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది. ఈ పాఠశాలలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్వహిస్తారు. కొత్త పాఠశాలల కోసం కేంద్రం ఇదివరకే రాష్ట్రాలకు సూచనలు చేసింది. నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు పంపాలని సూచించింది. అయితే కేంద్రం నిర్దేశించిన నిబంధనలు కాస్త ఇబ్బందికరంగా ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఒక మండలంలో ఎస్టీ జనాభా 50 శాతం ఉండాలనేది ప్రధాన నిబంధన. మండలంలో ఎస్టీ జనాభా 20 వేలకు పైబడి ఉండాలనేది మరో నిబంధన. ఈ రెండు నిబంధనలు ఇబ్బందికరమని, వీటిలో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. రెండింటిలో ఒక అంశాన్ని పరిగణించినా రాష్ట్రానికి కొత్తగా ఏడు పాఠశాలలు మంజూరయ్యే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▲ 158 | నిఫ్టీ ▽ 46 |
| 59,708 | 17,616 |

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 11,567 | ▽ 18 |
| డోజోన్స్ | 33,765 | ▽ 321 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,761 | ▽ 11 |
| డాక్స్ | 15,181 | ▲ 52 |
| షాంఘై | 3,285 | ▲ 25 |
| నికాయ్ | 27,347 | ▲ 20 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


**బులియన్** రూ.లలో

| ముంబై | |
|---|---|
| బంగారం (24 క్యారట్) | 56,630 |
| బంగారం (22 క్యారట్) | 53,930 |
| వెండి (కిలో) | 76,000 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 81.03 | 82.70 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 87.38 | 90.45 |
| € | యూరో | ఒకటి | 99.13 | 102.53 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 61.95 | 63.98 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 56.59 | 58.98 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 61.29 | 63.34 |
| SAR | సౌదీ రియాల్ | పదింటికి | 20.85 | 22.52 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | పదింటికి | 21.41 | 23.20 |
| ¥ | చైనా యువాన్ | పదింటికి | 11.03 | 13.11 |

మూలధన వ్యయాలపై ప్రధానంగా దృష్టి పెట్టడమనేది ప్రైవేట్ పెట్టుబడులు కూడా పుంజుకోవడానికి దోహదపడ గలదు. చిన్న సంస్థలు, వ్యవసాయానికి ఊతమిచ్చే చర్యలు రుణ వృద్ధికి తోడ్పడతాయి. అలాగే గందరగోళం లేని కొత్త పన్నుల విధానానికి మారే క్రమంలో విని యోగం గణనీయంగా పెరగగలదు.



– దినేష్ ఖరా, చైర్మన్, ఎస్‌బీఐ

# మురిసి‘పడిన’ మార్కెట్!

బడ్జెట్లో వృద్ధి మంత్రంతో తారాజువ్వలా దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్లు... అంతలోనే చప్పన చల్లారిపోయాయి. మౌలిక రంగానికి భారీగా కేటాయింపులను పెంచుతూ.. మధ్యతరగతి వర్గాలకు ఐటీ ఊరటనిచ్చిన నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను అంతా స్వాగతించారు. కానీ, ఊహించని పరిణామాలతో మార్కెట్ లాభాలన్నీ ఆవిరైపోయాయి. అదానీ షేర్లు బేర్ గుప్పిట్లో చిక్కుకోవడంతో మార్కెట్ రోలర్ కోస్టర్‌ను తలపించింది.



## బడ్జెట్ మెప్పించినా... లాభాలు ఆవిరి

- ఫెడ్ రిజర్వ్ ద్రవ్య పాలసీ వెల్లడికి ముందు అప్రమత్తత
- కలవరపెట్టిన అదానీ గ్రూప్ షేర్లలో భారీ అమ్మకాలు
- గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ
- ద్వితీయార్థంలో రోలర్ కోస్టర్ రైడ్
- ఎదురీదిన ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు

**ముంబై:** వృద్ధి ప్రోత్సాహక బడ్జెట్ లాభాలను నిలుపుకోవడంలో స్టాక్ మార్కెట్ విఫలమైంది. కేంద్రమంత్రి ప్రసంగం ఆసాంతం భారీ లాభాలను ఆర్జించిన సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయి మిశ్రమంగా ముగిశాయి. ట్రేడింగ్‌లో 1,958 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 158 పాయింట్లు లాభంతో 59,708 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నిఫ్టీ 619 పాయింట్ల రేంజ్‌లో ట్రేడైంది. ఆఖరికి 46 పాయింట్ల నష్టంతో 17,616 వద్ద నిలిచింది. ద్వితీయార్థంలో నెలకొన్న అమ్మకాల సునామీలో ఐటీ, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లు మాత్రమే స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ప్రభుత్వరంగ బ్యాంక్స్, మెటల్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతం చొప్పున నష్టపోయాయి.

### ప్రథమార్థంలో భారీ లాభాలు

బడ్జెట్‌పై ఆశలతో ఉదయం సూచీలు ఉత్సాహంగా మొదలయ్యాయి. సెన్సెక్స్ 451 పాయింట్ల లాభంతో 60001 వద్ద, నిఫ్టీ 17,812 పాయింట్ల వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు, మూలధన వ్యయం భారీ పెంపు, ఎల్‌టీసీజీ పన్ను జోలికెళ్లకపోవడంతో ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చాయి. ఫలితంగా ప్రథమార్థంలో సెన్సెక్స్ 1,223 పాయింట్లు ఎగసి 60,773 వద్ద, నిఫ్టీ 310 పాయింట్లు దూసుకెళ్లి 17,662 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేశాయి.

### మిడ్‌సెషన్ నుంచి లాభాల స్వీకరణ

కేంద్ర మంత్రి ప్రసంగం ఆసాంతం అనూహ్యమైన ర్యాలీ చేసిన సూచీలు చివరి వరకు ఆ జోరును నిలుపుకోలేకపోయాయి. ట్రేడింగ్ ద్వితీయార్థంలో అదానీ గ్రూప్ షేర్లలో అనూహ్య అమ్మకాలు తలెత్తాయి. ఫెడ్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి నేపథ్యంలో అప్రమత్తత చోటు చేసుకుంది. గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్టం(60,773) నుంచి 1,958 పాయింట్లు పతనమై 58,817 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ గరిష్టం(17,972)నుంచి 619 పాయింట్లు క్షీణించి 17,353 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగొచ్చింది.

### అదానీ గ్రూప్ షేర్లు విలవిల...

అదానీ గ్రూప్ సంస్థలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక వెల్లడి నేపథ్యంలో క్రెడిట్ సూయిజ్ షాక్ ఇచ్చింది. అదానీ కంపెనీల రుణాల బాండ్లను స్వీకరించడం నిలిపివేసింది. దీంతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో అదానీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఈ గ్రూప్‌నకు చెందిన పది కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 26%, అదానీ పోర్ట్స్ 18%, అదానీ టోటల్ గ్యాస్ 10%, అంబుజా సిమెంట్స్ 17%, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు 6% క్షీణించాయి. అదానీ పవర్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ షేర్లు 5% లోయర్ సర్క్యూట్ తాకాయి. బుధవారం ఒక్క రోజే ఈ గ్రూప్ రూ.2 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌ను కోల్పోయింది.

స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపే అంశాలేవీ బడ్జెట్‌పై లేవు. వినియోగ ప్రాధాన్యత, మూలధన వ్యయం పెంపుతో తొలి దశలో ఆశావాదంతో ట్రేడయ్యాయి. బుల్స్ మెచ్చిన బడ్జెట్ ఇది. అయితే అదానీ గ్రూప్ సంక్షోభం, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య పాలసీ నిర్ణయాల వెల్లడికి అప్రమత్తత సెంటిమెంట్‌ను పూర్తిగా దెబ్బతీశాయి.

– ఎస్ రంగనాథన్, ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్

### మార్కెట్లో మరిన్ని సంగతులు...

- వార్షిక ప్రీమియం రూ.5 లక్షలకుపైన జీవిత బీమా పాలసీలపై పన్ను విధింపుతో బీమా కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎల్‌ఐసీ 4%, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ 7%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 6%, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ షేర్లు తొమ్మిది శాతం చొప్పున నష్టపోయాయి.
- మౌలిక వసతులకు పెద్దపీట వేస్తూ రూ.10 లక్షల కోట్ల నిధుల కేటాయింపు మౌలిక సదుపాయాల కంపెనీ షేర్లకు కలిసొచ్చింది. ఈ రంగానికి చెందిన సైమన్స్ 4%, కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్, హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ 3%, ఎల్ అండ్‌టీ 1.50%, అశోక బిల్డ్‌కాన్ 1.21% చొప్పున లాభపడ్డాయి.
- సిగరెట్లపై 16 శాతం పన్ను పెంపుతో గోడ్‌ఫ్రే ఫిలిప్స్, ఎన్‌టీసీ ఇండస్ట్రీస్, వీటీఎస్ ఇండస్ట్రీస్ షేర్లు 6%, 3.50%, మూడుశాతం నష్టపోయాయి. మరోవైపు గోల్డెన్ టొబాకో 4.58%, ఐటీసీ 2.50% చొప్పున లాభపడ్డాయి.
- బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో రియల్టీ, రైల్వే రంగ షేర్లు ప్రథమార్థంలో భారీగా ర్యాలీ చేశాయి. అయితే మార్కెట్ పతనంలో భాగంగా ఈ రంగాల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. రియల్టీ రంగ షేర్లు నాలుగు శాతం, రైల్వే షేర్లు తొమ్మిది శాతం చొప్పున నష్టపోయాయి.
- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకానికి తాజా బడ్జెట్‌లో రూ.79 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో సిమెంట్ రంగ షేర్లు బలపడ్డాయి. ఇండియా సిమెంట్స్, రామ్‌కో సిమెంట్స్, శ్రీరాం సిమెంట్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్ షేర్లు 4–1% చొప్పున లాభపడ్డాయి.

### ఈవీలకు ‘ఇంధనం’



ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లేందుకు, మద్దతు ఇవ్వడానికి చేసిన ప్రయత్నం 2023 బడ్జెట్‌లో ప్రతిబింబిస్తుంది. ఇది స్థిరమైన, భవిష్యత్తు, ప్రత్యామ్నాయ ఇంధన సాంకేతికతపై వృద్ధి చెందే కార్బన్–రహిత దేశాన్ని సృష్టించడానికి వీలు కల్పిస్తుంది. గ్రీన్ గ్రోత్, సుస్థిరత కింద కార్యక్రమాలు ఈవీల పట్ల అవగాహనను పెంపొందిస్తాయి. స్వచ్ఛమైన, పర్యావరణ అనుకూల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ సహకరించడంలో సహాయపడతాయని విశ్వసిస్తున్నాము.

– నవీన్ ముంజాల్, ఎండీ, హీరో ఎలక్ట్రిక్

### ప్రతికూలతల్లోనూ మంచి బడ్జెట్



కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లోనూ మంచి బడ్జెట్ ప్రకటించారు. మరింత మంది నర్సింగ్ నిపుణుల అవసరం నేపథ్యంలో 157 నర్సింగ్ కళాశాలల ఏర్పాటు నిర్ణయించడం ఆహ్వానించతగ్గది. ఆయుష్మాన్ భారత్‌కు 10% అదనంగా కేటాయించారు. మధ్యతరగతికి ఊరటనిచ్చేలా వ్యక్తిగత పన్ను శ్లాబులు, రేట్లను తగ్గించారు.

– కామినేని శశిధర్, ఎండీ, కామినేని హాస్పిటల్స్

### పరిశోధన, ఆవిష్కరణలకు ఊతం



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించే బాటలో కొత్త కార్యక్రమానికి శ్రీకారం. ఐసీఎంఆర్ ల్యాబొరేటరీలతో సహకారం, ఆర్‌అండ్‌డీలో పెట్టుబడులకు ప్రోత్సాహం ఔషధ రంగంలో ఆవిష్కరణలకు మద్దతునిస్తాయి. ఆరోగ్యానికి జీడీపీలో 2 శాతం కంటే అధికంగా కేటాయింపులు, వైద్య పరికరాల కోసం అంకితమైన మల్టీ–డిసిప్లినరీ కోర్సులు, సికిల్–సెల్ అనీమియాను తొలగించే లక్ష్యం, ఏఐ ఆధారిత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు ఆహ్వానించతగ్గ నిర్ణయాలు.

– సతీశ్ రెడ్డి, చైర్మన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్

### వినియోగ డిమాండ్‌కు ప్రోత్సాహం



2023–24 బడ్జెట్... ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే ఇన్‌ఫ్రాపై భారీ వ్యయం, స్థిర ఆర్థిక వృద్ధి, వినియోగ డిమాండ్‌ను ప్రోత్సహించే పటిష్ట నిర్మాణ ప్రణాళిక. 33% పెంపుతో మూలధన వ్యయం రూ.10 లక్షల కోట్లకు చేర్చడం.. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏకానమీగా భారత్‌ను నిలబెట్టేందుకు ప్రభుత్వ సంకల్పాన్ని స్పష్టం చేస్తోంది.

– సుమంత్ సిన్హా, ప్రెసిడెంట్, అసోచామ్

### ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతాయ్



వృద్ధి చక్రాన్ని కదలికలో ఉంచడానికి పెట్టుబడి, వినియోగానికి మద్దతు అవసరం. 33% అధికంగా మూలధన వ్యయం రూ.10 లక్షల కోట్లు ప్రకటించారు. ప్రభుత్వం మూలధన వ్యయంపై జోరు కొనసాగించడం సంతోషంగా ఉంది. ఇది ఇప్పటికీ క్లిష్టంగా ఉన్న ప్రపంచ ఆర్థిక పరిస్థితుల మధ్య సరైన దిశలో తాజా బడ్జెట్ ఒక అడుగు.

– సుబ్రకాంత్ పాండా, ప్రెసిడెంట్, ఫిక్కీ

# పెరగనున్న వెండి ధర

**కస్టమ్స్ సుంకం 10 శాతం పెంపు**



**న్యూఢిల్లీ:** వెండి, వెండి ఆభరణాల ధరలు మరింత ప్రియం కానున్నాయి. దోర్ (ముడి), కడ్డీలు, సెమీ–మాన్యుఫాక్చరింగ్ వస్తువులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 10 శాతానికి పెంచడం దీనికి నేపథ్యం. ప్రస్తుతం సిల్వర్ దోర్‌పై బేసిక్ కస్టమ్స్ సుంకం 6.1 శాతంగా ఉండగా, సెమీ–మాన్యుఫ్యాక్చర్డ్ వస్తువులపై ఈ సుంకం 7.5 శాతంగా ఉంది. దిగుమతుల కట్టడి, దేశీయ పరిశ్రమకు ప్రోత్సాహ లక్ష్యంగా తాజా బడ్జెట్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషణలు ఉన్నాయి. బంగారం, ప్లాటినం విషయంలో ఉన్న సుంకాలకు సమానంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. కాగా, తాజా నిర్ణయం ఆభరణాల తుది ధర పెరుగుదలకు దారితీస్తుందని, స్థానిక రిఫైనరీలకు ఈ నిర్ణయం సవాలుగా మారే అవకాశం ఉందని కమా జ్యువెలరీ వ్యవస్థాపకుడు, ఎండీ కోలిన్ షా పేర్కొన్నారు. ధరలు పెరుగుతాయన్న అభిప్రాయాన్ని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చైర్మన్ ఎంపీ అహ్మద్ కూడా అంగీకరించారు. వెండిలో భౌతికంగా పెట్టుబడులకు సంబంధించి భారత్ ప్రస్తుతం అమెరికా, జర్మనీ తర్వాత మూడవ అతి పెద్ద మార్కెట్‌గా ఉంది. దేశ వెండి దిగుమతులు 2022లో 8,000 టన్నుల రికార్డు స్థాయికి చేరాయి. ఆభరణాల వినియోగం పెరగడం దీనికి కారణం.

**‘ఎలక్ట్రానిక్ పసిడి’కి ప్రోత్సాహం**

ఇదిలావుండగా, భౌతిక బంగారాన్ని ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసిట్‌గా (ఈజీఆర్)గా మార్చినా, లేక ఈజీఆర్‌ను భౌతిక బంగారంగా మార్చుకున్నా మూలధన లాభం పన్ను (సీజీటీ) ఏదీ ఉండబోదని ప్రభుత్వం పేర్కొంది. ఈ మార్పును మార్పుగా పరిగణించబోమని బడ్జెట్ తెలిపింది. ‘ఎలక్ట్రానిక్’ బంగారంలో పెట్టుబడులను ప్రోత్సహించే నిర్ణయం ఇదని ఆర్థికమంత్రి పేర్కొన్నారు.

# విదేశీ ప్రయాణాలపై మరింత టీసీఎస్

**రూ.7 లక్షలకు మించి పంపినా ఇంతే**

**న్యూఢిల్లీ:** విదేశీ ప్రయాణ ప్యాకేజీలకు చెల్లించే మొత్తంపై మూలం వద్దే పన్ను వసూలు (టీసీఎస్) రేటు ఇప్పటివరకు 5% ఉంటే దాన్ని 20%కి పెంచారు. అలాగే, లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.7 లక్షలకు మించి విదేశాలకు పంపిస్తే ఆ మొత్తంపై 20% టీసీఎస్‌ను ప్రవేశపెట్టారు. 2023 జూలై 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే వారి తల్లిదండ్రులపై ఈ నిర్ణయం భారం మోపనుంది. పిల్లల విదేశీ విద్య ఫీజు, ఇతర ఖర్చులను తల్లిదండ్రులు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా పంపిస్తుంటారని, వీటిపై 20 శాతం పన్ను చెల్లించాల్సి రావడం భారమని నాంజియా ఆండర్సెన్ ఇండియా పార్ట్‌నర్ అమిత్ అగర్వాల్ పేర్కొన్నారు.

## వార్షిక ప్రీమియం రూ. 5 లక్షలు దాటితే బాదుడే

**బీమా మెచ్యూరిటీపై పన్ను**

**న్యూఢిల్లీ:** జీవిత బీమా పాలసీ గడువు ముగిసిన తర్వాత చేతికొచ్చే మొత్తంపై పన్నును కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కాకపోతే వార్షిక ప్రీమియం రూ.5 లక్షలకుపైన ఉండే పాలసీలకు సంబంధించిన మొత్తంపైనే పన్ను అమలు చేస్తారు. ఏటా జీవిత బీమా పాలసీకి చెల్లించే ప్రీమియం రూ.5 లక్షల వరకు ఉంటే, గడువు తీరిన తర్వాత వచ్చే మొత్తంపైనా ఇక ముందూ పన్ను ఉండదు. అలాగే, మరికొన్ని వెసులుబాట్లు కల్పించారు. యులిప్ పాలసీలకు ఇది వర్తించదు. అలాగే, పాలసీదారు మరణించిన సందర్భాల్లో పరిహారంగా అందుకునే మొత్తంపై పన్ను ఉండదు. అలాగే, 2023 మార్చి 31 నాటికి పాలసీ తీసుకుని, దానికి ప్రీమియం రూపంలో రూ.5 లక్షలకు పైన చెల్లించే వారికి సైతం మెచ్యూరిటీపై పన్ను పడదు. 2023 మార్చి 1 నుంచి ఒకరిపైనే ఒకటికి మించి పాలసీలు తీసుకుని, చెల్లించే ప్రీమియం మొత్తం రూ.5 లక్షలు మించినట్టయితే గడువు తీరిన తర్వాత అందుకునే మొత్తంపై పన్ను చెల్లించాల్సి ఉంటుందని ఫింటూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ హెడ్ నిధి మంచంద తెలిపారు.



# వ్యాపారాల నిర్వహణ సులభతరం..

- గుర్తింపు ధ్రువీకరణకు పాన్ చాలు..
- వివాదాల పరిష్కారానికి వీఎస్‌వీ–2

**న్యూఢిల్లీ:** వ్యాపారాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు కేంద్రం చర్యలు ప్రతిపాదించింది. వీటి ప్రకారం ఇకపై ప్రభుత్వ ఏజెన్సీల పరిధిలోని వివిధ డిజిటల్ వ్యవస్థలతో లావాదేవీల్లో వ్యాపార సంస్థలు తమ గుర్తింపు ధ్రువీకరణ కోసం పర్మనెంట్ అకౌంటు నంబరు (పాన్) కార్డు ఒక్కటే సమర్పించినా సరిపోనుంది. ప్రస్తుతం వ్యాపారాలకి అనుమతులు తీసుకునేందుకు జీఎస్‌టీఎస్, టిన్, ఈఎస్‌ఐసీ వంటి రకరకాల ఐడీలు అవసరమవుతున్నాయి. దేశీయంగా వ్యాపారాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు ఇది తోడ్పడగలదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మరోవైపు, వాణిజ్య వివాదాల పరిష్కారం కోసం వివాద్ సే విశ్వాస్–2 (వీఎస్‌వీ–2) స్కీమును ప్రవేశపెడుతున్నట్లు ఆమె తెలిపారు. అసెస్‌మెంటుకు సంబంధించి పన్నులు, వడ్డీలు, జరిమానాలు వంటి అంశాల్లో వివాదాల పరిష్కారానికి ఇది ఉపయోగపడనుంది.



**పన్ను వివాదాల తగ్గింపుపై దృష్టి ..**

పన్నుపరమైన వివాదాలను తగ్గించేందుకు కూడా ఆర్థిక మంత్రి ప్రతిపాదనలు చేశారు. ఒకే తరహా లీగల్ వివాదాలపై అప్పీళ్లు చేసేందుకు బోలెడంత సమయం, వనరులు వృధా అవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్దిష్ట చట్టాన్ని సవాలు చేసే కేసు ఏదైనా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉంటే.. ఐటీ శాఖ మళ్లీ అదే తరహా కేసు మరొకటి దాఖలు చేయకుండా వాయిదా వేసేలా కేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉండాలని ఆమె ప్రతిపాదించారు.

**రీక్లెయిమింగ్ సులభతరానికి ఐఈపీఎఫ్**

షేర్లు, డివిడెండ్ల రీక్లెయిమింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు సమీకృత ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్, ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్)ను ఏర్పాటు చేయనున్నట్లు సీతారామన్ చెప్పారు. ఇక, ఫీల్డ్ ఆఫీసుల్లో దాఖలయ్యే వివిధ రకాల ఫారంలను కేంద్రీకృతంగా హ్యాండిల్ చేసేందుకు కంపెనీల చట్టం కింద సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా కార్పొరేట్లకు మరింత వేగవంతంగా సమాచారం/స్పందన లభించగలదని ఆమె పేర్కొన్నారు.

**కేవైసీ.. ఈజీ..**

కస్టమర్ల వివరాల సేకరణకు సంబంధించిన నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రక్రియను సరళతరం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా అందరికీ ఒకే తరహా ప్రక్రియ పాటించడం కాకుండా ‘రిస్క్ ఆధారిత’ విధానాన్ని అమల్లోకి తేనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. వివిధ ప్రభుత్వ ఏజెన్సీలు, నియంత్రణ సంస్థలు, నియంత్రిత సంస్థల దగ్గర ఉండే వ్యక్తుల గుర్తింపు, చిరునామాలను ఒకే చోట అప్‌డేట్ చేసేలా నిర్దిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆమె ప్రతిపాదించారు. ఇందుకోసం డిజిలాకర్ సర్వీసును, ఆధార్‌ను ఉపయోగించనున్నారు. అలాగే, ఒకే సమాచారాన్ని వివిధ ప్రభుత్వ ఏజెన్సీలకు వేర్వేరుగా సమర్పించాల్సిన అగత్యం తప్పించేలా ఏకీకృత ఫైలింగ్ ప్రక్రియ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి ప్రతిపాదించారు.

# టీవీలు ఇక చౌక..

**రూ.3,000 వరకు తగ్గుదల**

**న్యూఢిల్లీ:** దేశీయంగా తయారయ్యే టెలివిజన్ సెట్స్ ధరలు సుమారు 5 శాతం తగ్గనున్నాయి. దిగుమతయ్యే ఓపెన్ సెల్ ప్యానెళ్లపై కస్టమ్స్ సుంకం 5 నుంచి 2.5 శాతానికి చేరుస్తూ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రభావంతో టీవీల ధర రూ.3,000 వరకు తగ్గనుందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఎల్‌ఈడీ టీవీ తయారీ వ్యయంలో ఓపెన్ సెల్ వాటా 60–70 శాతం ఉంటుంది. తయారీ కంపెనీల్లో సింహభాగం వీటిని విదేశాల నుంచి తెప్పించుకుంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయం దేశీయంగా విలువ పెరగడంతోపాటు పరిశ్రమ వృద్ధికి దోహదం చేస్తుందని కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్, అప్లయెన్సెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (సియామా) ప్రెసిడెంట్ ఎరిక్ బ్రగాంజా తెలిపారు. ‘ఇది పరిశ్రమకు మంచి ముందడుగు. దేశీయ తయారీకి ఊతమిస్తుంది. చాలా మంది తయారీదారులు వినియోగదార్లకు ఈ ప్రయోజనాలను బదలాయిస్తారు’ అని చెప్పారు.

**డిమాండ్ పెంచుతుంది..**

కస్టమ్స్ డ్యూటీ 2.5% తగ్గింపుతో విక్రయ ధర 5% దిగొస్తుందని సూపర్ ప్లాస్ట్రానిక్ (ఎస్‌ఎస్‌పీఎల్) సీఈవో అవనీత్ సింగ్ మార్వా తెలిపారు. టీవీ విడిభాగాలపై దిగుమతి సుంకం తగ్గింపు టెలివిజన్ పరిశ్రమకు బూస్ట్‌నిస్తుందని సోనీ ఇండియా ఎండీ సునీల్ నయ్యర్ అన్నారు. ‘ఈ బడ్జెట్ వివిధ రంగాలలో డిమాండ్, వినియోగదారుల వ్యయాన్ని ప్రోత్సహిస్తుంది. గణనీయమైన పన్ను ప్రయోజనాల కారణంగా కస్టమర్ల చేతిలో ఎక్కువ పునర్వినియోగపర్చదగిన ఆదాయం ఉంటుంది’ అని అన్నారు. మధ్య, ఉన్నత తరగతికి పన్ను తగ్గింపుతో పన్ను చెల్లింపుదార్ల చేతిలో ఎక్కువ డబ్బు ఉంటుంది. తద్వారా డిమాండ్, వినియోగాన్ని పెంచుతుందని ప్యానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా చైర్మన్ మనీశ్ శర్మ వివరించారు. దేశీయంగా తయారీ పెరుగుతుందన్నారు.



**జీవనశైలి మార్పుగా..**

ఈ తగ్గింపు తయారీదారులకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా సరసమైన ధరకు టెలివిజన్లను కొనుగోలు చేయడంతో చాలా మంది వినియోగదారుల జీవనశైలి మారుతుందని హాయర్ అప్లయాన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ సతీశ్ ఎన్ఎస్ తెలిపారు. పన్ను కుదింపు అసలైన గేమ్ చేంజర్ కాబోతోందని వీడియోటెక్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ అర్జున్ బజాజ్ అభిప్రాయపడ్డారు.

# దిగుమతి చేసుకునే కార్లు ప్రియం

**కస్టమ్స్ సుంకం పెంపు ● ఈవీలకూ ఇదే వర్తింపు**

**న్యూఢిల్లీ:** విదేశాల్లో పూర్తిగా తయారై (కంప్లీట్‌లీ బిల్ట్ యూనిట్స్/సీబీయూ) భారత్‌లోకి దిగుమతి అయ్యే ఎలక్ట్రిక్ కార్లు సహా అన్ని రకాల కార్లపై కస్టమ్స్ డ్యూటీ పెంచారు. విదేశాల్లో పూర్తిగా తయారైన వాటిని ‘సీబీయూ’లుగా చెబుతారు. 40,000 డాలర్ల కంటే తక్కువ ధర (ఇన్‌వాయిస్ వ్యాల్యూ) ఉన్నవి లేదంటే ఇంజిన్ సామర్థ్యం 3,000 సీసీ కంటే తక్కువ ఉన్న పెట్రోల్ కార్లు, 2,500 సీసీ కంటే తక్కువ సామర్థ్యం ఉన్న డీజిల్ ఇంజిన్ కార్లపై కస్టమ్స్ డ్యూటీని 60% నుంచి 70%కి పెంచారు. ఎలక్ట్రిక్ కార్లు 40,000 డాలర్లకు పైన ధర ఉంటే వాటిపై కస్టమ్స్ డ్యూటీని 60% నుంచి 70%కి పెంచారు. సెమీ నాక్డ్ డౌన్ (ఎస్‌కేడీ/పాక్షికంగా తయారైన) కార్లపై (ఎలక్ట్రిక్ సహా) కస్టమ్స్ డ్యూటీని 30% నుంచి 35%కి పెంచారు. ప్రస్తుతం విదేశాల్లో తయారై దిగుమతి అయ్యే కార్లు 40,000 డాలర్లు లేదా ఇంజిన్ సామర్థ్యం 3,000 సీసీ కంటే ఎక్కువ ఉన్న పెట్రోల్ కార్లు, 2,500 సీసీ మించిన డీజిల్ కార్లపై 100% కస్టమ్స్ డ్యూటీ ఉంది.

**2 శాతం వరకు పెరగనున్న ధరలు**

ప్రభుత్వం కస్టమ్స్ సుంకం పెంపు ప్రతిపాదనలతో కార్ల ధరలు 2 శాతం వరకు పెరుగుతాయని లగ్జరీ కార్ల తయారీ సంస్థలైన బీఎండబ్ల్యూ, మెర్సెడెజ్ బెంజ్, లెక్సస్ ప్రకటించాయి. బేసిక్ కస్టమ్స్ డ్యూటీ ప్రభుత్వం సవరించడంతో, ఎస్ క్లాస్ మేబ్యాచ్, జీఎల్‌బీ, ఈక్యూబీ ధరలపై ప్రభావం పడుతుందని మెర్సెడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. భారత్‌లోనే ఎక్కువ తయారీ చేస్తున్నందున 95 శాతం మోడళ్ల ధరలపై ప్రభావం ఉండదని చెప్పారు.






## ఫెడ్ మరోసారి వడ్డీ పెంపు

- వడ్డీ రేటు 0.25 శాతం అప్



**న్యూయార్క్:** యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేటును పెంచింది. పావు శాతం హెచ్చించింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 4.5–4.75 శాతానికి చేరాయి. వేగంగా బలపడుతున్న ద్రవ్యోల్బణం అదుపునకు ఫెడ్ కొంతకాలంగా వడ్డీ రేట్లను పెంచుతూ వస్తున్న సంగతి తెలిసిందే. నిజానికి రేట్ల నిర్ణయానికంటే తదుపరి ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ నిర్వహించనున్న విలేకరుల సమావేశానికి ప్రాధాన్యమున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

## ల్యాబ్ వజ్రాల ముడిపదార్థాలపై దిగుమతి సుంకాల తగ్గింపు



ల్యాబ్‌లో ఉత్పత్తి చేసే వజ్రాల (ఎల్‌జీడీ) తయారీలో ఉపయోగించే సీడ్స్ (ముడిపదార్థం)పై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కేంద్రం ప్రతిపాదించింది. సహజసిద్ధ వజ్రాల నిల్వలు తగ్గిపోతుండటంతో పరిశ్రమ ఎల్‌జీడీల వైపు మళ్లుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ నేపథ్యంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సీడ్స్‌పై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని తగ్గించాలని నిర్ణయించినట్లు ఆమె పేర్కొన్నారు. సహజసిద్ధ డైమండ్ల కటింగ్, పాలిషింగ్‌లో భారత్ అంతర్జాతీయ దిగ్గజంగా ఉంది.

## వృద్ధి ఆధారితం

బడ్జెట్ వృద్ధి ఆధారితమైంది. పెట్టుబడులపై నిరంతర దృష్టితో ఆర్థికంగా వివేకం కలిగి ఉంది. భారతదేశపు మొదటి అమృత్ కాల్ బడ్జెట్ 2047 నాటికి విక్షిత్ భారత్‌కు బలమైన పునాదులు వేసింది. మూలధన వ్యయంపై నిరంతర దృష్టి మొత్తం ఆర్థిక ఉత్పాదకతను పెంచుతుంది.

\- చంద్రజీత్ బెనర్జీ, డైరెక్టర్ జనరల్, సీఐఐ.



## బిజినెస్ రీల్

### అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీవో ఉపసంహరణ



**ముంబై:** ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయినప్పటికీ ఇష్యూను ఉపసంహరించుకోవాలని అదానీ గ్రూప్ నిర్ణయించింది. ప్రస్తుతం అసాధారణ పరిస్థితులు, మార్కెట్లో తీవ్ర ఒడిదుడుకులు నెలకొన్న నేపథ్యంలో ఇన్వెస్టర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. ఎఫ్‌పీవో ద్వారా సేకరించిన నిధులను ఇన్వెస్టర్లకు తిరిగి ఇవ్వనున్నట్లు సంస్థ చైర్మన్ గౌతమ్ అదానీ తెలిపారు. తమ బ్యాలెన్స్ షీట్ పటిష్టంగానే ఉందని, రుణాల తిరిగి చెల్లింపుల్లో మంచి ట్రాక్ రికార్డు ఉందని పేర్కొన్నారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ. 20,000 కోట్ల ఎఫ్‌పీవో జనవరి 31న ముగిసిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్టుతో బుధవారం కూడా గ్రూప్ సంస్థల షేర్లు భారీగా నష్టపోయిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఆసియా కుబేరుడిగా మళ్లీ అంబానీ



**న్యూఢిల్లీ:** హిండెన్‌బర్గ్ రిపోర్టు పరిణామాలతో పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ ప్రపంచ టాప్ 10 కుబేరుల జాబితాలో స్థానం కోల్పోయారు. దీంతో ఆ లిస్టులో ఆసియా దేశాల నుంచి ఏకైక కుబేరుడిగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ నిల్చారు. ఫోర్బ్స్ వెబ్‌సైట్ ప్రకారం 83.7 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన తొమ్మిదో స్థానంలో ఉన్నారు. గత వారం వరకు మూడో స్థానంలో కొనసాగిన అదానీ ర్యాంకు తాజాగా 15వ స్థానానికి తగ్గింది. ఆయన సంపద 75.1 బిలియన్ డాలర్లుగా ఉంది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)



| 2-2-2023 | |
|---|---|
| విశాఖ | 460–00 |
| చిత్తూరు | 473–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 445–00 |
| విజయవాడ | 445–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **1-2-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 423–00 |
| వరంగల్ | 425–00 |
| రిటైల్ ధర | 4.85 |

### నిఫ్టీ 50 — టాప్ 10 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ICICIBANK | 850.05 | 2.18 |
| JSWSTEEL | 731.45 | 2.09 |
| ITC | 359.6 | 2.06 |
| TATASTEEL | 122.05 | 1.96 |
| BRITANNIA | 4,389.95 | 1.68 |
| CIPLA | 1,033.00 | 1.48 |
| HDFCBANK | 1,625.50 | 1.37 |
| TATACONSUM | 739.1 | 1.32 |
| EICHERMOT | 3,305.70 | 1.3 |
| HDFC | 2,655.00 | 1.22 |

### నిఫ్టీ 50 — టాప్ 10 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ADANIENT | 2,179.75 | -26.7 |
| ADANIPORTS | 504 | -17.73 |
| HDFCLIFE | 516.4 | -10.79 |
| SBILIFE | 1,114.50 | -8.61 |
| BAJAJFINSV | 1,269.35 | -5.45 |
| SBIN | 527 | -4.79 |
| INDUSINDBK | 1,040.40 | -3.93 |
| BPCL | 335.45 | -2.27 |
| UPL | 740 | -2.27 |
| M&M | 1,350.10 | -2.08 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 8,257 |
| ఎన్ఎస్ఈ | 81,995 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 2,82,61,182 |
| ఎఫ్ఐఐ | + 1,785 |
| డీఐఐ | + 529 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 76.80 $ | 78.87 |
| బ్రెంట్ | 83.21 $ (రాత్రి 11.30 మంగళవారం) | 85.46 (క్రితం ముగింపు) |

# ఎంఎస్ఎంఈలకు చేయూత..

**రుణ హామీ పథకానికి రూ. 9,000 కోట్లు**

**న్యూఢిల్లీ:** లఘు, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) చేయూతనిచ్చే దిశగా రుణ హామీ పథకాన్ని కేంద్రం మరింత మెరుగ్గా తీర్చిదిద్దింది. ఇందుకోసం రూ. 9,000 కోట్లు కేటాయించింది. 2023 ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. అదనంగా రూ. 2 లక్షల కోట్ల తనఖా లేని రుణాలకు ఈ స్కీము ఉపయోగపడగలదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అలాగే రుణ వ్యయం కూడా 1 శాతం మేర తగ్గుతుందని పేర్కొన్నారు. కోవిడ్ కష్టకాలంలో కాంట్రాక్టులను పూర్తి చేయలేని ఎంఎస్ఎంఈలకు ఊరటనిచ్చే నిర్ణయం కూడా తీసుకున్నారు. అవి జమ చేసిన లేదా సమర్పించిన పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీని జప్తు చేసుకుని ఉంటే.. అందులో 95 శాతం మొత్తాన్ని ప్రభుత్వం, ప్రభుత్వ ఏజెన్సీలు వాపసు చేస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలను ఆర్థిక వ్యవస్థ వృద్ధి చోదకాలుగా ఆమె అభివర్ణించారు. ఎంఎస్ఎంఈలు, బడా వ్యాపార సంస్థలు, చారిటబుల్ ట్రస్టుల కోసం డిజిలాకర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పత్రాలను ఆన్‌లైన్‌లో భద్రపర్చుకునేందుకు, అవసరమైనప్పుడు బ్యాంకులు, నియంత్రణ సంస్థలు మొదలైన వాటితో షేర్ చేసుకునేందుకు ఇది ఉపయోగపడగలదని మంత్రి చెప్పారు.



### ప్రిజంప్టివ్ ట్యాక్సేషన్ ఉపశమనం..

ఎంఎస్ఎంఈలు ప్రస్తుతం కల్పిస్తున్న ప్రిజంప్టివ్ ట్యాక్సేషన్ విషయంలో మరింత వెసులుబాటు లభించింది. వృత్తి నిపుణులు అయితే వార్షిక ఆదాయం రూ.50 లక్షల్లోపు, ఎంఎస్ఎంఈలు అయితే వార్షిక టర్నోవర్ రూ.2 కోట్ల వరకు ఉంటే ఆదాయపన్ను చట్టం కింద ప్రిజంప్టివ్ ఇన్‌కమ్ (ఊహించతగిన ఆదాయం) పథకానికి అర్హులు. తాజా ప్రతిపాదన ప్రకారం సంస్థలు తమ వార్షిక టర్నోవర్ లేదా స్థూల చెల్లింపుల స్వీకరణల్లో నగదు రూపంలో స్వీకరించే మొత్తం 5 శాతంలోపు ఉంటే ప్రిజంప్టివ్ స్కీమ్ కింద మరింత ప్రయోజనం పొందొచ్చు. అంటే తమ వార్షిక టర్నోవర్‌లో 5 శాతం లోపు నగదు స్వీకరించే సంస్థలు వార్షిక టర్నోవర్ రూ.3 కోట్ల వరకు ఉన్నా, వృత్తి నిపుణుల ఆదాయం రూ.75 లక్షల వరకు ఉన్నా ప్రయోజనానికి అర్హులు. ఎంఎస్ఎంఈలకు సకాలంలో చెల్లింపులు జరిపేందుకు వీలుగా.. వాస్తవంగా ఆ చెల్లింపులు చేసినప్పుడే అందుకు అయ్యే వ్యయాలను మినహాయించుకునే విధంగా నిబంధనలు మార్చారు. ప్రిజంప్టివ్ స్కీమ్ నిబంధనల కింద చిన్న వ్యాపార సంస్థలు తమ టర్నోవర్‌లో 8 శాతం కింద (నాన్ డిజిటల్ రిసీప్ట్స్) లాభంగాను, డిజిటల్ లావాదేవీల రూపంలో స్వీకరించినట్టయితే టర్నోవర్‌లో 6 శాతాన్ని లాభం కింద చూపించి పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

## టాప్ గేర్‌లో కార్ల అమ్మకాలు

- 2023 తొలి నెలలో జోరు



**ముంబై:** కొత్త క్యాలెండర్ ఏడాది(2023) తొలి నెలలో కార్ల అమ్మకాలు జోరందుకున్నాయి. దిగ్గజాలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, టీకేఎం, కియా ఇండియా, హ్యుందాయ్ జనవరిలో పటిష్ట విక్రయాలను సాధించాయి. అయితే ఎంజీ మోటార్, హోండా మాత్రం వాహన విక్రయాలలో వెనకడుగు వేశాయి. మారుతీ 12 శాతం అధికంగా 1,72,535 వాహనాలను విక్రయించగా.. ఎంఅండ్ఎం 37 శాతం వృద్ధితో 64,335 వాహనాలను అమ్మింది. ఈ బాటలో టాటా మోటార్స్ అమ్మకాలు సైతం 6 శాతం పుంజుకుని 81,069 వాహనాలకు చేరాయి. టయోటా కిర్లోస్కర్ మోటార్(టీకేఎం) అమ్మకాలు 175 శాతం జంప్‌చేసి 12,835 యూనిట్లను తాకాయి. కియా ఇండియా అమ్మకాలు 48 శాతం మెరుగుపడి 28,634 యూనిట్లకు చేరగా.. హ్యుందాయ్ మోటార్ ఇండియా 17 శాతం అధికంగా 62,276 వాహనాలను విక్రయించింది.

## జనవరిలో 'తయారీ' నెమ్మది



**న్యూఢిల్లీ:** భారత్ తయారీ రంగం జనవరిలో నెమ్మదించింది. మొత్తం అమ్మకాల్లో వేగం లేకపోవడం దీనికి కారణం. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జనవరిలో 55.4గా నమోదయ్యింది. డిసెంబర్‌లో ఈ సూచీ 57.8 వద్ద ఉంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తగినంత సిబ్బంది ఉండడం వల్ల ఈ సంఖ్యలో ఎటువంటి పెరుగుదలా నమోదుకాలేదని తమ సర్వే వెల్లడించినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. కాగా, సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సూచీ 19 నెలలుగా అప్‌ట్రెండ్‌లోనే ఉందన్నమాట. నెలవారీగా నెమ్మదించినప్పటికీ, తయారీ రంగం అప్‌ట్రెండ్ ధోరణిలోనే ఉన్నట్లు పోలీయానా డీ లిమా తెలిపారు. కాగా, ద్రవ్యోల్బణానికి సంబంధించి డిసెంబర్‌లో కొంత ఒత్తిడి ఉన్నట్లు తమ సర్వేలో వెల్లడయినట్లు డీ లిమా పేర్కొన్నారు.

## సీతమ్మ పత్రాల్లో..



### ఐఎఫ్ఎస్‌సీ బిజినెస్‌కు బూస్ట్

గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీలో బిజినెస్ యాక్టివిటీని ప్రోత్సహించే బాటలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితర పలు చర్యలు ప్రకటించారు. వీటిలో ట్రేడ్ రీఫైనాన్సింగ్‌కు వీలుగా ఎగ్జిమ్ బ్యాంకు అనుబంధ సంస్థ ఏర్పాటు, ఐఎఫ్ఎస్‌సీ బ్యాంకింగ్ యూనిట్ల కొనుగోలుకి విదేశీ బ్యాంకులను అనుమతించడం వంటివి ఉన్నాయి. అంతే కాకుండా ఆర్బిట్రేషన్, అనుబంధ సర్వీసులకు చట్టబద్ధ ప్రొవిజన్లు, ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్) చట్ట ప్రకారం డ్యుయల్ రెగ్యులేషన్‌ను నివారించేందుకు ఐఎఫ్ఎస్‌సీఏ చట్టానికి సవరణలు ప్రతిపాదించారు.

### 'ఇంటి'పై ఎల్‌టీసీజీ పరిమితి రూ.10 కోట్లే

ఇల్లు లేదా ఇతర క్యాపిటల్ అసెట్స్ కొనుగోలు చేసి విక్రయించగా వచ్చే దీర్ఘకాల మూలధన లాభాలపై (ఎల్‌టీసీజీ) పన్ను మినహాయింపునకు ఆర్థిక మంత్రి సీతారామన్ పరిమితి తీసుకొచ్చారు. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54, 54ఎఫ్ కింద గరిష్టంగా 10 కోట్ల మొత్తానికే పన్ను మినహాయింపు పరిమితం చేశారు. అంటే ఒక ఇల్లు లేదా ఇతర క్యాపిటల్ పెట్టుబడులను విక్రయించినప్పుడు వచ్చే దీర్ఘకాల మూలధన లాభాన్ని, మరో ఇంటిని కొనుగోలు చేయడం ద్వారా పన్ను లేకుండా చేసుకోవచ్చు. కాకపోతే ఈ మూలధన లాభం రూ.10కోట్లకు మించి ఉంటే ఆ మొత్తంపై ఇక మీదట పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మరీ ఖరీదైన ఆస్తుల కొనుగోలుపై పన్ను మినహాయింపులు తగ్గించేందుకే ఇలా చేశారు. పన్నుల్లో రాయితీలు, మినహాయింపులను మరింత మెరుగ్గా మార్చే లక్ష్యంతో రూ.10 కోట్లకు పరిమితం చేసినట్టు మంత్రి చెప్పారు. ఇందులో సెక్షన్ 54 అన్నది ఒక ఇంటిని అమ్మగా వచ్చే దీర్ఘకాల మూలధన లాభాన్ని తీసుకెళ్లి మరో ఇంటి కొనుగోలు చేయడం ద్వారా మినహాయింపునకు సంబంధించినది.

### టెలికం ఆదాయ లక్ష్యం రూ.89,469 కోట్లు

ప్రభుత్వం 2023–24లో టెలికం రంగం నుండి పన్నుయేతర ఆదాయ అంచనాను 30 శాతం పెంచి రూ.89,469.17 కోట్లకు చేర్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో ఈ ఆదాయాలు అంచనాలను మించి (రూ. 52,806 కోట్లు) రూ.68,784 కోట్లుగా నమోదయ్యాయి. 2021–22లో ఈ వాస్తవ రెవెన్యూ పరిమాణం రూ.85,828 కోట్లు. కమ్యూనికేషన్ రంగం నుండి వచ్చే పన్నుయేతర ఆదాయం ప్రధానంగా టెలికం ఆపరేటర్ల నుండి లైసెన్స్ ఫీజులు, స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీల రూపంలో ఉంటుంది.

### ఆయిల్ కంపెనీలకు ఉపశమనం

ప్రభుత్వరంగ చమురు విక్రయ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. 10 నెలలుగా పెట్రోల్, డీజిల్ విక్రయ ధరలను సవరించకుండా నష్టపోయిన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐవోసీ కోసం రూ.30,000 కోట్లను ఆర్థిక మంత్రి కేటాయించారు. అంతర్జాతీయంగా ధరలు గణనీయంగా పెరిగినప్పటికీ, 2021 ఏప్రిల్ 6 నుంచి ఈ సంస్థలు ధరలను సవరించకుండా విక్రయిస్తున్నాయి. బ్యారెల్ చమురు ధర 116 డాలర్లకు వెళ్లిన సమయంలో వాటికి ఎక్కువ నష్టం వచ్చింది. ఆ తర్వాత చమురు ధరలు తగ్గడంతో పెట్రోల్‌పై లాభం వస్తుండగా, డీజిల్‌పై ఇప్పటికీ నష్టపోతున్నాయి. 2022–23లో ఏప్రిల్–సెప్టెంబర్ కాలానికి ఈ మూడు ఉమ్మడిగా రూ.21,200 కోట్ల నష్టాలను ప్రకటించడం గమనార్హం. పైగా వీటికి రెండేళ్లుగా ఎల్పీజీ సబ్సిడీ చెల్లింపులు కూడా చేయలేదు. దీంతో రూ.50,000 కోట్లను ఇవ్వాలని అవి కోరగా, ప్రభుత్వం రూ.30,000 కోట్లను కేటాయించింది.

### సీఎస్ఆర్ కొనుగోళ్లకు జీఎస్‌టీ ఐటీసీ లేదు

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద కంపెనీలు నిర్వహించే సేవా కార్యక్రమాల కోసం.. కొనుగోలు చేసే ఉత్పత్తులు, సేవలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్ చేసుకోవడానికి ఇక మీదట అనుమతించరు. ఇందుకు సంబంధించి జీఎస్‌టీ చట్టంలో కావాల్సిన సవరణను ఆర్థిక బిల్లు 2023లో ప్రవేశపెట్టారు. కొన్ని రకాల అపరాధాల్లో విచారణ ప్రారంభించడాన్ని రూ.2 కోట్ల విలువకు పెంచారు. నకిలీ ఇన్వాయిస్‌ల నేరంలో విచారణ పరిమితి రూ.కోటిగానే ఉంటుంది.

### పీఎస్‌యూ పెట్టుబడులు ప్లస్

విద్యుత్ శాఖలోని ప్రభుత్వ రంగ కంపెనీల పెట్టుబడి ప్రతిపాదనలను తాజా బడ్జెట్ 15 శాతం పెంచింది. 2023–24 ఏడాదికి రూ. 60,805 కోట్లకు చేర్చింది. అయితే 2022–23 బడ్జెట్ అంచనాలు రూ. 51,470 కోట్లుకాగా.. సవరించిన తాజా అంచనాలు రూ. 52,878 కోట్లను తాకాయి. డాక్యుమెంట్ ప్రకారం వచ్చే ఏడాదికి అత్యధికంగా ఎన్‌హెచ్‌పీసీ రూ. 10,857 కోట్లు(ఈ ఏడాది రూ. 7,129 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది.

### ఎన్ఐఎస్ఎం ప్రమాణాల బాధ్యత సెబీకి

సెక్యూరిటీల మార్కెట్‌లో నిపుణుల లభ్యతను పెంచేందుకు, శిక్షణా సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ (ఎన్ఐఎస్ఎం)లో బోధనకు సంబంధించిన ప్రమాణాలు, నిబంధనల రూపకల్పన, నియంత్రణ, నిర్వహణ బాధ్యతలను సెబీకి అప్పగించాలని ప్రతిపాదించింది. అంతర్జాతీయంగా పేరొందిన ఫైనాన్షియల్ మార్కెట్ సర్టిఫయింగ్ సంస్థల్లో ఎన్ఐఎస్ఎం కూడా ఒకటి. ఇది 20 పైచిలుకు సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు అందిస్తోంది.

## వీరి స్పందన ఇది..

### ఆర్థిక వ్యవస్థకు సానుకూలం



జీడీపీలో 3.3 శాతానికి, పీఎం ఆవాస్ యోజనకు 66 శాతం పెంచి రూ.79,000 కోట్లకు, ఎంఎస్ఎంఈలకు రూ.9,000 కోట్ల రుణ హామీ పథకానికి వరుసగా మూడో ఏడాది మూలధన వ్యయాన్ని అధికం చేసి రూ.10 లక్షల కోట్లకు చేర్చడం ఆర్థిక వృద్ధిపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. రేపటికి సుస్థిర నగరాలను అభివృద్ధి చేయడానికి పట్టణ ప్రణాళిక సంస్కరణలపై దృష్టిని కొనసాగించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఎన్‌హెచ్‌బీకి రూ.10,000 కోట్లు కేటాయించడం హర్షణీయ పరిణామం.

\- హర్షవర్ధన్ పటోడియా, ప్రెసిడెంట్, క్రెడాయ్ నేషనల్.

### వాణిజ్య వాహన విక్రయాల పెంపునకు దోహదం



ఇన్‌ఫ్రాకు రూ.10 లక్షల కోట్ల మూలధన వ్యయం ఖచ్చితంగా వాణిజ్య వాహన విక్రయాలకు సహాయం చేస్తుంది. ప్రభుత్వ పాత వాహనాలను రద్దు చేయాలనే లక్ష్యం అన్ని విభాగాల అమ్మకాలను పెంచుతుంది. వ్యక్తిగత పన్ను శ్లాబులను తగ్గించడంతో ఎంట్రీ లెవెల్ ద్విచక్ర, త్రిచక్ర వాహన విక్రయాలకు జోష్‌నింపుతుంది. లిథియం అయాన్ బ్యాటరీల దిగుమతి సుంకం తగ్గింపుతో ఈవీల ధరలు దిగొస్తాయి. దీంతో సామాన్యులకు ఈవీలు చేరువ అవుతాయి.

\- మనీశ్ రాజ్ సింఘానియా, ప్రెసిడెంట్, ఎఫ్ఏడీఏ.

### ఆరోగ్య రంగంపై అధిక దృష్టి



వైద్య రంగానికి భారీ మొత్తాన్ని కేటాయించడం ద్వారా కరోనా మహమ్మారి నుండి ప్రభుత్వం అనేక విషయాలను నేర్చుకున్నట్లు, ఆరోగ్య సంరక్షణ మీద మరింతగా దృష్టి సారించినట్లు అవగతమవుతున్నది. ఐసీఎంఆర్, ల్యాబ్‌లను విస్తరించే యోచన స్పష్టంగా కనిపిస్తున్నది. ఉమ్మడి పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలకు చెందిన విద్యావేత్తలకు, ప్రైవేట్ రంగానికి చెందిన ఆర్ అండ్‌డీ బృందాల పరిశోధనలకు ఇది సానుకూలమైన విషయం.

\- అనిల్ కృష్ణ, సీఎండీ, మెడికవర్ హాస్పిటల్స్.

### మా చర్చలు కొనసాగిస్తాం..



బంగారం, వెండి, ప్లాటినంపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని పరిశ్రమ సిఫార్సు చేసింది. మా విన్నపాన్ని బడ్జెట్‌లో పరిగణలోకి తీసుకోలేదు. పరిశ్రమ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంతో ఈ విషయంపై చర్చలు కొనసాగిస్తాం. ముడి వెండి (డోర్), బార్‌లు, వస్తువులపై దిగుమతి సుంకాన్ని పెంచాలని ప్రతిపాదించడం ద్వారా.. బంగారం, ప్లాటినం మాదిరిగా వెండిపై దిగుమతి సుంకాన్ని హేతుబద్ధం చేశారు. దీంతో నికరంగా దిగుమతి స్థాయిలో వెండిపై సుంకం 5 శాతం పెరిగింది. దీని ప్రభావంతో వెండి వస్తువులు దేశీయంగా ప్రియం అవుతాయి.

\- విపుల్ షా, చైర్మన్, జీజేఈపీసీ.

### బంగారంపై సుంకం తగ్గింపు హర్షణీయమే.. కానీ!



బంగారంపై దిగుమతి సుంకాన్ని 12.5 నుంచి 10 శాతానికి తగ్గించడం సరైన దిశలో ఒక అడుగు. అయితే.. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ సెస్ పెంపుతో మొత్తం సుంకాన్ని 15 శాతానికి తీసుకువచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పసిడి ధరలు పెరిగిన సమయంలో అధిక పన్నులు బంగారాన్ని అసెట్ క్లాస్‌గా మార్చే ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తాయి.

\- సోమసుందరం పీఆర్, ఇండియా సీఈవో, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్.

### దీర్ఘకాలిక వృద్ధి



మూలధన వ్యయం 33 శాతం పెరుగుదల ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది ఉపాధి అవకాశాలను మరింతగా సృష్టిస్తుంది. ప్రైవేట్ రంగం నుండి పెట్టుబడులకు ఊతమిస్తుంది. అనేక రవాణా మౌలిక ప్రాజెక్టులు, 50 కొత్త విమానాశ్రయాలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ప్రాధాన్యతను పెంచుతాయి. వారితో పాటు సంస్థలు, వ్యాపారాల ప్రవాహంతో పాటు రియల్టీ అభివృద్ధి చెందుతుంది.

\- ఎం.నంద కిశోర్, ఎండీ, రామ్‌కీ ఎస్టేట్స్, ఫామ్స్.

# బ్యాం'కింగ్' నుంచి రూ.48,000 కోట్ల డివిడెండ్




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థల నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.48,000 కోట్ల డివిడెండ్‌ను అంచనా వేస్తున్నట్లు బడ్జెట్ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) ఈ తరహా రాబడి బడ్జెట్ లక్ష్యం రూ.73,948 కోట్లుకాగా, చాలా తక్కువగా రూ.40,953 కోట్లు ఒనగూడుతుందన్నది తాజా అంచనా. ఈ లెక్కన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కన్నా వచ్చే ఆర్థిక సంవత్సరం డివిడెంట్ దాదాపు 17 శాతం అధికం. 2022 మేలో జరిగిన బోర్డ్ సమావేశంలో ప్రభుత్వానికి రూ.30,307 కోట్ల డివిడెండ్ పేమెంట్లను చెల్లించడానికి ఆర్‌బీఐ ఆమోదముద్ర వేసింది.

**ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ.43,000 కోట్లు..**


బడ్జెట్ డాక్యుమెంట్ ప్రకారం, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర ఇన్వెస్ట్‌మెంట్ల నుంచి 2023–24 సంవత్సరంలో రూ.43,000 కోట్ల డివిడెండ్లు రానున్నాయి. 2022–23 సవరిత అంచనాల ప్రకారం, రూ. 43,000 కోట్లు ఒనగూరుతున్నాయి. 2022–23 బడ్జెట్ అంచనా రూ.40,000 కోట్లకన్నా ఇది అధికం.

**మొత్తం డివిడెండ్ ఇలా...**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) సవరిత అంచనా (ఆర్ఈ) ప్రకారం, మొత్తంగా రూ.1,08,592 కోట్ల డివిడెండ్ ఒనగూరనుంది. రానున్న 2023–24లో ఈ వసూళ్లు రూ.1,15,820 కోట్లకు చేరనున్నాయి.

## డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్ డౌన్

- వచ్చే ఏడాది(2023–24) టార్గెట్ రూ. 61,000 కోట్లు



**న్యూఢిల్లీ:** తాజా బడ్జెట్(2023–24)లో ప్రభుత్వ రంగ సంస్థల డిజిన్వెస్ట్‌మెంట్ లేదా ప్రయివేటైజేషన్ ద్వారా సమకూర్చుకోదలచిన నిధుల లక్ష్యానికి కోతపెట్టినట్లు ఆర్థిక శాఖ అధికారులు తెలియజేశారు. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన డిజిన్వెస్ట్‌మెంట్(క్యాపిటల్ రిసీప్ట్స్) అంచనాను రూ. 50,000 కోట్లుగా పేర్కొన్నారు. ఇవి 2022–23 బడ్జెట్ అంచనాలు రూ. 65,000 కోట్లతో పోలిస్తే రూ. 15,000 కోట్లు తక్కువకావడం గమనార్హం! కాగా.. ఏప్రిల్ 1నుంచి ప్రారంభమయ్యే వచ్చే ఆర్థిక సంవత్సరానికి మిస్‌లేనియస్ క్యాపిటల్ రిసీప్ట్స్‌ను రూ. 51,000 కోట్లుగా తాజా బడ్జెట్ పేర్కొంది. ఇవికాకుండా ప్రభుత్వ ఆస్తుల మానిటైజేషన్ ద్వారా 2022–23, 2023–24లలో మరో రూ. 10,000 కోట్లను సమకూర్చుకోగలమని అంచనా వేసింది. క్యాపిటల్ రిసీప్ట్స్ బడ్జెట్ పద్దులో మిస్‌లేనియస్ రిసీప్ట్స్ పేరుతో విడిగా డిజిన్వెస్ట్‌మెంట్‌ను నమోదు చేసే సంగతి తెలిసిందే. వెరసి సవరించిన అంచనాల ప్రకారం ఈ ఏడాది డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ. 60,000 కోట్లుకాగా.. వచ్చే ఏడాదికి రూ. 61,000 కోట్లుగా అధికారిక వర్గాలు వివరించాయి. ఇక దీపమ్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం పూర్తి ఏడాది లక్ష్యం రూ. 65,000 కోట్లుకాగా.. ప్రభుత్వం ఇప్పటివరకూ సీపీఎస్ఈలలో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా రూ. 31,100 కోట్లను సమకూర్చుకుంది.

### బ్యాంకింగ్ చట్టాలకు సవరణలు

ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు, బ్యాంకుల నిర్వహణను మెరుగుపర్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకింగ్ రెగ్యులేషన్, బ్యాంకింగ్ కంపెనీస్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాల్లో నిర్దిష్ట సవరణలను ప్రతిపాదించారు. మరిన్ని వినూత్న ఫిన్‌టెక్ సేవలను అందించేందుకు డిజిలాకర్‌లో ఉండే పత్రాల వినియోగ పరిధిని పెంచనున్నట్లు ఆమె తెలిపారు.

## క్లుప్తంగా...

### తెలుగు వర్సిటీ దూరవిద్య కేంద్రం ఫలితాలు వెల్లడి

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం 2020–21వ విద్యా సంవత్సరానికి 2022 నవంబరులో వివిధ కోర్సులకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. బ్యాక్ లాగ్ కోర్సులైన ఎంఏ (జ్యోతిషం, తెలుగు, సంస్కృతం, టూరిజం మేనేజ్‌మెంట్), బీఏ (కర్నాటక సంగీతం, స్పెషల్ తెలుగు)లతో పాటు.. ప్రస్తుతం నిర్వహిస్తున్న కోర్సులు పీజీ డిప్లొమా ఇన్ జ్యోతిర్వాస్తు, డిప్లొమా (లలిత సంగీతం, ఫిల్మ్ రైటింగ్, జ్యోతిషం), సర్టిఫికెట్ కోర్సులైన జ్యోతిషం, సంగీత విశారదల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు గతేడాది నవంబరులో నిర్వహించిన పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడవచ్చని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య సి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

### కొత్తగా ఇద్దరికి కరోనా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 3991 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఇద్దరు వైరస్ బారిన పడినట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కరోజులో కరోనా నుంచి నలుగురు కోలుకోగా, ప్రస్తుతం 23 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు ఆయన వెల్లడించా రు.

### బొగ్గు రవాణాలో సింగరేణి కొత్త రికార్డు

**జనవరిలో 68.4 లక్షల టన్నులు రవాణా**

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ జనవరిలో 68.4 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసి రికార్డు సృష్టించిందని ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2016 మార్చిలో నమోదు చేసిన 64.7 లక్షల టన్నుల బొగ్గు రవాణా రికార్డును అధిగమించిందని వెల్లడించింది. సగటున రోజుకు 39 రైళ్ల ద్వారా జనవరిలో మొత్తం 1216 రేకుల ద్వారా బొగ్గు రవాణా చేసినట్టు తెలిపింది. తెలంగాణ జెన్‌కో, ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు రవాణా జరిగింది. గత డిసెంబరులో గరిష్ఠంగా 1186 రేకుల ద్వారా బొగ్గు రవాణా జరిపిన రికార్డును సైతం జనవరి నెల అధిగమించిందని సంస్థ తెలిపింది.

### అడ్వాన్స్ రిజర్వేషన్‌కు ఆర్టీసీ రాయితీ

సాక్షి, హైదరాబాద్: బస్సు టికెట్లను అడ్వాన్స్‌గా రిజర్వ్ చేసుకుంటే చార్జిలో రాయితీ ఇవ్వనున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. 31 రోజుల నుంచి 45 రోజుల ముందు టికెట్ రిజర్వ్ చేసుకుంటే టికెట్ ధరలో 5 శాతం, 46–60 రోజుల ముందు రిజర్వ్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. ఈమేరకు ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం(ఓపీఆర్ఎస్) సాఫ్ట్‌వేర్‌ను సవరించింది.

### సింహపురి, దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

సాక్షి, హైదరాబాద్: సింహపురి, దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను చేర్చాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. సికింద్రాబాద్–గూడూరు మధ్య సింహపురి, సికింద్రాబాద్–ముంబయి మధ్య దేవగిరి ఎక్స్‌ప్రెస్ నడుస్తున్న విషయం తెలిసిందే. క్రమంగా సంప్రదాయ ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో తక్కువ బరువుండే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేస్తున్న రైల్వే.. తాజాగా ఈ రెండు రైళ్లకు మార్చి నుంచి వాటిని జత చేస్తున్నట్టు ప్రకటించింది.

### ఇంటర్ పరీక్షల వరకు నవీన్‌మిట్టల్‌నే కొనసాగించండి

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంటర్ బోర్డు కార్యదర్శిగా నవీన్ మిట్టల్‌ను ఇన్‌చార్జి పోస్టులో కొనసాగనివ్వాలని తెలంగాణ ఇంటర్ విద్య పరిరక్షణ సమితి ప్రభుత్వాన్ని కోరింది. నవీన్ తొలిసారిగా అనేక సంస్కరణలను ప్రవేశపెట్టారని, పాలనాపరమైన విధానాలు ఆయన నేతృత్వంలో కొనసాగితే కీలకమైన దశలో ఇబ్బంది ఉండదని సంఘం నేత మాచర్ల రామకృష్ణగౌడ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సంఘ నేతలు నవీన్ కొనసాగింపును కోరుతూ ఇంటర్ బోర్డు వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు.

# రోజూ మక్క రొట్టె తినాల్సిందే..!

**ప్రకృతితో సహ జీవనం చేస్తున్న రాజమ్మ తండా**


రాజమ్మ తండాలో పచ్చని ప్రకృతి మధ్య ఇండ్లు

- వీరి ఆయుఃప్రమాణం 90 ఏళ్లకు పైనే..
- వంటలన్నీ కట్టెల పొయ్యిపైనే..
- తండాలో కనిపించని ఎలక్ట్రిక్ వస్తువులు
- 30 ఏళ్లలో చనిపోయింది ఏడుగురు మాత్రమే
- కరోనాను దరిచేరనివ్వని తండా

రామారెడ్డి (ఎల్లారెడ్డి)

పరిపూర్ణ ఆరోగ్యం, శారీరక, మానసిక ఆధ్యాత్మిక అనుసంధానమే ప్రకృతి జీవనం. ప్రకృతి జీవనం అంటే చెట్లు, పుట్టలు కొండలు, పక్షులతో సహజీవనంలో ఉండటమే. ప్రకృతిలో భాగమైన మనిషి పాశ్చాత్య నాగరికతకు అలవాటుపడి మానసిక, శారీరక ఆరోగ్యానికి దూరమై కాలుష్య ప్రపంచంలో భారంగా జీవితాన్ని సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఓ తండా ఆధునిక మానవుడికి తిరిగి ప్రకృతిని పరిచయం చేసి.. ప్రకృతి–మనిషి సంబంధాన్ని బలోపేతం చేసి భవిష్యత్తులో మానవ మనుగడకు పొంచి ఉన్న ముప్పును తప్పించాల్సిన అవరాన్ని గుర్తు చేసింది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని రాజమ్మ తండాపై ప్రత్యేక కథనం.

**తండావాసులకు వరం**

సహజసిద్ధ వాతావరణంలో జీవించడం వల్ల వారికి రోగ నిరోధిక శక్తి బాగా ఇనుమడిస్తుంది. తెల్ల రక్త కణాల సంఖ్య పెరిగి ఇన్ఫెక్షన్లు, జబ్బులను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. తాజా గాలిని పీల్చుకోవడం వల్ల మెదడు కొత్త ఉత్సాహంతో పని చేస్తుంది. ఇదే రాజమ్మ తండా వాసులకు వరంగా మారింది. పచ్చని ప్రకృతి మధ్య జీవించే వీరి జీవనోపాధి వ్యవసాయం. వీరి ఆయుఃప్రమాణం 90 ఏళ్లకు పైనే ఉంది. ఈ తండాలో గత 30 ఏళ్లలో ఏడుగురు మృతిచెందగా, వారిలో మధ్య వయస్కులు ఇద్దరు మాత్రమే అనా రోగ్యంతో మరణించారు. మిగిలిన ఐదుగురిలో ఇద్దరు వంద ఏళ్లు పూర్తిచేసుకోగా, ముగ్గురు 90 ఏళ్లలో మరణించారు. ఇప్పటికీ 90 ఏళ్లపైబడి ఉన్న వారు వ్యవసాయం చేస్తూ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు.

**అల్లం–ఎల్లి కారంతో కలిపి..**

వీరు వంటలు మొత్తం కట్టెల పొయ్యిపైనే చేస్తారు. వీరి ప్రధాన ఆహారం మక్క రొట్టెలు. అల్లం–ఎల్లి కారంతో వీటిని తింటారు. ఏ ఇంట్లో కూడా రొట్టె లేకుండా ఒక్కపూట కూడా గడవదని తండా వాసులు చెబుతారు. ఇళ్ల పక్కనే ఉన్న తమ పొలాల్లో పండించిన తాజా కూరగాయలను వాడతారు. ఒక్కో కుటుంబానికి సగటున నాలుగెకరాల పొలం ఉంటుంది.

**రాజమ్మ తండాలో ఎంతమంది?**

కుటుంబాలు: 50
జనాభా: 230

**ఎలక్ట్రానిక్ వస్తువులకు దూరం**

తండాలోని ఇళ్లలో టీవీ, ఫోన్ తప్ప ఏ ఇతర ఎలక్ట్రిక్ వస్తువు ఉండదు. తండాలో ఏ ఇంట్లో కూడా ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్, కూలర్ లాంటివేవీ ఉండవు.

**మినరల్ వాటర్‌కు దూరం**

ఆధునిక కాలంలో పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని ఇళ్లలో తాగడానికి మినరల్ వాటర్ వాడుతున్నారు. కానీ, రాజమ్మ తండావాసులు మాత్రం బోరు నీళ్లనే తాగుతారు. తండాకు సమీపంలోనే వాటర్ ప్లాంట్ ఉన్నప్పటికీ మినరల్ వాటర్ తాగడానికి ఇష్టపడరు.

**కరోనా దరిచేరలేదు**

ప్రపంచాన్నే వణికించిన కరోనా వైరస్ రాజమ్మ తండా దరి చేరలేదు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన తండా వాసులు కరోనా వేళ తండాకు వచ్చి సేఫ్ జోన్‌లోకి వెళ్లారు. కరోనా రెండు దశల్లో కూడా ఏ ఒక్కరూ వైరస్ బారిన పడలేదు.

**చుట్టూ మంచి వాతావరణం**



నా వయసు 80 ఏళ్లు. రోజూ వ్యవసాయ పనులు చేస్తా. ఎలాంటి రోగాలు లేవు. మక్క రొట్టెలను పొద్దు, మాపు తింటా. ఇంటి చుట్టూ మంచి వాతావరణం ఉంటుంది. మా చుట్టూ ఉన్న వాతావరణమే మాకు రక్షణ.

–శివరాం, రాజమ్మ తండా

**ఎలాంటి రోగం లేదు**

అప్పటికప్పుడు కట్టెల పొయ్యి మీద చేసిన మక్క రొట్టెలను తింటా. 76 ఏళ్ల వయసులో ఉన్నా. చలి కాలం దగ్గు, జర్వం తప్ప ఎలాంటి రోగం ఇప్పటి వరకైతే రాలేదు.

–మాలిబాయి, రాజమ్మతండా

**బోరు నీళ్లు తాగుతాం.**



మాకు మినరల్ వాటర్ అంటే తెలియదు. బోరు నీళ్లు తాగుతాం. అడవి నుంచి ఎండి పోయిన కట్టెలను తెచ్చుకుని కట్టెల పొయ్యి మీద వంట చేసుకుంటాం. నాకు 80 ఏళ్లు. ఎలాంటి రోగాలు లేవు. ఎప్పుడైనా జ్వరం వస్తే నీళ్లు గరం చేసి తాగుతా. జ్వరం పోతుంది.

–గంగవాత్ సోరాత్, రాజమ్మతండా

# సమతుల్య బడ్జెట్ ఇది

- విధానాల్లో పేదల వ్యతిరేకత ఉంది
- ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ అందె సత్యం



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్ సమతుల్యంగా ఉందని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్. అందె సత్యం అభిప్రాయపడ్డారు. ఈసారి కేటాయింపుల్లో అంకెల రూపంలో సానుకూలత కనిపించినా, కేంద్ర విధానాల్లో పే దల వ్యతిరేకత కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ద్రవ్యోల్బణాన్ని సాకుగా చూపి విద్య, వైద్య, సంక్షేమ రంగాల్లో కోత పెట్టే అవకాశం లేకపోలేదని చెప్పారు. 'బడ్జెట్ పరిమాణాన్ని రూ.45లక్షల కోట్లకు పెంచడం ద్వారా వివిధ రంగాలకు తగిన కేటాయింపులను చూపెట్టగలిగారు. ఏకలవ్య పాఠశాలల స్థాపన ద్వారా గిరిజన విద్యార్థులకు సౌకర్యాలు కల్పించిన కారణంగా డ్రాపవుట్ల సంఖ్య తగ్గుతుంది. వ్యవసాయ రుణాలను రూ.18 లక్షల కోట్ల నుంచి రూ.20 లక్షల కోట్లకు పెంచారు. అయితే, బ్యాంకులు ఈ రుణ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. వ్యవసాయ రంగంలో డిజిటలైజేషన్ కారణంగా 80% ఉండే చిన్న, సన్నకారు రైతాంగానికి ఉపయోగం లేదు. ఉపాధి హామీకి కేటాయింపులు గ్రామీణ పనుల అవసరతలకు తగ్గట్టు లేవు. బంగారం, వజ్రాలు తదితర విలాస వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ పెంపు సమర్థనీయమే. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు, టీవీలపై తగ్గింపు మధ్య తరగతి ప్రజలకు వెసులుబాటు కల్పిస్తుంది. ఆదాయపన్ను మినహాయింపు రూ.7లక్షల వరకు లేదనేది అబద్ధం. రూ.3 లక్షల వరకు మాత్రమే పన్ను లేదు. రూ.7లక్షలు ఏడాదికి ఆర్జించే ఆదాయ శ్రేణి మిగిలిన మొత్తాన్ని సేవింగ్స్ చేసుకోవడం చాలా కష్టం. కొన్ని రంగాల కేటాయింపుల్లో అంకెలు పేదలకు అనుకూలంగా కనిపిస్తున్నా విధానాలు మాత్రం కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు.

### కీలకరంగాలకు కేటాయింపులు తగ్గాయి

సాక్షి, హైదరాబాద్: 'కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయం అంతకుముందు ఏడాదితో పోల్చితే 7% పెరిగింది. అదీకూడా వడ్డీలకు చేసే ఖర్చులను మినహాయిస్తే 5.4 శాతమే పెరిగింది. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని లెక్కేస్తే అస్సలు పెరగలేదనే చెప్పాలి. ప్రస్తుతం ఆర్థికమాంద్యం ప్రపంచాన్ని ఆవరిస్తున్న వేళ ప్రభుత్వ వ్యయం పెరగాల్సి ఉన్నా జీడీపీతో పోల్చితే తగ్గింది. గతేడాది సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం..15.4% జీడీపీ వ్యయంగా ఉంది. ఇప్పుడది 14.9 శాతానికి తగ్గింది. జీడీపీలో భాగంగా తగ్గింది. ప్రభుత్వ వ్యయం భారీగా పెరగాల్సిన సమయంలో పెరగలేదు. ఫలితంగా కీలకరంగాలకు కేటాయింపులు తగ్గాయి. మధ్యతరగతి వేతనజీవులకు ఇన్‌కమ్‌టాక్స్ రిబేట్ రూ. 5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెరుగుతున్నట్టు కనిపిస్తున్నా అది కొత్త స్కీంలోకి వెళ్లేవారికే వర్తిస్తుంది. కేంద్రం మధ్యతరగతికి రాయితీలు ఇచ్చినట్టు కనిపిస్తున్నా, ఎంతోమందికి అది వర్తించదు. ఐటీకి సంబంధించి కొత్త స్కీంలోకి వస్తేనే అది వర్తిస్తుంది.'' –ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు

### రంగు, రుచి, వాసన లేదు

సాక్షి, హైదరాబాద్: ''బడ్జెట్ రంగు,రుచి,వాసన లేనట్టు కనిపిస్తోంది. ఆర్థికవ్యవస్థకు ఎప్పుడూ దన్నుగా నిలిచే మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, ఉద్యోగులు, నగర ప్రాంత ప్రజలు, వ్యాపారులను బీజేపీ ఇంత కాలం దూరం చేసుకుంది. అదానీ, అంబానీ సేవల్లో నిమగ్నమయ్యారు. మధ్యతరగతివర్గాలను పట్టించుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆరెస్సెస్) సూచనలతో బడ్జెట్‌లో మార్పులు చేసినట్టు కనిపిస్తోంది. ప్రధాని మోదీ కూడా ఇటీవల మధ్యతరగతిని పట్టించుకోవాలంటూ సూచనలు చేశారు. ఈ వర్గాన్ని మళ్లీ దగ్గర చేసుకునేందుకు బడ్జెట్‌లో ఆదాయపన్ను రాయితీలు కల్పించారు. ధరల పెరుగుదల వల్ల అత్యధికంగా ప్రభావితమయ్యేది మధ్యతరగతి వర్గమే. ఖతే ధరల నియంత్రణ విషయాన్ని అంతగా పట్టించుకున్న దాఖలాల్లేవు.''

– డి.పాపారావు, ఆర్థికరంగ విశ్లేషకుడు

# కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, భూపేశ్‌సాగర్**



కేంద్రం ప్రవేశ పెట్టిన రూ.45 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే కేటాయించి దేశంలోని 70 కోట్ల మంది బీసీలను అవమానపరిచారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం చేశారు. దేశ సంపద సృష్టిలో బీసీల పాత్ర అమితంగా ఉన్నా, సంపదలో వారికి వాటా కల్పించరా? బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని పలు మార్లు ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రులకు విన్నవించినా కేంద్రానికి చీమకుట్టినట్లు కూడా లేదు. కేంద్రం తన బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకోకపోతే బీసీలంతా ఏకమై పార్లమెంట్‌ను ముట్టడిస్తాం. దేశంలో కులవృత్తులనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న బీసీల పరిస్థితులు రోజురోజుకు దయనీయంగా మారుతున్నాయి. కులవృత్తి దారులు తయారు చేసే పాలు, మాంసం, వ్యవసాయ ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, నగిషీలు, నగలు ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌పోర్ట్ వ్యవస్థను గ్రామీణ వ్యవస్థలకు అందుబాటులోకి తీసుకురావాలి. వెంటనే ఈ బడ్జెట్‌ను పునఃసమీక్షించి కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలి.

# హైదరాబాద్‌లో మిల్లెట్స్‌పై పరిశోధనలు

**ప్రత్యేకంగా ప్రస్తావించిన కేంద్ర బడ్జెట్**
**శ్రీఅన్న పథకం ద్వారా చిరుధాన్యాలకు ప్రోత్సాహం**



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా 2023ను జరుపుకుంటున్న తరుణంలో వాటి సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని గురించి కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించింది. శ్రీఅన్న పథకం ద్వారా హైదరాబాద్‌లో చిరుధాన్యాలపై ప్రత్యేక పరిశోధనలు జరపాలని నిర్ణయించింది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) ఉన్న సంగతి తెలిసిందే. అందులోని పరిశోధనలకు పెద్దపీట వేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సంస్థ జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీలతో అనుసంధానమై పనిచేస్తుంది. వేలాదిమందికి ఇందులో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. భవిష్యత్తులో మిల్లెట్ ఆహారపదార్థాలు అందుబాటులోకి తీసుకురావడం, మిల్లెట్ సాగు చేసే రైతులను ప్రోత్సహించడం, ఉత్పాదకత పెంచడం ఈ పరిశోధనల లక్ష్యం. ఐఐఎంఆర్ పరిధిలో 41 మంది సాంకేతిక సిబ్బంది, 21 అడ్మినిస్ట్రేటివ్, 27 సహాయక సిబ్బంది, 17 విభాగాలలో 48 మంది శాస్త్రవేత్తల బృందం పనిచేస్తున్నారు.

**2023 అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరం ప్రాధాన్యం ఏంటి?**

మిల్లెట్లు పోషక ఆహార ధాన్యాలు. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి మిల్లెట్ల సాగు, వినియోగం కొనసాగుతోంది. మిల్లెట్లలో ప్రొటీన్, ఫైబర్, ఐరన్ అధికంగా ఉంటాయి. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది కాబట్టి షుగర్ వ్యాధి రాకుండా, వచ్చినవారికి మంచి ఆహారంగా ఉంటుంది. మిల్లెట్ల ద్వారా ఆరోగ్య ప్రయోజనాలతోపాటు, వాటిని పండించడానికి తక్కువ నీరు, తక్కువ పెట్టుబడి అవసరం. భారత ప్రభుత్వ విన్నపం మేరకు ఐక్యరాజ్యసమితి 2023ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించింది. భారతదేశం చేసిన ప్రతిపాదనను 70 దేశాలు ఆమోదించాయి. రసాయన పురుగుమందులు, ఎరువులు వాడకుండా మిల్లెట్లను సులభంగా పండించవచ్చు. చిన్న కమతాల రైతులకు మిల్లెట్ పంటలు పండించడం ఉపయోగకరం. మిల్లెట్లను రొట్టెలు, ఉప్మా, గంజిగా ఉపయోగించవచ్చు. మిల్లెట్లలో 60 రకాల వరకు ఉన్నాయి. మన దేశంలో ప్రధానంగా జొన్న, సజ్జ, కొర్రలు, ఎండు కొర్రలు, ఊదలు, సామలు, రాగులు వంటి చిరుధాన్యాలు ఉన్నాయి. అయితే 1960లలో హరిత విప్లవం ద్వారా ఆహార భద్రతపై దృష్టి సారించడంతో చిరుధాన్యాల ఆహారాన్ని ప్రజలు మరిచిపోయారు. ఇప్పుడిప్పుడే మళ్లీ వీటిపై ఆసక్తి చూపుతున్నారు. హరిత విప్లవానికి ముందు మిల్లెట్ల సాగు దాదాపు 40 శాతం ఉండగా, ఆ తర్వాత 20 శాతానికి పడిపోయింది. మన దేశంలో ప్రస్తుతం 1.70 కోట్ల టన్నుల మిల్లెట్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇది ఆసియాలో 80 శాతం, ప్రపంచ ఉత్పత్తిలో 20 శాతం ఉంటుంది. రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, హరియాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో అధికంగా మిల్లెట్లను ఉత్పత్తి చేస్తాయి. మనదేశం నుంచి మిల్లెట్లను యూఏఈ, నేపాల్, సౌదీ అరేబియా, లిబియా, ఒమన్, ఈజిప్ట్, ట్యునీషియా, యెమెన్, యూకే, యూఎస్‌లకు ఎగుమతి అవుతాయి.

**ఆగ్రోస్ మిల్లెట్ ఆహార కేంద్రాలు: కె.రాములు, ఎండీ, ఆగ్రోస్**

అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆగ్రోస్ ఆధ్వర్యంలో మిల్లెట్‌ను ప్రజలకు చేరువ చేయాలని భావిస్తున్నాం. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా వందలాది మిల్లెట్ కియోస్క్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆసక్తి కలిగిన మహిళలకు మిల్లెట్ ఫుడ్‌పై ఐఐఎంఆర్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని కూడా మా ఆలోచన. శిక్షణ అనంతరం నిర్ణీత పద్ధతిలో తయారు చేసిన కియోస్క్‌లను ఏర్పాటు చేస్తాం. అందుకోసం ముందుకు వచ్చే వారికి రుణాలు ఇప్పించే ఆలోచన కూడా ఉంది. ఈ కియోస్క్‌ల్లో రెడీమేడ్ మిల్లెట్ ఫుడ్, మిల్లెట్‌తో తయారు చేసిన బిస్కెట్లు, ఐస్‌క్రీం, నూడిల్స్, మిల్లెట్ బిర్యానీ వంటివి కూడా అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నాం.

# మార్చిలో భారత్ గౌరవ్ రైలు

**దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్**



సాక్షి, హైదరాబాద్: పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ ప్రత్యేక తీర్థయాత్ర పర్యాటక అనుభూతిని పంచే భారత్ గౌరవ్ రైలు త్వరలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పట్టాలెక్కనుంది. చారిత్రక, సాంస్కృతిక, తీర్థయాత్ర ప్రాధాన్యమున్న ప్రాంతాలను వారం రోజుల పాటు చుట్టి వచ్చే భారత్ గౌరవ్ రైళ్లను కేంద్రం ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా రైల్వే శాఖ దక్షిణ మధ్య రైల్వేకు ఓ రైలును మంజూరు చేసింది. ఇది వచ్చే మార్చిలో ప్రారంభమవుతుందని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ బుధవారం ప్రకటించారు. బడ్జెట్ అనంతరం ఆయన రైల్ నిలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ రైలు కేటాయింపు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్– పూరి–కోణార్క్–గయా–వారణాసి–అయోధ్య–ప్రయాగ్‌రాజ్–సికింద్రాబాద్ మధ్య ఇది తిరగనుంది. ఎనిమిది పగళ్లు, ఏడు రాత్రులు ఈ యాత్ర కొనసాగనుంది. దీని చార్జీ వివరాలను త్వరలో ఐఆర్‌సీటీసీ ప్రకటించనుందని ఆయన తెలిపారు. తాజా బడ్జెట్‌లో ఇలాంటి యాత్రలకు సంబంధించి దేశవ్యాప్తంగా కొత్తగా ఐదారు సర్క్యూట్‌లు పొందుపరిచిన విషయాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించినట్లు అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వేకు ఇలాంటి మరిన్ని రైళ్లు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్ల రీ డెవలపింగ్ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త బడ్జెట్‌లో అమృత్ భారత్ స్టేషన్లను పొందుపరిచారని, దేశవ్యాప్తంగా 1,275 స్టేషన్లను ఇందుకు ఎంపిక చేసినట్లు రైల్వే శాఖ మంత్రిని ఉటంకిస్తూ ఆయన తెలిపారు. వీటిల్లో దక్షిణ మధ్య రైల్వేకు కూడా స్థానం ఉంటుందన్నారు. బడ్జెట్‌కు సంబంధించి రైల్వే వివరాలు ఉండే పింక్ బుక్‌లో ఆ వివరాలు పొందుపరిచారని, పార్లమెంటుకు ఆ బుక్‌ను సమర్పించగానే వివరాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు.

# నేటి నుంచి 'సమతాకుంభ్' ఉత్సవాలు


ముచ్చింతల్‌లోని సమతాస్ఫూర్తి కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాల

- బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన సమతాస్ఫూర్తి కేంద్రం
- 9 కుండాలతో యజ్ఞం

శంషాబాద్ రూరల్: సమతాస్ఫూర్తి కేంద్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శంషాబాద్ మండలం ముచ్చింతల్ శివారులోని శ్రీరామనగరంలో సమతామూర్తి ప్రతిష్ఠాపన జరిగి ఏడాది పూర్తి అయిన సందర్భంగా నేటి(గురువారం) నుంచి 'సమతాకుంభ్–2023'పేరుతో ఉత్సవాలు నిర్వహించనున్నారు. శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఉత్సవ ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ నెల 12 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. స్ఫూర్తికేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో 9 కుండాలతో యజ్ఞం చేయనున్నారు. ప్రతిష్ఠాపన సందర్భంగా గతేడాది 1,035 కుండాలతో యజ్ఞం చేపట్టారు. 'సమతాకుంభ్'లో సేవలు అందించేందుకు దేశ విదేశాల నుంచి మూడువేల మంది వికాస తరంగిణి కార్యకర్తలు తరలివస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రసాదవితరణ, అన్నదానం ఉంటుంది. ఉత్సవాల సమయంలో స్ఫూర్తికేంద్రాన్ని బుధవారం కూడా తెరుస్తారు. సమతామూర్తి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఉత్సవాలు ఇలా..**

మొదటిరోజు ఉదయం శ్రీ భగవద్రామానుజుల స్వర్ణమూర్తికి ఉత్సవారంభస్నపనం, విష్వక్సేన వీధిశోధన ఉంటుంది. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణం, రాత్రికి సాకేత రామచంద్రస్వామి, 18 దివ్య దేశమూర్తులు 18 గరుడులపై యాగశాల ప్రవేశం చేస్తారు. 3న సాకేత రామచంద్రస్వామికి సూర్య ప్రభవాహన సేవ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ ఉంటుంది. 4న సామూహిక పారాయణంతోపాటు 18 గరుడసేవలు ఉంటాయి. ఇదేరోజు ప్రపంచ కేన్సర్ దినోత్సవం నిర్వహిస్తారు. 5న శాంతి కల్యాణ మహోత్సవం, 6న వసంతోత్సవం, 7న డోలోత్సవం, 8న సామూహిక పుష్పార్చన, 18 రూపాలలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. 9న ఆచార్య వరివస్య, 10న సామూహిక ఉపనయనాలు, 11న రథోత్సవం, చక్రస్నానం, గీతాపారాయణం, 12న మహా పూర్ణాహుతి ఉంటాయి.

# సికిల్ సెల్.. పాతికేళ్లలో నిల్?

సాక్షి, హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తాజాగా ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్‌లో సికిల్ సెల్ ఎనీమియాను సంపూర్ణంగా తుడిచిపెట్టేందుకు కార్యాచరణ ప్రకటించడంపట్ల హర్షం వ్యక్తం అవుతోంది. బడ్జెట్లో ప్రకటించిన ప్రకారం అమలుకు నోచుకుంటే ఈ వ్యాధి మరో పాతికేళ్లలో కనుమరుగు కావడం తథ్యమని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**ఏమిటీ సికిల్ సెల్?**

మానవ శరీరంలోని రక్తంలో ఏర్పడే అపసవ్యతగా సికిల్‌సెల్‌ను పేర్కొంటున్నారు. ఇది వంశపారంపర్యంగా వచ్చేవ్యాధి. ఈ వ్యాధికి గురైనవాళ్లలో ఎర్రరక్త కణాలు ప్రత్యేకమైన సికిల్ (కొడవలి) రూపాన్ని సంతరించుకుంటాయి. అవి సాధారణంగా 125 రోజులు బతకాల్సి ఉండగా 25 రోజుల్లోపే చనిపోతాయి. న్యుమోనియా, తీవ్రమైన కీళ్లనొప్పులు, అవయవాల వాపులు, స్ట్రోక్... వంటివి వ్యాధి లక్షణాల్లో కొన్ని. సరైన చికిత్స చేయనట్లయితే శరీరంలోని పలు అవయవాలను ఇది దెబ్బతీస్తుంది. ఇటీవల జాతీయ ఆరోగ్య సర్వే ప్రకటించిన వివరాలను బట్టి చూస్తే రాష్ట్రంలోని చిన్నారులు పెద్ద సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియా బారిన పడుతున్నారు. సరైన అవగాహనలేక, గుర్తించడంలో ఆలస్యం వల్ల అనేకమంది బాధితులుగా మారుతున్నారు. వరంగల్, ఆదిలాబాద్, అసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలవారు, ఆదివాసీలు అత్యధిక సంఖ్యలో ఈ వ్యాధికి గురవుతున్నారు. దీనికి సంబంధించిన వైద్య చికిత్సల కోసం నగరానికి రాకపోకలు సాగించేవారు కూడా ఎక్కువే.

**మంచి నిర్ణయం...**



వచ్చే 2047కల్లా సికిల్ సెల్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోవడం మంచి నిర్ణయం. దీనిలో భాగంగా ఈ వ్యాధికి అత్యధికంగా గురయ్యే ఆదివాసీ ప్రాంతాల్లో 0–40 ఏళ్ల మధ్య వయసులో ఉన్న 7 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడం వ్యాధి నిర్మూలనకు దోహదపడుతుంది. గత కొన్నేళ్లుగా బాధితులకు స్వచ్ఛంద సేవలు అందిస్తున్న మా సొసైటీ ఈ మిషన్ అమలులో ప్రభుత్వానికి పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తుంది.

– చంద్రకాంత్ అగర్వాల్, అధ్యక్షుడు, తలసీమియా సికిల్‌సెల్ సొసైటీ

**మేనరికపు వివాహాలు కూడా కారణమే**



తండాలలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపించడానికి మేనరిక వివాహాలు, దగ్గర బంధువుల్లో వివాహాలు కూడా కారణమే. ప్రణాళికాబద్ధంగా పరీక్షల నిర్వహణ, అవగాహన పెంచడం, ముందస్తుగా వ్యాధిని గుర్తించడం ఆయా ప్రాంతాల్లో వ్యాధి నిర్మూలనకు దోహదపడతాయి. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఆ దిశగా ముందడుగు వేసిందని భావిస్తున్నాం.

– డాక్టర్ కె.సి గౌతమ్‌రెడ్డి, కన్సల్టెంట్ అంకాలజిస్ట్ అమోర్ ఆసుపత్రి

సాక్షి
కరీంనగర్
గురువారం 2 ఫిబ్రవరి 2023





## చక్రతీర్థోత్సవం..

కరీంనగర్ మార్కెట్‌రోడ్ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రతీర్థోత్సవం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. - 18లో▸



## మత్స్యగిరీంద్రుని కల్యాణం

మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి గుట్టపై బుధవారం భూదేవి, నీలాదేవితో స్వామివారి కల్యాణం కన్నులపండువగా, అంగరంగ వైభవంగా జరిగింది. - 18లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0/17.0

## వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

## న్యూస్‌రీల్

### కంటి వెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

విద్యానగర్(కరీంనగర్)/కరీంనగర్ టౌన్: జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, కుటుంబ సభ్యులకు బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, 18 ఏళ్లు పైబడిన వారి కుటుంబ సభ్యుల కోసం రెండు రోజుల పాటు శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జువేరియా, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాడూరు కరుణాకర్, గాండ్ల శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### 3న డీఈడీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

తిమ్మాపూర్: డీసెట్ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)-2022 మూడో విడత ప్రవేశాలకు కన్వీనర్ ప్రకటన ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. మొదటి, రెండో విడతల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేయించుకోని వారికి ఈనెల 3న అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డీసెట్ 2022లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఎల్‌ఎండీ కాలనీలోని కరీంనగర్ ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)కు ఉదయం 10 గంటలకు రావాలని సూచించారు. సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు జిరాక్స్ సెట్స్ వెంట తీసుకుని రావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు పరిశీలన తర్వాత ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఉంటుందని వివరించారు. మొదటి రెండు విడతల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకుని ఆప్షన్ ఇవ్వని వారు కూడా ఆప్షన్ ఇవ్వడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. వివరాలకు డీసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

### రిజర్వేషన్ ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక రాయితీ

కరీంనగర్: రిజర్వేషన్ ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక రాయితీలు ప్రకటించిందని ఆర్టీసీ ఆర్‌ఎం ఖుస్రో షా ఖాన్ తెలిపారు. 31 రోజుల నుంచి 45 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకుంటే టికెట్‌లో 5 శాతం రాయితీ కల్పించిందని, 46 రోజుల నుంచి 60 రోజుల ముందు టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం డిస్కౌంట్ ప్రకటించిందన్నారు. ఆన్‌లైన్ ప్యాసెంజర్ రిజర్వేషన్ సిస్టం (ఓపీఆర్‌ఎస్) సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసిందని, ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉన్న అన్ని సర్వీస్‌లకు ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తు రిజర్వేషన్‌ను 30 రోజుల నుంచి 60 రోజులకు సంస్థ పెంచిందని, ప్రయాణికులకు మరింత చేరువ అయ్యేందుకు ఈ ప్రత్యేక రాయితీలను ప్రకటించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో శుభకార్యాలు, పెళ్లిళ్లు, పండుగలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. టీఎస్ ఆర్టీసీ అందిస్తున్న రాయితీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని సంస్థను ఆదరించాలన్నారు. సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం ఆర్టీసీ బస్సుల్లోనే సాధ్యమని, ముందస్తు రిజర్వేషన్ విధానానికి మంచి స్పందన లభిస్తోందన్నారు. టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం అధికారిక వెబ్‌సైట్ www.tsrtconline.in ను సందర్శించాలని తెలిపారు.

### క్వింటాల్ పత్తి ధర రూ.7,900

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,900 పలికింది. బుధవారం మార్కెట్‌కు 126 వాహనాల్లో 1,706 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,900, మోడల్ ధర రూ.7,800, కనిష్ఠ ధర రూ.7,200 ఖరీదు వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 18 మంది రైతులు 25 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,500, మోడల్ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.6,500 చెల్లించారు. మార్కెట్‌లో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

# ఉమ్మడి జిల్లాకు నిరాశే



## బసంత్‌నగర్ విమానాశ్రయంపై బడ్జెట్‌లో రాని స్పష్టత

- కరీంనగర్ ట్రిపుల్ ఐటీపైనా దొరకని హామీ
- ఆస్తిపన్ను విధింపుపై మిశ్రమ స్పందన
- ఈసారి కూడా నెరవేరని కేంద్రీయ, నవోదయ స్కూళ్లు
- నర్సింగ్ కాలేజీ కేటాయింపుల్లోనూ దక్కని అవకాశం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కేంద్ర బడ్జెట్ 2023-24 ఉమ్మడి జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎలాంటి కేటాయింపులూ జరగలేదు. ముఖ్యంగా ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారులలో ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు దాదాపుగా లేవనే చెప్పాలి. అదే సమయంలో సగటు ఉద్యోగిపై ఆదాయపు పన్ను విషయంలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు పన్ను విధానాన్ని ప్రశంసిస్తుంటే.. మరికొందరు విమర్శిస్తున్నారు.

### నెరవేరని విభజన హామీలు..

- రాష్ట్ర విభజన హామీలకు సంబంధించి జిల్లాకు ఒకటి చొప్పున సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి నవోదయ స్కూళ్లు, కేంద్రీయ స్కూళ్లు ఇస్తానని మాట ఇచ్చిన కేంద్రం ఈసారి బడ్జెట్‌లోనూ ఎలాంటి హామీలు, కేటాయింపులు చేయలేదు.
- బడ్జెట్‌లో ఎంపిక చేసిన 50 విమానాశ్రయాల్లో తెలంగాణ నుంచి బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు ఉందా? లేదా అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే.. ఈ విషయంలో రాష్ట్రం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని కేంద్రం మొదటి నుంచి చెబుతూ వస్తోంది.
- దేశవ్యాప్తంగా 174 నర్సింగ్ కాలేజీలను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో మూడు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లగా తెలంగాణకు ఒక్క కాలేజీ కూడా మంజూరు కాలేదు. ఇటీవల ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఇచ్చిన క్రమంలో నర్సింగ్ కాలేజీలకు అనుమతి ఇచ్చి ఉంటే మరింత ప్రోత్సాహకరంగా ఉండేదని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- సగటు వేతనజీవికి ఆస్తిపన్ను విషయంలో మాత్రం మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. రూ.7 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడంపై కొందరు ప్రజలు స్వాగతిస్తున్నారు. అదే రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఉన్న ఆదాయానికి 5% పన్నుపై మరికొందరు పెదవి విరుస్తున్నారు.
- మైనార్టీ బాలబాలికల స్కాలర్‌షిప్పుల రద్దుపై ముస్లిం నాయకులు మండిపడుతున్నారు. ఇది మైనార్టీ వ్యతిరేక ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ధనవంతులకు ఉపయోగపడేలా బడ్జెట్



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పూర్తిగా ధనవంతులకు ఉపయోగపడేలా ఉంది. తెలంగాణకు ఎప్పటిలాగే మొండిచేయి చూపింది. రాష్ట్ర విభజన హామీల అమలుకు ఎలాంటి నిధులు లేవు. కేటాయింపులు లేవు. 157 నర్సింగ్ కళాశాలల్లో తెలంగాణకు ఒకటి కూడా కేటాయించకపోవడం దౌర్భాగ్యం. సామాన్య ప్రజల నడ్డివిరిచి బడాబాబులకు రెడ్‌కార్పెట్ పరిచేలా బడ్జెట్ ఉంది.

– జీవీ రామక్రిష్ణారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

### జిల్లా ప్రజలను మరోసారి నిరాశపరిచింది..



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలను నిరాశపరిచింది. జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజీ కూడా మంజూరు చేయలేదు. కనీసం చిన్న తరహా పరిశ్రమ కూడా రాలేదు. గతంలో ప్రకటించిన అనుబంధ సైనిక్ స్కూల్‌ను పూర్తిస్థాయి సైనిక స్కూల్‌గా మారుస్తారని ఎదురుచూసిన జిల్లా ప్రజలకు నిరాశే మిగిలింది. అంకెల గారెడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. టాక్స్‌ల మినహాయింపు పేరుతో పన్నుల రూపంలో ప్రజల కష్టార్జితాన్ని దోచుకునే ప్రయత్నం చేశారు.

– కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

### అందరి ఆకాంక్షలకు అనుగుణంగా..



కేంద్ర బడ్జెట్ చారిత్రకమైంది. అందరి ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్లో కేటాయింపులు ఉన్నాయి. సామాన్యుడికి ఉపశమనం కలిగించేలా పన్ను స్లాబులు ఆరు నుంచి ఐదుకు తగ్గించడమే కాకుండా పన్ను మినహాయింపు 5 లక్షల నుంచి 7 లక్షల వరకు పెంచారు. మహిళలు, కర్షకులకు అనుకూలంగా బడ్జెట్ నిలిచింది.

– గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

### తెలంగాణపై వివక్ష



కేంద్ర బడ్జెట్ తెలంగాణకు పూర్తి వ్యతిరేకంగా ఉంది. విభజన హామీల అమలుపై దృష్టిసారించకపోవడం దుర్మార్గం. వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, టెక్స్‌టైల్ పార్క్, గిరిజన విశ్వవిద్యాలయం, కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పించకపోవడం వివక్షతకు నిదర్శనం. ఉపాధి కల్పనకు బడ్జెట్‌లో నిధులు లేవు. పూర్తిగా సంపన్నుల బడ్జెట్‌లా ఉంది.

– డాక్టర్ నగేష్, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

### కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా..



కేంద్రం ప్రవేశపెట్టిన ప్రతీ బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్. ధాన్యం కొనుగోలుకు ప్రోత్సాహాలను లేవని పంటల ఇన్సూరెన్స్‌కు గతంలో రూ.25 వేల కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు 13 వేల కోట్లకు కుదించడం అన్యాయం. ఉపాధి హామీని నీరుగార్చేలా చేశారు. మైనారిటీలకు రాయితీలు తగ్గించారు. కార్పొరేట్, పెట్టుబడి దారులకు ఈ ప్రభుత్వం ఊడిగం చేస్తోంది.

– మర్రి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి

### వేతన జీవులకు ఊరట



కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు, మధ్య తరగతి వారికి కొంత మేరకు ఊరట కలిగించే విషయం. వేతన జీవులకు, పెన్షనర్స్‌కు సంవత్సర ఆదాయం రూ.15,50,000 దాటిన వారికి అదనంగా స్టాండర్డ్ డిటెక్షన్ రూ.52,500 ప్రత్యేకంగా ఇవ్వడం ఒక విషయం. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మినహాయింపు రూ.25 లక్షలకు పెంచడం వల్ల ప్రైవేట్ ఉద్యోగులకు లబ్ధి.

– కర్నేబత్తుల వెంకటేశ్వర్లు, టాక్స్ అడ్వకేట్

### విద్యారంగాన్ని విస్మరించారు...



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా విద్యారంగాన్ని విస్మరించింది. ఈ బడ్జెట్ కేవలం పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టింది. ఎన్నికల బడ్జెట్ తప్ప విద్యార్థులకు యువకులకు ఈ బడ్జెట్‌తో ఉపయోగం లేదు. బడ్జెట్‌లో విద్యకు 10 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పిన మోదీ ప్రభుత్వం విద్యారంగం పట్ల చిన్నచూపు చూస్తూ కనీసం 5 శాతం నిధులు కూడా కేటాయించలేదు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి బడ్జెట్‌లో విద్యకు నిధులు తగ్గిస్తూ కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతోంది.

– కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

### పెన్షనర్లకు నిరాశ



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పెన్షన్ దారులను నిరాశపరిచింది. కనీసం పెన్షన్‌ను అయినా ఆదాయ పరిధినుండి మినహాయించాలని ఎంత మంది కోరినా ఆ ప్రతిపాదనని పట్టించుకోలేదు. రూ.7 లక్షల వరకు పన్ను లేదని ప్రకటించినా అది రెండో పద్ధతిలో పన్ను మదింపు చేసే వారికే వర్తిస్తుంది.

– జి.అశోక్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి

### మెజారిటీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొండి చేయి



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తీరు ఎక్కువ వేతనం గల అతి కొద్ది మందికి మాత్రమే లాభం. అది కూడా సేవింగ్స్, హోం లోన్ లేని వారికి మాత్రమే. పాత విధానాన్ని క్రమంగా కనుమరుగు చేసేలా ఏ విధమైన తగ్గింపులు లేకుండా ఈ ప్రకటన ఉంది. దీనివల్ల మెజారిటీ ఉద్యోగులకు మొండిచేయి మాత్రమే. తక్కువ సంఖ్యలో ఉన్న పెద్ద ఉద్యోగులకు టాక్స్ స్లాబ్‌లలో భారీ తగ్గింపు వల్ల లాభం చేకూరుతుంది.

– కందుకూరి దయానంద్, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### కొత్త విధానాన్ని ప్రోత్సహించేదిగా ఉంది



బడ్జెట్‌లో వేతన జీవులకు సంబంధించి ఆదాయ పన్ను కొత్త విధానాన్ని ప్రోత్సహించేదిగా ఉంది. పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పు చేయలేదు. చిన్న, మధ్య తరగతి వేతన జీవులకు కొంత ఊరట. ఏ పన్ను విధానాన్ని ఎంచుకోవాలనేది పూర్తిగా చెల్లింపు దారుడి ఐచ్ఛికం. ఎందులో ప్రయోజనం ఉంటే దాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

– నందికొండ విద్యాసాగర్, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

### సామాజిక న్యాయానికి వ్యతిరేకం



దేశంలో సామాజిక న్యాయం.. సుపరిపాలన మా సాధ్యం అన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అసంబద్ధంగా ఉంది. 2023-24 బడ్జెట్‌లో దేశంలోని మైనార్టీ విద్యపై, మదర్సాలకు వ్యతిరేకంగా ప్రభావం చూపింది. కేంద్ర ప్రభుత్వం మైనార్టీ బాలబాలికలకు అందించే స్కాలర్ షిప్పులను రద్దు చేయడం హేయమైన చర్య. రూ.160 కోట్ల నుండి 10 కోట్లకు కుదించి మైనార్టీలకు వ్యతిరేకంగా వక్రబుద్ధిని ప్రదర్శించడం సరికాదు. ముస్లిం సమస్యలపై అవగాహన లేని స్మృతి ఇరానీ కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిగా ఉండటం దురదృష్టం.

– గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం నగర అధ్యక్షుడు

### వేతన జీవులను నిరాశ పర్చిన కేంద్ర బడ్జెట్



ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయటానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. కార్పొరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం.. చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించలేదు. గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదు.

– ముల్కల కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

# పేద విద్యార్థుల విద్యాభ్యున్నతే లక్ష్యం

- అందరికీ చదువు అందాలనే సంకల్పంతోనే కేజీ టూ పీజీ విద్య
- రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



ప్రహరీని ప్రారంభిస్తున్న మంత్రి కమలాకర్

కొత్తపల్లి(కరీంనగర్): రాష్ట్రంలోని పేద విద్యార్థుల విద్యాభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కొత్తపల్లి మండలం చింతకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు- మనబడి' కార్యక్రమంలో భాగంగా రూ.27.24 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి పనులను బుధవారం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువు'కొన'లేని నిరుపేద విద్యార్థులకు కేజీ టూ పీజీ ఉచిత విద్య అందించడమే సీఎం కేసీఆర్ ధ్యేయమని వెల్లడించారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు చదువు మాత్రమే కాకుండా వారిలో మానసిక ఉత్సాహాన్ని పెంపొందించేలా వాలీబాల్, కబడ్డీ వంటి ఆటలు ఆడుకోవడానికి ఆట స్థలాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మన ఊరు మనబడి ద్వారా 230 పాఠశాలలను జిల్లాలో గుర్తించామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వై.సునీల్ రావు, డీఈవో జనార్దన్ రావు, జడ్పీటీసీ కరుణ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీడీ చార్జీలు చెల్లించనవసరం లేదు..

- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులపై విధించిన ఏసీడీ చార్జీలు వసూళ్లు నిలిపివేసేందుకు సీఎండీ ప్రభాకర్ రావు సుముఖత వ్యక్తం చేశారని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చట్టవిరుద్ధమైన ఏసీడీ చార్జీలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కరెంటు కోతలు, ఏసీడీ చార్జీలపై ప్రజలు, రైతులు విసుగుచెంది ధర్నాలు, రాస్తారోకోలు చేయడంతో ఉన్నతాధికారులు దిగివచ్చారని చెప్పారు. తాను సీఎండీతో మాట్లాడగా ఏసీడీ చార్జీల వసూలును నిలిపివేస్తామని తెలిపారని వెల్లడించారు. ఏసీడీ చార్జీలు ఎవరూ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. రాష్ట్రానికి కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, యాదాద్రి పవర్ ప్రాజెక్టు గుదిబండగా మారాయని అన్నారు. రామగుండం బీ థర్మల్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తే అత్యంత చౌకగా విద్యుత్‌ను తయారు చేసుకోవచ్చనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమావేశంలో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేడిపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

### మౌనదీక్షకు తరలిన వీఆర్‌ఏలు



కరీంనగర్ అర్బన్: రాష్ట్ర వీఆర్‌ఏ జేఏసీ పిలుపు క్రమంలో బుధవారం జిల్లా వీఆర్‌ఏలు హైదరాబాద్ తరలివెళ్లారు. వీఆర్‌ఏల డిమాండ్ల సాధనకు ఇందిరాపార్క్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. జిల్లా వీఆర్‌ఏల జేఏసీ నేతలు నలువాల మల్లేశం, కిన్నెర కొమురయ్య, చెట్టి రవి, నలువాల సాయికిషోర్, గాండ్ల నవీన్, అంజి, ప్రశాంత్, మమత, చందన, మాధవి, స్వరూప తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్.. వేదికపై అతిథులు

# ప్రతిభను వెలికితీసే వేదిక..



బ్యాటింగ్ చేస్తూ..

గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ఒక వేదికలాంటిదని, 'సాక్షి' మీడియా చేస్తున్న ప్రయత్నం అద్వితీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, స్టేట్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. యువత చదువులోనే కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించాలని అన్నారు.

- 18లో▸ - కరీంనగర్ స్పోర్ట్స్

## క్లుప్తంగా

### టీపీటీయూకు రాజీనామా

విద్యానగర్‌(కరీంనగర్‌): కరీంనగర్‌ ఉమ్మడి జిల్లాకు చెందిన తెలంగాణ ప్రోగ్రెసివ్‌ టీచర్స్‌ యూనియన్‌(టీపీటీయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.సారయ్య తన పదవికి, సంఘం ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. అలాగే పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎ.కనకయ్య, కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు ఎ.అంజయ్య తమ పదవులకు, సంఘం ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తమ వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

### జాబితా విడుదల చేయాలి

కరీంనగర్‌: ఎస్సీ, ఎస్టీ టీచర్ల పదోన్నతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో జాబితా విడుదల చేయడంలో డీఈవో జనార్దన్‌రావు నిర్లక్ష్యం కారణంగా పలువురు టీచర్లు బెంబేలెత్తుతున్నారని బీటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సబ్జెక్టుల వారీగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో రోస్టర్‌ పాయింట్లను పరిగణనలోకి తీసుకుని తక్షణమే సీనియారిటీ జాబితా విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. పదోన్నతులలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఏవైనా పొరపాట్లు జరిగితే కలెక్టరేట్‌ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ముస్తాబాద్‌(సిరిసిల్ల): ముస్తాబాద్‌ మండలం మొర్రాయిపల్లెకు చెందిన రైతు దమ్మ లచ్చయ్య(55) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. లచ్చయ్య బుధవారం వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని కూతురు సోనికి ఫోన్‌చేసి తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. అప్పుల బాధలు భరించలేక లచ్చయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లచ్చయ్య మృతితో భార్య ఎల్లవ్వ, కూతురు సోని రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ట్రాక్టర్‌ ఢీకొని ఒకరు మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన ఇనుగుర్తి భూమయ్య(70) కాంతి భవన్‌ సమీపంలో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్‌ ఢీకొని మృతిచెందాడు. పురాణిపేటకు చెందిన ఇనుగుర్తి భూమయ్య పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కాంతిభవన్‌ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ భూమయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్‌ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్‌ తెలిపారు.

### తాటిచెట్టుపై నుంచి పడిన గీతకార్మికుడు

ముస్తాబాద్‌(సిరిసిల్ల): ఆవునూర్‌లో తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు బండి రాములు(34) తీవ్రంగా గాయపడ్డారు. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారీ కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాములును సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.



# గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి గంగుల


మేయర్‌ సునీల్‌రావు బ్యాటింగ్‌, మంత్రి కీపింగ్‌


తలపడుతున్న జట్లు



- విద్యార్థులు, యువత క్రీడా రంగంలో రాణించాలి
- సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ సీజన్‌ 4ను ప్రారంభించిన మంత్రి గంగుల

కరీంనగర్‌స్పోర్ట్స్‌: గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు 'సాక్షి' ప్రీమియర్‌ లీగ్‌ ఒక వేదికలాంటిదని, 'సాక్షి' మీడియా చేస్తున్న ప్రయత్నం అద్వితీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ అన్నారు. కరీంనగర్‌ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్‌ కళాశాల మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో, స్టేట్‌ స్పాన్సర్‌ సుధాకర్‌ పీవీసీ పైప్స్‌ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ సీజన్‌ 4 పోటీలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే యువత, చిన్నారులు సన్మార్గాల్లో నడుస్తారన్నారు. యువత విద్యలోనే కాకుండా అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు. మేయర్‌ సునీల్‌ రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్‌ సాగర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సువర్ణావకాశమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి, మేయర్‌ బ్యాటింగ్‌ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు ఉదయం జరిగిన పోటీలను జిల్లా క్రికెట్‌ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్‌ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్‌ పైప్స్‌ ఏరియా మేనేజర్‌ షేక్‌ రఫీ, జిల్లా ఒలింపిక్‌ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి, కార్పొరేటర్‌ ఎడ్ల అశోక్‌, కరీంనగర్‌ సాక్షి యూనిట్‌ బ్రాంచి మేనేజర్‌ వైద శ్రీనివాస్‌, బ్యూరో ఇన్‌చార్జి అనిల్‌, ఏడీవీటీ మేనేజర్‌ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్‌ మేనేజర్‌ మధుకర్‌ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**తొలి రోజు ఫలితాలు**

జూనియర్స్‌ విభాగంలో జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, కరీంనగర్‌ జట్టు.. అల్ఫోర్స్‌ జూనియర్‌ కళాశాల, మంచిర్యాలపై గెలిచింది. ఎస్సార్‌ జూనియర్‌ కళాశాల, మంచిర్యాల జట్టు.. కాకతీయ జూనియర్‌ కళాశాల, గోదావరిఖని జట్టుపై విజయం సాధించింది. సీనియర్స్‌ విభాగంలో వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్‌ జట్టు వివేకానంద ఇంజనీరింగ్‌ కళాశాల, కరీంనగర్‌పై విజయం సాధించింది. జూనియర్స్‌ బ్యాటింగ్‌లో రిషి (అల్ఫోర్స్‌) 23 పరుగులు, ఫిరోజ్‌ (జ్యోతిష్మతి) 20 పరుగులు, హుర్రేయర్‌ (ఎస్సార్‌) 19 పరుగులు చేసి అలరించారు. సీనియర్స్‌లో ఆదిల్‌ (వివేకానంద) 34 పరుగులు చేశారు. కాగా జూనియర్స్‌ విభాగంలో జ్యోతిష్మతి (కరీంనగర్‌), ఎస్సార్‌ (మంచిర్యాల) జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.


వికెట్‌ తీసిన ఆనందంలో..


కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌, ఎమ్మెల్యే


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

# నయనానందం.. మత్స్యగిరీంద్రుని కల్యాణం

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి గుట్టపై బుధవారం భూదేవి, నీలాదేవితో స్వామివారి కల్యాణం కన్నులపండువగా, అంగరంగ వైభవంగా జరిగింది. ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ కనుమల్ల విజయ పట్టువస్త్రాలు, ముత్యాలు, తలంబ్రాలు సమర్పించారు. వేదపండితులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు, యజ్ఞాచార్యులు, చిగురాల రామకృష్ణాచార్యుల వేద మంత్రోచ్చారణలతో ధ్వజారోహణం, గరుడ బలి, ఎదుర్కోళ్లు, మత్స్యగిరీంద్రుని కల్యాణం నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో స్వామి, అమ్మవార్లు విహరించారు. హుజురాబాద్‌ రూరల్‌ సీఐ జనార్దన్‌ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ సాగి మలహాల్‌రావు, ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ కిషన్‌రావు, విండో చైర్మన్‌లు సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సంజీవరెడ్డి, తహసీల్దార్‌ శ్రీనివాస్‌రావు, ఈవో సుధాకర్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మహిపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

# చక్రతీర్థోత్సవం.. వసంతోత్సవం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


ధాన్యాలు దంచుతున్న భక్తులు

కరీంనగర్‌కల్చరల్‌: కరీంనగర్‌ మార్కెట్‌రోడ్‌ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మహా పూర్ణాహుతి వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండితుడు గుదిమెళ్ల విజయకుమారాచార్యులు ఆధ్వర్యంలో యాగశాలలో ఆరాధన, సేవాకాలం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనం, మహా పూర్ణాహుతి పూజలు చేశారు. ప్రత్యేక వేదికపై వసంతోత్సవం, సుగంధ శోభవ ద్రవ్యాలతో తిరుమంజన జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో చక్రతీర్థోత్సవం జరుపగా భక్తులు అందులో స్నానం చేసి పునీతులయ్యారు. కల్యాణం జరిగిన వేదికపై ఉత్సవమూర్తులకు పుష్పయాగం చేసి పూలమాలతో అభిషేకించారు. కార్యక్రమాల్లో ఈవో వెంకన్న, ఆలయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్‌, చకిలం గంగాధర్‌, గంప రమేష్‌ తదితరులున్నారు.

# ఉచిత సంతాన సాఫల్య శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్‌: రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌, శ్రీలక్ష్మి మహేశ్వర చారిటబుల్‌ ట్రస్ట్‌ సంయుక్త ఆధ్వర్యంలో పిల్లలు లేని పది మంది దంపతులకు ఉచితంగా ఐవీఎఫ్‌ చికిత్స అందించేందుకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.బి.ఎస్‌.రావు బుధవారం రెనె ఆసుపత్రిలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాతృత్వం అనేది ప్రతీ మహిళ జీవితంలో ఒక వరం లాంటిదని, అలాంటి వరాన్ని పేద ప్రజలకు అందించాలనే సదుద్దేశంతో రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌ ఎంతో ఖర్చుతో కూడుకున్న ఐవీఎఫ్‌ వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న ప్రయత్నం అభినందనీయమన్నారు. డాక్టర్‌ బంగారి రజనీప్రియదర్శిని మాట్లాడుతూ, శిబిరం ఈనెల 28 వరకు కొనసాగుతుందని, శిబిరానికి హాజరైన వారిలో పది మంది దంపతులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి ఉచితంగా చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెనే హాస్పిటల్‌ చైర్మన్‌, ప్రొఫెసర్‌ డాక్టర్‌ బంగారి స్వామి, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్‌ జగన్‌మోహన్‌ రావు, జాయింట్‌ సెక్రెటరీలు డా.ఎంఎల్‌ఎన్‌ రెడ్డి, డా.అలీం, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ రాంకిరణ్‌, డాక్టర్‌ లక్ష్మణ్‌, మహిళా వైద్యులు చంద్రమతి, కొల్లూరి రాధ, నీలిమ, ఝాన్సీ, శేష శైలజ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### టీపీటీయూకు రాజీనామా

విద్యానగర్‌(కరీంనగర్‌): కరీంనగర్‌ ఉమ్మడి జిల్లాకు చెందిన తెలంగాణ ప్రోగ్రెసివ్‌ టీచర్స్‌ యూనియన్‌ (టీపీటీయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.సారయ్య పదవికి, సంఘం ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. అలాగే పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎ.కనకయ్య, కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు ఎ.అంజయ్య తమ పదవులు, సంఘం ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కరీంనగర్‌: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి డిమాండ్‌ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన పట్టణ లారీ డ్రైవర్స్‌ యూనియన్‌ జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఏడేళ్ల నుంచి డ్రైవర్లకు జీతాల పెరుగుదలలో ఎలాంటి మార్పు లేదని, రోజుకు 10 నుంచి 12 గంటలు, 24 గంటలు డ్యూటీలో ఉంటున్నా నెలకు రూ.8,000- రూ.10,000 వరకు మాత్రమే ఇస్తున్నారని, ఇంతటి అన్యాయమైన జీతాలు ఏ రాష్ట్రంలోని లారీ డ్రైవర్లకు లేకపోవచ్చునని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లారీ అసోసియేషన్‌లో 300- 400 మంది లారీ డ్రైవర్స్‌ ఉంటారని, వీరందరూ సీఐటీయూ అనుబంధ లారీ డ్రైవర్స్‌ యూనియన్‌లో చేరిన సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంకే.ఆరిఫ్‌, ప్రధాన కార్యదర్శి రాపాక విజయేందర్‌రెడ్డి, కోశాధికారి షరీఫ్‌, సహాయ కార్యదర్శులుగా మంద రాజు, శనిగరం దేవదాసు, దస్తగిరి, ఉపాధ్యక్షులు జి.పురుషోత్తం, దీకొండ రాజు, తాళ్ల లక్ష్మణ్‌ ఎన్నికయ్యారు. సమావేశంలో పున్నం రవి, భిక్షపతి, చందు, దిలీప్‌కుమార్‌, జహంగీర్‌, వెంకట్‌, నర్సయ్య, లచ్చయ్య, సంపత్‌ తదితరులు పాల్గొన్నారు.

# 'ఈటల'వి సిగ్గుమాలిన ఆరోపణలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్‌

చొప్పదండి: సంక్షేమ పథకాలతో రాష్ట్రం ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందుతుంటే హుజురాబాద్‌ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ సిగ్గుమాలిన ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ విమర్శించారు. మండలంలోని రాగంపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌పై, దళితబంధు, రైతుబంధు పథకాలపై ఈటల నోరు జారితే ప్రజలే భూస్థాపితం చేస్తారన్నారు. కేసీఆర్‌ భిక్షతో ఈ స్థాయికి వచ్చి ఇప్పుడు డబ్బులున్న వారికి రైతుబంధు అవసరమా అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ముందుగా కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి మాట్లాడాలని ఈటలకు సూచించారు. ఎమ్మెల్యే వెంట చిలుక రవీందర్‌, మాచర్ల సౌజన్య, గడ్డం చుక్కారెడ్డి, మినుపాల తిరుపతిరావు, సాంబయ్య తదితరులున్నారు.

# 3న జిల్లా సబ్‌ జూనియర్స్‌, కెడెట్‌ జూడో జట్ల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్‌: జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3న కరీంనగర్‌ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో ని జిల్లా సబ్‌ జూనియర్స్‌, కెడెట్‌ బాలబాలికల జూడో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా జూడో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కదారి అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలిపారు. సబ్‌ జూనియర్స్‌ బాలురు 30 కేజీ, 35 కేజీ, 40, 45, 50, 55, 60, 66కేజీల లోపు ఆ పైగా, బాలికలు 28 కేజీ, 32, 36, 40, 44, 48, 52, 57ల లోపుతో పాటు 57కేజీలపై.. కెడెట్‌ బాలురు 50కేజీ, 55, 60, 66, 73, 81, 90ల లోపు ఆపైగా, బాలికలు 40, 44, 48, 52, 57, 63, 70 కేజీలలోపు ఆ పై విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. సబ్‌ జూనియర్స్‌ విభాగానికి 2008, 2009, 2010, కెడెట్‌ విభాగానికి 2005, 2006, 2007 సంవత్సరాల్లో పుట్టిన వారు అర్హులని వివరించారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈ నెల 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 11 గంటలకు సాయిమానేరులోని జూడో అకాడమీలో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 99498 30494 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

# 'ఈటల'.. వట్టిమాటలు కట్టిపెట్టు


మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

కరీంనగర్‌: ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ హుజూరాబాద్‌ నియోజకవర్గంలో 14 నెలల్లో ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని, వట్టిమాటలు కట్టిపెట్టాలని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నాయకుల మాటలు నీటి బుడుగల్లాంటివని, తనను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధుల వరద తెచ్చి అభివృద్ధి చేస్తానని మాట్లాడిన ఈటల ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. గవర్నర్‌పై తాను చేసిన వ్యాఖ్యల్లో తప్పులేదని, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన గవర్నర్‌ కేంద్రం చెప్పు చేతుల్లో ఉంటూ రాష్ట్రాన్ని ఇబ్బందుల పాలు చేసే చర్యలు మానుకోవాలని సూచించానని అన్నారు. భాష గురించి తాకు బీజేపీ నుంచి నీతులు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. తిన్నింటివాసాలు లెక్కబెట్టిన చందంగా వ్యవహరించిన ఈటల రాజేందర్‌పై సానుభూతితో ప్రజలు ఓట్లు వేసి ఉప ఎన్నికల్లో గెలిపించారని, రానున్న ఎన్నికల్లో ఆయనకు ఓటమి తప్పదని, హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్‌ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. సమావేశంలో జమ్మికుంట మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ పొనగంటి మల్లయ్య, పోతిరెడ్డిపేట్‌ సర్పంచ్‌ తాటికొండ పుల్లచారి, హుజూరాబాద్‌ పట్టణ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థి దుర్మరణం


ఘటన స్థలం వద్ద తీవ్రంగా గాయపడిన సాయిబాబా

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): మండలంలోని రామకృష్ణకాలనీ పంచాయతీ పరిధి సుభాష్‌నగర్‌ వద్ద కేడీసీసీబీ బ్యాంకు ఎదుట రాజీవ్‌ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఓ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్న పారిక సాయిబాబా(19) మధ్యాహ్నం కళాశాల అనంతరం బయటకు వచ్చాడు. తన బుల్లెట్‌ బైక్‌పై స్నేహితుల వద్దకు వెళ్లాడు. వారితో కాసేపు మాట్లాడిన అనంతరం రాజీవ్‌ రహదారి మీదుగా కరీంనగర్‌ బయల్దేరాడు. కేడీసీసీబీ బ్యాంకు ఎదుట ఆటో ఎదురుగా రావడంతో దానిని తప్పించే క్రమంలో కిందపడ్డాడు. ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్‌ అతివేగంగా నడిపి సాయిబాబాను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయిబాబా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి తండ్రి గురుమిల్‌సింగ్‌ మండలంలోని నర్సింగాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్‌ఎండీ ఎస్సై తెలిపారు.

# తమ్ముడిని హత్య చేశారనే..

- మంథని సుమన్‌ హత్యలో కీలక పాత్రధారి ధనాల చంద్రశేఖర్‌
- జైలులో పరిచయమైన నేరస్తుడితో కలిసి ఘాతుకం
- ఏడుగురు నిందితుల అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి డీసీపీ వైభవ్‌ గైక్వాడ్‌



నిందితుల అరెస్ట్‌ చూపుతున్న డీసీపీ వైభవ్‌ గైక్వాడ్‌

గోదావరిఖని(రామగుండం): తన తమ్ముడు ధనాల శివకుమార్‌ అలియాస్‌ చిన్న హత్యకు ప్రతీకారంగానే మంథని సుమన్‌ను ధనాల చంద్రశేఖర్‌ హతమార్చాడు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్‌ గైక్వాడ్‌ వివరాలు వెల్లడించారు. ఘటనకు 15రోజుల ముందునుంచే స్కెచ్‌ చేసి పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన నిందితుడు ధనాల చంద్రశేఖర్‌, వరంగల్‌ జైలులో అతడికి పరిచయమైన వేముల నవీన్‌ అలియాస్‌ బాబి కలిసి సుమన్‌ను హత్య చేసినట్లు పేర్కొన్నారు. దీనికి చంద్రశేఖర్‌ బంధువులు సహకరించారు. గోదావరిఖని లెనిన్‌నగర్‌లో నివాసముంటున్న చంద్రశేఖర్‌ ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నాడు. ఇతడిపై గతంలో రౌడీషీట్‌తో పాటు పలు కేసులు ఉన్న క్రమంలో పీడీయాక్ట్‌ నమోదు చేసి 2019లో వరంగల్‌ జైలుకు పంపారు. తన తమ్ముడ్ని 2018లో హత్య చేసిన సుమన్‌ను ఏలాగైనా చంపాలనే నిర్ణయించుకున్నాడు. వరంగల్‌ జైలులో ఉన్న సమయంలో వేముల నవీన్‌ అలియాస్‌ బాబితో పరిచయమైంది. ఈక్రమంలో మంథని సుమన్‌ హత్యకు సహకరిస్తే హైదరాబాద్‌లో రెస్టారెంట్‌ పెట్టుకునేందుకు ఆర్థికసాయం చేస్తానని చెప్పడంతో బాబి ఒప్పుకున్నాడు.

**అదనుచూసి ప్రధాన చౌరస్తాలోనే..**

మంథని సుమన్‌ను హత్య చేసేందుకు హైదరాబాద్‌లో ఉంటున్న బాబి గత నెల 28న గోదావరిఖనికి బస్సులో వచ్చాడు. తర్వాత చంద్రశేఖర్‌, బాబి ఇద్దరూ ఆనంద్‌ ఇంట్లో బస చేశారు. గత నెల 29న రాత్రి 8.20 గంటల సమయంలో చంద్రశేఖర్‌, బాబి ప్రధాన చౌరస్తా వద్దకు వచ్చారు. అప్పుడే సుమన్‌ చాయ్‌ తాగి తన ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌కు చేరుకుంటున్న క్రమంలో చంద్రశేఖర్‌, బాబి కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి చంపేశారు. అనంతరం బాబి రైలులో హైదరాబాద్‌ పారిపోయాడు.

**ఏడుగురి అరెస్ట్‌**

మంథని సుమన్‌ హత్య కేసులో ఏడుగురిని అరెస్ట్‌ చేశారు. గోదావరిఖని లెనిన్‌నగర్‌కు చెందిన ధనాల చంద్రశేఖర్‌, హైదరాబాద్‌ బేగంపేట్‌ ప్రకాశ్‌నగర్‌కు చెందిన వేముల నవీన్‌ అలియాస్‌ బాబి, ప్రధాన నిందితుడి బావ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన మాడుగుల శ్రీనివాస్‌, చెల్లె మాడుగుల స్వరూప, బంధువులు గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన గంరేటి అజయ్‌కుమార్‌, గంరేటి శేషి, రామగుండం హౌజింగ్‌ బోర్డు కాలనీకి చెందిన బంగారి ఆనంద్‌ను అరెస్ట్‌ చేశారు. నిందితుల నుంచి మూడు కత్తులు, ఆటో, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈకేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్‌, సీఐలు రమేష్‌బాబు, ప్రసాద్‌రావు, ఇతర అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

**రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా**

ఇటీవల హత్యకు గురైన సుమన్‌, హత్య చేసిన చంద్రశేఖర్‌ రౌడీషీటర్లు కావడంతో.. ఇకముందు రౌడీషీటర్లపై పోలీసుల వైఖరి ఏలా ఉండబోతోందని అడిగిన ప్రశ్నకు డీసీపీ స్పందించారు. ఈవిషయంలో సీపీ సీరియస్‌గా ఉన్నారని, త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్‌ నిర్వహిస్తామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### 'గ్రానైట్ లారీ డ్రైవర్స్, క్లీనర్స్' కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గంగుల

**కొత్తపల్లి:** మండలంలోని బావుపేటలో విజయ రథం గ్రానైట్ లారీ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ బుధవారం ప్రారంభించారు. గ్రానైట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, సర్పంచు ప్రసాద్, డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ అధ్యక్షుడు పొన్నం అజయ్‌కుమార్, నాయకులు ఎస్.రాము, సోమినేని తిరుపతి, గోదల నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాల తొలగింపు



నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**కొత్తపల్లి:** కమాన్‌పూర్ పంచాయతీ పరిధి సర్వే నంబర్ 116లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్‌లను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. సర్కారు భూమిలో అడ్డూఅదుపు లేకుండా వందలాదిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ గండె లక్ష్మీనరసింహారావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు మోకాపైకి వెళ్లి, అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్‌లను తొలగించారు. ఇంకా అనేకం ఇలాంటి నిర్మాణాలున్నాయని, అధికారులు ఏవిధంగా స్పందిస్తారోనని పలువురు అంటున్నారు.

### నూతన పంచాంగం ఆవిష్కరణ



**కరీంనగర్‌కల్చరల్:** కరీంనగర్‌కు చెందిన పంచాంగ సిద్ధాంతి సముద్రాల వంశీమోహనాచార్యులు గణించిన రాబోయే శోభకృత్ నామ నూతన సంవత్సర పంచాంగాన్ని బుధవారం తీగలగుట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహా నిలయంలో ఆయన తండ్రి లక్ష్మణాచార్యుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాంగ కర్త మాట్లాడుతూ.. దృక్ సిద్ధాంతం ప్రకారం పంచాంగం రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో ఆచ్చి యాదగిరి ఆచార్యులు, మాడభూషణ శ్రీనివాస్, కానుల గోపిశర్మ, సముద్రాల వినయ్, యుగంధర్ పాల్గొన్నారు.

**డైరీ, క్యాలెండర్..**



**విద్యానగర్:** తెలంగాణ రిటైర్డ్ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ ముద్రించిన 2023 డైరీ, క్యాలెండర్‌ను బుధవారం కరీంనగర్‌లోని కృషి భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ జనసత్తా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకణ రామయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు, వరంగల్ జిల్లా ప్రతినిధి వెంకటనారాయణ, కృషి భవన్ కార్యదర్శి భూంపల్లి మోహన్‌రెడ్డి, మేసినేని మురళీధర్‌రావు, ఆర్.బాలబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ధాన్యం ఆరబెట్టే యంత్రం



రాకేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

**కరీంనగర్‌రూరల్:** నగునూరుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి బోకూరి రాకేశ్‌రెడ్డిని సర్పంచు ఉప్పుల శ్రీధర్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు సన్మానించారు. గుజరాత్‌లోని పారుల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న రాకేశ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి తడిసిన ధాన్యం ఆరబెట్టే యంత్రం ఎగ్జిబిట్‌ను ఆన్‌లైన్‌లో పంపించాడు. ఇది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు బుధవారం సమాచారం రావడంతో ప్రజాప్రతినిధులు అతన్ని సత్కరించారు. ఉపసర్పంచు దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వినయ్‌సాగర్, శ్రీనివాస్, వార్డుసభ్యులు బాబు, వెంకటమ్మ, ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

# క్యాంపస్ టు కార్పొరేట్



గ్రూప్ డిస్కషన్‌లో పాల్గొన్న విద్యార్థినులు



మాక్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న టీఎస్‌కేసీ ప్రతినిధులు

- కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం
- విద్యార్థులు త్వరగా ఉద్యోగాలు సాధించేందుకు చర్యలు
- టాస్క్, టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ
- స్కిల్స్ ఉన్నవారినే ఎంపిక చేసుకుంటున్న కంపెనీలు

**శాతవాహన యూనివర్సిటీ:** విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టు ఉంటే సరిపోదు. ఉద్యోగాలు సాధించాలంటే అదనపు నైపుణ్యాలపై దృష్టి పెట్టాల్సిందే. కోర్సులు పూర్తయ్యాక ఉద్యోగాల గురించి ఆలోచిద్దామనుకుంటే ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం కష్టం. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలని కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో టీఎస్‌కేసీ(తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్), టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో క్యాంపస్ టు కార్పొరేట్ కార్యక్రమం కింద ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులను కాలేజీ క్యాంపస్ నుంచి కార్పొరేట్ సంస్థల వైపు నడిపిస్తున్నారు. వివిధ మల్టీనేషనల్ కంపెనీలు సైతం ప్రతిభ గల విద్యార్థుల కోసం అన్వేషిస్తూ స్కిల్స్ ఉన్నవారినే ఎంపిక చేసుకుంటున్నాయి.

**వివిధ అంశాలపై అవగాహన..**

విద్యార్థులు తమ కోర్సులు పూర్తి చేసుకున్న వెంటనే ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాలపై శిక్షణనిస్తున్నారు. రెజ్యూమ్ సెట్టింగ్, కమ్యూనికేషనల్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, మాక్ ఇంటర్వ్యూలు, ప్రజెంటేషన్ స్కిల్స్, గ్రూప్ వర్కింగ్, బాడీ లాంగ్వేజ్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, కార్పొరేట్, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పని విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. లోపాలను ఎప్పటికప్పుడు సవరిస్తూ విద్యార్థులను మెరికల్లా తయారు చేస్తున్నారు.

#### అదనపు నైపుణ్యాలు అవసరం



కేవలం పాఠ్యాంశాలపై పట్టు ఉంటే సరిపోదు. కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలంటే అదనపు నైపుణ్యాలు అవసరం. కళాశాలలో చేరిన విద్యార్థులకు వాటిపై శిక్షణనిస్తున్నాం.
– డాక్టర్ టి.శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్

#### మొదటి సంవత్సరం నుంచే..



టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో కళాశాలలో మొదటి సంవత్సరం నుంచే నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించాలని టాస్క్‌తో కలిసి పని చేస్తున్నాం.
– సీహెచ్.శోభారాణి, టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్

#### తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని సమాచారమిస్తే ముందుకు రావడం లేదు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధ పెట్టి, ఇంటర్వ్యూలకు పంపించాలి.
– గంగాప్రసాద్, టాస్క్ రీజినల్ కో–ఆర్డినేటర్

#### సులభంగా ఉద్యోగాలు



మేము కోర్సు పూర్తవగానే ఉద్యోగాలు సాధించాలని శిక్షణనిస్తున్నారు. టీఎస్‌కేసీ, టాస్క్ ఆధ్వర్యంలో చేపడుతున్న నైపుణ్య కార్యక్రమాలు బాగున్నాయి. ఉద్యోగాలు సులభంగా వస్తాయి.
– ఎం.స్నేహ, డిగ్రీ విద్యార్థిని

#### కొత్త విషయాలు నేర్చుకున్న



కళాశాలలో క్యాంపస్ టు కార్పొరేట్ అనే కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఇందులో గ్రూప్ డిస్కషన్, కమ్యూనికేషనల్ స్కిల్స్‌తోపాటు ఇతర నైపుణ్యాలు నేర్పించారు. కొత్త విషయాలు నేర్చుకున్న.
– కె.కృష్ణవేణి, డిగ్రీ విద్యార్థిని

#### క్లాస్‌రూం నాలెడ్జ్ సరిపోదు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించాలంటే క్లాస్ రూం నాలెడ్జ్ సరిపోదు. కచ్చితంగా అదనపు నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే ఉద్యోగాలు వస్తాయని తెలుసుకున్నాం.
– జి.హారిక, డిగ్రీ విద్యార్థిని

## మార్కెట్లలో సౌకర్యాల కల్పనకు కృషి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్



దుస్తులు అందిస్తున్న మంత్రి కమలాకర్

**కరీంనగర్ అర్బన్:** మార్కెట్లలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తూ రైతులు పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ, దడువాయి, చాట, సడెం కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువ మంది ప్రజలకు వ్యవసాయమే జీవనాధారమని తెలిపారు. ఈ క్రమంలో పంట ఉత్పత్తుల కొనుగోలుతోపాటు గిట్టుబాటు ధరను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సాగు రంగానికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. మార్కెట్లలో పనిచేసే కార్మికులకు సర్కారు బాసటగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, నగర మేయర్ సునీల్‌రావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యదేవుని ఆలయ వార్షికోత్సవం



పూజలు చేసిన అర్చకులు

**కరీంనగర్ కల్చరల్:** రాంనగర్ 37వ డివిజన్ శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి(సత్యదేవుని) ఆలయ 19వ వార్షికోత్సవాన్ని ఆలయ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున రాజేందర్–రజనీదేవి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి–హరిశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ చల్ల హరికిష్ట–పద్మ బుధవారం ఘనంగా జరిపించారు. అర్చకులు బహిరి అనిల్‌కుమార్, తిరునగరి ప్రవీణ్ కుమార్‌లు పూజలు చేశారు. శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి తిరుకల్యాణం కనులపండువగా నిర్వహించారు. రాజేందర్ మాట్లాడుతూ.. సత్యదేవుని ఆలయం నిర్మించి, రెండు దశాబ్దాలు కావస్తోందని, స్వామివారిపై నమ్మకంతో చాలా మంది భక్తులు వస్తున్నారని తెలిపారు. కోర్కెలు నెరవేరిన దంపతులు వచ్చి, వ్రతాలు ఆచరిస్తున్నారని అన్నారు. మేయర్ సునీల్‌రావు సతీమణి అపర్ణ హాజరై, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి సహకరించిన దాతలను నిర్వాహకులు సన్మానించారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

**కరీంనగర్‌రూరల్:** మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌లో ట్రాక్టర్ల యజమానులకు ప్రభుత్వ ఇసుక పాలసీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్లకు భారీ జరిమానా విధించడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు ట్రాక్టర్లు ఇవ్వొద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడపవద్దని సూచించారు. సాండ్ ట్యాక్సీ ట్రాక్టర్లు నిర్ణీత సమయాల్లోనే రాకపోకలు సాగించాలన్నారు. ట్రాక్టర్ల యజమానుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో సర్పంచు పురుమల్ల శ్రీనివాస్, ఎస్సై అశోక్, ఆర్ఐ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తుపాకుల గూడెం చిత్ర బృందం సందడి



స్వాగతం పలుకుతున్న అభిమానులు

**కరీంనగర్ కల్చరల్:** తుపాకుల గూడెం చిత్ర బృందం సభ్యులు బుధవారం నగరంలో సందడి చేశారు. వారికి జిల్లా కేంద్రానికి చెందిన పలువురు యువకులు, అభిమానులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం మంకమ్మతోటలోని శివాణి డిగ్రీ, పీజీ కళాశాలకు చేరుకోగా కళాశాల నిర్వాహకులు వంగపల్లి సతీశ్‌కుమార్, ఎర్రంశెట్టి మునీందర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సినిమా హీరో శ్రీకాంత్ రెడ్డి, జయెత్రి మకానా, మరో నటుడు జిల్లా కేంద్రానికి చెందిన శివరాంరెడ్డి, సురంజిత్ రెడ్డిలు విద్యార్థులతో ఆడిపాడారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చూడదగ్గ సినిమా తుపాకుల గూడెం అన్నారు. ఇది ఈ నెల 3న విడుదలవుతోందని, అందరూ కుటుంబంతో వెళ్లి, చూడాలని కోరారు. కళాశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. తమ కళాశాలకు చెందిన యువకుడు శివరాంరెడ్డి సినిమాలో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా యువకులు అనుదీప్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీకాంత్, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

**కొత్తపల్లి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కడప ఫైన్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల హెచ్‌ఎం సంజయ్ భట్టాచార్య తెలిపారు. 100 మంది విద్యార్థులు పాల్గొనగా 11 మంది బంగారు, 10 మంది రజత పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్‌ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు బుధవారం అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనూకర్ రావు, ప్రసూన, వి.యు.యం.ప్రసాద్, వినోద్‌రావు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్తలు రబింద్ర పాత్రో, లక్ష్మి దీప్తి, హరిప్రియ, శ్రీలత, టీచర్లు పాల్గొన్నారు.

## సర్కారు బడుల అభివృద్ధే లక్ష్యం



నగునూరు పాఠశాలలో తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య

**కరీంనగర్‌రూరల్:** సర్కారు బడుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అన్నారు. బుధవారం కరీంనగర్ మండలంలోని నగునూరులో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టిన ప్రాథమిక పాఠశాల తరగతి గదులు, కిచెన్‌షెడ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నగునూరు పాఠశాలకు రూ.4.69 లక్షలు మంజూరు చేసి, పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. బడిలోని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచు ఉప్పుల శ్రీధర్, ఉపసర్పంచు దామరపల్లి దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వినయ్‌సాగర్, శ్రీనివాస్, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, ఏఈ మగ్దుం, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రాజు, వార్డు సభ్యులు వెంకటమ్మ, బాబు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహం ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు, ఉత్సవాల నిర్వాహకులు

**కరీంనగర్ కల్చరల్:** విద్యానగర్‌లోని నవీన కుర్మవాడ శ్రీ బాల భక్తాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ముగిశాయి. ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితుడు నమిలికొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి మూర్తుల ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. భగవంతుని ఆరాధన వల్ల బాధలు తొలగుతాయని అన్నారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం నిర్వహించే శ్రీరామ కల్యాణానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో తిరువరంగం భరతాచార్యులు, కోదుమగుళ్ల వెంకటరమణ, రామకృష్ణమాచార్యులు, చిట్యాల భరత్‌కుమార్ స్వామి, రామాచార్యులు, దేవనపల్లి రమేశ్ స్వామి, ఆలయ అర్చకులు రమేశ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ తనిఖీ




వివరాలు తెలుసుకుంటున్న సీపీ సుబ్బారాయుడు

**కరీంనగర్ క్రైం:** కరీంనగర్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ ఎల్.సుబ్బారాయుడు బుధవారం తనిఖీ చేశారు. ఠాణా పనితీరు, ట్రాఫిక్ నియంత్రణ చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పకడ్బందీగా కొనసాగించాలన్నారు. వాహనదారులు, పాదాచారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అతివేగంతో వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, ట్రిపుల్ రైడింగ్, వాహనాలకు ఇతర రకాల సైలెన్సర్లను బిగించి, శబ్ధ కాలుష్యం సృష్టించడం వంటి వాటిని నియంత్రించడంపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా మద్యం సేవించి, వాహనాలు నడిపేవారిని పట్టుకోవడంతోపాటు వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. అస్తవ్యస్తంగా ఉండే పార్కింగ్ స్థలాలను గుర్తించి, అందుకు కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ తిరుమల్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముంపు గ్రామాల ప్రజలను ఆదుకోవాలి

**గంగాధర(చొప్పదండి):** మండలంలోని ఎల్లమ్మ చెరువు ముంపుతో నష్టపోయిన మంగపేట, నారాయణపూర్, ఇస్తార్‌పల్లి గ్రామాల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య డిమాండ్ చేశారు. ఎల్లమ్మ చెరువు ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. వర్షాకాలంలో చెరువు కట్ట తెగిపోయినప్పటికీ దానికి మరమ్మతు చేయకపోవడంతో రైతులకు తీవ్ర నష్ట కలుగుతోందన్నారు. మరమ్మతు చేసి, వారి ఇబ్బందులు తీర్చాలని కోరారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి, ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు పంజాల ప్రశాంత్, రెండ్ల శ్రీనివాస్, ఆకుల మనోహర్, ప్రణయ్, ప్రేమ్, రాజు, రమేశ్, సాగర్ ఉన్నారు.

## పర్లపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



విద్యార్థులతో చైర్‌పర్సన్ విజయ, జెడ్పీ సీఈవో ప్రియాంక

**తిమ్మాపూర్(మానకొండూర్):** ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు జెడ్పీ సీఈవో ప్రియాంక తెలిపారు. మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పర్లపల్లిలో అభివృద్ధి చేసిన పాఠశాలను జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ ఎంపీపీ కేతిరెడ్డి వనితతో కలిసి బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుల, సర్పంచు భారతి, ఎంపీటీసీ సభ్యుడు ముప్పిడి సంపత్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజేశ్, టీచర్లు మహిపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యమాలు తెలంగాణ అస్తిత్వ ప్రతీకలు

- శాతవాహన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సంకసాల మల్లేశ్

**శాతవాహన యూనివర్సిటీ:** 'తెలంగాణ ఉద్యమాలు – సాహిత్యం' అనే అంశంపై శాతవాహన విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సంకసాల మల్లేశ్ బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇక్కడ జరిగిన ఉద్యమాలు తెలంగాణ అస్తిత్వ ప్రతీకలని అన్నారు. అస్తిత్వ ప్రేరణతో, స్ఫూర్తితో సాహిత్యం కూడా వెలువడిందని తెలిపారు. నేటి తరం ఆ ఉద్యమాలు, సాహిత్య చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ ప్రసంగిస్తూ.. ఉద్యమాలలో సామాన్య ప్రజల ఆవేశాలు, ఆవేదనలు నిండి ఉన్నాయని, అవే పాటలుగా, కథలుగా వెలువడ్డాయని తెలిపారు. నిజాం కాలం నాటి సాయుధ రైతాంగ పోరాటం రజాకార్ల దుర్మార్గం మీదనే కాని ముస్లింలకు వ్యతిరేకం కాదన్నారు. డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం భౌగోళిక, సామాజిక, ప్రజాస్వామ్య, స్వాతంత్ర్య పోరాటమన్నారు. తెలంగాణ మట్టిలోనే ప్రశ్నించే లక్షణం ఉందని, కవులలో పాల్కురికి సోమనాథుని నుంచి అది కొనసాగుతోందని పేర్కొన్నారు. గౌరవ అతిథి ఆచార్య గోనానాయక్ మాట్లాడుతూ.. తెలంగాణలోని గిరిజనులు, సామాన్యులు కూడా చైతన్యవంతులని, పలు ఉద్యమాల్లో వారి కృషి ఉందని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య బన్న అయిలయ్య హాజరయ్యారు. ఎస్‌యూ వర్సిటీ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం అధిపతి, ప్రిన్సిపాల్ ముహమ్మద్ జాఫర్ జరి సదస్సుకు అధ్యక్షత వహించగా కన్వీనర్‌గా గంద్ర లక్ష్మణరావు, కో–కన్వీనర్లుగా లక్ష్మీనారాయణ, పావని వ్యవహరించారు. సోషల్ సైన్స్ డీన్ సూరేపల్లి సుజాత, వన్నాల రమేశ్, శ్రీవాణి, మునావర్, హుమేర, ఆచార్య సూర్యధనంజయ్, కలువకుంట్ల రామకృష్ణ, ప్రమోద, వారాల ఆనంద్, సాహిత్యాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరాటే బెల్టులు ప్రదానం




**కరీంనగర్:** నగరంలోని కోరా ఉన్నత పాఠశాలలో జాతీయస్థాయి షావోలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ అకాడమీ బెల్టుల ప్రదానోత్సవం బుధవారం నిర్వహించారు. ఒలింపిక్ సెక్రటరీ, జూడో తెలంగాణ సెక్రటరీ గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బెల్టులు అందించారు. పిల్లలు చదువుతోపాటు ఇలాంటి ఆసక్తికరమైన పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. పాఠశాల డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ మాట్లాడుతూ.. కరాటే పోటీలు విద్యార్థుల్లో మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. కుంగ్‌ఫూ శిక్షకుడు శేఖర్, పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్ వరప్రసాద్ తదితరులున్నారు.

## అండర్-19 ప్రపంచకప్ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్ చేతుల మీదుగా అండర్-19 జట్టు కెప్టెన్ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.



# గిల్ జిగేల్...


గిల్

- భారత ఓపెనర్ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2-1తో సిరీస్ సొంతం

**అహ్మదాబాద్:** మోదీ స్టేడియంలో భారత్ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (63 బంతుల్లో 126 నాటౌట్; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2-1తో సిరీస్ గెలుచుకుంది. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' హార్దిక్ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

**గిల్ విధ్వంసం**

ఇషాన్ కిషన్ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్, త్రిపాఠి కివీస్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్ (13 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్ స్కోరు 156/3. శుబ్‌మన్ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్... లిస్టర్, టిక్నర్, ఫెర్గూసన్ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా ధనాదంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి.

భారత్ పేస్‌కు కివీస్ బ్యాటర్స్ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత్ విజయానికి బాటపడింది. మిచెల్, సాన్‌ట్నర్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.


సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ హార్దిక్

స్కాన్ చేయండి
ఈ రోజు హైలైట్ కొరకు

**126** అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్ గిల్ (126 నాటౌట్) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్ సవరించాడు.

**168** అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

**5** భారత్ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్ రాహుల్, రోహిత్, కోహ్లి ఈ ఘనత సాధించారు.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** ఇషాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్ 1; గిల్ (నాటౌట్) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్ (బి) సోధి 44; సూర్యకుమార్ (సి) బ్రేస్‌వెల్ (బి) టిక్నర్ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్ (బి) మిచెల్ 30; హుడా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
**వికెట్ల పతనం:** 1-7, 2-87, 3-125, 4-228.
**బౌలింగ్:** లిస్టర్ 4-0-42-0, బ్రేస్‌వెల్ 1-0-8-1, ఫెర్గూసన్ 4-0-54-0, టిక్నర్ 3-0-50-1, ఇష్ సోధి 3-0-34-1, సాన్‌ట్నర్ 4-0-37-0, మిచెల్ 1-0-6-1. **న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** అలెన్ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 1; చాప్‌మన్ (సి) ఇషాన్ (బి) అర్ష్‌దీప్ 0; ఫిలిప్స్ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్ (సి) మావి (బి) ఉమ్రాన్ 35; బ్రేస్‌వెల్ (బి) ఉమ్రాన్ 8; సాన్‌ట్నర్ (సి) సూర్య (బి) మావి 13; ఇష్ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్ (సి) ఉమ్రాన్ (బి) పాండ్యా 0; టిక్నర్ (సి) ఇషాన్ (బి) పాండ్యా 1; లిస్టర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్) 66. వికెట్ల పతనం:** 1-4, 2-4, 3-5, 4-7, 5-21, 6-53, 7-53, 8-54, 9-66, 10-66. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4-0-16-4, అర్ష్‌దీప్ సింగ్ 3-0-16-2, ఉమ్రాన్ మాలిక్ 2.1-0-9-2, కుల్దీప్ యాదవ్ 1-0-12-0, శివమ్ 2-0-12-2.

# ఆంధ్ర 379 ఆలౌట్

**ఎడమచేతి వాటంతో బ్యాటింగ్ చేసిన విహారి**


విహారి

**ఇండోర్:** డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ రెండు వికెట్లు తీయగా... నితీశ్ కుమార్ రెడ్డి, పృథ్వీరాజ్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు)... రికీ భుయ్ (149; 18 ఫోర్లు, 1 సిక్స్) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్ లలిత్ మోహన్ (22 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్ జైన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

## జాతీయ స్కూల్స్ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు


యశ్వి జైన్

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్-15 బాలుర విభాగంలో వేముల అద్వైత్ విఘ్నేశ్ (7.5 పాయింట్లు)... అండర్-15 బాలికల విభాగంలో యశ్వి జైన్ (7 పాయింట్లు)... అండర్-13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్-11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్-9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్-7 బాలుర విభాగంలో ఆదుళ్ల దివిత్ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్-7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ ప్రకటించారు.

## ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్



**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 21-13, 21-14తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి (భారత్) 21-17, 19-21, 23-21తో చెయుక్ యి లీ (హాంకాంగ్)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్ వర్మ, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21-14, 19-21, 25-27తో హియో క్వాంగ్ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్ వర్మ 14-21, 16-21తో లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో.. మిథున్ 18-21, 12-21తో నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ జోడీ 21-11, 21-16తో టై అలెగ్జాండర్-జోసెఫిన్ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

# సినిమా

## జైసల్మేర్‌లో జైలర్


● రజనీకాంత్

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్'. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్' చిత్ర యూనిట్ ఇప్పుడు 'జైసల్మేర్'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్థాన్‌లో ల్యాండ్ అయ్యారు రజనీకాంత్. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

## హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...

హెలికాప్టర్‌లో షూటింగ్ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్. 1996లో హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్. కాగా కమల్ హెలికాప్టర్ రైడ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్షీట్స్, షూటింగ్ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్ ఇలా హెలికాప్టర్ రైడ్ చేస్తున్నారన్నది కోలీవుడ్ టాక్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్, బాబీ సింహా కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.


● కమల్‌హాసన్

## పల్లెటూరి ప్రేమ


● 'శశివదనే'లో ఓ దృశ్యం

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను 'దిల్' రాజు విడుదల చేశారు. వైభవ్ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్ లవ్ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.

## ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

**- శౌరి చంద్రశేఖర్ టి. రమేష్**

''మా నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్ టి. రమేష్. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్ టి.రమేష్ మాట్లాడుతూ– ''రామ్ గోపాల్ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్ పాయింట్ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్లు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.


● శౌరి చంద్రశేఖర్

## పదిహేనేళ్ల తర్వాత....


● విజయ్, త్రిష

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్– హీరోయిన్ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ ప్రకటించింది. దీంతో విజయ్, త్రిష ఐదోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్' తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్ దత్, ప్రియా ఆనంద్, అర్జున్ సర్జా, గౌతమ్ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.

## వింతగా మారబోతోంది


● బ్రహ్మానందం

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో భరత్ కుమార్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్ కౌశిక్, సాయికృష్ణ గద్వాల్, విజయ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్ భాస్కర్.

## తెరపైకి జాక్సన్ జీవితం


● మైఖేల్


● జాఫర్

పాప్ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్ జాక్సన్ జీవితంతో 'మైఖేల్' పేరుతో బయోపిక్ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్ ఫుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్ కుమారుడు జాఫర్ జాక్సన్ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్. ''మైఖేల్ జాక్సన్ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్ జాక్సన్ 2009 జూన్ 25న మరణించిన విషయం తెలిసిందే.

## లవ్.. యాక్షన్


● రక్షిత్, కోమలి

రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శరవణ వాసుదేవన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్ సాంగ్‌ని డైరెక్టర్ హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్, యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చోలేటి, కెమెరా: సాయికుమార్.

## అయోమయంలో...


● రణధీర్, శుభశ్రీ

రణధీర్, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్ ప్రసాద్ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్, సంగీతం: శివ కాకాని.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Printed at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) 08461 - 222645, 222646, 222647, Fax: 08461 - 222649. RNI Regn No. TELTEL/2008/23795. 